శుక్రవారం 4-8-2023

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15
సంచిక: 321



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'



తొలి టీ20 చేజారే..
వెస్టిండీస్ చేతిలో నాలుగు పరుగుల తేడాతో ఓడిన టీమిండియా - 13లో



నెల కనిష్టానికి సూచీలు
సెన్సెక్స్ 542 పాయింట్లు క్రాష్. 19,400 దిగువకు నిఫ్టీ - 13లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




యుద్ధ మృతులు 10 వేలు
రష్యా దురాక్రమణ తమ దేశంపై మొదలయ్యాక 10,749 మంది పౌరులు చనిపోయినట్లు ఉక్రెయిన్ తెలిపింది.
వివరాలు 6లో ▸



హరియాణలో మళ్లీ ఉద్రిక్తత
హరియాణలోని నూహ్ జిల్లాలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. రెండు ప్రార్థనా మందిరాలు స్వల్పంగా కాలిపోయాయి.
వివరాలు 6లో ▸



జ్ఞానవాపి మసీదులో సర్వేకి ఓకే
వారణాసిలోని జ్ఞానవాపి మసీదులో శాస్త్రీయ సర్వే జరపాలని దిగువ కోర్టు ఇచ్చిన ఆదేశాలను అలహాబాద్ హైకోర్టు సమర్థించింది.
వివరాలు 6లో ▸



కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య
రాజస్తాన్ కోటాలో కోచింగ్ తీసుకుంటున్న ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఏడాది ఇక్కడ 19మంది బలవన్మరణానికి పాల్పడ్డారు.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

సంపద పెరిగింది.. అప్పులు తగ్గాయి



'కోవిడ్ లాంటి సంక్షోభాన్ని ఎదుర్కొన్నప్పటికీ గత ప్రభుత్వ హయాంలో కంటే వైఎస్సార్‌సీపీ పాలనలో సంపద పెరగడంతో పాటు అప్పులు తగ్గాయి. రాష్ట్ర అప్పులపై ఆర్బీఐ, కేంద్ర ఆర్థిక మంత్రి వాస్తవాలు చెప్పారు. రాష్ట్ర అప్పులు రూ.పది లక్షల కోట్లు అంటూ చేస్తున్న దుష్ప్రచారంలో నిజం లేదు' అని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చెప్పారు.
వివరాలు 14లో ▸

బాలికపై లైంగికదాడి.. ఆటో డ్రైవర్‌కు 15 ఏళ్లు జైలు



బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఆటో డ్రైవర్‌కు 15 ఏళ్ల జైలుశిక్ష, రూ.50 వేలు జరిమానా విధిస్తూ విశాఖలోని ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జి.ఆనందిని తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా ఏడాదిపాటు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని స్పష్టం చేశారు.
వివరాలు 3 ▸

3,295 ప్రొఫెసర్ పోస్టులు 3 నెలల్లో భర్తీ

'ఉన్నత' అధ్యాయం

వర్సిటీలు, ట్రిపుల్ ఐటీల్లో భారీ నియామకాలకు సీఎం జగన్ గ్రీన్ సిగ్నల్

వర్సిటీల్లో 2,635.. ట్రిపుల్ ఐటీల్లో 660 అధ్యాపక పోస్టుల భర్తీ

- 23న ఏపీపీఎస్సీ నోటిఫికేషన్.. సెప్టెంబర్ చివరిలో ఆన్‌లైన్ పరీక్షలు
- అక్టోబర్ 10 నాటికి ఫలితాలు.. నెలలో ఇంటర్వ్యూలు పూర్తి
- నవంబర్ చివరి నాటికి ఎంపికైన అభ్యర్థుల తుది జాబితా ప్రకటన
- కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న వారికి వెయిటేజీ
- ఏడాదికి ఒక మార్కు చొప్పున గరిష్టంగా 10 మార్కుల వెయిటేజీ
- వంద శాతం మెరిట్ ప్రాతిపదికన పారదర్శకంగా నియామకాలు



ఇంటర్వ్యూలో వారికి వెయిటేజీ

ఇప్పటికే వైద్యారోగ్య శాఖలో 51 వేల పోస్టుల భర్తీతోపాటు అంతకు ముందు 1.30 లక్షల గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల నియామకాలను ఎలాంటి లోపాలు లేకుండా సకాలంలో పూర్తి చేసిన విషయాన్ని సమావేశంలో సీఎం జగన్ ప్రస్తావించారు. ఇదే తరహాలో వర్సిటీల్లో అధ్యాపకుల నియామకాలను కూడా వేగంగా, సమర్థంగా చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. నూటికి నూరుశాతం మెరిట్ ప్రాతిపదికన పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఇప్పటి వరకు కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న వారికి ఏడాదికి ఒక మార్కు చొప్పున గరిష్టంగా 10 మార్కులు వెయిటేజ్ ఇవ్వాలని అధికారులు ప్రతిపాదించగా ఇంటర్వ్యూ సమయంలో కేటాయించాలని సీఎం జగన్ నిర్ణయించారు.

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు, ట్రిపుల్ ఐటీల్లో 3,295 అధ్యాపక పోస్టుల భర్తీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమోద ముద్ర వేశారు. ఉన్నత విద్యలో అత్యున్నత ప్రమాణాలను నెలకొల్పడంలో భాగంగా అంతర్జాతీయ స్థాయి కరిక్యులమ్‌ను ప్రవేశపెట్టాలని నిర్ణయించిన నేపథ్యంలో ఉత్తమ ఫలితాల సాధనకు వర్సిటీల్లో పూర్తి స్థాయిలో రెగ్యులర్ పోస్టులను భర్తీ చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించేందుకు అధ్యాపక సిబ్బంది నియామకాల్లో అర్హత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో యూనివర్సిటీలు, ట్రిపుల్ ఐటీల్లో అధ్యాపకుల నియామకాలపై సీఎం జగన్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. వర్సిటీల్లో 2,635 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్ పోస్టులతో పాటు ట్రిపుల్ ఐటీల్లో 660 లెక్చరర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి
మిగతా 3వ పేజీలో ▶



మళ్లీ మోకాలడ్డు

- రాజధానిలోకి పేదలు రాకుండా మరోసారి అడ్డుకున్న చంద్రబాబు అండ్ కో
- ఇళ్ల స్థలాలు మొదలు ఇళ్ల నిర్మాణం వరకు వరుసగా పిటిషన్లు
- ప్రభుత్వ చర్యలకు అడుగడుగునా అడ్డుపడిన టీడీపీ నేతలు
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ న్యాయ పోరాటంతో 50 వేలకు పైగా ఇళ్ల స్థలాల పంపిణీ
- ఇళ్లు నిర్మిస్తుండగా రైతుల ముసుగులో మళ్లీ పిటిషన్లు దాఖలు
- ఆర్–5 జోన్‌లో ఇళ్ల నిర్మాణం వద్దన్న హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం
- మధ్యంతర ఉత్తర్వులు జారీ
- సుప్రీంకోర్టులో సవాల్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- ఆ మేరకు ప్రభుత్వ న్యాయవాదులకు దిశా నిర్దేశం.. టీడీపీ కుట్ర రాజకీయంపై మండిపడుతున్న పేదలు

2లో



టీడీపీకి పేదలంటే **గిట్టదు**

ఇళ్లపై ప్రస్తుతం న్యాయస్థానం స్టేటస్‌కో మాత్రమే ఇచ్చింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మా అందరి తరఫున పై కోర్టును ఆశ్రయించి పేద ప్రజలకు రాజధానిలోనే ఇళ్లు నిర్మించి ఇస్తుందన్న నమ్మకం మాకుంది. రైతుల ముసుగులో, స్వచ్ఛంద సంస్థల ముసుగులో కోర్టును ఆశ్రయించి టీడీపీ వారు ఆడుతున్న దొంగ ఆట ఇది. ఈ కుట్ర గురించి ప్రజలకు అంతా తెలుసు. ఇంటింటికి తిరిగి టీడీపీ వాళ్లు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి వెళ్లొద్దన్నప్పుడే మాకు అర్థం అయింది. పేద ప్రజలంటే టీడీపీకి గిట్టదని మరోమారు రుజువైంది. - పులి భాగ్యలక్ష్మి, సంజీవ్‌నగర్



6లో

'ఢిల్లీ' బిల్లుకు లోక్‌సభ ఆమోదం

తగినంత సమయమిచ్చి

నేనే వస్తున్నా..

విపత్తుల వేళ ముందుగానే నిధుల విడుదల: సీఎం జగన్
వనరులను సమకూర్చి అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేశాం

- సకాలంలో టీఆర్ 27 నిధుల విడుదల
- నా పర్యటనలతో సహాయ చర్యలకు ఆటంకం కలగొద్దనే అధికారులకు కొంత సమయమిచ్చి వస్తున్నా
- సోమ, మంగళ వారాల్లో బాధిత ప్రాంతాల్లో పర్యటిస్తా
- క్షేత్రస్థాయిలో అన్నీ పరిశీలిస్తా.. బాధితులను పరామర్శిస్తా
- వరద సాయంలో ఉదారంగా వ్యవహరించాలి.. మనకే ఆ పరిస్థితి ఎదురైతే ఎలాంటి సాయాన్ని ఆశిస్తామో అలాగే అందించాలి
- ఎక్కడా ఏ కలెక్టర్ కూడా సరిగా చేయలేదనే మాటే రాకూడదు
- వరద ప్రభావం తగ్గగానే ఆస్తి, పంట నష్టం వివరాల సేకరణ
- వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్

సాక్షి, అమరావతి: వరద ప్రాంతాల్లో అధికార యంత్రాంగం ముమ్మరంగా చేపట్టిన సహాయ చర్యలకు తన పర్యటనల ద్వారా ఆటంకం కలిగించకూడదనే ఉద్దేశంతో కొంత సమయం ఇచ్చి ఆ తరువాత క్షేత్రస్థాయిలో బాధితులకు అందిన సాయం, పునరావాస కార్యక్రమాలను స్వయంగా పరిశీలిస్తున్నట్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. విపత్తుల వేళ బాధితులను ఆదుకునేందుకు అవసరమైన నిధులు, వనరులను అధికారులకు ముందుగానే సమకూర్చి అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విపత్తుల సమయంలో ఎలా వ్యవహరిస్తోందో మీ అందరికీ తెలిసిన విషయమేనని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇప్పుడు కూడా అదే తరహాలో సోమ, మంగళవారాల్లో వరద ప్రాంతాల్లో పర్యటించి
మిగతా 3వ పేజీలో ▶

ఓడగుట్టపై వరద బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



10లో

ఆపద వేళ.. ఆపన్న హస్తం..

గోదావరి వరదల వేళ వైఎస్ జగన్ ప్రభుత్వం తమ పట్ల ఎంతో ఔదార్యం చూపిందని.. ఆపద వేళ ఆపన్న హస్తం అందించి ఆదుకుందని ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం రుద్రమకోట గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఓడగుట్టపై పునరావాస శిబిరం ఏర్పాటు చేసి ఏ లోటూ లేకుండా చూస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. గోదావరి గట్టుపైనే తమ గ్రామం ఉన్నందున చిన్నపాటి వరదొచ్చినా వరద తాకిడికి గురవుతుందని.. టీడీపీ హయాంలో వరదలు వచ్చినప్పుడల్లా నానా అగచాట్లు పడేవారమని వివరించారు. తమను పట్టించుకునే నాథుడు ఉండేవారు కాదని చెప్పారు.

ఆద్యంతం సందేహాస్పదం

దర్యాప్తు తీరుపై 'ద వైర్' విశ్లేషణాత్మక కథనం-2

వివేకా హత్య కేసులో విస్మయం కలిగిస్తున్న సీబీఐ దర్యాప్తు

- ప్రత్యక్ష సాక్షి రంగన్న, పరస్పర విరుద్ధ వాంగ్మూలాలు
- హత్య జరుగుతుంటే బయటే ఉన్న రంగన్న ఏం చేశాడు?
- రెండో వాంగ్మూలం ప్రకారం చెట్టుకింద దాక్కుని చూశాడు
- తొలి వాంగ్మూలంలో ఈ విషయం ఎందుకు చెప్పలేదు?
- హత్య జరిగాక వివేకా పీఏ వచ్చే వరకు నిద్ర పోతున్నట్లు నటించాడా?
- వాళ్లు హత్య చేస్తుంటే ఎవరికైనా చెబుదామని అనిపించలేదా?
- సాక్షుల వాంగ్మూలాల పేరిటా కట్టుకథలు
- అజేయ కల్లం చెప్పిందొకటి.. నమోదు చేసింది మరొకటి!

2లో

అంగన్‌వాడీ.. కొత్త ఒరవడి

చిన్నారులకు యూనిఫామ్

టై, బెల్టులతో చిన్నారులకు ప్రత్యేక ఆకర్షణ
ఆదర్శంగా ఇన్నేశుపేట కేంద్రం



యూనిఫామ్‌లో చిన్నారులు

ఇచ్ఛాపురం రూరల్: మారుతున్న కాలానికి అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాలను సైతం ప్రభుత్వం ఉన్నతీకరిస్తోంది. ఎప్పటికప్పుడు కొత్త సంస్కరణలు తెచ్చి మరింత బలోపేతం చేస్తుండటంతో పిల్లలు కూడా కేంద్రాలకు వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించడంతో పాటు నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నారు. కొంతమంది అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్రానికి వచ్చే పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి కొత్త ఒరవడి సృష్టిస్తున్నారు. ఇచ్ఛాపురం మండలం ఇన్నేశుపేట అంగన్‌వాడీ కేంద్రం దీనికి ఉదాహరణగా నిలుస్తోంది.

కార్పొరేట్ స్థాయిలో..

ఇన్నేశుపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అడుగు పెడితే కార్పొరేట్ స్థాయిలో నిర్వహించే కాన్వెంట్‌లోకి ప్రవేశించామనే అనుభూతి కలుగుతోంది. ప్రీ ప్రైమరీ చిన్నారులు బ్లూ నిక్కరు, గళ్ల షర్టు, మెడలో టై, గుర్తింపు కార్డు, నలుపు బూట్లు, షర్టు జేబు వద్ద వేలాడుతున్న కర్చీఫ్‌తో అల్లారు ముద్దుగా కనిపిస్తారు. గురువారం ఒక్కరోజు మాత్రం పూర్తిగా తెలుపు యూనిఫామ్‌తో పిల్లలందరూ కేంద్రానికి వస్తారు. 38 మంది చిన్నారులుండే ఈ కేంద్రం సొంత భవనంలో నడుస్తోంది. కొంత మంది పిల్లలు ప్రైవేటు ప్రీప్రైమరీ పాఠశాలలకు యూనిఫామ్‌తో వెళ్లి ఆనందపడుతుంటారని.. ఇదే ఉద్దేశంతో తమ కేంద్రానికి వచ్చే చిన్నారులు కూడా యూనిఫామ్ ధరించాలన్నది వారి తల్లిదండ్రుల కోరిక అని ఇక్కడి అంగన్‌వాడీ కార్యకర్తలు చెబుతున్నారు.

ఈ కేంద్రం ప్రత్యేకం



ఇప్పటివరకు చాలాచోట్ల సీడీపీవోగా పనిచేశాను. కానీ ఇన్నేశుపేట అంగన్‌వాడీ కేంద్రం ఓ ప్రత్యేకమే. ప్రీప్రైమరీ విద్యార్థులు ఏకరూప దుస్తుల్లో ముచ్చటగా కనిపిస్తుంటారు. ఆ కేంద్రానికి వెళితే.. కార్పొరేట్ కాన్వెంట్‌లో అడుగుపెట్టినట్టు ఉంటోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన ఆంగ్ల బోధన కావడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఖర్చుకు వెనుకాడకుండా ఉత్సాహంగా కేంద్రానికి పంపిస్తుంటారు.
– పురాణం నాగరాణి, సీడీపీవో, ఇచ్ఛాపురం రూరల్

క్రమశిక్షణను అలవర్చేందుకు..



కొన్నేళ్లుగా మా అంగన్‌వాడీ కేంద్రంలో యూనిఫామ్ అమలు చేస్తున్నాం. వీటిని ధరించడం వల్ల ప్రీస్కూల్‌లో క్రమశిక్షణ, ఐక్యతను పెంపొందించడానికి దోహదపడుతోంది. ఖర్చు మొత్తం చిన్నారుల తల్లిదండ్రులు ఇష్టంగానే భరిస్తారు. నీలం, తెలుపు రంగుల్లోని యూనిఫామ్‌లో తమ పిల్లల్ని అంగన్‌వాడీ కేంద్రానికి పంపించడాన్ని గొప్పగా ఫీలవుతుంటారు.
– నెయ్యిల శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్త, ఇన్నేశుపేట

పోషణ.. ఆరోగ్య సంరక్షణ

గర్భిణులు, బాలింతలకు వరం
ఏలూరు జిల్లాలో 21,555 మందికి మేలు
నెలకు రూ.1.97 కోట్ల వ్యయం

కైకలూరు: రాష్ట్రంలో గర్భిణులు, బాలింతల సంపూర్ణ ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ, ప్లస్, టేక్ హోమ్ రేషన్ పంపిణీ' మన్ననలు పొందుతోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి పౌష్టికాహారం తీసుకోవడంలో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలియడంతో నేరుగా 10 రకాల పౌష్టికాహార పదార్థాలతో కూడిన సరుకుల సంచిని గర్భిణులు, బాలింతల ఇంటికే పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ముఖ ఆధారిత గుర్తింపు పద్ధతిలో సరుకుల సరఫరా పారదర్శకంగా సాగుతోంది. జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు నేరుగా లబ్ధిదారుల ఇంటికే వెళ్లి సరుకుల కిట్లు అందిస్తున్నారు.

రక్తహీనత నివారణకు..

రక్తహీనత, పౌష్టికాహారలేమితో గర్భిణులు, బాలింతలు ఎవ్వరూ ఉండకూడదనే ఉద్దేశంతో సీఎం జగన్ టేక్ హోం రేషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద కిట్ విలువ రూ.850, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కింద గిరిజన ప్రాంత మహిళలకు కిట్ విలువ రూ.1,150 అందిస్తున్నారు. రాష్ట్ర చరిత్రలో గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ఇంత పెద్ద ఎత్తున ఖర్చు చేస్తున్న దాఖలాలు లేవు. అలాగే గ్రామాల్లో వైద్య సేవలు అందించే ఫ్యామిలీ డాక్టర్లు ఇకపై అంగన్‌వాడీ కేంద్రాల్లో పర్యటించాలని సీఎం జగన్ నిర్ణయంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గిరిజన మండలాల్లో అదనంగా..

జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీల పరిధిలో 11,826 మంది గర్భిణులు, 9,729 మంది బాలింతలు మొత్తం 21,555 మంది ఉన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద రూ.850 కిట్లు తీసుకునే 16,853 మందికి నెలకు రూ.1,43,250,50, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కింద గిరిజన ప్రాంతాల్లోని కిట్లు తీసుకునే 4,702 మందికి కిట్ రూ.1,150 చొప్పున రూ.54,07,300 మొత్తం రూ.1,97,32,350 ఖర్చు ప్రభుత్వం భరిస్తోంది.

నాణ్యతలో రాజీపడలేదు

నాణ్యత విషయంలో ఏ మాత్రం రాజీ పడకుండా సీఎం జగన్ 10 రకాల పోషక పదార్థాలను అందిస్తున్నారు. ఒక్కో కిట్‌లో మూడు కిలోల నాణ్యమైన బియ్యం, కిలో కందిపప్పు, అరలీటరు పామాయిల్, ఐదు లీటర్ల పాలు, రెండు కిలోల రాగిపిండి, కిలో అటుకులు, పావు కిలో బెల్లం, పావు కిలో వేరుశనగ చిక్కీలు, పావు కిలో కర్జూరం, 25 కోడిగుడ్లు (13 గుడ్లు ఒకసారి, 12 గుడ్లు మరోసారి) అందిస్తారు. గిరిజన మండలాల్లో అదనంగా రెండు కిలోల మల్టీగ్రైన్ ఆటా, పావు కిలో వేరుశనగ చిక్కీ, పావు కిలో బెల్లం ఇస్తున్నారు. జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి కిట్ల పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. త్వరలో ఏలూరు జిల్లావ్యాప్తంగా రేషన్ బియ్యంతో తయారు చేసే వంటకాలపై పోటీలు నిర్వహించి అవగాహన కల్పించనున్నారు.

శుభ పరిణామం

అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పౌష్టికాహారాన్ని తీసుకునేవాళ్లం. ఒక్కోసారి వివిధ కారణాల వల్ల కేంద్రాలకు వెళ్లలేక పోయేవాళ్లం. సమయం మించిపోతే పదార్థాలు చల్లబడేవి. ఇప్పుడు ఏ బాధా లేకుండా ఇంటి వద్దకే పోషకాహార కిట్లు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ కృతజ్ఞతగా ఉంటాం.
–పి.రజని, బాలింత, కైకలూరు

పారదర్శకంగా పంపిణీ


రాష్ట్రంలో గర్భిణులు, బాలింతలకు సీఎం జగన్ విలువైన పోషకాహారం కిట్లు అందిస్తున్నారు. వీటిని పారదర్శకంగా పంపిణీ చేసేందుకు ముఖ ఆధారిత పద్ధతిని అందుబాటులోకి తీసుకొచ్చాం. ఇప్పటికే జిల్లాలో పలువురు లబ్ధిదారులకు వారి ఇంటి వద్దనే కిట్లు పంపిణీ చేశాం.
–కేపీఎల్ పద్మావతి, జిల్లా మహిళా, శిశుసంక్షేమశాఖాధికారి, ఏలూరు

క్లుప్తంగా...

నేడు సీఎం జగన్ విజయవాడ పర్యటన

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం విజయవాడలో పర్యటించనున్నారు. ఉదయం 10.20 గంటలకు తాడేపల్లిలోని నివాసం నుంచి బయలుదేరి విజయవాడలోని 'ఏ' కన్వెన్షన్ సెంటర్‌కు సీఎం చేరుకుంటారు. అక్కడ నిర్వహించే ఆంధ్రప్రదేశ్ సహకార బ్యాంక్(ఆప్కాబ్) వజ్రోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారు. అనంతరం ఆయన తాడేపల్లిలోని నివాసానికి చేరుకుంటారు.

త్వరలో ఆదిత్య-ఎల్1 ప్రయోగం



సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): సూర్యుడిపై పరిశోధనల కోసం సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్(షార్) నుంచి ఈ నెలాఖరులో గానీ సెప్టెంబర్ మొదటివారంలో గానీ పీఎస్ఎల్వీ సీ57 రాకెట్ ద్వారా ఆదిత్య-ఎల్1 ఉపగ్రహాన్ని ఇస్రో శాస్త్రవేత్తలు ప్రయోగించనున్నారు. షార్ కేంద్రంలోని మొదటి ప్రయోగ వేదికకు సంబంధించి వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో రాకెట్ అనుసంధానం పనులు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది చేసిన ఆరు ప్రయోగాలు వరుసగా విజయాలు సాధించడంతో.. రెట్టించిన ఉత్సాహంతో మరో రాకెట్ ప్రయోగానికి ఇస్రో సిద్ధమైంది.

వర్సిటీల్లో పోస్టుల భర్తీ హర్షణీయం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఉన్నత విద్య బలోపేతానికి 3,295 బోధనా సిబ్బంది నియామకాలు చేపట్టడం హర్షణీయమని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యానికి వర్సిటీల నాణ్యత దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో కొత్తగా రెగ్యులర్ పోస్టులు భర్తీ చేయడం ద్వారా వర్సిటీ విద్య బలోపేతం అవుతుందని తెలిపారు. త్వరలో చేపట్టబోయే డీఎస్సీకి కూడా జనరల్ కేటగిరీ అభ్యర్థుల వయో పరిమితిని పెంచాలని, వివిధ శాఖల్లోని ఖాళీలకు నోటిఫికేషన్లు విడుదల చేసి నిరుద్యోగులను ఆదుకోవాలని కోరారు.

ఎనర్జీ అసిస్టెంట్లకు సర్కారు వరం

- రెండేళ్లు పూర్తి చేసిన వారందరినీ రెగ్యులర్ చేస్తూ సీఎండీల ఉత్తర్వులు



సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎనర్జీ అసిస్టెంట్ల కల నెరవేరింది. వారి జీవితాల్లో పండుగ వచ్చింది. జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగాలు పొందిన వారిలో నిబంధనల మేరకు అర్హత గల అందరినీ పర్మినెంట్ (రెగ్యులర్) చేస్తూ ఏపీ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ల సీఎండీలు ఐ.పృథ్వీతేజ్, జె.పద్మాజనార్దనరెడ్డి, కె.సంతోషరావు గురువారం ఉత్తర్వులిచ్చారు. సంస్థ నియమ నిబంధనలకు అనుగుణంగా వారి జీతభత్యాలుంటాయని ఆదేశాల్లో వెల్లడించారు. 2019లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో పాటు ఎనర్జీ అసిస్టెంట్ల పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం సృష్టించి నిరుద్యోగులకు వరంలా అందించింది. ఏపీ ఈపీడీసీఎల్‌లో దాదాపు 2,859 మంది, ఏపీ సీపీడీసీఎల్‌లో 1,910 మంది, ఏపీ ఎస్పీడీసీఎల్‌లో 3,114 మంది చొప్పున మొత్తం 7,883 మందికి ఉద్యోగం కల్పించింది. వీరికి రెండేళ్ల పాటు ప్రొబేషన్ పీరియడ్ ఉంటుందని సీఎండీలు తెలిపారు.

శ్రీసిటీలో అమెరికన్ కంపెనీల అద్భుత వృద్ధి

- శ్రీసిటీ సందర్శించిన యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నీఫర్ లారెన్స్



శ్రీసిటీలో ఆక్సిజన్ క్లీనింగ్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కాన్సుల్ జనరల్

వరదయ్యపాళెం(తిరుపతి జిల్లా): శ్రీసిటీలోని అమెరికన్ కంపెనీలు అద్భుత వృద్ధిని సాధిస్తున్నాయని యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా కాన్సుల్ జనరల్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా) జెన్నీఫర్ లారెన్స్ అన్నారు. జెన్నీఫర్ లారెన్స్‌తోపాటు వైస్ కాన్సుల్ జనరల్ అఖిల్ బెరీ, ఆర్థిక వ్యవహారాల నిపుణుడు సిబా ప్రసాద్ త్రిపాఠి, యూఎస్ ఫారిన్ కమర్షియల్ సర్వీస్ కమర్షియల్ అడ్వైజర్ సునీల్‌కుమార్ గురువారం శ్రీసిటీని సందర్శించారు. వారికి శ్రీసిటీ చైర్మన్ శ్రీనిరాజు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీలోని వీఆర్వీ పరిశ్రమలో నూతన ఆక్సిజన్ క్లీనింగ్ ప్లాంట్‌ను లాంఛనంగా జెన్నీఫర్ లారెన్స్ ప్రారంభించారు. శ్రీసిటీలోని అన్ని అమెరికన్ కంపెనీల సీఈవోలు, సీఎక్స్‌వోలతో ఆమె ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

మళ్లీ మోకాలడ్డు



రాజధానిలోకి పేదలు రాకుండా మరోసారి అడ్డుకున్న చంద్రబాబు అండ్ కో

ప్రభుత్వ చర్యలకు అడుగడుగునా అడ్డుపడిన టీడీపీ నేతలు

టీడీపీ కుట్ర రాజకీయంపై మండిపడుతున్న పేదలు

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాజధానిలో పేదలు ఉండటానికి వీల్లేదంటున్న చంద్రబాబు సహా తెలుగుదేశం పార్టీ పెద్దలు వారి పంతం నెగ్గించుకున్నారు. రాజధానిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ఆర్-5 పేరుతో ఓ జోన్‌ను సృష్టించి, ఆ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలకు రాజధాని రైతుల ముసుగులో అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తోన్న చంద్రబాబు అండ్‌ కో తాజాగా మరో అడుగు ముందుకు వేసింది. సీఎం జగన్.. 50 వేల మందికి పైగా పేద అక్కచెల్లెమ్మలకు అక్కడ ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి, వేగంగా ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో మరోమారు కోర్టు ద్వారా మోకాలడ్డారు. నాడు అధికారంలో ఉన్నప్పుడు రాజధానిలో పేదల ఇళ్ల కోసం మొత్తం భూమిలో 5 శాతం కేటాయించాలని చట్టం తీసుకొచ్చి, దాన్ని తమ స్వప్రయోజనాల కోసం అమలు చేయకుండా తుంగలో తొక్కిన టీడీపీ పెద్దలు.. ఇప్పుడూ పేదలకు తీరని ద్రోహమే చేశారు. రాజధానిలో పేదలు వచ్చి చేరితే అదో పెద్ద మురికి వాడగా మారుతుందని, వారి వల్ల తమ స్థలాలకు రేట్లు పడిపోతాయంటూ పేదలను కించపరుస్తూ తమ న్యాయవాదుల ద్వారా దారుణంగా వాదనలు వినిపించిన టీడీపీ పెద్దలు.. కోర్టుల్లో తమకున్న బలాన్ని మరోసారి రుజువు చేశారు. రాజధానిలో పేదలకు ఇచ్చిన స్థలాల్లో ప్రభుత్వం చేపట్టబోతున్న ఇళ్ల నిర్మాణాన్ని అడ్డుకోవాలంటూ రైతుల ముసుగులో వారు దాఖలు చేయించిన అనుబంధ పిటిషన్లను హైకోర్టు అనుమతించింది. పేదలకు ఇచ్చిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టకుండా స్టే విధించింది. పేదల ఇళ్ల నిర్మాణానికి విస్తృత ప్రజా ప్రయోజనాలు పూర్తి వ్యతిరేకంగా ఉన్నాయని తెలిపింది. అందువల్ల ఇళ్ల నిర్మాణానికి అనుమతినివ్వడం ఎంత మాత్రం సమర్థనీయం కాదని స్పష్టం చేసింది. ఆర్-5 జోన్‌లో పేదల ఇళ్ల నిర్మాణం పూర్తయితే పూడ్చలేని నష్టం జరుగుతుందని తేల్చి చెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ రవినాథ్ తిల్హరీలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టుకు ప్రభుత్వం

హైకోర్టు తీర్పుపై నిరుపేదల పక్షాన సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. నవరత్నాలు -పేదలందరికీ ఇళ్లు పథకం కింద సీఆర్‌డీఏ పరిధిలో గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన నిరుపేదలకు పక్కా ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో 1,402 ఎకరాల్లో 50,793 మంది మహిళలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసింది. రూ.1,829.57 కోట్ల వ్యయంతో అన్ని మౌలిక వసతులతో ఇళ్ల నిర్మాణాలకు గత నెల 24వ తేదీన సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఇళ్ల నిర్మాణాలు కూడా ప్రారంభమయ్యాయి. ఆరు నెలల్లో తమ దశాబ్దాల సొంతింటి కల నెరవేరబోతోందని పేదింటి అక్కాచెల్లెమ్మలు ఆశగా ఎదురు చూస్తున్న తరుణంలో కోర్టు తీర్పుతో ఇళ్ల నిర్మాణాలు ఆగిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే తమ న్యాయవాదులకు దిశా నిర్దేశం చేసింది.

అప్పుడు ఫలించని కుట్ర

సీఆర్‌డీఏలో పేదల ఇళ్లు నిర్మించకుండా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, ఆయన సృష్టించిన సంఘాలు ఆది నుంచి అడ్డుపడుతూ వస్తున్న విషయం తెలిసిందే. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద 2020లోనే ప్రభుత్వం రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదలకు 30 లక్షలకు పైగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేసింది. గత చంద్రబాబు ప్రభుత్వ తప్పులను సరిదిద్ది పేదలకు రాజధానిలో 5 శాతం భూమిని కేటాయించడమే కాక, ఆ భూమిలో ఇళ్ల స్థలాలు ఇచ్చి, అందులో ఇళ్లు నిర్మించేందుకు వీలుగా ఆర్ 5 జోన్‌ను సృష్టిస్తూ సీఆర్‌డీఏ చట్టానికి రాష్ట్ర ప్రభుత్వం సవరణ చేసింది. ఆ చట్టాన్ని, ఆ జోన్‌లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు అవసరమైన భూమిని గుంటూరు, కృష్ణా జిల్లాల కలెక్టర్లకు బదలాయించేందుకు అనుమతినిస్తూ జారీ చేసిన జీవోను సవాలు చేయిస్తూ టీడీపీ పలువురి చేత హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేయించింది. చంద్రబాబు, ఆయన సృష్టించిన సంఘాలు హైకోర్టులో 18 కేసులు, సుప్రీంకోర్టులో 5 కేసులు వేశారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా అడ్డుకునేందుకు హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు శక్తివంచన లేకుండా ప్రయత్నించారు. సీఎం జగన్ మూడేళ్లపాటు వారితో న్యాయ పోరాటం చేశారు. దీంతో అటు హైకోర్టు, ఇటు సుప్రీంకోర్టు కూడా ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని నియంత్రించేందుకు నిరాకరించాయి. ఇళ్ల పట్టాలు జారీ చేసుకోవచ్చంటూ ప్రభుత్వానికి అనుమతినిచ్చాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసింది. అలా పంపిణీ చేసిన స్థలాల్లో ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అనంతరం ఇళ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అందాల్సిన సాయాన్ని అడ్డుకోవడానికి చంద్రబాబు అండ్ కో విశ్వప్రయత్నాలు చేస్తోంది. కేంద్ర మంత్రులు, అధికారులను కలిసి రకరకాల ఫిర్యాదులు చేశారు. అయినప్పటికీ వారి పాచికలు పారలేదు.

మళ్లీ మరో కుట్ర

దీనిపై ఓర్వలేని తెలుగుదేశం పార్టీ పెద్దలు మరో కుట్రకు తెరలేపారు. పేదల కోసం చేపట్టనున్న ఇళ్ల నిర్మాణాన్ని అడ్డుకునేందుకు హైకోర్టులో మళ్లీ పిటిషన్లు దాఖలు చేయించారు. ఇళ్లు కట్టకుండా ప్రభుత్వాన్ని నియంత్రించాలన్నారు. ఈ వ్యాజ్యాలపై ఇటీవల న్యాయమూర్తులు జస్టిస్ సోమయాజులు, జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ రవినాథ్ తిల్హరీలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. ఇరుపక్షాల సుదీర్ఘ వాదనలు విని తీర్పును రిజర్వ్ చేసింది. గురువారం తీర్పు వెలువరించింది. పిటిషనర్లు తమ వాదనల సందర్భంగా లేవనెత్తిన అంశాలన్నింటితో ఏకీభవించిన త్రిసభ్య ధర్మాసనం.. ప్రభుత్వం, సీఆర్‌డీఏ వాదనల్లో ఒక్క దాన్ని కూడా పరిగణనలోకి తీసుకోకపోవడం విశేషం.

ఇతర ప్రాంతాల వారికి ఇవ్వచ్చో లేదో చూడాలి

రాజధాని నిర్మాణంలో ఇళ్లు కోల్పోయే వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఇతర ప్రాంతాల వారికి రాజధానిలో ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు చట్ట నిబంధనలు అనుమతిస్తాయా? లేదా? అన్నది లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది. ఇళ్ల పట్టాల మంజూరు హైకోర్టు ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటుందని సుప్రీంకోర్టు చెప్పిన నేపథ్యంలో, భవిష్యత్తులో తాము పట్టాల మంజూరుకు వ్యతిరేకంగా తీర్పునిస్తే, ఇప్పుడు చేపట్టే ఇళ్ల నిర్మాణం కోసం ఖర్చు చేసిన డబ్బు మొత్తం వృథా అవుతుందని ధర్మాసనం తెలిపింది. ఈ డబ్బంతా ప్రజా ధనమని గుర్తు చేసింది. పన్నుదారుల డబ్బు ఇలా వృథా అవుతుంటే మౌనంగా చూస్తూ ఉండలేమంది. సీఆర్‌డీఏ నుంచి తీసుకున్న భూములకు ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి డబ్బు చెల్లించలేదని, డబ్బు చెల్లించనప్పుడు ఆ భూములు ప్రభుత్వ పరం కావని తెలిపింది.

వాళ్లు పెట్టరు.. పెట్టే వారిని పెట్టనివ్వరు



ఎన్నో ఏళ్ల నుంచి రైల్వే స్థలాల్లో భయం భయంగా బతుకుతున్నాం. సీఎం జగన్ పుణ్యమా అంటూ ఇళ్ల స్థలం ఇచ్చారు. ఇప్పుడేమో ఇళ్లు నిర్మించవద్దంటూ కోర్టు తీర్పు ఇచ్చిందని అంటున్నారు. టీడీపీ వాళ్లు కూడా ప్రజల్ని పరిపాలించడానికి, మంచి చేయడానికే ఉన్నామని చెబుతున్నారు. అలాంటప్పుడు ఇలా పేదల ఇళ్లపై కోర్టుకు వెళ్లడం ఏమిటో అర్థం కావడం లేదు. వాళ్లు పెట్టరు.. పెట్టే వాళ్లను పెట్టనివ్వరు. గతంలో పెన్షన్ రావాలంటే ఆఫీస్‌ల చుట్టూ తిరగాల్సివచ్చేది. జగన్ వచ్చాక ఇంటికి వచ్చి పెన్షన్ ఇస్తున్నారు. ఎవరు ఎన్ని కుయుక్తులు పన్నినా తుదకు న్యాయం గెలుస్తుంది.

– చిలక పార్వతమ్మ, సలాం హోటల్ సెంటర్

ఇది టీడీపీ నాయకుల కుట్ర



అమరావతిలో చట్ట ప్రకారం కేటాయించాల్సిన పేదల ఇళ్ల స్థలాలను సైతం టీడీపీ స్వార్థ ప్రయోజనాల కోసం కోర్టును ఆశ్రయించి అడ్డుకోవడం దుర్మార్గం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేద ప్రజల పట్ల విశ్వాసం ఉంది కాబట్టే రాజధాని ప్రాంతంలో 50 వేల మందికి పైగా ఇళ్లు కేటాయించారు. టీడీపీ రైతుల ముసుగులో కోర్టుకు వెళ్లి పేదలను మోసగిస్తోంది. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో జగన్‌మోహన్‌రెడ్డే ముందంజలో ఉన్నారు. ఆయన సాధించి తీరుతారు.

– రెడ్డి నిర్మల, బాబూ జగజ్జీవన్‌రామ్ కాలనీ

వారి విజయం తాత్కాలికమే



రాజధాని ప్రాంతంలో పేదలు ఉండకూడదనే ఉద్దేశంతోనే వాళ్లు వివిధ కారణాలను చూపిస్తూ కోర్టుకు వెళ్లారు. వారు అనుకున్నదే చేశారు. అమరావతిలో డబ్బున్న వాళ్లే ఉండాలని వాళ్ల ఉద్దేశం. వారు ఎన్ని చేసినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తప్పకుండా తుది విజయం సాధిస్తారు. ఆ నమ్మకం మాకు ఉంది. కేటాయించిన స్థలాల్లోనే ఇళ్లు నిర్మించి ఇస్తారని గట్టిగా నమ్ముతున్నాం. వాళ్ల విజయం తాత్కాలికమే. న్యాయస్థానాల్లో తుది విజయం పేద ప్రజలదే.

– షేక్ మీరాబీ, నులకపేట

రాజధాని అంటే వాళ్లే ఉండాలా?



రాజధాని అమరావతిలో చంద్రబాబు, ఆయన సామాజికవర్గం వాళ్లు మాత్రమే వుండాలా? మాలాంటి పేదలకు రాజధానిలో ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్లు నిర్మించి ఇస్తుంటే చంద్రబాబు, ఆయన సామాజిక వర్గం వాళ్లు అడ్డుకోవడం దుర్మార్గం. పేదలంతా ఏకమై పోరాటం చేస్తే చంద్రబాబు ఆయన సామాజిక వర్గం రాజధాని అమరావతిలో ఉండగలరా? ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేదలంతా అండగా నిలుస్తాం. తుదకు మావైపే న్యాయం నిలుస్తుంది.

– కొండవనేని సీత, ఇప్పటం, తాడేపల్లి మండలం

రైతుల ముసుగులో తెలుగుదేశం నాటకం



రైతుల ముగుసులో టీడీపీ నాటకం ఆడుతోంది. ఈ మధ్యకాలంలో చదువుకున్న పిల్లలు చెబితే తప్ప టీడీపీ నిజ స్వరూపం మాకు తెలియలేదు. రైతుల ముసుగులో కోర్టుకు వెళ్లిన వారు రాజధాని ప్రాంతంలో పేద వాళ్లకు ఎలా నివాస స్థలాలు ఇస్తారంటూ ఫిర్యాదు రాశారని చెప్పారు. ఇలా చేయడం దుర్మార్గం. పేదల కడుపు కొట్టడం ధర్మం కాదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే మా అందరికీ న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉంది.

– దాడి శాంతకుమారి, నులకపేట

మా వల్లే మీరు సుఖంగా ఉంటున్నారు



డబ్బున్న వాళ్ల ఇళ్లలో పని చేయాలంటే మాలాంటి వారు ఎక్కడెక్కడో గుడిసెల్లో ఉంటూ వచ్చి పోవాలి. కాబట్టి మాలాంటోళ్లం రాజధానిలో ఉండకూడదనేది వారి పంతం. పేదలకు ఇళ్లు కట్టించకూడదని టీడీపీ వాళ్లు కోర్టును ఆశ్రయించడం చాలా బాధగా ఉంది. మాలాంటి వారు ఉంటేనే మీలాంటి వారు ఇళ్లల్లో సుఖంగా ఉంటారు. ఇప్పటికైనా అది ఆలోచించి కోర్టులో వేసిన కేసును వెనక్కు తీసుకుంటే బాగుంటుంది.


– కొప్పుల పద్మ, పోలకంపాడు

ఆద్యంతం సందేహాస్పదం

వివేకా హత్య కేసులో విస్మయం కలిగిస్తున్న సీబీఐ దర్యాప్తు

పలు కీలక కోణాలు విస్మరించిన వైనం

దర్యాప్తు తీరుపై 'ద వైర్' విశ్లేషణాత్మక కథనం–2



సాక్షి, అమరావతి: మాజీ ఎంపీ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ దర్యాప్తు తీరు ఆద్యంతం అశాస్త్రీయం, అహేతుకం, అసంబద్ధం, సందేహాస్పదంగా ఉందని ప్రముఖ జాతీయ వార్త వెబ్‌సైట్ 'ద వైర్' కుండబద్దలు కొట్టింది. రాజకీయ కారణాలతోనే హత్య జరిగిందని చెబుతున్న సీబీఐ.. కీలకమైన ఆస్తి వివాదం కోణాన్ని విస్మరించడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. వివేకా హత్య అనంతరం ఆయన నివాసంలో నిందితులు ఆస్తి పత్రాల కోసం వెతికారన్నది స్పష్టమవుతున్నా, ఆ కోణంలో ఎందుకు దర్యాప్తు చేయడం లేదని ప్రశ్నించింది. నార్కో ఎనాలిసిస్ పరీక్షల్లో కూడా ఏమీ చెప్పని వాచ్‌మెన్ రంగన్నకు రెండున్నరేళ్ల తర్వాత అంతా గుర్తుకు వచ్చినట్టు సీబీఐ వాంగ్మూలం నమోదు చేయడంపై సందేహాలు వ్యక్తం చేసింది. ఇక కీలక ఆధారంగా గొప్పగా ప్రకటించిన గూగుల్ టేక్ అవుట్ డాటా పూర్తిగా తప్పని స్వయంగా సీబీఐనే ప్రకటించడాన్ని 'ద వైర్' ప్రధానంగా ప్రస్తావించింది. రాజకీయ, నేర సంబంధమైన పరిశోధనాత్మక పాత్రికేయంలో 20 ఏళ్ల అనుభవం ఉన్న ప్రముఖ జర్నలిస్ట్ నరితా రాణి రాసిన రెండు విశ్లేషణాత్మక కథనాలను 'ద వైర్' వెబ్‌సైట్ ప్రముఖంగా ప్రచురించింది. మొదటి కథనంలో సీబీఐ దర్యాప్తులో డొల్లతనాన్ని బట్టబయలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా ప్రచురించిన రెండో కథనంలో మరింత లోతుగా విశ్లేషించి సీబీఐ దర్యాప్తు తీరును ఎండగట్టింది. సీబీఐ ప్రస్తావించిన ఐపీడీఆర్ డాటా కూడా హేతుబద్ధ ఆధారం కాదని తేల్చి చెప్పింది. దర్యాప్తునకు ఆధారంగా చెబుతూ సాక్షుల వాంగ్మూలాల పేరిట సీబీఐ చెబుతోంది కట్టు కథలేనని స్పష్టం చేసింది. ఏకంగా 14 మంది సాక్షులు సీబీఐ తీరును తప్పుబట్టడం.. ఏకంగా రిటైర్డ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అజేయ కల్లం సీబీఐపైనే న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేయడాన్ని ప్రముఖంగా ప్రస్తావించింది. ఏ కోణంలో చూసినా సరే వివేకా హత్య కేసు దర్యాప్తులో సీబీఐ దారి తప్పిందనే విషయాన్ని స్పష్టం చేసింది. 'ద వైర్' వెబ్‌సైట్ రెండవ కథనంలోని ప్రధాన అంశాలు ఇలా..

వివేకాను చివరిగా ఎవరు చూశారు?

వాచ్‌మెన్ రంగన్న ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం 2019 మార్చి 14 రాత్రి 12 గంటల సమయంలో వివేకా తన నివాసం నుంచి బయటకు వచ్చి సిగరెట్ తాగడం రంగన్న చూశాడు. నిందితులు కాకుండా వివేకా జీవించి ఉండగా చివరిసారిగా చూసిన వ్యక్తి రంగన్న. పోలీసు దర్యాప్తు నియమావళి ప్రకారం జీరో అవర్‌గా పిలిచే అప్పటి నుంచే దర్యాప్తు మొదలు కావాలి. అయితే 2021లో దస్తగిరి ఇచ్చిన అప్రూవర్ వాంగ్మూలంగానీ అనంతరం రంగన్న ఇచ్చిన వాంగ్మూలంలోగానీ 11.30 గంటలకు ఎర్ర గంగిరెడ్డి వివేకా నివాసానికి వచ్చారని చెప్పడం గమనార్హం.

వాచ్‌మెన్ రంగన్న అప్పుడలా.. ఇప్పుడిలా

వివేకా హత్య కేసు దర్యాప్తు చేసిన మొదటి దర్యాప్తు అధికారి చెప్పిన దాని ప్రకారం.. వాచ్‌మెన్ రంగన్న 2019 మార్చి 14వ తేదీ రాత్రి వివేకానందరెడ్డి నివాసం వరండాలో నిద్రపోయాడు. ఎన్నికల ప్రచారం ముగించుకుని రాత్రి 11.30 గంటల సమయంలో వివేకానందరెడ్డి తన నివాసానికి చేరుకున్నారు. కారు శబ్దం వినిపించి రంగన్న నిద్ర లేచి గేటు తెరిచాడు. వివేకా ఇంటి వద్ద దిగిపోయాక.. కారు డ్రైవర్ ప్రసాద్ ఇంటికి వెళ్లిపోయాడు. 'నేను నిద్రపోతాను.. నువ్వు నిద్రపో' అని వివేకా రంగన్నతో చెప్పి తన నివాసంలోకి వెళ్లిపోయారు. ఆ తర్వాత వివేకాను ఆయన నివాసంలో ఆ రోజు రాత్రి హత్య చేస్తుంటే బయటే ఉన్న రంగన్న ఏం చేశాడనే దానిపై టీడీపీ ప్రభుత్వ హయాంలోని పోలీసు అధికారులు విచారించనే లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక కొన్ని వారాల తర్వాత రంగన్న పేరు కూడా అనుమానితుల జాబితాలో చేర్చారు. మరికొందరు అనుమానితులతోపాటు రంగన్నను కూడా అహ్మదాబాద్ తీసుకువెళ్లి నార్కో ఎనాలిసిస్ పరీక్షలు నిర్వహించారు. ఆ పరీక్షల్లో ఎలాంటి విషయాన్ని రాబట్టలేదు. మరి రంగన్నకు ఏదైనా విషయం తెలిసి ఉంటే నార్కో ఎనాలిసిస్ పరీక్షల్లో బయటపడేది కదా!

రెండున్నరేళ్ల తర్వాత అన్నీ గుర్తుకొచ్చాయా?

వివేకా హత్య జరిగిన రెండున్నరేళ్ల తర్వాత సీబీఐ రంగన్నను ప్రత్యక్ష సాక్షిగా న్యాయస్థానంలో హాజరు పరిచింది. ఈ సారి రంగన్న కొన్ని కొత్త విషయాలు చెప్పడం ఆశ్చర్యం కలిగించింది. 2019 మార్చి 14న రాత్రి వివేకాను ఇంటి వద్ద దించేసి డ్రైవర్ ప్రసాద్ వెళ్లిపోయిన తర్వాత.. 15 నిమిషాలకు అంటే 11.45 గంటలకు వివేకా స్నేహితుడు ఎర్ర గంగిరెడ్డి అక్కడికి చేరుకున్నాడని చెప్పాడు. దర్యాప్తులో ఇదే కీలకమైన టర్నింగ్ పాయింట్. ఎందుకంటే ఈ మొత్తం ఎపిసోడ్‌లో దస్తగిరి, రంగన్న వాంగ్మూలాలు రెండు చోట్ల సరిపోలుతున్నాయి. వివేకా నివాసానికి ఎర్ర గంగిరెడ్డి రావడం.. వెళ్లడం అనే అంశాలు.

మృతదేహాన్ని అర్ధరాత్రే చూసిన రంగన్న

2021 జూలైలో జమ్మలమడుగు న్యాయస్థానంలో రంగన్న ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం.. 2019 మార్చి 14 అర్ధరాత్రి వివేకా నివాసం నుంచి శబ్దాలు రావడంతో కిటికీ వద్దకు వెళ్లి లోపలికి చూశాడు. లోపల నలుగురు వ్యక్తులు హాల్, బెడ్ రూమ్‌లలో తిరుగుతూ దేని కోసమో వెతుకుతున్నారు. రంగన్న ఓ చెట్టు వెనుక దాక్కున్నాడు. సునీల్ యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి, దస్తగిరి బయటకు వచ్చి గోడదూకి వెళ్లిపోవడం చూశాడు. అనంతరం ఎర్ర గంగిరెడ్డి బయటకు వచ్చి విషయం ఎవరికీ చెప్పొద్దని బెదిరించి వెళ్లాడు. ఆ తర్వాత అంటే తెల్లవారుజామున 3 గంటల సమయంలో రంగన్న వివేకా నివాసం లోపలికి వెళ్లాడు. బెడ్‌రూమ్‌లో మంచం పక్కన రక్తం పడి ఉంది. బాత్‌రూమ్‌లో వివేకా కింద పడిపోయి ఉన్నారు. ఆయన చుట్టూ రక్తం మడుగు కట్టి ఉంది.

అయినా బయట నిద్రించిన రంగన్న!

రక్తం మడుగులో తన యజమాని వివేకానందరెడ్డి చనిపోయి ఉండడాన్ని చూసిన తర్వాత రంగన్న ఏం చేశారంటే.. ఆయన ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం తలుపు దగ్గరకు మూసివేసి బయటకు వచ్చి అటూ ఇటూ చూశాడు. ఎవరూ కనిపించకపోవడంతో అక్కడే బీడీ తాగాడు. కాసేపు మెట్ల మీద కూర్చున్నాడు. కాసేపట్లో సమీపంలోని మసీదు నుంచి ఉదయం ప్రార్థనలు వినిపించాయి. దాంతో అక్కడే వరండాలో నిద్రపోయాడు. సీబీఐ అధికారులు ఆ ప్రాంతంలో ఉన్న రెండు మసీదుల్లోని మత పెద్దలతో మాట్లాడారు. వారు ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం రోజూ ఉదయం 5 గంటలకు మసీదులో ప్రార్థనలు మొదలవుతాయి. అప్పటికి 15 నిమిషాల ముందే మసీదు మైకుల ద్వారా ఆజాన్ వినిపించడం మొదలు పెడతారు. అంటే తెల్లవారుజామున 3.30 గంటల నుంచి 4.45 గంటల మధ్యలో రంగన్న తన యజమాని వివేకా మృతదేహాన్ని చూశాడు. కానీ తన వద్ద ఉన్న ఫోన్ ద్వారా అందుబాటులో ఉన్న వివేకా వద్ద పని చేసే సిబ్బందికి గానీ.. అక్కడికి పది నిమిషాల్లోనే వెళ్లగలిగేంత సమీపంలో ఉన్న డ్రైవర్ ప్రసాద్ నివాసానికి గానీ.. మరెవరికైనా చెప్పాలనిగానీ అనుకోలేదు. ఉదయం 5.30 గంటల నుంచి 6 గంటల మధ్య వివేకా పీఏ కృష్ణా రెడ్డి, వంటమనిషి లక్ష్మి, ఆమె కుమారుడు ప్రకాశ్ వచ్చే వరకు నిద్రపోతున్నట్టు నటిస్తూ గడిపాడు. పైగా ఉదయం వివేకా నివాసం ఉత్తరం వైపు తలుపు తెరచి ఉండటాన్ని చూసిన పీఏ కృష్ణా రెడ్డి.. తనను ఇంటి లోపలికి వెళ్లి చూడమంటే రంగన్న లోపలికి వెళ్లాడు. అప్పుడు వివేకా మృతదేహాన్ని మొదటి సారి చూసినట్టుగా అందర్నీ నమ్మించాడు. ఆ విషయాన్ని 861 రోజుల తర్వాత సీబీఐ ద్వారా న్యాయస్థానంలో ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నాడు. హత్య జరిగిన రెండేళ్ల తర్వాత దస్తగిరి ఇచ్చిన అప్రూవర్ వాంగ్మూలం, రంగన్న ఇచ్చిన వాంగ్మూలం తప్ప మరే ఆధారం లేదు.

సాక్షులు చెప్పని విషయాలు చెప్పినట్లు..

సాక్షుల వాంగ్మూలాల పేరిటా సీబీఐ అడ్డదారులు తొక్కింది. సాక్షులు చెప్పని విషయాలు చెప్పినట్టుగా గతంలో దర్యాప్తు అధికారిగా ఉన్న రామ్‌సింగ్ నమోదు చేయడం వివాదాస్పదమవుతోంది. కనీసం 14 మంది సాక్షులు తాము చెప్పని విషయాలను చెప్పినట్టుగా సీబీఐ వాంగ్మూలం నమోదు చేయడాన్ని ఖండించారు. నలుగురు సాక్షులు రామ్‌సింగ్‌కు వ్యతిరేకంగా పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. ఇదే విషయాన్ని ఎంపీ అవినాశ్ రెడ్డి సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్‌కు రాసిన లేఖలో ప్రధానంగా ప్రస్తావించారు కూడా. వివేకా చనిపోయారనే విషయాన్ని 2019 మార్చి 15న ఉదయం 6.15 గంటలకు ఆయన పీఏ కృష్ణా రెడ్డి గుర్తించారు. అంతకు ముందే వివేకా మరణం గురించి ఎవరికైనా తెలుసా అనే కోణంలో సీబీఐ దృష్టి సారించింది. వివేకా హత్య గురించి గజ్జెల ఉదయ్ కుమార్ రెడ్డికి 2019 మార్చి 15 తెల్లవారుజామున 4 గంటలకే తెలుసని ఆయన తల్లి తమ పొరుగున ఉండే ప్రభావతి దేవికి చెప్పినట్టుగా సీబీఐ చార్జ్‌షీట్‌లో పేర్కొంది. ఆ మేరకు ప్రభావతి దేవి 161 వాంగ్మూలం ఇచ్చినట్టు కూడా వెల్లడించింది. కానీ సీబీఐ వాదనను ప్రభావతి దేవి ఖండించారు. తాను చెప్పని విషయాలను చెప్పినట్టుగా సీబీఐ తన పేరిట వాంగ్మూలం నమోదు చేసుకుందని ఆవిడ స్పష్టం చేశారు.

అజేయ కల్లం పేరిట తప్పుడు వాంగ్మూలం

సాధారణ వ్యక్తులే కాదు.. ఏకంగా రాష్ట్ర రిటైర్డ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వాంగ్మూలాన్ని కూడా సీబీఐ వక్రీకరించడం వివాదాస్పదమైంది. అజేయ కల్లం చెప్పని విషయాలను చెప్పినట్టుగా సీబీఐ తప్పుడు వాంగ్మూలం నమోదు చేసి చార్జ్‌షీట్‌లో పేర్కొంది. దీన్ని అజేయ కల్లం తీవ్రంగా ఖండిస్తూ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేయడం సీబీఐ తీరును ఎండగడుతోంది. '2019 మార్చి 15 ఉదయం 5.30 గంటలకు హైదరాబాద్‌లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాసంలో పార్టీ మేనిఫెస్టో కమిటీ సమావేశం జరుగుతుండగా.. ఇంట్లో సహాయకుడు వచ్చి వైఎస్ భారతి పిలుస్తున్నారని వైఎస్ జగన్‌కు చెప్పారు. దాంతో లోపలికి వెళ్లిన జగన్ కాసేపటి బయటకు వచ్చి తన చిన్నాన్న వివేకానందరెడ్డి మరణించినట్టు అక్కడ ఉన్న మాకు చెప్పారు' అని అజేయ కల్లం వాంగ్మూలంలో పేర్కొన్నట్టు సీబీఐ తెలిపింది. దీన్ని అజేయ కల్లం తీవ్రంగా ఖండించారు. 2019 మార్చి 15 ఉదయం 5 గంటలకు పార్టీ మేనిఫెస్టో కమిటీ సమావేశం మొదలైంది. గంటన్నర తర్వాత అంటే 6.30 గంటల సమయంలో సహాయకుడు వచ్చి ఓఎస్డీ కృష్ణ మోహన్‌రెడ్డిని పిలిచారు. ఆయన బయటకు వెళ్లారు. తర్వాత కాసేపటికి కృష్ణమోహన్‌రెడ్డి వచ్చి వైఎస్ జగన్ చెవిలో ఏదో చెప్పారు. దాంతో నిశ్చేష్టుడైన వైఎస్ జగన్ వెంటనే లేచారు. తన చిన్నాన్న వివేకానందరెడ్డి చనిపోయారు అని మాతో చెప్పారు. వెంటనే సమావేశాన్ని ఆపేసి బయటకు వచ్చాం' అని తాను సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నట్టు అజేయ కల్లం స్పష్టం చేశారు. అసలు వైఎస్ భారతి పేరును తాను ప్రస్తావించ లేదని, అలాగే తాను 6.30 గంటలని చెప్పగా 5.30 గంటలుగా సీబీఐ పేర్కొందని ఆయన తప్పుబట్టారు.

రేపటి సంచికలో: వివేకా లేఖను పట్టించుకోరా?

హిందూపూర్‌లో ఎగిరేది వైఎస్సార్‌సీపీ జెండానే

ఏపీ ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్ నవీన్ నిశ్చల్



సాక్షి, అమరావతి: 2024 ఎన్నికల్లో హిందూపూర్‌లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయడం ఖాయమని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ఏపీ ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్ నవీన్ నిశ్చల్ ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీ నియోజకవర్గ చరిత్రలో తొలిసారిగా ఓ బీసీ మహిళకు సమన్వయకర్తగా బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. టీఎస్ దీపికను హిందూపూర్ నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో నిలపడం మహిళా సాధికారతకు నిదర్శనమని పేర్కొన్నారు. దీపిక విజయానికి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా కృషి చేయాలని నవీన్ నిశ్చల్ పిలుపునిచ్చారు.

మెడిసిన్‌లో బీ, సీ కేటగిరీ సీట్ల భర్తీకి నోటిఫికేషన్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఈ ఏడాది నుంచి కొత్తగా ప్రారంభమవుతున్న ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలలతో పాటు స్విమ్స్, ప్రైవేట్ వైద్య, దంత కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి బీ, సీ కేటగిరీ ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీకి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు నీట్ యూజీ–2023లో అర్హత సాధించిన విద్యార్థులు శుక్రవారం ఉదయం పది గంటల నుంచి ఈ నెల 10వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలి. https://-ugmq.ysruhs.com వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ అప్లికేషన్ అందుబాటులో ఉంటుంది. నియమాలు, నిబంధనలపై స్పష్టత కోసం 8978780501, 7997710168, 9391805238, సాంకేతిక సమస్యలపై 7416563063, 7416253073, పేమెంట్ గేట్‌వేలో స్పష్టత కోసం 8333883934 నంబర్‌లను విద్యార్థులు సంప్రదించవచ్చు. నీట్ యూజీలో వచ్చిన ర్యాంక్‌ల ఆధారంగా నిబంధనలకు లోబడి సీట్ల కేటాయింపు ఉంటుందని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు. సీటు వచ్చేలా చేస్తామని కొందరు వ్యక్తులు చెప్పే మాయ మాటలు నమ్మి విద్యార్థులు, తల్లిదండ్రులు మోసపోవద్దని ఆమె స్పష్టంచేశారు.

'షాక్' ఇస్తే సర్వీసులెలా పెరిగాయి?

- 2021–22 వరకూ 9,912 చేనేత విద్యుత్ సర్వీసులుంటే ఇప్పుడు వాటి సంఖ్య 10,157
- నేతన్నలకు విద్యుత్ చార్జీల్లో 50 శాతం రాయితీ ఇస్తున్న ప్రభుత్వమిది
- ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు



సాక్షి, అమరావతి: ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్)లో గత రెండున్నరేళ్లలో చేనేత విద్యుత్ సర్వీసులు పెరిగాయని సంస్థ సీఎండీ కె. సంతోషరావు తెలిపారు. 'నేతన్నలకు కరెంట్ షాక్' అనే శీర్షికతో ఈనాడులో వచ్చిన కథనంపై గురువారం ఆయన స్పందించారు. నేతన్నలకు ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో 2021–22 వరకూ 9,912 విద్యుత్ సర్వీసులు వుండగా, 2022–23 నాటికి ఆ సర్వీసుల సంఖ్య 10,125కు పెరిగిందని.. 2023–24 జూలై నాటికి మొత్తం 10,157 సర్వీసులున్నాయన్నారు. అయితే, వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా పవర్ లూమ్స్ విద్యుత్ సర్వీసుల సంఖ్య తగ్గినట్లు ఈనాడు కథనంలో రాయడం అవాస్తవమన్నారు. షాక్ ఇస్తే సర్వీసులు ఎలా పెరిగాయని ఆయన ప్రశ్నించారు. చేనేత కార్మికులకు ఇంధన చార్జీల్లో 50 శాతం రాయితీని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోందని తెలిపారు. అలాగే, చేనేత కార్మికుల గృహాలకు నెలకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని, నేతన్నల అభ్యర్థన మేరకు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) కిలోవాట్ హవర్ (కేడబ్ల్యూహెచ్) బిల్లింగ్ విధానానికి అనుమతించిందని తెలిపారు. ఈ ఉత్తర్వులవల్ల మగ్గాలకు సంబంధించిన సర్వీసుల విద్యుత్ బిల్లు కొంతమేరకు తగ్గినట్లు సీఎండీ వెల్లడించారు.

విద్యుత్ షాక్‌తో ముగ్గురు దుర్మరణం

- భవన నిర్మాణ పనుల్లో విద్యుత్ తీగలకు తగిలిన ఇనుప రాడ్
- షాక్‌కు గురై ఇద్దరు మొదటి అంతస్తులో మృతి
- ఘటనను చూసి పైకి వెళ్లి పొరపాటున ఇనుపచువ్వను పట్టుకుని అంగన్‌వాడీ ఆయా మృతి


కేసరినాయుడు (ఫైల్)


చంద్రశేఖర్ (ఫైల్)


రెయ్యమ్మ (ఫైల్)

రాజాం/సంతకవిటి: విజయనగరం జిల్లా సంతకవిటి మండలం సోమన్నపేట గ్రామంలో గురువారం తీవ్ర విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన పొంద్రంకి కేసరినాయుడు (24), గంగ్రేటి చంద్రశేఖర్ (18), దూబ రెయ్యమ్మ (57) విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. పొంద్రంకి రామినాయుడు ఇంటి మొదటి అంతస్తు నిర్మాణ పనుల్లో భాగంగా అతని కుమారుడు కేసరినాయుడు, అదే గ్రామానికి చెందిన అతని స్నేహితుడు గంగ్రేటి చంద్రశేఖర్‌ను పనికి పిలిచి డాబా ఎక్కారు. ఆ సమయంలో డాబా మీద ఉన్న 12 ఎంఎం ఇనుప రాడ్‌ను డాబా వెనుక వైపునకు నెట్టగా, డాబాకు కొద్ది దూరంలో ఉన్న 230 ఓల్ట్స్ విద్యుత్ సరఫరా తీగలకు రాడ్ తగిలింది. వెంటనే రాడ్‌ను పట్టుకున్న ఇద్దరు యువకులు షాక్‌కు గురై పెద్దగా కేకలు వేస్తూ మృతి చెందారు. డాబా మీద యువకుల అరుపులను ఎదురుగా ఉన్న అంగన్‌వాడీ ఆయా దూబ రెయ్యమ్మ విని వెంటనే డాబాపైకి వెళ్లి పొరపాటున ఇనుప చువ్వను ముట్టుకోవడంతో ఆమె కూడా షాక్‌కు గురై మృతి చెందింది. ఈ విషయాన్ని గమనిస్తున్న ఒకరిద్దరు ఏదో జరుగుతుందని ఊహించి డాబా ఎక్కకుండా పొలాల్లో ఉన్న కుటుంబీకులకు సమాచారం అందించారు. గ్రామంలోకి వచ్చిన కిరాణా సరుకుల రవాణా వ్యాపారి డోల ప్రసాద్ డాబా వెనుక వైపునకు వెళ్లి ఇనుప రాడ్ స్ట్రీట్ లైన్ విద్యుత్ తీగలకు తగిలి ఉండడాన్ని గమనించి ఎలక్ట్రికల్ ఏఈకి ఫోన్ చేసి విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. అనంతరం డాబా ఎక్కి చూసి డాబాపై ముగ్గురు పడి ఉండడాన్ని గమనించి డాబా కిందకు దించారు. ముగ్గురిలో చంద్రశేఖర్ కొన ఊపిరితో ఉన్నాడనే అనుమానం రావడంతో వెంటనే ప్రైవేట్ వాహనంలో సంతకవిటి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పడంతో తిరిగి గ్రామానికి తీసుకొచ్చారు. బాధిత కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై లైంగికదాడికి పాల్పడిన ఆటో డ్రైవర్‌కు 15 ఏళ్లు జైలు

రూ.50వేలు జరిమానా
విశాఖలోని ప్రత్యేక న్యాయస్థానం తీర్పు

విశాఖ లీగల్: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఆటోడ్రైవర్‌కు 15 ఏళ్ల జైలుశిక్ష, రూ.50వేలు జరిమానా విధిస్తూ విశాఖ నగరంలోని ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనందిని గురువారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా ఏడాదిపాటు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. పోక్సో చట్టం కింద బాలికకు రాష్ట్ర ప్రభుత్వం రూ.4 లక్షలు పరిహారం చెల్లించాలని న్యాయమూర్తి సూచించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాల మేరకు... విశాఖపట్నంలోని అక్కయ్యపాలెం రాంజీ ఎస్టేట్‌కు చెందిన పదహారేళ్ల బాలిక 2016లో నగరంలోని రామా టాకీసు వద్ద ఉన్న ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరింది. మరికొందరు బాలికలతో కలిసి ఆమె ప్రతి రోజు ఆటోలో కళాశాలకు వెళ్లేది. ఈ క్రమంలో 2016, సెప్టెంబర్ 29న ఆటో డ్రైవర్ సాయిగణేష్(25) ఆ బాలికను ఒంటరిగా రామాటాకీస్ దగ్గర నుంచి పోర్టు స్టేడియం రోడ్డు మీదుగా అక్కయ్యపాలెం పైపుల సందులోకి తీసుకువెళ్లాడు. అక్కడ బాలికతో వికృతంగా ప్రవర్తించి లైంగిక దాడి చేశాడు. బాలికకు తీవ్ర రక్తస్రావం కావడంతో తిరిగి ఆటోలో తీసుకువచ్చి ఆమె ఇంటి దగ్గర వదలిపెట్టాడు. ఆటో డ్రైవర్ లైంగికదాడికి పాల్పడిన విషయాన్ని బాధితురాలు తన తల్లికి తెలియజేసింది. బాలికకు తీవ్ర రక్తస్రావం కావడంతో తొలుత ఆమెను సెవెన్ హిల్స్ ఆస్పత్రికి, ఆ తర్వాత కేజీహెచ్‌కి తరలించి చికిత్స చేయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు విశాఖ నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేశారు. అనంతరం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో 15 ఏళ్లు జైలు శిక్ష, రూ.50వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

నిరాశ్రయులకు ఓటు హక్కు కల్పించేలా
చర్యలు చేపట్టండి

- అర్హులైన వారందర్నీ ఓటరు జాబితాలో 100 శాతం చేర్పించేందుకు కృషి
- కలెక్టర్లకు కేంద్ర ఎన్నికల సంఘం అధికారుల ఆదేశం
- ముగిసిన రెండు రోజుల సదస్సు


మాట్లాడుతున్న సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్లు ధర్మేంద్ర శర్మ, నితీష్‌కుమార్ వ్యాస్, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా

సాక్షి, విశాఖపట్నం: అర్హత కలిగి ఉండి.. నిరాశ్రయులుగా ఉన్నవారికీ ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్లు ధర్మేంద్ర శర్మ, నితీష్ కుమార్ వ్యాస్ ఆదేశించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా సవరణ–2024పై రెండు రోజుల సమీక్ష విశాఖలో గురువారం ముగిసింది. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా అధ్యక్షతన సదస్సు జరిగింది. కేంద్ర ఎన్నికల కమిషన్ తరఫున డిప్యూటీ ఎన్నికల కమిషనర్ హృదేశ్‌కుమార్, సీనియర్ ప్రిన్సిపల్ సెక్రటరీ నరేంద్ర ఎన్ బుటాలియా, ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాష్‌కుమార్ హాజరయ్యారు.

ప్రత్యేక సంక్షిప్త సవరణపై అవగాహన

కలెక్టర్లకు ప్రత్యేక సంక్షిప్త సవరణ (స్పెషల్ సమ్మరీ రివిజన్)–2024పై పూర్తిస్థాయి అవగాహన కల్పించారు. మానవ వనరుల లభ్యత, ఎన్నికల సిబ్బందికి శిక్షణ, చట్టబద్ధమైన డాక్యుమెంటేషన్, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్, ఎన్నికల సిబ్బందికి, పోలింగ్ స్టేషన్లకు కనీస సౌకర్యాలు, ఫిర్యాదు నిర్వహణ తదితర అంశాలపై కూడా చర్చించారు. ముగింపు సందర్భంగా సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ ధర్మేంద్ర శర్మ, నితీష్‌కుమార్ వ్యాస్ మాట్లాడుతూ అర్హులైన వారందర్నీ ఓటరు జాబితాలో 100 శాతం చేర్పించేందుకు ప్రతి జిల్లా కలెక్టర్ కృషి చేయాలన్నారు. ముఖ్యంగా నిరాశ్రయులపై శ్రద్ధ వహించాలనీ, అట్టడుగు సమాజంలో ఉన్న వారిని, మురికివాడలు, సంచార జాతులు, ఎస్సీ, ఎస్టీ ప్రజలు, గిరిజన తండాల్లో నివాసితులు, పీవీజీటీ పరిధిలో (బలహీన గిరిజన సమూహాలు) ఉన్నవారు.. ఇలా ప్రతి ఒక్కరికీ విలువైన ఓటు హక్కు కల్పించాలని ఆదేశించారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్ అనంతరం ఓటర్ల నమోదుపై వచ్చే ప్రతి ఫిర్యాదుపై శ్రద్ధ వహించాలని సూచించారు. రాజకీయ పార్టీలకు ఓటింగ్, ఎన్నికల గురించి పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తూ.. ప్రతి ఒక్క అంశాన్ని క్షుణ్ణంగా వివరించాలన్నారు. ఈవీఎంలను ఒకటికి రెండుసార్లు పరిశీలించాలని స్పష్టం చేశారు. యువ ఓటర్లు, వలస ఓటర్లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. ఎస్ఎస్ఆర్–2024 ప్రక్రియ పూర్తయ్యే సమయానికి అర్హులైన ఓటర్లతో ఎలాంటి తప్పులు లేకుండా పూర్తిస్థాయి పారదర్శకంగా ఉన్న ఓటర్ల జాబితా తయారు చేసేందుకు 26 జిల్లాల కలెక్టర్లు నిరంతరం కృషి చేయాలని ధర్మేంద్రశర్మ, నితీష్ ఆదేశించారు.



- ఏపీలో ఎన్నికల విధుల కోసం పక్క రాష్ట్రాల నుంచి అధికారులను వినియోగించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు కోరారు. గురువారం విశాఖలో జరుగుతున్న ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ ధర్మేంద్ర శర్మను ఆయనతో పాటు పలువురు టీడీపీ నేతలు కలిసి వినతి పత్రం ఇచ్చారు.

తగినంత సమయమిచ్చి నేనే వస్తున్నా..

▶ మొదటి పేజీ తరువాయి

బాధితులను తాను స్వయంగా కలుసుకోనున్నట్లు సీఎం జగన్ స్పష్టం చేశారు. వరద బాధిత ప్రాంతాల్లో ఎక్కడా విమర్శలకు తావులేకుండా సహాయ, పునరావాస కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో సీఎం జగన్ గురువారం తన క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు, ఏలూరు, అంబేడ్కర్ కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు.

ముందస్తుగానే నిధులిస్తున్నాం..

నేను పాలనా పగ్గాలు చేపట్టిన నాటి నుంచి విపత్తుల సమయంలో ఏ రకంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నానో మీరంతా గమనించే ఉంటారు. దేశంలోని ఇతర సీఎంలంతా దాదాపు ఈ రకంగానే కార్యకలాపాలను నిర్వహిస్తుండడం మనం అంతా చూస్తున్నా. అధికారులకు అవసరమైన నిధులు, వనరులను సమకూర్చి సమర్థంగా సహాయ, పునరావాస కార్యక్రమాలు అమలు జరిగేలా చూస్తున్నాం. విపత్తు సంకేతాలు అందగానే కలెక్టర్లకు ముందస్తుగా నిధులు విడుదల చేస్తున్నాం. మీరు అడిగిన టీఆర్ 27 కింద నిధులు సహా అవసరమైన వనరులను సమకూరుస్తూ అధికారులను ఎంపవర్ చేస్తున్నాం.

సరిపడా సమయం ఇస్తున్నాం

సహాయ, పునరావాస చర్యలను సమర్థంగా చేపట్టేలా ప్రభుత్వం నాలుగేళ్లుగా అన్ని రకాలుగా తోడుగా నిలుస్తోంది. బాధితులకు సరైన విధంగా సహాయం అందించేలా తగిన చర్యలు తీసుకునేందుకు సరిపడా సమయం ఇస్తున్నాం. ఆ తర్వాత ముఖ్యమంత్రిగా నేను వచ్చి క్షేత్రస్థాయిలో కలెక్టర్లుగా మీరు, అధికారులు, సిబ్బంది సహాయ పునరావాస కార్యక్రమాలను ఏ రకంగా చేపట్టారో స్వయంగా పరిశీలిస్తున్నా. నేరుగా బాధితులను అడిగి వివరాలు తెలుసుకుంటున్నా. ఈసారి కూడా నేను వస్తా. క్షేత్రస్థాయిలో మీరు తీసుకున్న చర్యలు, అందించిన సహాయంపై సమీక్ష చేస్తా.


వరద ప్రభావిత ప్రాంతాల కలెక్టర్లతో జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

ఉదార స్వభావంతో ఉండాలి

ఏ ఒక్క బాధిత కుటుంబం కూడా వరదలతో ప్రభావితమైనప్పటికీ తమకు సహాయం అందలేదని చెప్పే పరిస్థితి ఉండకూడదు. వరద సహాయ కార్యక్రమాల్లో ఉదారంగా వ్యవహరించాలని, మానవీయతతో, సానుభూతితో ఉండాలని నేను ఇదివరకే చెప్పా. ఈ విషయం మరోసారి స్పష్టం చేస్తున్నా. ఒకవేళ మనమే ఆ పరిస్థితుల్లో ఉంటే ఎలాంటి సాయాన్ని కోరుకుంటామో ఆ తరహాలోనే అధికారులుగా మీరు స్పందించాలి.

సాయం పొందని బాధిత కుటుంబం ఉండకూడదు

ఈ సహాయం పొందని వరద బాధిత కుటుంబం అంటూ ఉండకూడదు. సహాయ శిబిరాల్లో గడిపిన వారు తిరిగి ఇళ్లకు వెళ్లేటప్పుడు ప్రతి కుటుంబానికి రూ.2,000 చొప్పున, వ్యక్తులైతే రూ.1,000 చొప్పున ఇచ్చి పంపించాలి. క్యాంపులు కొనసాగుతున్న చోట ఆహారం, తాగునీరు, సదుపాయాల విషయంలో ఒక్క ఫిర్యాదు కూడా రాకూడదు. మనం ఏ రకమైన సదుపాయాలను ఆశిస్తామో శిబిరాల్లో కూడా అలాంటి సౌకర్యాలే ఉండాలి. మా కలెక్టర్ మమ్మల్ని బాగా చూసుకున్నారనే మాట వినిపించాలి.

కచ్చా ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నా రూ.10 వేలు సాయం

వరద కారణంగా కచ్చా ఇల్లు పాక్షికంగానైనా, పూర్తిగానైనా ధ్వంసమైతే ఎట్టి పరిస్థితుల్లోనూ వర్గీకరణ చేయవద్దు. బాధితులందరికీ రూ.10 వేలు చొప్పున సహాయం అందించాలి. ఆ డబ్బులు వారు తమ ఇంటిని బాగు చేసుకోవడానికి ఉపయోగపడతాయి. వైద్య శిబిరాలను కొనసాగించండి. వరద నీరు తగ్గగానే పారిశుద్ధ్య కార్యక్రమాలు కొనసాగించండి. ఇది చాలా ముఖ్యమైన అంశం. మిగిలిన చోట్ల నుంచి వరద బాధిత ప్రాంతాలకు పారిశుద్ధ్య కార్మికులను తరలించండి. పీహెచ్‌సీలు, విలేజ్ క్లినిక్స్‌లలో సరిపడా మందులు ఉండేలా చూసుకోండి. పాము కాట్లకు మందులను కూడా అందుబాటులో ఉంచాలి.

వరద తగ్గగానే పంట, ఆస్తి నష్టంపై ఎన్యూమరేషన్

వరద ప్రభావం తగ్గిన వెంటనే పంట, ఆస్తి నష్టంపై ఎన్యూమరేషన్ చేపట్టి సచివాలయాల్లో సోషల్ ఆడిట్ కోసం జాబితాను ఉంచండి. ఆ తర్వాత కూడా ఎవరైనా తమకు నష్టం జరిగిందని వస్తే మరోసారి క్షేత్రస్థాయిలో పర్యటించి అంచనా వేయండి. పంట నష్టం, ఆస్తి నష్టానికి సంబంధించి అత్యంత పారదర్శకంగా పరిహారం అందించండి.

అవసరమైన చోట వెంటనే కొత్త ఇళ్లు

అవసరమైన చోట వెంటనే కొత్త ఇళ్లను మంజూరు చేయండి. ఏటి గట్టుమీద ఉన్నవారికి పక్కా ఇళ్లను మంజూరు చేయండి. వరద వచ్చిన ప్రతిసారి వారు ఇబ్బంది పడకుండా ఇళ్లను మంజూరు చేయాల్సిన బాధ్యత కలెక్టర్లదే. అలాంటి ప్రమాదకర ప్రాంతాల్లో ఉండేవారికి సురక్షిత ప్రాంతంలో ఇళ్లు ఇవ్వాలి. వారి కష్టాలకు శాశ్వతంగా పరిష్కారం చూపాల్సిన బాధ్యత మనదే. అవసరమైన స్థలాన్ని సేకరించి ఇళ్ల పట్టాలిచ్చి ఇళ్లను కూడా మంజూరు చేయండి.

పోలవరం ఎగువ ముంపు ప్రాంతాలకు పునరావాసంలో ప్రాధాన్యం

పోలవరం ఎగువన తరచూ ముంపునకు గురయ్యే ప్రాంతాలకు ఆర్ అండ్ ఆర్ కార్యక్రమాల్లో మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. పశువులకు గ్రాసం కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు తదితరాలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి. వరద ప్రభావం తగ్గి పరిస్థితి మెరుగుపడేంతవరకూ రక్షిత తాగునీటిని అందించాలి. వరద బాధిత ప్రాంతాలకు నేను వచ్చినప్పుడు ఈ అంశాలకు సంబంధించి ఎవరూ ఫిర్యాదు చేసే పరిస్థితి రాకూడదు.

ఆ మాటే రాకూడదు..

వరద బాధిత ప్రాంతాల్లో సోమ, మంగళవారాల్లో నా పర్యటనకు సంబంధించి సీఎంవో అధికారులు ఆదివారం సాయంత్రం వివరాలను ప్రకటిస్తారు. క్షేత్రస్థాయిలో బాధితులకు అందిన సహాయ, పునరావాస కార్యక్రమాలను నేను స్వయంగా పరిశీలిస్తా. నేను ఏ జిల్లాలో పర్యటించినప్పటికీ మా కలెక్టర్ సరిగా చేయలేదనే మాటే రాకూడదు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. ఈ సమీక్షలో మంత్రి ధర్మాన ప్రసాదరావు, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లోకి వరద వస్తే రూ.2 వేలివ్వాలి

ఇంట్లోకి వరదనీరు వస్తే కచ్చితంగా రూ.2 వేలు చొప్పున బాధితులకు అందించాలి. మళ్లీ ఒక్కసారి పరిశీలించి ఎవరికైనా అందకపోతే తగిన చర్యలు తీసుకోండి. అలాగే ఇంట్లోకి వరదనీరు రాకపోయినా వరద కారణంగా సంబంధాలు తెగిపోయిన వారికి కచ్చితంగా నిర్ణయించిన ప్రకారం రేషన్ అందించాలి. 25 కేజీల బియ్యం, పాలు, కేజీ కూరగాయలు, కేజీ వంటనూనె, కేజీ పప్పు లాంటి సరుకులు తప్పనిసరిగా బాధితులకు అందాలి. దీంతోపాటు తాగునీరు కూడా అందించాలి.

3,295 ప్రొఫెసర్ పోస్టులు
3 నెలల్లో భర్తీ
'ఉన్నత' అధ్యాయం

▶ మొదటి పేజీ తరువాయి



అధికారులు ప్రతిపాదించగా ఒకే రిక్రూట్‌మెంట్‌లో చేపట్టాలని సీఎం ఆదేశించారు. దీనికి సంబంధించి ఆగస్టు 23వ తేదీన ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ జారీ కానుండగా నవంబర్ చివరి నాటికి మొత్తం నియామక ప్రక్రియను పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధమైంది.

ఏపీపీఎస్సీ ద్వారా పారదర్శకంగా..

వర్సిటీల్లో ఆచార్యుల పోస్టుల భర్తీకి షెడ్యూల్, పరీక్షా విధానంపై అధికారులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సుదీర్ఘంగా చర్చించారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ద్వారా పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపారు. వర్సిటీలు, ట్రిపుల్ ఐటీల్లో 3,295 అధ్యాపక పోస్టుల భర్తీకి ఆగస్టు 23వ తేదీన నోటిఫికేషన్ విడుదల కానుంది. సెప్టెంబరు 3, 4వ వారాల్లో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 10వ తేదీ నాటికి ఫలితాలను ప్రకటించి ఆ తర్వాత నెల రోజుల్లోగా ఇంటర్వ్యూలు చేపట్టాలని నిర్ణయించారు. నవంబర్ చివరి నాటికి మొత్తం నియామక ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి జె.శ్యామల రావు, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి (హెచ్ఆర్) చిరంజీవి చౌదరి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్, ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) సెక్రటరీ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని సన్నిధి.. పర్యావరణ పెన్నిధి

అన్నవరంలో 15 నుంచి ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌పై నిషేధం

- వాటి స్థానంలో మొక్కజొన్న గింజలతో తయారయ్యే నాన్ ప్లాస్టిక్ బాటిల్స్ వినియోగం
- బయో ఎలైట్ సంస్థతో సంప్రదింపులు

బయో ఎలైట్ కంపెనీ తయారు చేసిన నాన్ ప్లాస్టిక్ వాటర్ బాటిల్



ప్రయాణంలో అయినా.. పర్యటనకు వెళ్లినా ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌నే వినియోగిస్తున్నారు. పర్యావరణానికి హాని చేసే ప్లాస్టిక్ ఉత్పత్తులను నిషేధించే క్రమంలో ప్రత్యామ్నాయంగా గాజు, స్టీల్, కాపర్ బాటిల్స్‌ను అక్కడక్కడా కొందరు వాడుతున్నారు. అయితే.. మొక్కజొన్న గింజలతో కూడా వాటర్ బాటిల్స్ తయారవుతున్నాయి. దేశంలోనే తొలిసారిగా ఈవిధమైన నాన్ ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌ను హైదరాబాద్‌కు చెందిన బయో ఎలైట్ సంస్థ తయారు చేస్తోంది. ఇవి చూడటానికి అచ్చం ప్లాస్టిక్ బాటిల్స్‌లానే ఉంటాయి.

అన్నవరం


మొక్కజొన్నతో తయారైన బయో ఎలైట్ బాటిల్‌ను కాల్చగా.. ముద్దగా వచ్చిన మొక్కజొన్న పిప్పి


అన్నవరం దేవస్థానం

15 నుంచి అన్నవరం కొండపై ప్లాస్టిక్ నిషేధంతో..

కాకినాడ జిల్లా అన్నవరంలోని శ్రీవీర వెంకట సత్యనారాయణ స్వామి ఆలయంలో ఆగస్టు 15 నుంచి ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌ను నిషేధిస్తున్నారు. వీటికి ప్రత్యామ్నాయంగా గాజు, స్టీల్ లేదా కాపర్ బాటిల్స్ మాత్రమే ఉపయోగించాలని దేవస్థాన ప్రాంగణంలోని వ్యాపారులకు ఈఓ చంద్రశేఖర్ అజాద్ సర్క్యులర్ జారీ చేశారు. ఈ విషయం తెలుసుకున్న బయో ఎలైట్ సంస్థ తాము తయారు చేస్తున్న నాన్ ప్లాస్టిక్ బాటిల్స్ సరఫరాకు దరఖాస్తు చేసుకుంది. గాజు వాటర్ బాటిల్ ధర రూ.80 నుంచి రూ.100 వరకూ ఉంటుందని, పొరపాటున కింద పడి, పగిలితే భక్తులకు ప్రమాదమని పేర్కొంది. అలాగే స్టీల్ లేదా మరే ఇతర మెటల్‌తో తయారు చేసిన బాటిల్స్ ఖరీదు రూ.100 కన్నా ఎక్కువని, తాము తయారు చేసిన నాన్ ప్లాస్టిక్ వాటర్ బాటిల్‌లో వాటర్ నింపి రూ.40కే సరఫరా చేస్తామని బయో ఎలైట్ సంస్థ ఎండీ దిలీప్ దేవస్థానానికి దరఖాస్తు చేశారు.

ఇవీ ప్రత్యేకతలు

బయో ఎలైట్ సంస్థ మొక్కజొన్న గింజలను ద్రవంగా మార్చి.. హానికరం కాని కొన్ని రసాయనాలను కలిపి జర్మన్ టెక్నాలజీతో ఈ బాటిల్స్ తయారు చేస్తోంది. ఇది చూడటానికి అచ్చం ప్లాస్టిక్ వాటర్ బాటిల్‌లానే కనిపిస్తుంది. దానికన్నా కాస్త మెత్తగా ఉంటుంది. దీనిని మూడు నెలల వరకూ వాడుకోవచ్చు. ఆ తరువాత ఆటోమెటిక్‌గా ఈ బాటిల్ శిథిలమై, ఏడాది నుంచి రెండేళ్లలోగా భూమిలో కలిసిపోతుంది. ఈ బాటిల్‌ను నాన్ ప్లాస్టిక్‌గా గుర్తిస్తూ న్యూఢిల్లీలోని సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సర్టిఫికెట్ కూడా ఇచ్చిందని దిలీప్ 'సాక్షి'కి తెలిపారు. దీంతోపాటు సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ ట్రెనింగ్ (సీఐపీఈటీ) ధ్రువీకరించిన సర్టిఫికెట్లను కూడా ఆయన దేవస్థానానికి సమర్పించారు.

తేడా గుర్తించాం

దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ అన్నవరం క్షేత్రంలో గత వారం పర్యటించగా.. ఆయన సమక్షంలో ప్లాస్టిక్ వాటర్ బాటిల్, బయో ఎలైట్ బాటిల్స్‌ను కాల్చి పరీక్షించాం. బయో ఎలైట్ బాటిల్ పొగ రాకుండా కాలిపోయింది. మొక్కజొన్న కాల్చితే వచ్చే వాసన వచ్చింది. ప్లాస్టిక్ వాటర్ బాటిల్‌ను కాల్చితే పొగతో పాటు చుక్కచుక్కలుగా ప్లాస్టిక్ కింద పడింది. చివరన ప్లాస్టిక్ ముద్దలా వచ్చింది. బయో ఎలైట్ బాటిల్స్‌ను మరోసారి సీఐపీఈటీ సంస్థకు పంపించి పరీక్షిస్తాం. ఇవి నాన్ ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ అని ధ్రువీకరణ పత్రం వచ్చిన తరువాత మాత్రమే దేవస్థానంలో షాపుల ద్వారా విక్రయించేందుకు అనుమతిస్తాం. పరిశీలన అనంతరం ధర నిర్ణయిస్తాం.

– ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్, ఈఓ, సత్యదేవుని ఆలయం

ఇండియాలోనే తొలిసారి

హైదరాబాద్ మల్కాజ్‌గిరిలో మా కంపెనీ ఉంది. హైదరాబాద్ చుట్టుపక్కల కొన్ని రిసార్ట్స్‌కు, షాపింగ్ మాల్స్‌కు మా వాటర్ బాటిల్స్ సరఫరా చేస్తున్నాం. అన్నవరం దేవస్థానానికి సరఫరా చేసేందుకు దరఖాస్తు చేసుకున్నాం. నెలకు లక్ష బాటిల్స్ సరఫరా చేసే సామర్థ్యం ఉంది. దేవస్థానంలో అమ్మకాలను బట్టి ఇంకా ఎక్కువ కూడా సరఫరా చేస్తాం.

– దిలీప్, ఎండీ, బయో ఎలైట్ సంస్థ

ఆకలేసింది.. ఆయువు మూడింది!


ఆహారం కోసం కాపు కాస్తూ..


హమ్మయ్యా నోటికి చిక్కింది..


గుటకాయస్వాహా..!

చల్లని వాతావరణానికి తూనీగల సంచారం అధికంగా ఉంది. ఆహార అన్వేషణలో ఉన్న ఓ పక్షి ఇదిగో ఇలా కరెంటు తీగలపై మాటేసింది. తూనీగలు సమీపంలోకి రాగానే వాటిని తింటూ తన ఆకలి తీర్చుకుంటోంది. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గొల్లపూడి శివారు ప్రాంతంలో గురువారం సాయంత్రం కనిపించిన ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

– కందుల చక్రపాణి, సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ

> ఓ విశ్వాసులారా! మీరు పరస్పరం ఎత్తిపొడుచుకోకండి. చెడ్డపేర్లతో పిలుచుకోకండి. ఒకనిని చెడ్డపేరుతో పిలవటం ఎంతో నీచమైన విషయం.
>
> – ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 4 ఆగస్టు 2023

వేధిస్తున్న తప్పులు

నాలుగు నెలల్లో మూడోసారి నేరాభియోగాలను ఎదుర్కోవడం... అదీ అగ్రరాజ్యానికి అధ్యక్షుడిగా వ్యవహరించిన వ్యక్తి అంటే అసాధారణమే! అందులోనూ ఏకంగా దేశాన్నే మోసం చేశారంటూ ఆరోపణ రావడం అమెరికా చరిత్రలోనే తొలిసారి. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు అందులోనూ రికార్డు సృష్టించారు. పదవిలో ఉన్నా, లేకున్నా వింత ధోరణి, విచిత్రమైన మాటలతో వార్తల్లో నిలిచిన ట్రంప్‌ను పాత తప్పులు వెంటాడుతున్నాయి. 2020 నాటి అధ్యక్ష ఎన్నికల్లో ఓడిపోయినా, ఫలితాన్ని తారుమారు చేసేందుకు శతవిధాల ప్రయత్నించారంటూ 4 అంశాల ప్రాతిపదికన 45 పేజీల్లో మంగళవారం ఆయనపై నమోదైన నేరాభియోగం అందుకు తాజా ఉదాహరణ. ఈ ఏడాది ఇప్పటికే మరో రెండు నేరాభియోగాలు మీదపడ్డ ట్రంప్ మెడకు రోజురోజుకూ చట్టం ఉచ్చు బిగిస్తోంది. మళ్ళీ అమెరికా అధ్యక్ష పోటీలో నిలవాలనుకుంటున్న ఆయన వీటి నుంచి బయటపడగలరా? మరో 15 నెలల్లో జరిగే ఎన్నికలపై వీటి ప్రభావమేంటి?

నేరాభియోగాలు ఎదుర్కోవడం ట్రంప్‌కు ఇప్పుడు నిత్యవ్యవహారమైపోయింది. 2016 ఎన్నికల ప్రచారవేళ ఓ నీలిచిత్రాల తార నోరు మూయించేందుకు భారీగా డబ్బు చెల్లించారంటూ ఈ ఏడాది ఏప్రిల్‌లో 30 అంశాల ప్రాతిపదికన మన్‌హాటన్ కోర్ట్ అభిశంసించింది. రహస్య జాతీయ భద్రతా పత్రాలను అనధికారికంగా ట్రంప్ ఉంచుకున్నారంటూ జూన్‌లో ఫ్లోరిడాలోని గ్రాండ్ జ్యూరీ 37 అంశాలతో నేరాభియోగం మోపింది. ఆ రెండు నేరాభియోగాల తర్వాత ఈ ఆగస్ట్ 1న ఫెడరల్ గ్రాండ్ జ్యూరీ చేసిన అభియోగం ముచ్చటగా మూడోదన్న మాట. అయితే, మునుపటి రెండింటి కన్నా ఇది భిన్నమైనది, తీవ్రమైనది. 2020 అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి బైడెన్ విజయం సాధించినా ట్రంప్, మరో ఆరుగురితో కలసి ఆ ఫలితాన్ని మార్చాలని చూశారన్నది తాజా అభియోగం. ఓటింగ్‌లో మోసమేమీ లేదని ట్రంప్‌కు తెలిసినా ఉద్దేశపూర్వకంగానే తప్పుడు ఆరోపణలతో కుట్ర చేశారనీ, ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పోగొట్టేందుకు ప్రయత్నించారనీ ఆరోపణ. నిరుడు సభాసంఘం నివేదిక సైతం ఇలాంటి నిర్ణయాలకే వచ్చింది. ఎన్నికల తర్వాత 2021 జనవరి 6న అమెరికా అధ్యక్ష భవనంపై ట్రంప్ సమర్థకుల మూకదాడికీ, దానికి దారితీసిన పరిస్థితులకూ పూర్తి బాధ్యత ట్రంప్‌దేనని తేల్చేందుకు చట్టపరమైన తొలి ప్రయత్నం ఈ తాజా నేరాభియోగం.

కిందపడ్డా తనదే పైచేయి అన్నట్టుగా... 2020 ఎన్నికల్లో ఓడిపోయినా సరే అధికార పీఠంపై కొనసాగేందుకు అమెరికా లాంటి ప్రజాస్వామ్య అగ్రరాజ్యపు అధ్యక్షుడు ప్రవర్తించడం, ఎన్నికల ఫలితాలకు కుట్ర సిద్ధాంతాలు ఆపాదించడం ఎలా చూసినా సమర్థించలేనివి. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల నిర్వహణ, ప్రశాంతంగా అధికార బదలాయింపు అనేవి గణతంత్ర అమెరికాకు మూలస్తంభాలు. కానీ, ఎన్నికల కౌంటింగ్ నియమాలు ఏర్పాటు చేశాక, గత 130 ఏళ్ళ పైగా అంతా ప్రశాంతంగా సాగితే, 2021లో ట్రంప్ తన చర్యలతో మూలాలకే దెబ్బకొట్టారు. ఎన్నికల్లో మోసం జరిగిందన్న తన వాదనకు మద్దతునివ్వాలంటూ అధికారులపై ఆయన ఒత్తిడి తెచ్చారు. చివరకు బైడెన్ విజయాన్ని ఖరారు చేసే శాసననిర్మాతల్ని సైతం ఆ జనవరి 6 నాటి మూకదాడితో భయపెట్టే ప్రయత్నమూ చేశారు. ఇది నేరమే కాదు... ఘోరం. అయితే, ఎన్నికల్లో మోసం జరిగిందని తాను చేస్తున్న వాదన బోగస్సని తెలిసినాసరే, ట్రంప్ కావాలనే అలా అడ్డంగా వాదించారని ప్రాసిక్యూటర్లు నిరూపించగలరా అన్నది ప్రశ్న. అలా నిరూపించడం మీదే చర్యలు ఆధారపడి ఉంటాయి. ట్రంప్ మాత్రం ఈ అభియోగాలన్నీ తనపై రాజకీయ వేధింపుల్లో భాగమని ఆరోపిస్తున్నారు.

వచ్చే 2024 అమెరికా అధ్యక్ష ఎన్నికలకు రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగాలని 77 ఏళ్ళ ట్రంప్ ఉవ్విళ్ళూరుతున్నారు. చిత్రంగా మునుపు మీద పడ్డ రెండు నేరాభియోగాల వల్ల ఆయన ఎన్నికల రేటింగ్ తగ్గకపోగా విపరీతంగా పెరిగింది. కోర్టు వ్యవహారాల వల్ల ట్రంప్ ఆర్థిక వనరులు తరిగిపోవచ్చు. కోర్ట్ విచారణ మాటెలా ఉన్నా తాజా అభియోగాన్ని సైతం ట్రంప్ తన రాజకీయ లాభానికి వాడుకోవడం ఖాయం. కక్ష సాధిస్తున్నారనీ, అసలైన బాధితుణ్ణి తానే అనీ ఆయన తన ప్రచారంలో వేడి పెంచగలరు. అసలు నిజం, సాక్ష్యాధారాలేమైనా, గణనీయ సంఖ్యలో అమెరికన్ ఓటర్లు ట్రంప్ వాదననే సమర్థించవచ్చు. వెరసి అమెరికా చరిత్రలో మునుపెన్నడూ లేనట్టు ఓటర్లు పూర్తిగా రెండు వర్గాలుగా చీలిపోయే పరిస్థితుల్లో రానున్న ఎన్నికలు జరిగే ప్రమాదం కనిపిస్తోంది.

ట్రంప్ తన రాజకీయ చాణక్యంతో కోర్టులో ఉచ్చు నుంచి జారుకొనే ప్రయత్నం చేస్తారు. వకీళ్ళ ద్వారా వ్యవహారాన్ని వీలైనంత జాప్యం చేసి, రేపు మళ్ళీ శ్వేతసౌధ పీఠమెక్కితే అక్కడ నుంచి ఇక అంతా తన కనుసన్నల్లో జరపాలన్నది ఆయన పేరాశ. నిజానికి, శృంగార తార కేసు వచ్చే మార్చిలో, రహస్య పత్రాల కేసు వచ్చే మేలో కానీ తేలవు. వచ్చే జనవరిలో ఎంపిక ప్రక్రియ ప్రారంభించే రిపబ్లికన్ పార్టీ ఆ లోగా తమ అభ్యర్థి ఎవరో ఖరారు కూడా చేసేస్తుంది. ఈ పరిస్థితుల్లో సత్వరమే ఈ అభియోగాలపై విచారణ జరిపి, తప్పొప్పులు తేల్చడమే అమెరికన్ కోర్టుల కర్తవ్యం. ట్రంప్ తప్పు లేదని తేలితే చేసేది లేదు. ఒకవేళ తప్పు చేసినట్టు ఆయనపై నేరాభియోగాలు రుజువైతే తగిన శిక్ష విధించి, చట్టం ముందు ఎంతటి వారైనా ఒకటేనని చూపవచ్చు. అమెరికా ప్రజాస్వామ్య స్ఫూర్తిని లోకానికి చాటవచ్చు. దేశ రాజ్యాంగ వ్యవస్థనే అవహేళన చేసిన ఘటనలో రాజకీయాల రొచ్చులోకి పోకుండా కోర్టులు అప్రమత్తతతో వ్యవహరించడమే ప్రజాస్వామ్య విలువలకు శ్రీరామరక్ష. ప్రపంచమంతా ఆసక్తిగా చూస్తోంది అందుకే!

ఒపెన్‌హైమర్‌తో మన అనుబంధం

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

జపాన్‌లోని హిరోషిమా, నాగసాకిలపై అణుబాంబు జారవిడిచి 78 ఏళ్లు అవుతోంది. ఆధునిక యుగంలో ఇంతటి విధ్వంసకరమైన ఘటన మరోటి చోటుచేసుకోలేదంటే అతిశయోక్తి కాదు. రెండో ప్రపంచయుద్ధం నాటి ఈ ఘటనపై లెక్కలేనన్ని పుస్తకాలు, డాక్యుమెంటరీలు, సినిమాలు వచ్చాయి. తాజాగా ప్రదర్శితమవుతున్న 'ఒపెన్‌హైమర్' చిత్రం కూడా ఈ కోవకు చెందినదే. మన్‌హాటన్ ప్రాజెక్టులో భాగంగా తయారైన అణుబాంబులు, వాటి సృష్టికర్త జె.రాబర్ట్ ఒపెన్‌హైమర్ ఇతివృత్తంతో సాగుతుంది ఈ సినిమా. ఒపెన్‌హైమర్‌కు ఉన్న భగవద్గీత, సంస్కృత జ్ఞానం ఆయనపై భారతదేశంలో ఆసక్తి పెరిగేందుకు కారణమయ్యాయి. భారతదేశ ఆధ్యాత్మికత పట్ల ఆరాధన కంటే కూడా ఈ దేశంతో ఆయనకున్న సంబంధం మరింత లోతైనది.


జర్మనీలో పుట్టి అమెరికాలో సైద్ధాంతిక భౌతిక శాస్త్రవేత్తగా ఎదిగిన ఒపెన్‌హైమర్‌ను అణుబాంబు పితామహుడని కూడా అంటారు. ఒపెన్‌హైమర్‌కు ఉన్న భగవద్గీత, సంస్కృత జ్ఞానం ఆయనపై భారతదేశంలో ఆసక్తి పెరిగేందుకు కారణమయ్యాయి. భారతదేశ ఆధ్యాత్మికత పట్ల ఆయనకు ఉందని చెబుతున్న ఆరాధన కంటే కూడా ఈ దేశంతో ఆయనకున్న సంబంధం మరింత లోతైనది. దీన్ని 20వ శతాబ్దంలో ఆధునిక భౌతిక శాస్త్రం అభివృద్ధి నేపథ్యంలో చూడాలి.

విశ్వం మొత్తానికి ఆధారమైన, మౌలికమైన కణాలపై అధ్యయనం సాగిన కాలం అది. అణు కేంద్రకం దాంట్లోని భాగాలను అర్థం చేసుకునే అణు భౌతికశాస్త్ర అభివృద్ధి కూడా ఈ కాలంలోనే వేగం పుంజుకుంది. అణుశక్తితోపాటు అణుబాంబుల తయారీకి దారితీసిన పరిశోధనలివి. ఈ కాలపు భారతీయ శాస్త్రవేత్తలు కూడా చాలామంది ఈ అణు భౌతిక శాస్త్ర రంగంలో కృషి చేశారు. దేబేంద్ర మోహన్ బోస్ (ఇతడి విద్యార్థిని బిభా చౌధురి), మేఘనాథ్ సాహా, సత్యేంద్రనాథ్ బోస్, హోమీ జహంగీర్‌భాభా, దౌలత్‌సింగ్ కొఠారీ, పియారా సింగ్ గిల్ వంటి మహామహులు వారిలో కొందరు మాత్రమే. వీరు ఆధునిక భౌతికశాస్త్రంలో పేరెన్నికగన్న వుల్ఫ్‌గాంగ్ పౌలీ, నీల్స్ బోర్, లార్డ్ రూథర్‌ఫర్డ్, పాల్ డైరాక్, ఎన్రికో ఫెర్మీ, ఎర్నెస్ట్ ష్రోడింగర్, జేమ్స్ చాద్విక్, జాన్ కాక్‌క్రాఫ్ట్, హిడెకీ యుకవాలతో కలిసి పని చేయడం లేదా వారితో సంబంధబాంధవ్యాలను కలిగి ఉండటం కద్దు.

భాభాతో సంబంధం

కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ఖగోళ వికిరణాలపై పరిశోధనలు చేస్తున్న సమయంలోనే హోమీ భాభాకు ఒపెన్‌హైమర్ (కేంబ్రిడ్జ్‌లో సీనియర్. తరువాతి కాలంలో బెర్క్‌లీలో పనిచేశారు) గురించి ఒక అవగాహన ఉండింది. 1936లో భాభా, వాల్టర్ హైట్లర్ ఉమ్మడిగా ఖగోళ వికిరణ జల్లు (కాస్మిక్ రే షవర్స్) సిద్ధాంతాన్ని ప్రతిపాదించగా, ఒపెన్ హైమర్ ఓ ఏడాది తరువాత దాదాపుగా అలాంటిదే స్వతంత్రంగా ప్రతిపాదించారు. అప్పట్లో భాభాకు పాశ్చాత్యదేశాల్లోని గొప్ప భౌతిక శాస్త్రవేత్తలతో సంబంధాలు ఉండేవి. ఒకానొక దశలో 1940లో తనను ఒపెన్ హైమర్‌కు పరిచయం చేయాల్సిందిగా భాభా తన మిత్రుడు పౌలీని కోరారు. ఇద్దరూ కలిసి బెర్క్‌లీలో పరిశోధనలు చేయాలన్నది ఉద్దేశం. రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభం కావడంతో భాభా భారత్‌లోనే ఉండిపోవాల్సి వచ్చింది. భౌతికశాస్త్ర మౌలికాంశాలపై పరిశోధనలు చేసేందుకు ఓ సంస్థను స్థాపించే అవకాశమూ అప్పుడే లభించింది. తరువాతి కాలంలో భాభాకు అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూతో కలిసి భారతీయ అణుశక్తి కార్యక్రమాన్ని సిద్ధం చేసి అమలు చేసే అవకాశమూ దక్కింది.

అణు రియాక్టర్ నిర్మాణానికి, యురేనియం శుద్ధికి అవసరమైన ఇంజినీరింగ్ నైపుణ్యాన్ని భాభా తనకు పాశ్చాత్య దేశాల్లో ఉన్న సంబంధాల ద్వారానే సంపాదించగలిగారు. ప్రిన్స్‌టన్, కావెండిష్ వంటి ప్రసిద్ధ సంస్థల తరహాలో టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్) స్థాపనకూ బాబా అంతర్జాతీయ సహకారం అందేలా రూఢి చేసుకున్నారు. అయితే 1945లో హిరోషిమా, నాగసాకి లపై అణుబాంబులు పడిన తరువాత రాబర్ట్ ఒపెన్‌హైమర్ వివాదాస్పద వ్యక్తి అయ్యారు. అయినా టీఐఎఫ్ఆర్‌లో పరిశోధకుల బృందాన్ని తయారు చేసే విషయంలో భాభా ఆయన సాయం తీసుకున్నారు. ఒపెన్‌హైమర్ విద్యార్థి, ఆయనతో కలిసి మన్‌హాటన్ ప్రాజెక్టులో పనిచేసిన బెర్నార్డ్ పీటర్స్‌కు ఉద్యోగమిచ్చారు. అప్పట్లో ప్రిన్స్‌టన్‌లో పనిచేస్తున్న ఒపెన్ హైమర్ సోదరుడు ఫ్రాంక్ ఒపెన్ హైమర్‌కూ ఉద్యోగం ఆఫర్ చేశారు భాభా. రాబర్ట్‌ను సంప్రదించిన తరువాతే ఫ్రాంక్‌కు ఉద్యోగం ఇవ్వజూపినట్లు చరిత్రకారులు చెబుతారు. ఈ అణుశక్తి కార్యక్రమ ఏర్పాటుకు ఫ్రెంచ్ నోబెల్ గ్రహీత ఫ్రెడెరిక్ జోలియెట్ క్యూరీ సలహాలు కూడా నెహ్రూ స్వీకరించారు.



రాబర్ట్ ఒపెన్‌హైమర్

పరోక్ష ప్రేరణ

ఒపెన్‌హైమర్‌పై విమర్శలు పెల్లుబుకుతున్న నేపథ్యంలో భాభా చేసిన కొన్ని నియామకాలపై నిరసన వ్యక్తమైంది. ఒపెన్ హైమర్‌కు కమ్యూనిస్టులతో ఉన్న గత సంబంధాలపై కూడా వివాదాలు తలెత్తాయి. ఒపెన్‌హైమర్ కూడా తన మాజీ విద్యార్థి పీటర్స్‌ను కమ్యూనిస్టు సానుభూతిపరుడిగా అభివర్ణించారు. దీంతో పీటర్స్ భారత్‌కు రావడం కష్టమైంది. ఎలాగోలా వచ్చిన తరువాత టీఐఎఫ్ ఆర్‌లో అతడిపై ఇంకోసారి దుమారం రేకెత్తింది. ఇంకోవైపు ఫ్రాంక్ ఒపెన్ హైమర్ కూడా అమెరికా ప్రభుత్వం పాస్‌పోర్టు ఇచ్చేందుకు నిరాకరించడంతో భారత్‌కు రాలేకపోయారు. అయితే అమెరికాలో రాబర్ట్ ఒపెన్ హైమర్ మాత్రం ఇన్ స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ (ఐఏఎస్) డైరెక్టర్‌గా కొనసాగుతూ భారతీయ శాస్త్రవేత్తలు చాలామందికి మార్గదర్శకుడిగా వ్యవహరించారు. యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్‌లో యువ భౌతిక శాస్త్రవేత్తగా ఉన్న అల్లాడి రామకృష్ణన్‌కు ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ ఏడాది స్కాలర్‌షిప్ మంజూరు చేయడం మచ్చుకు ఒక ఉదాహరణ మాత్రమే. అల్లాడి భారత్‌కు తిరిగి వచ్చాక ఐఏఎస్ లాంటి సంస్థను స్థాపించాలని ఆశించారు. ఈ ఆలోచనే తరువాతి కాలంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటికల్ సైన్సెస్‌గా 1962లో మద్రాస్‌లో ఆవిష్కృతమైంది.

భారత్‌కు తరచూ...

ఆ కాలంలో స్వల్పకాలిక పర్యటనపై భారత్‌కు విచ్చేసే విదేశీ శాస్త్రవేత్తల్లో ఒపెన్ హైమర్ పేరు తరచూ వినిపించేది. పీసీ మహలనోబిస్ ఆలోచనల రూపమైన 'షార్ట్ విజిట్స్ ఆఫ్ సైంటిస్ట్ ఫ్రమ్ అబ్రాడ్'లో భాగంగా ఒపెన్ హైమర్‌తో పాటు నీల్స్ బోర్, నార్బెర్ట్ వీనర్, పీఎంఎస్ బ్లాకెట్, జోసెఫ్ నీధమ్, జేబీఎస్ హాల్డేన్ లాంటి మహామహులు భారత్‌కు వచ్చిపోయేవారు. వీరికి పంపే ఆహ్వాన పత్రికలపై నెహ్రూ స్వయంగా సంతకాలు చేసేవారు. ఇందులో చాలామంది నెహ్రూకు తెలుసు.

1945 అనంతర ఒపెన్ హైమర్ నైతిక దృక్కోణాన్ని నెహ్రూ బహిరంగంగా ప్రశంసించారు. 1959లో భారత జాతీయ సైన్స్ కాంగ్రెస్ సమావేశాల ఆవిష్కరణ సందర్భంగా మాట్లాడుతూ, ఒపెన్ హైమర్ భగవద్గీత నుంచి స్ఫూర్తి పొందారని ఉల్లేఖించారు. పరిశోధనలు, ఆవిష్కరణలకు కూడా సామాజిక విపరిణామాలు ఉంటాయన్న విషయాన్ని పెద్ద శాస్త్రవేత్తలు గుర్తించేందుకు ఇది ఉపయోగపడాలన్నారు.

హిరోషిమా, నాగసాకిలపై అణుబాంబు ప్రయోగంతో రెండో ప్రపంచ యుద్ధం నాటకీయంగా ముగిసింది. ఈ ఘటన అమెరికా, సోవియట్ యూనియన్‌ల మధ్య అణ్వాయుధ పోటీకి దారితీసింది. అదే సమయంలో అణుశక్తిని శాంతియుత ప్రయోజనాల కోసం వాడుకునే ప్రయత్నాలూ మొదలయ్యాయి. వలసవాద శకం ముగిసిన తరువాత అణుశక్తిని శాంతియుత, వ్యూహాత్మక ప్రయోజనాల కోసం వాడుకోవడమన్న అంశం భారత్ లాంటి దేశాలకు ప్రధాన పరిశోధన ఇతివృత్తమైంది. ఈ నవతరం సైన్స్‌ను అభివృద్ధి చేయడం భారత్‌కు ప్రథమ కర్తవ్యమైంది. అణుశక్తిని విద్యుదుత్పత్తికి ఉపయోగించుకుంటామని భారత్ పలుమార్లు స్పష్టం చేసింది. అయితే 1964లో చైనా అణుబాంబును పరీక్షించడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. పదేళ్ల తరువాత భారత్ కూడా పోఖ్రాన్–1తో అణ్వస్త్ర దేశాల జాబితాలో చేరిపోయింది. కానీ భగవద్గీతకు నెలవైన భారత్ అణు మార్గం పట్టడాన్ని ఒపెన్‌హైమర్ మాత్రం చూడలేకపోయారు!

వ్యాసకర్త సైన్స్ వ్యవహారాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

భయం... భయం



ఒక్కోసారి మా నాన్న చని పోయారన్న విషయం నాకు శాంతిని కలిగిస్తుంది. ఎందుకంటే నేను ఆందోళన చెందాల్సిన మనుషుల్లో ఒకరు తగ్గిపోయినట్టు. ఆయన కుర్తా ధరించేవారు, గడ్డం ఉంచుకునేవారు. ముస్లిం అని ఇట్టే గుర్తుపట్టొచ్చు. చుట్టుపక్కల మత ఉద్రిక్తతలు తలెత్తిన ప్రతిసారీ ఇంట్లోంచి కదలొద్దని చెప్పేదాన్ని, లోలోతుల్లో భయం వేసేది.

– శాజియా ఇమామ్, పీహెచ్‌డీ విద్యార్థిని

కపట దాటవేత



గణపతి ఒక మిథ్య అని సీపీఐ (ఎం) కేరళ కార్యదర్శి (ఎం.వి. గోవిందన్) పునరుద్ఘాటించారు. మరి అల్లా సంగతి ఏమని అడిగితే, ప్రతి విశ్వాసం కల్పన కానక్కర్లేదనీ, ఇస్లామీయుల ఏకేశ్వరోపాసన భిన్న తలానికి చెందినదనీ అన్నారు.

– శ్రీజిత్ పణిక్కర్, రైట్‌వింగ్ యాక్టివిస్ట్

దొందూ దొందే!



భిన్నాభిప్రాయాలు తెలుసుకోవడానికి నేను లెఫ్ట్‌వింగ్, రైట్‌వింగ్ ఇరుపక్ష వ్యాఖ్యాతల ట్విట్టర్ ఖాతాలు ఫాలో అవుతాను. ఎవరి గ్రూపులు వాళ్లకున్నాయి. నేను గమనించినది ఏమంటే, మేవాత్ హింస గురించి లెఫ్ట్‌వింగ్ నిజాయతీగా మాట్లాడదు. హంతకుడు చేతన్ సింగ్ గురించి రైట్‌వింగ్ నిజాయతీగా మాట్లాడదు.

– హార్దిక్ రాజ్‌గోర్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

సినిమా కుటుంబం




హీరో తల్లి పాత్ర చేస్తారా అని క్యాస్టింగ్ ఏజెంట్ ఫోన్ చేశాడు. చేస్తానన్నాను. కానీ హీరో వయసెంత అని అడిగాను. 35 అన్నాడు. అంటే నేను బాల్య వివాహం చేసుకుని, దైవమాయ వల్ల వయసు రాకముందే తల్లినై ఉండాలి. అంటే నా తల్లిదండ్రులు, అత్తామామలు, నా భర్త (ఒకవేళ చిన్నారి భర్త అయితే ఇదింకో దైవమాయ) బెయిల్ లేని బహువిధ మహాపరాధాలకు పాల్పడి ఉండాలి. సారీ! నేను ఆ నేరమయ కుటుంబంలో భాగం కాలేనని చెప్పాను.

– తారా దేశ్‌పాండే, నటి

సాహితీ ఝరి

తెలుగు భాషాభ్యుదయానికి విశేషంగా కృషి చేసిన సాహితీ ప్రముఖుల్లో దిట్ట పరవస్తు చిన్నయసూరి. 1806లో శ్రీపెరంబదూర్ పట్టణంలో జన్మించారు. తమిళనాట పుట్టినా తెలుగు వారి నోట గద్యాన్ని గడగడ పలికించిన ఘనత ఆయనది. 'పద్యానికి నన్నయ ఎలాగో.. గద్యానికి చిన్నయ అలా' అనే రీతిన తెలుగు సాహిత్యంలో కీర్తిబావుటా ఎగుర వేశారు. సంస్కృతంలోనూ ఘనాపాఠిగా



రాటుదేలి మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా విశిష్ట సేవలందించారు. తెలుగు భాషను కాచి వడపోసి సరళమైన శైలిలో అందరికీ అర్థమయ్యేలా 'బాల వ్యాకరణం' గ్రంథాన్ని రాశారు. 'పంచతంత్ర' కథల్లో పేరొందిన 'మిత్రలాభం', 'మిత్ర భేదం'... రెండింటినీ సంస్కృతం నుంచి తెలుగులోకి అనువదించి వినూత్నంగా 'నీతి చంద్రిక'ను అందించారు.

ఇవికాక 'సూత్రాంధ్ర వ్యాకరణం', 'నీతి సంగ్రహం', 'ఆంధ్ర ధాతుమాల' వంటి రచనలు ప్రముఖమైనవి. తెలుగు భాషపై ఎక్కువ మక్కువతో సాహితీ సేద్యం గావించిన చిన్నయసూరి 1862లో కాలం చేశారు. ఆ మహనీయుడి సేవలకు నివాళిగా 'చిన్నయసూరి సాహితీ పీఠం', 'ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం' సంయుక్తంగా విజయవాడలోని తుమ్మల పల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో శుక్రవారం (ఆగస్టు 4న) చిన్నయసూరి విగ్రహాన్ని ఆవిష్కరిస్తుండడం తెలుగు సాహిత్యాభిమానులందరికీ ఆనందదాయకం.

– చెన్నాప్రగడ వీఎస్సెస్ శర్మ, జర్నలిస్ట్

కేంద్రమే చెబుతున్నా... ఇదేం దుష్ప్రచారం?

సందర్భం



వి.వి.ఆర్. కృష్ణంరాజు

> 'వారు హిట్లర్ విధానాన్నే అనుసరిస్తారు. అబద్ధం ఎంత పెద్దదైనా దాన్ని పదేపదే ప్రచారం చేసి ప్రజలు నిజమనుకునే విధంగా చేస్తారు.'
>
> – జాన్ ఎఫ్ కెనడీ

ఒక్క అబద్ధం వేయి నిజాలకు ముప్పుగా మారుతుంది... అదే నిత్యం వందలాది అబద్ధాలు ఉప్పెనలా వెల్లువెత్తితే నిజానికి నిలువ నీడ లేకుండా పోతుంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఇదే జరుగుతోంది. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు అబద్ధాలను ఉద్యమరూపంలో ప్రచారం చేస్తు న్నాయి. వారు ప్రచారం చేస్తున్నవి అసత్యాలు, అర్ధ సత్యాలే నని పదేపదే నిర్ధారణ అవుతున్నప్పటికీ వాటినే వల్లె వేస్తు న్నారు. ఏపీ ప్రభుత్వం చేస్తున్న అప్పులపై జరుగుతున్న తప్పుడు ప్రచారం ఇందుకు ఒక ఉదాహరణ.

నిజానికి అప్పులు లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ కార్యకలాపాలను నిర్వర్తించలేవు. అయితే ఈ దేశంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం మాత్రమే పెద్ద మొత్తంలో అప్పులు చేస్తూ, ఏపీ ఆర్థిక వ్యవస్థను శ్రీలంక వ్యవస్థలా దిగజారుస్తోందని ప్రతిపక్షాలతో పాటు కొన్ని పత్రికలు కూడా పెద్ద ఎత్తున అసత్యప్రచారాలు చేస్తున్నాయి. జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అప్పులు రూ. 12.50 లక్షల కోట్లకు చేరుకున్నాయని యనమల రామకృష్ణుడు చెబితే, చంద్రబాబు నాయుడు రూ. 10.31 లక్షల కోట్లని అన్నారు. తాజాగా రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి జూలై 19న విజయవాడలో మాట్లాడుతూ, మొత్తం ప్రభుత్వ రుణాలు రూ. 7.14 లక్షల కోట్లనీ, వాటిలో అనధి కారికంగా చేసిన రూ. 4.74 లక్షల కోట్లూ ఉన్నాయని ప్రకటించారు. నిజానికి అనధికార రుణాలంటూ ఏమీ ఉండవు. ప్రభుత్వంతో పాటు ప్రభుత్వ అనుబంధ సంస్థలు చేసే రుణాలన్నిటినీ ప్రభుత్వ రుణాలుగానే పరిగణిస్తారు. ఈ అబద్ధాల ప్రహసనానికి తోడుగా ఆమె జూలై 28న విశాఖలో మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రానికి రూ. 10.77 లక్షల కోట్ల అప్పులున్నట్లు తేల్చారు. దీనిలో రూ. 7.14 లక్షల కోట్లు గత నాలుగేళ్ళుగా జగన్ మోహన్ రెడ్డి చేసిన అప్పులేనని ప్రకటించారు. కానీ ఈ ఏడాది ఫిబ్రవరి ఏడో తేదీన కేంద్ర ఆర్థిక శాఖ ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్ అంచనాల ఆధారంగా ఉన్న అప్పులు కేవలం రూ. 4.42 లక్షల కోట్లుగా తేల్చింది. ఆగస్టు 1న ఇదే విషయాన్ని లోక్‌సభలో మరోసారి ఆర్థిక మంత్రి ధ్రువీకరించారు. దీంతో ప్రతిపక్షాలూ, ఒక వర్గం మీడియా చేస్తున్న ప్రచారం అబద్ధం అని తేలిపోయింది.

కేంద్ర ప్రభుత్వమే వీరి ప్రచారంలో ఏ మాత్రం నిజం లేదని అంటుంటే పురందేశ్వరి మాత్రం తాను చెప్పిన కాకి లెక్కలకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని ఆగస్టు ఒకటో తేదీన ప్రకటించారు. వివిధ కార్పొరేషన్లు, బాండ్ల ద్వారా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం సుమారు లక్షా 62 వేల కోట్ల రూపాయల రుణాలు చేసిందని ఆమె చెబుతున్నారు. అయితే ఈ లెక్క కూడా తప్పేననీ రాష్ట్రానికి ఉన్న ఇటువంటి రుణాలు 79,815 కోట్ల రూపాయలేననీ కేంద్రం



స్పష్టం చేసింది. ఈ రుణాలతో కలిపి రాష్ట్రానికి ఉన్న మొత్తం రుణాలు రూ. 4.42 లక్షల కోట్లు మాత్రమే!

నిజానికి గత చంద్రబాబు నాయుడు ప్రభుత్వ హయాంతో పోలిస్తే ప్రస్తుత జగన్ పాలనలో రాష్ట్ర రుణాల పెరుగుదల రేటు బాగా తగ్గింది. 2014–19 మధ్య రుణాలు 169 శాతం పెరిగితే గత నాలుగేళ్ళలో ఇది 58 శాతంగా నమోదైంది. గత ప్రభుత్వ హయాంలో రుణాల వార్షిక వృద్ధి 21.87 శాతం కాగా అది ప్రస్తుత పాలనలో 12.69 శాతానికి తగ్గింది. 2014 జూన్ నాటికి ఆంధ్రప్రదేశ్‌కు 1.18 లక్షల కోట్ల రుణాలు ఉండగా, చంద్రబాబు పదవి నుంచి దిగిపోయే సమయానికి అవి 2.71 లక్షల రూపాయలకు పెరిగాయి. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే కేంద్రం 2014 – 2019 సంవత్సరాల మధ్య లక్షా 30 వేల కోట్ల రూపాయల రుణాలకు అనుమతి ఇస్తే చంద్రబాబు ప్రభుత్వం 2.71 లక్షల రూపాయల రుణాలు చేసింది. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి 2022 జులై 20వ తేదీన రాజ్యసభలో టీడీపీ సభ్యుని ప్రశ్నకు సమాధానం చెబుతూ 2014–19 సంవత్సరాల మధ్య తెలుగుదేశం ప్రభుత్వం రూ. 1,62,828 కోట్ల మేర అదనపు వ్యయాలు చేసిందనీ, వీటిలో 51,677 కోట్ల రూపాయలకు మాత్రమే వ్యయ వివరాలు పంపిందనీ, మిగిలిన వ్యయాలకు ఇంత వరకూ వివరాలు ఇవ్వలేదనీ చెప్పారు. మరి ఒక వర్గం మీడియాకు గానీ, బీజేపీ రాష్ట్ర నాయకత్వానికి గానీ ఇవి కనిపించలేదా?

ఏపీలో జగన్ ప్రభుత్వం కేంద్రం నిర్దేశించిన ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్ (ఎఫ్ఆర్‌బీఎమ్) పరిధికి మించి రుణాలు చేస్తోందని ఈనాడు పత్రిక, ఈటీవీ ఈ ఏడాది ఫిబ్రవరి 7న కథనాలు వెలువరించాయి. కాని రాష్ట్రం ఎఫ్ఆర్‌బీఎమ్ పరిధిని అతిక్రమించి రుణాలు చేయడం లేదని ఆగస్టు 1న సాక్షాత్తూ కేంద్ర సర్కారే లోక్‌సభలో ప్రకటించింది.

2014లో మోదీ అధికారంలోకి వచ్చే నాటికి దేశ రుణాలు రూ. 53 లక్షల కోట్లు కాగా అవి ఇప్పుడు రూ. 155 లక్షల కోట్లకు పెరిగాయి. అంటే ఈ పెరుగుదల మూడు రెట్ల వరకూ ఉంది. 1947 నుంచి 2014 మార్చి వరకూ దేశ రుణాలు రూ. 55 లక్షల కోట్లు. 2014 నుంచి 2023 మధ్య మోదీ ప్రభుత్వం చేసిన రుణాలు వంద లక్షల కోట్లపైనే ఉన్నాయి. ప్రతి వ్యక్తిపై రుణ భారం రూ. 43,124 నుంచి లక్షా 25 వేల రూపాయలు పెరిగింది. కేంద్ర రుణాలు, జాతీయోత్పత్తి నిష్పత్తి 84 శాతానికి పెరిగింది. కానీ ఆంధ్రప్రదేశ్‌లో ఈ నిష్పత్తి 36.5 శాతం మాత్రమే. ఈ విషయాలను రాష్ట్రంలోని ప్రతిపక్షాలూ, మీడియా వర్గాలు గమనించినప్పుడు మాత్రమే రాష్ట్ర ప్రయోజనాలకు మేలు జరుగుతుంది. స్పష్టమైన ప్రజా తీర్పుతో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వాన్ని తప్పుడు ప్రచారాలతో అస్థిర పర్చే ప్రయత్నాలను ప్రతిపక్షాలు మానుకోకపోతే ప్రజలు మరోసారి మరింత విస్పష్టమైన తీర్పుతో వాటిని శాశ్వతంగా ఆ పక్షానికే పరిమితం చేయడం ఖాయం.

వ్యాసకర్త అధ్యక్షుడు, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్
మొబైల్: 950 529 2299

ఇథనాల్‌తో ఒరిగేదేమిటి?

శ్యాం ప్రసాద్ రెడ్డి కోర్సిపాటి జూలై 25న 'సాక్షి'లో రాసిన 'ఇథనాల్‌తో రైతుకు మంచిరోజులు!' వ్యాసం చదివాము. కానీ అందులో రైతుకి ఎలా మేలు జరుగుతుందో ఒక్క మాట కూడా లేదు. వడ్ల ధర పెరుగుతుందా ? రైతు ఆదాయం ఎంత పెరుగుతుంది? అసలు ఇథనాల్ కంపెనీలు రైతుల దగ్గర నుండి వడ్లను కొంటాయా? ఇటువంటి వివరాలేమీ లేవు.

ఈ బయో ఆయిల్ తయారీకి మిగిలిపోయిన, పాడైపోయిన ఆహార ధాన్యాలను వాడుతాం కనుక దేశంలో ఆహార కొరత ఏర్పడుతుందని భయం లేదు అనే అంశం చూడడానికి బాగానే ఉంది. కానీ వాస్తవానికి ఇదే ప్రధాన సమస్య. ఎలాగంటే... భారత ప్రభుత్వం 2025 నాటికి బియ్యం, మొక్కజొన్నల నుండి 740 కోట్ల లీటర్ల ఇథనాల్ ఉత్పత్తికి ప్రణాళిక వేసింది. అందుకు ప్రభుత్వ లెక్కల ప్రకారం లీటర్ ఇథనాల్ ఉత్పత్తికి 2.22 కిలోల బియ్యం లేదా 2.7 కిలోల మొక్కజొన్నలు కావాలి. అంటే 164.3 లక్షల టన్నుల బియ్యం కావాలి. అన్ని టన్నుల పాడైన ఆహార ధాన్యాలు మన దగ్గర ఎట్లా లభిస్తాయి? ప్రభుత్వం గిడ్డంగుల నుండి ఇథనాల్ కంపెనీకి బియ్యాన్ని కిలో 20 రూపాయలకే సరఫరా చేస్తున్నది. రైతు దగ్గర వడ్లు కొన్నా కంపెనీకి బియ్యం కిలో రూ. 20కి గిడుతుందని దీన్ని బట్టి గ్రహించాలి. ఇథనాల్ ఉత్పత్తి పుంజుకోకుండానే ఇప్పుడే ప్రభుత్వం బియ్యం ఎగుమతులను నిషేధించింది. పూర్తి స్థాయిలో ఈ ఆయిల్ ఉత్పత్తి ప్రారంభమైతే ఇక పరిస్థితి ఏంటి? అసలు కొరత భయం లేకుంటే భారత ప్రభుత్వం ఎగుమతులను ఎందుకు నిషేధించినట్లు?

పూర్తిగా ఇథనాల్‌ను మాత్రమే వాడే వాహనాలు అందుబాటులోకి వస్తే ఇథనాల్ ఉత్పత్తిని భారీగా పెంచవలసి వస్తుంది. భారత్ 2022–23లో 4,150 కోట్ల లీటర్ల పెట్రోల్ వినియోగించింది. ఒక లీటర్ పెట్రోల్ 1.51 లీటర్ల ఇథనాల్‌కి సమానం. ఈ లెక్కన పెట్రోల్ బదులు ఇథనాల్‌ను ఉపయోగించాలంటే 6,265 కోట్ల లీటర్లు ఉత్పత్తి చేయాలి. ఇంత పరిమాణంలో తయారుచేయడానికి 1,390 లక్షల టన్నుల బియ్యం కావాలి. 2022– 23లో గిడ్డంగులలో మొత్తం బియ్యం 99 లక్షల టన్నులు మాత్రమే ఉన్నాయి. అంటే దేశంలో గిడ్డంగుల్లో నిల్వ ఉంచిన మొత్తం బియ్యం కూడా ఇంత పరిమాణంలో ఇథనాల్‌ను ఉత్పత్తి చేయడానికి చాల వన్నమాట.

ఇథనాల్ ఉత్పత్తి వల్ల సామాన్య ప్రజలకు, ముఖ్యంగా రైతులకు విశేషమైన ఆర్థిక ప్రయోజనాలు కలుగుతాయనే వాదం ఒకటుంది. ఇదీ నిజం కాదు. లీటర్ ఇథనాల్ రూ. 15కి లభిస్తుందని కొందరు అంచనా వేస్తున్నారు. పోనీ అదే నిజమ నుకుందాం. ఒక లీటర్ ఇథనాల్ తయారు కావడానికి 2.22 కిలోల బియ్యం కావాలి. మరి బియ్యం ధర ఎంత ఉంటే లీటర్ ఇథనాల్ రూ. 15కి సరఫరా చేసి కంపెనీ లాభం పొందగలదు? లీటర్ ఇథనాల్ ఉత్పత్తి ఖర్చు 15 రూపాయల లోపు ఉంటేనే ఇది సాధ్యం. ఇది సాధ్యమయ్యే పనేనా? బియ్యం ఉచితంగా ఇచ్చినా లీటర్ ఇథ నాల్‌ను రూ. 15కి అమ్మలేరు.

– ఉచ్చోళ్ళ రామచంద్రయ్య
చిత్తనూరు ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** బ.తదియ సా.5.32 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** శతభిషం ప.12.14 వరకు, తదుపరి పూర్వాభాద్ర, **వర్జ్యం:** సా.6.11 నుండి 7.43 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.14 నుండి 9.05 వరకు, **అమృతఘడియలు:** రా.3.10 నుండి 4.42 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.42, **సూర్యాస్తమయం:** 6.29.

రాజ్యసభ

ఏపీ ఇన్ పార్లమెంట్

ఆఫ్‌షోర్ మైనింగ్‌తో జీవనాధారానికి చేటు తేవద్దు

రాజ్యసభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: సాగర గర్భం నుంచి ఖనిజాల వెలికితీత కోసం నిర్వహించే ఆఫ్‌షోర్ మైనింగ్ కార్యకలాపాల ద్వారా సముద్రంపై ఆధారపడి జీవించే కోస్తా ప్రాంత ప్రజల జీవనాధారానికి చేటురాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రభుత్వానికి సూచించారు. ఆఫ్‌షోర్ ఏరియాల్లో ఖనిజాల బిల్లుపై గురువారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ సముద్రగర్భంలో మైనింగ్ కార్యకలాపాల కారణంగా సాగరంలోని జీవవైవిధ్యానికి ముప్పు కలుగుతుందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయన్నారు. తీర రాష్ట్రాల్లో ఒకటైన ఆంధ్రప్రదేశ్ సాగర జీవవైవిధ్యం పదిలంగా ఉండాలని గట్టిగా కోరుకుంటున్నట్లు చెప్పారు. తీర రాష్ట్రాలు, అక్కడి ప్రజలు, సముద్రంలోని జీవవైవిధ్యం పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక విధానాన్ని రూపొందించాలని ఆయన కోరారు.

కార్పొరేట్లతోనే మీడియాలో పెడధోరణులు

కార్పొరేట్ల ప్రవేశంతోనే మీడియా స్వతంత్రం మంటగలిసిపోయి పెడధోరణులకు దారితీస్తోందని విజయసాయిరెడ్డి చెప్పారు. పత్రికలు, సంచికల రిజిస్ట్రేషన్ బిల్లుపై గురువారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ ఇటీవల పత్రికారంగం బాధ్యతలు, ప్రమాణాలను విస్మరిస్తూ అవాంఛనీయ ధోరణలకు పాల్పడుతున్న సంఘటనలు అనేకం చూస్తున్నామన్నారు. మీడియా రంగంలోకి ప్రవేశిస్తున్న కార్పొరేట్లు ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలైన ఇతర వ్యవస్థలను శాసించేస్థితికి చేరుకున్నాయని చెప్పారు. కార్పొరేట్ సంస్థలు మీడియా రంగంలో ప్రవేశించడాన్ని తాను వ్యతిరేకించడం లేదని, అయితే లాభాపేక్ష లేకుండా పత్రికలు నడిపే సంస్థలకు మాత్రమే మీడియాలో ప్రవేశం కల్పించేలా చట్టంలో నిబంధనలను సవరించాలని సూచించారు. డిజిటల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌ను ప్రెస్‌కౌన్సిల్ చట్టం పరిధిలోకి తీసుకురావాలని కోరారు. అన్ని రకాల డిజిటల్ న్యూస్ ప్లాట్‌ఫామ్‌లను నియంత్రిస్తూ, ఫేక్ న్యూస్ ప్రచారం చేసే సంస్థలపై భారీగా జరిమానాలు విధించేలా చట్టసవరణ చేపట్టాలని కోరుతూ తాను ఇప్పటికే ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టినట్లు చెప్పారు.

జూనియర్ లాయర్లకు సామాజికభద్రత కల్పించండి

అడ్వొకేట్స్ సవరణ బిల్లుపై విజయసాయిరెడ్డి మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులకు సామాజికభద్రత కల్పించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.జూనియర్ లాయర్లు వృత్తిలోకి అడుగుపెట్టిన దశలోనే వారికి తగినంత ఆర్థికసాయం అందిస్తూ ప్రతిభావంతులు వృత్తిలో కొనసాగేలా చూడాలన్నారు.

విశాఖలో క్రూయిజ్ టెర్మినల్ ప్రారంభానికి సిద్ధం

సాక్షి, న్యూఢిల్లీ: విశాఖపట్నం ఔటర్ హార్బర్‌లో క్రూయిజ్ కమ్ కార్గో టెర్మినల్ ప్రారంభానికి సిద్ధంగా ఉందని కేంద్ర పర్యాటకశాఖ సహాయమంత్రి అజయ్ భట్ చెప్పారు. దీంతోపాటే విశాఖపట్నంలో పర్యాటకుల సౌకర్యార్థం సీ ప్లేన్ సర్వీసులను ప్రారంభించేందుకు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజ్యసభలో గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. క్రూయిజ్ కమ్ కార్గో బెర్త్ నిర్మాణానికి రూ.77 కోట్ల వ్యయం అవుతుందని విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ ప్రతిపాదించగా.. పోర్టులు, షిప్పింగ్‌శాఖ చేసిన విజ్ఞప్తి మేరకు తమ శాఖ రూ.38.50 కోట్లను ఇచ్చిందని చెప్పారు. కోవిడ్ మహమ్మారి కారణంగా నిర్మాణంలో జాప్యం జరిగిందని తెలిపారు.

అయిదేళ్లలో పోలార్ రీసెర్చి నౌక సిద్ధం

వచ్చే అయిదేళ్లలో పోలార్ రీసెర్చి నౌకను సిద్ధం చేస్తామని భూవిజ్ఞానశాస్త్ర శాఖ మంత్రి కిరణ్ రిజుజు చెప్పారు. విజయసాయిరెడ్డి మరో ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ భారతి, మైత్రి, హిమాద్రి పేరిట ఉత్తర, దక్షిణ ధ్రువాలలో భారత్ మూడు శాస్త్రపరిశోధన కేంద్రాలను నెలకొల్పిందని చెప్పారు. ఈ కేంద్రాలకు నిరంతర రాకపోకలు సాగించడానికి ఐస్ బ్రేకర్ నౌక చాలా అవసరమన్నారు. మరో అయిదేళ్లలో పోలార్ రీసెర్చి నౌక సిద్ధమవుతుందని పేర్కొన్నారు. ఈ తరహా నౌకల తయారీలో అపార నైపుణ్యం కలిగిన రష్యా వంటి దేశాలతో షిప్పింగ్‌శాఖ సంప్రదింపులు జరుపుతోందని తెలిపారు.

99 స్పేస్ టెక్ స్టార్టప్‌కు ఇస్రో సహకారం

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అంతరిక్ష రంగంలో స్టార్టప్ సంస్థలకు సంస్థాగత, మౌలిక సహకారంతోపాటు సాంకేతిక మార్గదర్శకత్వం కూడా అందిస్తోందని పీఎంవో సహాయమంత్రి జితేంద్రసింగ్ తెలిపారు. విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. స్పేస్ సైన్స్, టెక్నాలజీ, అప్లికేషన్ డొమైన్లలో మొత్తం 99 స్పేస్ టెక్ స్టార్టప్ సంస్థలకు ఇస్రో ద్వారా సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వేతర సంస్థలను ప్రోత్సహించేందుకు ఇన్-స్పేస్ పేరుతో సింగిల్ విండో ఏజెన్సీని ఏర్పాటు చేశామన్నారు. అంతరిక్ష కార్యక్రమాల అమలులో దేశంలో ప్రధాన రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థ అయిన ఇస్రో ప్రతిభావంతులను ఆకర్షించి వారిని నిలుపుకొనే సామర్థ్యం కలిగి ఉందని జితేంద్ర సింగ్ తెలిపారు.

రూ.4.97 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది



న్యాయవ్యవస్థలో మౌలిక సదుపాయాలకు సంబంధించి కేంద్ర ప్రాయోజిత పథకాలకు విడుదల చేసిన నిధుల్లో ఏపీ ఇంకా రూ.4.97 కోట్లు ఖర్చు చేయాల్సి ఉందని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్ తెలిపారు. 2022-23లో రూ.22.50 కోట్లు విడుదల చేయగా రూ.4.97 కోట్లు ఇంకా ఖర్చు చేయాల్సి ఉందని వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు జవాబిచ్చారు. 2021-22, 2023-24ల్లో నిధులు విడుదల చేయలేదని చెప్పారు.

న్యాయమూర్తుల నియామకంలో రిజర్వేషన్లు లేవు



జిల్లా కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు కోర్టుల్లో న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించి రిజర్వేషన్ల ప్రొవిజన్ లేదని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్ చెప్పారు. న్యాయమూర్తుల నియామకాల సమయంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ, మహిళల్లో తగినవారుంటే చూడాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులను కోరామని వైఎస్సార్‌సీపీ ఎంపీ కృష్ణయ్య ప్రశ్నకు జవాబిచ్చారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల మేరకు ప్రభుత్వం న్యాయమూర్తులను నియమిస్తుందని చెప్పారు.

లోక్‌సభ

ఢిల్లీ ఆర్డినెన్స్ బిల్లుకు వైఎస్సార్‌సీపీ మద్దతు

బిల్లుపై చర్చలో వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభలో ఢిల్లీ ఆర్డినెన్స్ బిల్లుకు వైఎస్సార్‌సీపీ మద్దతు తెలిపింది. ఈ బిల్లుపై గురువారం లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ ఈ బిల్లుతో ఏపీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. లెఫ్టినెంట్ గవర్నర్‌కు ప్రత్యేక అధికారాలున్నాయని, సుప్రీంకోర్టు తీర్పును సమీక్షించి కేంద్రం ఆర్డినెన్స్ తీసుకొచ్చిందని తెలిపారు. సర్వీసులకు సంబంధించిన చట్టాలను చేసే అధికారం పార్లమెంట్‌కు ఉందని, అయితే అన్ని భాగస్వామ్య పక్షాలతో చర్చించాలని కోరారు. ఈ బిల్లు ఇతర రాష్ట్రాలకు వర్తింపజేయరని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

సోలార్ సిటీపై సమాచారం రాలేదు



27 రాష్ట్రాలు, కేంద్రపాలితప్రాంతాల్లో సోలార్ సిటీలను గుర్తించామని, ఆంధ్రప్రదేశ్ నుంచి సోలార్ సిటీ ప్రోగ్రామ్‌లో భాగంగా ఎలాంటి నామినేషన్ రాలేదని కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి ఆర్.కె.సింగ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ బాలశౌరి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. డెవలప్‌మెంట్ ఆఫ్ సోలార్ సిటీస్ ప్రోగ్రామ్‌లో భాగంగా విజయవాడను 2011లో సోలార్ సిటీగా అభివృద్ధికి అనుమతించామని, ఈ పథకం 2017లో ముగిసిందని చెప్పారు.

ప్రధానితో ఎంపీ కృష్ణయ్య, బీసీ నేతల భేటీ

బీసీల సమస్యలపై ప్రధాని మోదీకి వినతిపత్రం

సాక్షి, న్యూఢిల్లీ : 75 ఏళ్లుగా దేశంలో 56 శాతం జనాభా గల బీసీలకు విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమాన వాటా ఇవ్వకుండా అన్యాయం జరుగుతోందని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య నేతృత్వంలోని బీసీ నేతలు ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికైనా బీసీలకు న్యాయం చేయడానికి రాజ్యాంగంలోని 340 ఆర్టికల్ ప్రకారం ప్రధాని హోదాలో జోక్యం చేసుకోవాలని, జాతీయ బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీ కుల వృత్తులకు సబ్సిడీ రుణాలివ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేతలు గుజ్జ కృష్ణ, లాల్ కృష్ణ, డా.మారేష్, డా.పద్మలత, రమేశ్ తదితరులు ప్రధానితో కలిసి చర్చలు జరిపారు. సుమారు 15 నిమిషాల పాటు జరిగిన సమావేశంలో బీసీలకు సంబంధించిన పెండింగ్ అంశాలను ప్రధానికి వివరించి వినతిపత్రం ఇచ్చారు. దేశంలో కేంద్ర ప్రభుత్వాలు గత 75 ఏళ్లుగా బీసీలకు ఏ రంగంలోనూ జనాభా ప్రకారం వాటా ఇవ్వలేదని.. విద్యా, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో కనీస ప్రాతినిధ్యం కల్పించలేదని వివరించారు. జనాభా గణనలో కులాలవారీగా బీసీ జనాభా గణన చేయాలని బీసీ నేతల బృందం ప్రధానిని కోరింది. బీసీల డిమాండ్లు న్యాయమైనవి, దశలవారీగా పరిష్కరిస్తామని, అన్ని రంగాల్లో సమానవాటా ఇచ్చే ప్రక్రియ ప్రారంభమైందని ప్రధాని హామీ ఇచ్చినట్టు సమావేశం అనంతరం కృష్ణయ్య తెలిపారు.



ప్రధాని మోదీకి వినతిపత్రం ఇస్తున్న కృష్ణయ్య తదితరులు

ఏ లెక్కన పోలవరం మీకు బ్రెయిన్ చైల్డ్ బాబూ?

- 14 ఏళ్లు సీఎంగా ఉండి ఏనాడైనా ఆలోచించారా?
- ఒక్క రూపాయి అయినా ఖర్చు పెట్టారా?
- ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిందీ.. నిర్మాణాన్ని పరుగెత్తించింది వైఎస్సార్
- రెమ్యూనరేషన్ ఎంతో చెప్పు బ్రో..
- చంద్రబాబు, పవన్‌లపై మంత్రి అంబటి ధ్వజం
- ఢిల్లీలో కేంద్ర మంత్రి గజేంద్ర షెకావత్‌తో భేటీ



కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో మంత్రి అంబటి, ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టు చంద్రబాబు బ్రెయిన్ చైల్డ్ కాదని.. ఏటీఎం అని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. కేంద్రం నిధులిచ్చినా ప్రాజెక్టును పూర్తి చేయకుండా దాన్ని ఏటీఎంగా మార్చుకున్నారంటూ కేంద్రం నుంచి సర్టిఫికెట్ తెచ్చుకున్న ఘనత చంద్రబాబుదేనని ఎద్దేవా చేశారు. అసలు ఏ లెక్కన పోలవరం ఆయన బ్రెయిన్ చైల్డ్ అవుతుందని ప్రశ్నించారు. అనేకమంది ముఖ్యమంత్రులు పోలవరం ప్రాజెక్టుకు శంకుస్థాపనలు చేశారని గుర్తు చేశారు. కానీ 14 ఏళ్లు సీఎంగా ఉన్నప్పుడు ఏనాడైనా పోలవరం గురించి చంద్రబాబు ఆలోచన చేశారా? ఎప్పుడైనా దానికి శంకుస్థాపన చేశారా? ఏ రోజైనా ఒక్క రూపాయి అయినా ఖర్చుపెట్టారా? అని నిలదీశారు. ఇవేమీ చేయనప్పుడు పోలవరం బాబు బ్రెయిన్ చైల్డ్ ఎలా అవుతుందన్నారు. పోలవరంకు శంకుస్థాపన చేసి.. దాని నిర్మాణాన్ని పరుగెత్తించింది వైఎస్సార్ అని గుర్తుచేశారు. పులిచింతల కూడా ఆయన పుణ్యమేనన్నారు. ప్రాజెక్టును 2018 కల్లా పూర్తి చేసి జాతికి అంకితం చేస్తానని శాసనసభలో చంద్రబాబు చెప్పినమాట వాస్తవమా, కాదా..? అని నిలదీశారు. మరి ఎందుకు పూర్తి చేయలేకపోయారు? అని ప్రశ్నించారు. ప్రాజెక్టుకు వెన్నెముకలాంటి కాఫర్‌డ్యామ్ నిర్మించకుండా డయాఫ్రమ్ వాల్ ఎందుకు నిర్మించారని నిలదీశారు. తాను అడిగిన మూడు ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ఆంబోతు అని తనను దూషిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు చంద్రబాబు రాజకీయ జీవితమంతా ఆంబోతులకు ఆవులను సప్లైచేసే పైకి వచ్చారన్నారు. గురువారం ఢిల్లీలోని పార్లమెంటులో వైఎస్సార్‌సీపీ ఎంపీలు మిథున్‌రెడ్డి, బీవీ సత్యవతి, బెల్లాన చంద్రశేఖర్, రెడ్డెప్పలతో కలిసి అంబటి రాంబాబు కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో భేటీ అయ్యారు. పోలవరం ప్రాజెక్టు సందర్శించాలని ఆయనను కోరారు. నవంబరులో విశాఖలో జరిగే సదస్సుకు కూడా ఆహ్వానించారు. పోలవరానికి నిధులు, తదితర అంశాలపై కేంద్ర మంత్రితో చర్చించారు. అనంతరం ఏపీ భవన్‌లో ఎంపీలు సుభాష్ చంద్రబోస్, నందిగం సురేశ్‌లతో కలిసి మీడియాతో మాట్లాడారు. అంబటి ఏమన్నారంటే..

ధర్నాలు చేయించిన దుర్మార్గుడు బాబే..

అధికారంలో ఉన్నప్పుడు రాయలసీమలో ఒక్క ప్రాజెక్టయినా శంకుస్థాపన, పూర్తి చేయడం చేశారా చంద్రబాబూ? పోతిరెడ్డిపాడుకు మాజీ సీఎం ఎన్టీఆర్ శంకుస్థాపన చేస్తే.. దివంగత వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచి రాయలసీమకు నీళ్లిచ్చారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీని పెంచుతున్నప్పుడు కోస్తా రైతులతో ప్రకాశం బ్యారేజీ వద్ద ధర్నాలు చేయించిన దుర్మార్గుడు చంద్రబాబే.

దత్త పుత్రుడు, దత్త తండ్రి బంధం..

బ్రో సినిమా గురించి మాట్లాడడానికి నాకు పనీపాటా లేదా?.. ఈ సినిమాలో నన్ను కించపరిచారుకాబట్టే మాట్లాడుతున్నా. పవన్ రెమ్యూనరేషన్ ఎంత? నిజాయతీపరులైతే ఆయన లేదా నిర్మాత సమాధానం చెప్పాలి. 'అధికారికంగా తీసుకునేది కొంత.. అనధికారికంగా ఎంతో.. అధికారికంగా ముగ్గురు.. అనధికారికంగా ఎంతమందో'.. ఇదీ పవన్ జీవితం. ఆయన గురించి మాట్లాడుతుంటే చంద్రబాబుకు నొప్పి కలుగుతోంది. దీంతో దత్తపుత్రుడు, దత్తతండ్రి బంధం బయటపడింది. నాపైన 'సందులో సంబరాల శ్యాంబాబు అలియాస్ రాంబాబు' అని సినిమా తీస్తున్నారని తెలిసింది. ఏదైనా కారణాలతో సినిమా ఆగిపోతే నా వంతు సహకారం అందిస్తా.

రొయ్యలకు పక్కా ధరలు

- రైతులు, ప్రాసెసింగ్ యూనిట్ల ప్రతినిధులతో చర్చించి ధరల ఖరారు
- ఇకపై ప్రతి 10 రోజులకు ఒకసారి నిర్ణయం
- ఆక్వా రైతులకు ఏటా రూ.956.59 కోట్ల విద్యుత్ సబ్సిడీ
- ఆక్వా సాధికారత కమిటీ భేటీలో మంత్రులు పెద్దిరెడ్డి, సీదిరి, కారుమూరి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి. చిత్రంలో మంత్రులు అప్పలరాజు, కారుమూరి, అధికారులు

సాక్షి, అమరావతి: ఇకనుంచి రొయ్యలకు కౌంట్‌ల వారీగా కచ్చితమైన ధరలు లభించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీదిరి అప్పలరాజు, కారుమూరి నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ప్రతి 10 రోజులకు ఒకసారి రైతులు, ప్రాసెసింగ్ యూనిట్ల ప్రతినిధులతో చర్చించి ధరలు నిర్ణయించాలని, ఆ ధరలు కనీసం 10 రోజుల పాటు కొనసాగేలా చూడాలని అన్నారు. ఆక్వా సాధికారత కమిటీ సమావేశం రాష్ట్ర సచివాలయంలో మంత్రి పెద్దిరెడ్డి అధ్యక్షతన గురువారం జరిగింది. మంత్రులు మాట్లాడుతూ.. గతంలో ఆక్వా ఫీడ్, సీడ్ తయారీదారులు ఇష్టారాజ్యంగా రేట్లు నిర్ణయించడం, ప్రాసెసింగ్ యూనిట్లు కూడా కొనుగోలు ధరలను తమ నియంత్రణలో ఉంచుకోవడం వల్ల ఆక్వా రైతులు నష్టపోయేవారన్నారు. ఈ పరిస్థితిని మార్చాలన్న ఆలోచనతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆక్వా సాధికారత కమిటీ ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. దళారుల ప్రమేయాన్ని కట్టడి చేయడంతోపాటు ఆక్వా రైతులు, ప్రాసెసింగ్ యూనిట్లతో సమావేశాలు నిర్వహిస్తూ ధరలను స్థిరీకరిస్తున్నామన్నారు. రొయ్యల ధరల క్రమబద్ధీకరణతో పాటు సీడ్, ఫీడ్ రేట్లు హేతుబద్ధంగా ఉండేలా నిర్ణయిస్తున్నామన్నారు. తద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఆక్వా రైతుకు విద్యుత్ సబ్సిడీ అందించాలని సీఎం వైఎస్ జగన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు.

విద్యుత్ సమస్యలుంటే సరి చేయండి

ఆక్వా రంగానికి సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 63,754 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, ఈ-ఫిష్ సర్వే ద్వారా 46,455 కనెక్షన్లు యాక్టివ్‌గా ఉన్నట్టు గుర్తించామని అధికారులు వివరించారు. ఈ అంశంపై మంత్రులు మాట్లాడుతూ.. అర్హతే ప్రామాణికంగా విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలని, సమస్యలుంటే తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. ఆక్వాసబ్సిడీ కోసం ప్రభుత్వం ఏటా రూ.956.59 కోట్లు ఖర్చు చేస్తుందన్న విషయాన్ని క్షేత్రస్థాయిలో ప్రతీ ఆక్వా రైతుకు వివరించాలన్నారు. ఆక్వా ప్రాసెసింగ్‌లో ముందంజలో ఉన్న కేరళ, గుజరాత్ రాష్ట్రాల్లో అమలుచేస్తున్న విధానాలను అధ్యయనంచేసి, రాష్ట్రంలో ప్రోత్సహించాలని సూచించారు. కేజ్‌కల్చర్‌ను ప్రోత్సహించేందుకు అవకాశాలను పరిశీలించాలని కోరారు. రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న 8 ఫిషింగ్ హార్బర్‌ల ద్వారా మెరైన్ ఆక్వా ఉత్పత్తులను మరింత పెంచుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మరో రెండ్రోజుల్లో అమెరికా ఆక్వా మార్కెట్లు తెరుచుకుంటున్నందున ప్రస్తుతం నిర్ణయించిన ధరలకు కౌంట్‌కు రూ.10 వరకు పెరిగే అవకాశం ఉందని మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు వివరించారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీలు నీరబ్‌కుమార్‌ప్రసాద్, గోపాలకృష్ణ ద్వివేది, పర్యావరణశాఖ సీఈ శివారెడ్డి పాల్గొన్నారు.

లాభాల బాటలో విద్యుత్ రంగం

- 2022-23లో ఏపీజెన్‌కోకు రూ.33కోట్ల నికర లాభాలు
- 5వేల మెగావాట్ల సామర్థ్యంతో పీఎస్‌పీల నిర్మాణానికి రెండో వారంలో ఎంవోయూలు
- రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సాక్షి, అమరావతి: విద్యుత్ రంగాన్ని గాడిలో పెట్టేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాల ఫలితంగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఏపీజెన్‌కో రూ.33కోట్ల నికర లాభాలను ఆర్జించిందని రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఏపీజెన్‌కో, నెడ్‌క్యాప్ పనితీరుపై గురువారం సచివాలయంలో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్‌పీసీ, ఏపీజెన్‌కో సంయుక్తంగా రాష్ట్రంలో 5 వేల మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల (పీఎస్‌పీ) నిర్మాణానికి ఈ నెల రెండో వారంలో సీఎం వైఎస్ జగన్ సమక్షంలో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసుకోనున్నట్లు తెలిపారు. ఫ్లైయాష్ నిర్వహణ, విక్రయాలకు సంబంధించి పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలుచేయాలని మంత్రి సూచించారు. బాటమ్ యాష్‌కు మార్కెట్‌లో డిమాండ్ పెరిగిన నేపథ్యంలో ఏపీజెన్‌కోకు ఆదాయం పెరిగేలా విధాన నిర్ణయం తీసుకోవాలన్నారు. ఏపీజెన్‌కో విద్యుత్ ఉత్పత్తిని పెంచారని, అదే విధంగా ఇంధన ఉత్పత్తి వ్యయం తగ్గింపుపై కూడా దృష్టిపెట్టాలని చెప్పారు. వర్షాకాలంలో ప్లాంట్లలో బొగ్గు కొరత లేకుండా పదిరోజులకు సరిపడా నిల్వలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సులో చేసుకున్న ఒప్పందాలన్నీ త్వరగా కార్యరూపం దాల్చేలా చూడాలన్నారు. అనంతపురం, వైఎస్సార్ జిల్లాల్లో ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నందున అక్కడ సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ విద్యుత్ కేంద్రం, ఆర్టీపీపీ యూనిట్లు చాలా పాతవని, అందువల్ల విద్యుత్ ఉత్పత్తి వ్యయం కొంత ఎక్కువగా ఉందని, అయినప్పటికీ సాధ్యమైనంత తగ్గించడానికి ప్రయత్నిస్తామని ఇంధనశాఖ స్పెషల్ సీఎస్ విజయానంద్, ఏపీజెన్‌కో ఎండీ చక్రధర్‌బాబు తెలిపారు. ఈ సమావేశంలో ఇంధనశాఖ జాయింట్ డైరెక్టర్ కుమార్‌రెడ్డి, నెడ్‌క్యాప్ ఎండీ రమణారెడ్డి, ఏపీజెన్‌కో డైరెక్టర్లు, సీఈలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రైతులకు మరింత లబ్ధే లక్ష్యం

- అందుకోసమే ఆర్బీకేలతో పీఏసీఎస్‌లు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల అనుసంధానం
- సమీక్షలో సీఎస్ జవహర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: రైతు భరోసా కేంద్రాలతో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్‌లు), రైతు ఉత్పత్తిదారుల సంఘాల అనుసంధానం ద్వారా రైతులకు మరిన్ని ప్రయోజనాలు అందించాలనే ప్రయత్నం చేస్తున్నట్లు సీఎస్ జవహర్‌రెడ్డి చెప్పారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ సంబంధిత శాఖల అధికారులతో సీఎస్ సమీక్ష నిర్వహించారు. ఆర్బీకేలతో పీఏసీఎస్‌లు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల అనుసంధానంపై చర్చించారు. రైతుల ఉత్పత్తులకు విలువ ఆధారిత సేవలందించేందుకు వీలుగా రాష్ట్రంలో పెద్దఎత్తున ఆహారశుద్ధి పరిశ్రమలను ప్రభుత్వం నెలకొల్పుతోందని చెప్పారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ సీహెచ్ హరికిరణ్ మాట్లాడుతూ.. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు డ్రోన్లు ఇవ్వాలనుకుంటున్నట్లు చెప్పారు. వాటితో సులభంగా పురుగు మందులు స్ప్రే చేయొచ్చని.. విత్తనాలు, ఎరువులు జల్లేందుకు అనువుగా ఉంటాయని తెలిపారు.

టీచర్ల కృషితోనే మెరుగైన సమాజం

టీచర్ల నిరంతర కృషితో మెరుగైన సమాజాన్ని నిర్మించగలమని సీఎస్ జవహర్‌రెడ్డి అన్నారు. పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా, ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో గురువారం విజయవాడలో టీచర్లకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల హాజరును పెంచడంతోపాటు మెరుగైన అభ్యసన ఫలితాలు సాధించేందుకు టీచర్లు కృషి చేయాలని సూచించారు. టెక్నాలజీని సద్వినియోగం చేసుకుంటూ.. పిల్లలు స్వేచ్ఛగా నేర్చుకునేలా బోధించాలని సూచించారు. పాఠశాల విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ విద్యావిధానంలో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకువచ్చిందని చెప్పారు. డిజిటల్ బోధనతో పాటు మూడో తరగతి నుంచే సబ్జెక్టు టీచర్లను నియమించడం గొప్ప నిర్ణయాలని పేర్కొన్నారు.

నెలాఖరుకల్లా 5 లక్షల గృహాలను అందించాలి

ఈ నెలాఖరు నాటికి రాష్ట్రంలో 5 లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి.. లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. ఇంటి నిర్మాణాలు పూర్తి చేయడమే కాకుండా ఆ కాలనీల్లో తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, సోక్ పిట్లు తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. టిడ్కో గృహాలను కూడా గడువు ప్రకారం పూర్తి చేయాలని సూచించారు.

మరింత పటిష్టంగా ఉద్యోగుల హెల్త్ స్కీం

రాష్ట్రంలో ఉద్యోగులకు అమలు చేస్తున్న హెల్త్ స్కీంను, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను మరింత పటిష్టంగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఉద్యోగ సంఘాలకు సీఎస్ జవహర్‌రెడ్డి చెప్పారు. ఈహెచ్‌ఎస్‌పై గురువారం సచివాలయంలో సీఎస్ అధ్యక్షతన స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. గుండె, కిడ్నీ, కేన్సర్ తదితర 10 ప్రధాన ప్రొసీజర్లకు ప్రస్తుతమిస్తున్న ప్యాకేజీ రేట్లను సవరించేందుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. కేంద్రం నిర్దేశించిన టాప్‌బ్రాండ్ స్టంట్‌కే రాష్ట్ర ప్రభుత్వం నిధులిస్తోందని, దానినే అమర్చేలా నెట్‌వర్క్ ఆస్పత్రులను ఆదేశిస్తామని చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆరోగ్యశ్రీ సీఈవో హరీంద్ర ప్రసాద్ మాట్లాడుతూ అందరికీ హెల్త్ కార్డులు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు.

అంకితభావంతో ఉత్తమ ఫలితాలు

విద్యాశాఖ మంత్రి బొత్స



సాక్షి, అమరావతి: విద్యార్థుల్లో అభ్యసన బాగుండాలంటే ప్రభుత్వం కల్పించే మౌలిక సదుపాయాలతో పాటు ఉపాధ్యాయుల అంకితభావం కూడా అవసరమని, అప్పుడే ఆశించిన ఉత్తమ ఫలితాలు వస్తాయని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గురువారం విజయవాడలో నిర్వహించిన 'అకడమిక్ యాక్టివిటీస్' వర్క్‌షాప్‌లో మాట్లాడుతూ.. విద్యార్థులు రోజూ పాఠశాలకు వచ్చేలా తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులను కోరారు. విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరైతే తగిన కారణాలను తెలుసుకోవాలన్నారు. ప్రతినెలా తల్లిదండ్రుల సమావేశాన్ని తప్పక నిర్వహిస్తే విద్యార్థుల మంచి చెడులు తెలుసుకోవచ్చన్నారు. డిజిటల్ విద్యా విధానంలో భాగంగా పాఠశాలలకు సమకూర్చిన స్మార్ట్ టీవీలు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు, ట్యాబ్‌లు సమర్థవంతంగా వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులన్నింటినీ భర్తీ చేసేందుకు ముఖ్యమంత్రి అనుమతించారని బొత్స తెలిపారు. విద్యార్థుల్లో మానసిక స్థైర్యాన్ని పెంపొందించేందుకు, కుటుంబ సమస్యల వల్ల అభ్యసనకు ఆటంకం కలగకుండా విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రతి మండలంలో కౌన్సెలర్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు ఉపయోగపడేలా 63 అంశాలతో 'అభయ ఫౌండేషన్' రూపొందించిన 'కంపాస్' పుస్తకాన్ని మంత్రి బొత్స, విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్, సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు, రచయిత బాలచంద్ర ఆవిష్కరించారు.

అక్టోబర్ 15 నాటికి రెండోదశ భూసర్వే పూర్తి

- అధికారులకు మంత్రులు పెద్దిరెడ్డి, ధర్మాన ఆదేశం
- మొదటి దశలో వేల గ్రామాల్లో భూహక్కు పత్రాల పంపిణీ పూర్తి
- జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్షపై 14వ కేబినెట్ సబ్ కమిటీ భేటీ

సాక్షి, అమరావతి : దేశంలోనే అత్యంత శాస్త్రీయ విధానంలో సమగ్ర భూసర్వే చేస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ధర్మాన ప్రసాదరావులు తెలిపారు. 'జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష' పథకం అమలుపై 14వ కేబినెట్ సబ్ కమిటీ సమావేశం గురువారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధ్యక్షతన అమరావతి సచివాలయంలో జరిగింది. ఇందులో మంత్రి ధర్మాన ప్రసాదరావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమగ్ర సర్వేపై ఇప్పటివరకు అధికారులు చేపట్టిన చర్యలపై మంత్రులు ఈ సందర్భంగా సమీక్షించారు. పెద్దిరెడ్డి, ధర్మాన మాట్లాడుతూ.. ఇప్పటికే రాష్ట్రంలో రెండువేల గ్రామాల్లో జగనన్న భూహక్కు-భూరక్ష కింద సర్వేను విజయవంతంగా పూర్తిచేసి భూహక్కు పత్రాలను జారీచేసినట్లు చెప్పారు. మరో రెండువేల గ్రామాల్లో ఈ ఏడాది అక్టోబర్ 15లోగా రెండోదశ సర్వే ప్రక్రియ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

92శాతం డ్రోన్ ఫ్లై పూర్తి..

రాష్ట్రవ్యాప్తంగా 13,398 గ్రామాలకుగాను 12,032 గ్రామాల్లో అంటే దాదాపు 92 శాతం డ్రోన్ ఫ్లై పూర్తయ్యిందన్నారు. ఆగస్టు నెలాఖరుకు ఇది నూరుశాతం పూర్తిచేయాలని వారు ఆదేశించారు. ఈ సర్వే ఇమేజెస్‌ను రాష్ట్రవ్యాప్తంగా ఏడువేల గ్రామాలకు పంపించినట్లు చెప్పారు. అలాగే, మొదటిదశలో 25.7 లక్షల సర్వేరాళ్లను పాతి రైతులకు హద్దులను శాశ్వతంగా గుర్తించే ప్రక్రియను పూర్తిచేశామన్నారు. రెండోదశకు సంబంధించి మరో 5 లక్షల సర్వే రాళ్లు అందించాల్సి వుందని, వాటిని కూడా ఏపీఎండీసీ సకాలంలో సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. మూడు, నాల్గవ దశలకు సంబంధించి ఎన్ని సర్వే రాళ్లు కావాలో ముందుగానే రెవెన్యూ, సర్వే విభాగాలు ఇండెంట్‌ను అందించాలని మంత్రులు పెద్దిరెడ్డి, ధర్మాన సూచించారు.

అర్బన్ ప్రాంతంలో వేగవంతం చేయాలి..

ఇక అర్బన్ ప్రాంతాల్లోనూ సర్వేను చురుగ్గా నిర్వహించాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 123 పట్టణ స్థానిక సంస్థల్లో 15 లక్షల ఎకరాలను సర్వేచేయాల్సి ఉందన్నారు. అర్బన్ ఏరియాలోనే 5.5 లక్షల ఎకరాల వరకు వ్యవసాయ భూమిగా ఉందని, మిగిలిన 9.44 లక్షల ఎకరాలు అర్బన్ ప్రాంతంగా ఉందన్నారు. ఈ మొత్తం ఏరియాలో 38.19 లక్షల ఆస్తుల సర్వేను గడువులోగా పూర్తిచేయాలని మంత్రులు కోరారు.

ఆర్వోఎఫ్ఆర్ భూముల సర్వే..

ఇక ఆర్వోఎఫ్ఆర్ కింద రాష్ట్రంలో అటవీ భూముల్లో సాగుచేస్తున్న మూడు లక్షల ఎకరాలకు పట్టాలు ఇచ్చామని వారు వెల్లడించారు. వాటినీ వెబ్‌ల్యాండ్ అడంగల్ పరిధిలోకి తీసుకొచ్చి, సమగ్ర సర్వేలో భాగం చేయబోతున్నామని అధికారులు వివరించారు. రెండునెలల్లో ఈ ప్రక్రియను పూర్తిచేస్తామన్నారు. అటవీ భూముల ఆక్రమణలపై యాజమాన్య హక్కుల నిర్ధారణలో కూడా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రులు సూచించారు. రెవెన్యూ, అటవీశాఖ సంయుక్త సర్వే ద్వారా హద్దులను నిర్ధారించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో సీసీఎల్ఏ జి. సాయిప్రసాద్, స్పెషల్ సీఎస్ (పట్టణాభివృద్ధి) శ్రీలక్ష్మి, గనులశాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది, పీఆర్-ఆర్డీ కమిషనర్ సూర్యకుమారి, సర్వే అండ్ సెటిల్‌మెంట్ కమిషనర్ సిద్ధార్థ్ జైన్, ఎంఏయూడీ కమిషనర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

'ఇస్లామిక్ స్టేట్'కు కొత్త చీఫ్

న్యూఢిల్లీ: ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) తమ అధినేత అబు హుస్సేన్ అల్ హుస్సెయినీ అల్ ఖురేషి మృతి చెందినట్లు ధ్రువీకరించింది. ఈ మేరకు టెలిగ్రామ్ చానల్ ద్వారా ఆ సంస్థ ప్రకటించింది. ఆ ప్రకటన ఏ తేదీన విడుదలైందీ తెలియరాలేదు. అతడు ఎప్పుడు, ఎలా మృతి చెందాడనే విషయం కూడా అందులో పేర్కొనలేదు. ఐఎస్ కొత్త అధిపతిగా అబు హఫ్స్ అల్ హషిమి అల్ ఖురేషి పగ్గాలు చేపట్టనున్నారని సంస్థ ప్రతినిధి తెలిపారు.

బాలికను చంపి, బొగ్గుబట్టీలో కాల్చేశారు

రాజస్తాన్‌లోని భిల్వారాలో దారుణం

జైపూర్: రాజస్తాన్‌లో భిల్వారాలో దారుణం చోటుచేసుకుంది. కొందరు రాక్షసులు 14 ఏళ్ల బాలికను చంపి, బొగ్గు బట్టీలో కాల్చేశారు. బుధవారం ఉదయం మేకల కాపలాకు వెళ్లిన బాలిక తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో ఆమె సోదరుడు, గ్రామస్తులు వెతుకులాట మొదలుపెట్టారు. రాత్రికి గ్రామ సమీపంలోని మండుతున్న ఒక బట్టీలో బాలిక చేతి గాజు, ఎముక ముక్కలు..ఆ పక్కనే బాలిక చెప్పులు వారికి కనిపించాయి. దీంతో, వారు బట్టీలు నిర్వహించే కల్బేరియా తెగకు చెందిన అయిదుగురిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బాలికపై అత్యాచారం చేశాక, చంపి కొలిమిలో పడేసి ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. నిందితులను ప్రశ్నిస్తున్నట్లు కోట్రి పోలీస్ స్టేషన్ అధికారులు చెప్పారు.

కాల్పుల్లో జవాను మృతి




చురాచాంద్‌పూర్‌లో మృతులకు నివాళులర్పిస్తున్న జో–కుకీ వర్గీయులు

ఇంఫాల్: చురాచాంద్‌పూర్‌లో కుకీ–జోమి ప్రజల అంత్యక్రియల ఊరేగింపును అడ్డుకునేందుకు కొందరు యత్నించారు. అడ్డుకున్న జవాన్లతో ఘర్షణకు దిగారు. ఈ సందర్భంగా జరిగిన కాల్పుల్లో మణిపూర్ రైఫిల్స్‌కు చెందిన ఇద్దరు జవాన్లు సహా 25 మంది ఆందోళనకారులు గాయపడ్డారు. అనంతరం ఒక జవాను మృతి చెందారు. ఈ ఘటనతో చురాచాంద్‌పూర్ జిల్లాలో నిషేధాజ్ఞలను మళ్లీ పొడిగించారు. మరోవైపు, మణిపూర్ ఘర్షణల్లో మూడు నెలలుగా ప్రాణాలు కోల్పోయిన 35 మంది కుకీ–జోమి తెగ ప్రజల సామూహిక ఖననాలపై హైకోర్టు స్టే విధించింది.

కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

ఈ ఏడాది ఇప్పటిదాకా 19 మంది బలి



కోటా(రాజస్తాన్): రాజస్తాన్‌లోని కోటా పట్టణంలో వైద్య విద్య ప్రవేశ పరీక్ష కోసం కోచింగ్ తీసుకుంటున్న 17 ఏళ్ల విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. తన ముఖానికి ప్లాస్టిక్ బ్యాగ్ చుట్టుకొని ఊపిరాడని స్థితిలో ప్రాణాలు తీసుకున్నాడు. ఉత్తరప్రదేశ్‌లోని రామ్‌పూర్‌కు చెందిన మన్‌జోత్ చాబ్రా కోటాలోని ఓ శిక్షణా కేంద్రంలో 'నీట్' కోచింగ్ తీసుకుంటున్నాడు. గురువారం ఉదయం తన హాస్టల్ రూమ్‌లో విగతజీవిగా కనిపించాడు. మన్‌జోత్‌కు అతని తల్లిదండ్రులు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయకపోవడంతో వారు హాస్టల్ వార్డెన్‌ను అప్రమత్తం చేశారు. విద్యార్థి గది తలుపులను బద్దలు కొట్టి చూడగా మృతదేహం కనిపించింది. కోటాలో ఇటీవలి కాలంలో విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగిపోవడంతో హాస్టల్ గదుల్లో సీలింగ్ ఫ్యాన్‌కి యాంటీ సూసైడ్ పరికరాలు అమర్చారు. దీంతో మన్‌జోత్ తన ముఖానికి, తలకి ఒక ప్లాస్టిక్ బ్యాగ్‌ని చుట్టుకొని, దానికి ఒక బట్టను గట్టిగా కట్టి ప్రాణాలు తీసుకున్నట్టు పోలీసు అధికారి ధర్మవీర్ సింగ్ వెల్లడించారు. తన మరణానికి ఎవరూ కారణం కాదంటూ అతడి గదిలో ఒక లేఖ లభ్యమైనట్లు చెప్పారు. మన్‌జోత్ చాలా తెలివైనవాడని, అందరితో జోక్స్ వేస్తూ సరదాగా ఉంటాడని అతని స్నేహితులు చెప్పారు. కోటాలో ఈ ఏడాది బలవన్మరణం చెందిన విద్యార్థుల సంఖ్య 19కి చేరుకోవడం ఆందోళన కలిగిస్తోంది. గత ఏడాది ఇదే పట్టణంలో 15 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. అఖిల భారత స్థాయిలో జరిగే ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇచ్చే కేంద్రాలకు కోటా ప్రసిద్ధి గాంచింది. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల నుంచి విద్యార్థులు కోచింగ్ కోసం వస్తుంటారు. చదువుల్లో ఒత్తిడి వల్ల వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

అదే ప్రతిష్టంభన!

మణిపూర్‌పై పార్లమెంటులో అదే రగడ

- 176 నిబంధన కింద 'స్వల్ప వ్యవధి' చర్చకు సిద్ధం: కేంద్రం
- ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకునేది లేదు: విపక్ష కూటమి
- మోదీ ప్రకటన, పార్లమెంటులో పూర్తిస్థాయి చర్చకు పట్టు
- విపక్ష నేతలను ఒప్పించేందుకు మంత్రుల విఫలయత్నం

న్యూఢిల్లీ: పార్లమెంటులో మణిపూర్ ప్రతిష్టంభన వీడకపోగా గురువారం పీటముడి మరింతగా బిగుసుకుంది. ఈ విషయమై విపక్షాలను అనునయించేందుకు గురువారం అధికార బీజేపీ ఒక మెట్టు దిగినా లాభం లేకపోయింది. లోక్‌సభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే, ఇతర ప్రతిపక్ష నేతలతో కేంద్రం తరఫున రాజ్యసభ నాయకుడు పీయూష్ గోయల్, మరో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ అరగంటకు పైగా చర్చలు జరిపారు. కానీ తమ డిమాండ్లపై పట్టు వీడేందుకు విపక్షాలు ససేమిరా అన్నాయి. మణిపూర్ హింసాకాండపై ప్రధాని ఉభయ సభల్లోనూ ప్రకటన చేయడంతో పాటు పార్లమెంటులో లోతైన చర్చ జరగాల్సిందేనని పట్టుబట్టాయి. దాంతో చర్చలు ఎటూ తేలకుండానే ముగిశాయి. 267 నిబంధన కింద ఈ అంశంపై చర్చకు కేంద్రం సుముఖత వ్యక్తం చేసినా, ప్రధాని ప్రకటన డిమాండ్‌కు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించరాదని పట్టుదలగా ఉంది. అంతగా అయితే కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేస్తారని చెబుతోంది. చివరికి కేంద్రం మరింత దిగొచ్చి మణిపూర్‌పై 176 నిబంధన కింద ఆగస్టు 11న రాజ్యసభలో స్వల్ప వ్యవధి చర్చకు సిద్ధమని ప్రతిపాదించింది. విపక్ష ఇండియా కూటమి మాత్రం 267, 176 నిబంధనల్లో దేని కిందా చర్చకు ఒప్పుకునేది లేదంటోంది. ''నిబంధనతో మాకు నిమిత్తం లేదు. ఇరు పక్షాలకూ ఆమోదయోగ్యమైన నిబంధన కింద పూర్తిస్థాయి చర్చ మాత్రం జరిగి తీరాల్సిందే'' అని డిమాండ్ చేస్తోంది. మణిపూర్‌పై ఏదోలా పార్లమెంటులో చర్చ జరిగి ప్రతిష్టంభనకు తెరపడవచ్చంటున్నారు. తాము ప్రతిపాదించిన మధ్యేమార్గానికి మోదీ సర్కారు అంగీకరిస్తుందని ఆశిస్తున్నట్టు కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ చెప్పారు.



రాజ్యసభలో మణిపూర్ అంశాన్ని చర్చించాలని వేడుకుంటున్న విపక్ష సభ్యులు

సభ్యుల హామీతో మళ్లీ సభలోకి స్పీకర్

ఇక లోక్‌సభలో మరో అరుదైన, ఆసక్తికరమైన దృశ్యం చోటుచేసుకుంది. హుందాగా నడుచుకుంటామని పలువురు విపక్ష సభ్యులు హామీ ఇవ్వడంతో స్పీకర్ ఓం బిర్లా మధ్యాహ్నం సభలో అడుగుపెట్టి కార్యకలాపాలను నడిపించారు. సభా కార్యకలాపాలకు సభ్యులు పదేపదే అడ్డుకుంటుండటం పట్ల మంగళవారం ఆయన తీవ్ర అభ్యంతరం వెలిబుచ్చడం, వారి ప్రవర్తనకు హుందాగా లేదంటూ ఆక్షేపించడం, ఇక సభకు రాబోనని ప్రకటించడం తెలిసిందే. ఆ మేరకు బుధవారమంతా స్పీకర్ లోక్‌సభకు దూరంగా ఉన్నారు. గురువారం ఉదయం కూడా ప్రశ్నోత్తరాలయ్యే దాకా సభకు రాలేదు. దాంతో, 'స్పీకర్ సభకు రావాలన్నది విపక్ష సభ్యులందరి కోరిక. ఆయన్ను సభ మొత్తం ఇష్టపడుతుంది'' అని అధీర్ రంజన్ చౌధరి (కాంగ్రెస్) అన్నారు. ''ఎన్ని భేదాభిప్రాయాలున్నా మాట్లాడుకుని పరిష్కరించుకుందాం. స్పీకర్ మన నాయకుడు'' అని చెప్పారు. అనంతరం అధీర్ నేతృత్వంలో విపక్ష నేతలు సౌగాథా రాయ్ (తృణమూల్), కనిమొళి (డీఎంకే), సుప్రియా సులే (ఎన్సీపీ) తదితరులతో పాటు మంత్రి గడ్కరీ సైతం బిర్లా చాంబర్‌కు వెళ్లి సభకు రావాల్సిందిగా కోరారు.

జీఎన్‌సీటీడీ (సవరణ) బిల్లును లోక్‌సభ ఆమోదిస్తుండగా ఆప్ ఎంపీ సుశీల్ రింకూ వెల్‌లోకి దూసుకొచ్చి కాగితాలు చించి స్పీకర్‌కేసి విసిరారు. దాంతో సమావేశాలు పూర్తయ్యేదాకా ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు.

నాకు కోపమే రాదు ఎందుకంటే... | నా పెళ్లై 45 ఏళ్లయింది!

రాజ్యసభలో నవ్వులు పూయించిన చైర్మన్



మణిపూర్ అంశంపై పార్లమెంటు అట్టుడుకుతున్న వేళ రాజ్యసభలో చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ తనపైనే జోకులు వేసుకుని సభలో నవ్వులు పూయించారు. దాంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. మీకు పదేపదే కోపమెందుకు వస్తుందని విపక్షనేత మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. 'సర్, నాకసలు కోపమే రాదు. ఎందుకంటే నా పెళ్లై 45 ఏళ్లయింది' అంటూ ధన్‌ఖడ్ చెణుకులు విసరడంతో సభ్యుల నవ్వులతో సభ దద్దరిల్లిపోయింది. ''చిదంబరం (కాంగ్రెస్ సభ్యుడు) చాలా సీనియర్ లాయర్ కూడా. అథారిటీపై కోపం చూపే హక్కు మాకుండదని ఆయనకు బాగా తెలుసు. సభలో మీరే (సభ్యులు) అథారిటీ. మరో విషయం. నా భార్య ఎంపీ కాదు. కనుక ఆమె గురించి నేనిలా సభలో మాట్లాడటం సరికాదు కూడా'' అంటూ ధన్‌ఖడ్ మరోసారి అందరినీ నవ్వించారు. తనకు కోపం వస్తుందన్న వ్యాఖ్యలను సవరించుకోవాల్సిందిగా ఖర్గేను కోరారు. దాంతో ఆయన లేచి, ''మీకు కోపం రాదు. చూపిస్తారంతే. కానీ నిజానికి చాలాసార్లు లోలోపల కోపగించుకుంటారు కూడా'' అనడంతో అధికార, విపక్ష సభ్యులంతా మరోసారి నవ్వుల్లో మునిగిపోయారు!

రెండుసార్లు వాకౌట్

అంతకుముందు, మణిపూర్ అంశాన్ని లేవనెత్తేందుకు అనుమతించకపోవడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్, తృణమూల్, ఆర్జేడీ, ఆప్, వామపక్షాలు తదితర విపక్షాలు ఉదయం రాజ్యసభ భేటీ కాగానే వాకౌట్ చేశాయి. మధ్యాహ్నం రెండింటికి తిరిగి సమావేశమయ్యాక కాంగ్రెస్ సభ్యుడు ప్రమోద్ తివారీకి చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ అవకాశమిచ్చారు. మణిపూర్ హింసపై, మహిళలపై ఘోర అత్యాచారాలపై చర్చకు అవకాశం కోరుతున్నట్టు ఆయన చెప్పారు. దీనిపై అధికార, విపక్ష సభ్యులతో ఎన్నిసార్లు సమావేశమైనా ఎవరికి వాళ్లే తమదే పై చేయి కావాలని పట్టుదలకు పోవడంతో లాభం లేకపోతోందంటూ చైర్మన్ వాపోయారు. ఆగ్రహించిన విపక్ష సభ్యులు 'ప్రధాని మోదీ సభకు రావాలి' అంటూ నినాదాలకు దిగారు. వాటిని పట్టించుకోకుండా ఖనిజాల (సవరణ) బిల్లు ప్రవేశపెట్టేందుకు మంత్రి ప్రహ్లాద్ జోషికి చైర్మన్ అవకాశమిచ్చారు. దాన్ని నిరసిస్తూ విపక్షాలు రెండోసారి వాకౌట్ చేశాయి.

జ్ఞానవాపీ మసీదులో సర్వేకు ఓకే

- అనుమతిస్తూ అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వులు
- అంజుమన్ ఇంతెజామియా పిటిషన్ కొట్టివేత



జ్ఞానవాపీ మసీదు ముందు శంఖం పూరిస్తున్న భక్తుడు

ప్రయాగ్‌రాజ్/వారణాసి: వారణాసిలోని జ్ఞానవాపి మసీదులో శాస్త్రీయ సర్వే జరపాలంటూ పురావస్తు శాఖ(ఏఎస్ఐ)కు దిగువ కోర్టు ఇచ్చిన ఆదేశాలను అలహాబాద్ హైకోర్టు సమర్థించింది. శాస్త్రీయ సర్వేకు ఎటువంటి అభ్యంతరం లేదని తెలిపింది. జిల్లా కోర్టు ఉత్తర్వు సముచితమేనని, ఈ విషయంలో తాము జోక్యం చేసుకోబోమని పేర్కొంది. వారణాసిలోని కాశీ విశ్వనాథుని ఆలయాన్ని ఆనుకునే ఉన్న జ్ఞానవాపీ మసీదు ఆలయంపైనే నిర్మించిందా లేదా తేల్చేందుకు ఏఎస్ఐ శాస్త్రీయ సర్వే జరపాలంటూ వారణాసి జిల్లా కోర్టు జూలై 21న అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ ఆదేశాలపై అంజుమన్ ఇంతెజామియా మసీదు కమిటీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మసీదు కమిటీకి అప్పీల్ చేసుకునే అవకాశం కల్పించాలంటూ ఏఎస్ఐ సర్వేపై జూలై 26 సాయంత్రం 5వరకు స్టే ఇచ్చింది. ఈ మేరకు మసీదు కమిటీ సర్వేను ఆపాలంటూ అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ వేసింది. దీనిపై అలహాబాద్ హైకోర్టు సీజే ధర్మాసనం జూలై 27 వరకు హిందు, మసీదు కమిటీ వర్గాల వాదనలు విని, తీర్పు రిజర్వు చేసింది. మసీదు కమిటీ వేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మసీదు ఆవరణలో ఏఎస్ఐ అధికారులు తక్షణమే తమ పనులు ప్రారంభించవచ్చని, సర్వేలో భాగంగా ఆ ప్రాంతంలో ఎలాంటి తవ్వకాలు జరపరాదని స్పష్టం చేసింది. ఏఎస్ఐ అధికారులు సర్వేను శుక్రవారం నుంచి ప్రారంభించనున్నారు. ఇందుకు సహకరించాలంటూ ఏఎస్ఐ తమను కోరిందని వారణాసి జిల్లా మేజిస్ట్రేట్ ఎస్.రాజలింగం తెలిపారు.జ్ఞానవాపి మసీదులో ఏఎస్ఐ సర్వేకు అనుమతిస్తూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును అంజుమన్ ఇంతెజామియా మసీదు కమిటీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. సర్వే నిలుపుదల కోరుతూ స్పెషల్ లీవ్ పిటిషన్ వేసింది.

విపక్షాల లొల్లి నడుమే... 'ఢిల్లీ' బిల్లుకు ఆమోదం

మూజువాణి ఓటుతో ఆమోదించిన లోక్‌సభ ● విపక్షాల వాకౌట్

- బిల్లుపై సుదీర్ఘ చర్చ.. అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం
- ప్రజల సంక్షేమం గురించి ఆలోచించండి: అమిత్ షా
- 'ఇండియా' కూటమికి కేజ్రీవాల్ బై బై చెప్పేస్తారని జోస్యం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన 'గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ(అమెండ్‌మెంట్) బిల్లు–2023'పై గురువారం లోక్‌సభలో ఆమోద ముద్రపడింది. ప్రతిపక్ష సభ్యుల ఆందోళన మధ్యే మూజువాణి ఓటుతో బిల్లుకు ఆమోదం లభించింది. అనంతరం కేంద్ర ప్రభుత్వ తీరుపై నిరసనగా విపక్ష ఎంపీలు సభ నుంచి వాకౌట్ చేశారు. అంతకుముందు ఈ బిల్లుపై లోక్‌సభలో దాదాపు నాలుగు గంటలపాటు సుదీర్ఘంగా చర్చ జరిగింది. అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది.

ఇక ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎందుకు?: కాంగ్రెస్

సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ బిల్లును ప్రవేశపెట్టిందని కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి ఆరోపించారు. ప్రభుత్వ పాలనా సర్వీసులపై ఢిల్లీ ప్రభుత్వానికే అధికారాలు ఉన్నాయంటూ న్యాయస్థానం చెప్పిందని గుర్తుచేశారు. ఒకవేళ ఈ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందితే, రాష్ట్రాల్లో ప్రజల చేత ఎన్నికైన శాసనసభలపై కేంద్ర ప్రభుత్వానిదే పైచేయి అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు నామమాత్రం అవుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని అధికారులే నడిపిస్తే ఇక ఎంపీలను, ఎమ్మెల్యేలను ఎన్నుకోవడం ఎందుకని నిలదీశారు. 'చెక్స్ అండ్ బ్యాలెన్సెస్' వ్యవస్థను విచ్ఛిన్నం చేయొద్దని కోరారు. డీఎంకే సభ్యుడు దయానిధి మారన్ మాట్లాడుతూ.. 'ఇండియా' కూటమి బలంగా ఉందని, మీ గురించి ఆలోచించుకోండి అని బీజేపీకి హితవు పలికారు. 2024లో తమ కూటమి కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు.

ప్రజలను బానిసలుగా మారుస్తారా?: కేజ్రీవాల్

ఢిల్లీ బిల్లును వ్యతిరేకిస్తూ ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ గురువారం ట్వీట్ చేశారు. ఢిల్లీ ప్రజలను బానిసలుగా మార్చడానికే ఈ బిల్లు తీసుకొచ్చారని ఆక్షేపించారు. ప్రజల హక్కులను లాక్కొనే బిల్లు ఎందుకని నిలదీశారు. బిల్లుకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం వద్ద సరైన వాదన ఒక్కటి కూడా లేదన్నారు. బిల్లు విషయంలో తప్పు చేస్తున్నట్లు కేంద్రానికి కూడా తెలుసని పేర్కొన్నాను.

అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే..: అమిత్ షా

ఢిల్లీకి సంబంధించిన చట్టాలు చేసే అధికారం రాజ్యాంగంలోని ఆర్టికల్ 239ఏఏ కింద పార్లమెంట్‌కు ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. ఢిల్లీ బిల్లుపై లోక్‌సభలో తొలుత ఆయన చర్చను ప్రారంభించారు. కేవలం అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే ఢిల్లీలోని అధికార ఆప్ ఈ బిల్లును వ్యతిరేకిస్తోందని మండిపడ్డారు. ఢిల్లీకి పూర్తిస్థాయి రాష్ట్ర హోదా కల్పించాలన్న సూచనను జవహర్‌లాల్ నెహ్రూ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, సర్దార్ వల్లభ్‌బాయి పటేల్, సి.రాజగోపాలాచారి, రాజేంద్ర ప్రసాద్ సైతం తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తుచేశారు. ఢిల్లీ బిల్లు విషయంలో అసలు సమస్య అధికారుల బదిలీలు, పోస్టింగులపై నియంత్రణ గురించి కాదని, ఇప్పటిదాకా జరిగిన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే బిల్లును వ్యతిరేకిస్తున్నారని కేజ్రీవాల్ పార్టీపై అమిత్ షా వ్యంగ్యాస్త్రాలు విసిరారు. బిల్లులు, చట్టాలు కేవలం ప్రజల సంక్షేమం కోసమేనని తేల్చిచెప్పారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో రూ.12 లక్షల కోట్ల అవినీతి జరిగిందని, అందుకే మీరు ప్రతిపక్షానికి పరిమితం అయ్యారని కాంగ్రెస్ సహా ఇతర పార్టీలను ఉద్దేశించి అన్నారు. బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందాక 'ఇండియా' కూటమిలో 'ఆప్' భాగస్వామిగా ఉండబోదన్నారు.

హరియాణాలో మళ్లీ ఉద్రిక్తత



నూహ్ అల్లర్లలో అరెస్టయిన యువకులు

గురుగ్రామ్: మత ఘర్షణలతో అట్టుడికిన హరియాణాలోని నూహ్ జిల్లాలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. బుధవారం రాత్రి 11.30 గంటలకు ఓ వర్గానికి చెందిన రెండు ప్రార్థనా మందిరాలు స్వల్పంగా దగ్ధమయ్యాయి. ఘటనలో ఎవరూ గాయపడలేదు. అయితే, ఒక ప్రార్థనా మందిరం కరెంటు షార్ట్ సర్క్యూట్‌తో, మరొకటి గుర్తుతెలియని కారణాలతో మంటలు అంటుకోవడంతో దగ్ధమైనట్లు పోలీసులు చెప్పారు. దీంతో స్థానికంగా ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు వారిని చెదరగొట్టారు. గురుగ్రామ్‌లోనూ ఉద్రిక్తత కొనసాగుతోంది. కాగా, హరియాణాలో మత ఘర్షణలకు సంబంధించి ఇప్పటిదాకా 93 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి(హోం) ప్రసాద్ చెప్పారు. 176 మందిని అరెస్టు చేశామని, వీరిలో 78 మందిని పీడీ చట్టం కింద అదుపులోకి తీసుకున్నామని తెలియజేశారు.

డేటా దుర్వినియోగం చేస్తే రూ.250 కోట్ల జరిమానా

న్యూఢిల్లీ: పౌరుల డిజిటల్ హక్కులు, వ్యక్తిగత సమాచార భద్రతకు ఉద్దేశించిన డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లును గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. విపక్షాల ఆందోళనల మధ్య కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లుని ద్రవ్య బిల్లుగా తీసుకువచ్చారన్న ఆరోపణల్ని మంత్రి అశ్విని వైష్ణవ్ తోసిపుచ్చారు. ఇది సాధారణ బిల్లేనని స్పష్టం చేశారు. పౌరుల వ్యక్తిగత గోప్యతతో ప్రమేయమున్న ఈ బిల్లును హడావుడి ఆమోదించవద్దని లోక్‌సభలో కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌధరి అన్నారు. గత ఏడాది ప్రజాభిప్రాయ సేకరణ కోసం ఉంచిన ముసాయిదా బిల్లుపై వచ్చిన సలహాలు సూచనలతో కొన్ని మార్పులు చేర్పులు చేశారు. వినియోగదారుల డిజిటల్ డేటాని దుర్వినియోగం చేసేవారిపై కేంద్రం కొరడా ఝుళిపించింది. అలాంటి సంస్థలపై రూ.50 నుంచి రూ.250 కోట్ల వరకు జరిమానా విధించనుంది. అంతేకాకుండా ఈ చట్టం అమలు కోసం ప్రత్యేకంగా డేటా ప్రొటెక్షన్ బోర్డుని ఏర్పాటు చేయనున్నట్టుగా బిల్లులో పేర్కొంది.



సునాక్ ఇంటిపై నల్లవస్త్రం

నలుగురు పర్యావరణ కార్యకర్తల అరెస్టు

లండన్: బ్రిటన్ ప్రధాని ఇంటిపై నల్లటి వస్త్రాన్ని కప్పిన నలుగురు పర్యావరణ కార్యకర్తలను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఉత్తర ఇంగ్లాండ్‌లో నార్త్ యార్క్‌షైర్ ప్రాంతంలోని రిచ్‌మండ్‌లో ఉన్న రిషి సునాక్ ఇంటిపై వారు నల్లటి వస్త్రం కప్పి తమ నిరసనను తెలియజేశారు. వీరు 'గ్రీన్‌పీస్' అనే పర్యావరణ పరిరక్షణ సంస్థలో సభ్యులుగా ఉన్నారు. సముద్రంలో చమురు, గ్యాస్ వెలికితీతను మరింత విస్తరిస్తూ సునాక్ ఇటీవల తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఇలా నిరసన వ్యక్తం చేశారు. సునాక్ ఇంటిపైకి ఎక్కి 200 చదరపు మీటర్ల నల్ల వస్త్రాన్ని కప్పారు. అలాగే సునాక్ ఇంటి ముందు మరో ఇద్దరు కార్యకర్తలు 'చమురు లాభాలు ముఖ్యమా? లేక మా భవిష్యత్తు ముఖ్యమా?' అని ప్రశ్నిస్తూ బ్యానర్‌ను ప్రదర్శించారు. ఈ సమయంలో సునాక్ కుటుంబసభ్యులెవరూ ఆ ఇంట్లో లేరు.

యుద్ధ మృతులు 10 వేలు

కీవ్: రష్యా దురాక్రమణ తమ దేశంపై మొదలయ్యాక 499 మంది చిన్నారులు సహా 10,749 మంది పౌరులు చనిపోయినట్లు ఉక్రెయిన్ తెలిపింది. ఉక్రెయిన్ ప్రాసిక్యూటర్ జనరల్ ఉన్నతాధికారి యూరి బియెలౌసోవ్ ఓ ఇంటర్వ్యూలో ఈ విషయాలు వెల్లడించారు. ఆక్రమిత ప్రాంతాలను విముక్తి చేసిన తర్వాతే వాస్తవ సంఖ్య తేలుతుందని చెప్పారు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో 500 మంది చిన్నారులు సహా 9 వేల మందికి పైగా పౌరులు మృతి చెందినట్లు జూలై 7న ఐక్యరాజ్యసమితి వెల్లడించిన నివేదిక తెలిపింది. కాగా, రష్యా కాల్పుల్లో ఖెర్సన్ నగరంలోని 18వ శతాబ్దానికి చెందిన చారిత్రక సెంట్ కేథరిన్ కేథడ్రల్ చర్చి దెబ్బతింది. మంటలను ఆర్పుతుండగా మరోసారి దాడి జరిగింది.



యుద్ధ ట్యాంకర్‌పై కూర్చున్న రష్యా అధ్యక్షుడు పుతిన్ నిలువెత్తు రక్త ప్రతిమపై వాటర్ గన్‌తో నీళ్లు పిచికారీ చేస్తున్న ఓ బాలిక. ఇటలీ రాజధాని రోమ్‌లో జేమ్స్ కొలోమినా అనే కళాకారుడు ఈ ప్రతిమను ప్రతిష్టించారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శుక్రవారం । 4 । ఆగస్టు । 2023

హైదరాబాద్- బెంగళూరు మధ్య వందేభారత్!



హిందూపురం అర్బన్: కేంద్ర రైల్వే శాఖ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును హైదరాబాద్‌లోని కాచిగూడ- బెంగళూరులోని యశంతపుర మధ్య ఈ నెల 6 నుంచి నడుపుతున్నట్లు రైల్వేశాఖ అధికారులు ఆయా స్టేషన్లకు సందేశం పంపారు. షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, గద్వాల, కర్నూలు, డ్రోణాచలం, గుత్తి, అనంతపురం, ధర్మవరం, పెనుకొండ, హిందూపురం, గౌరిబిదనూర్, యశంతపూర్ స్టేషన్లలో రైలుకు స్వాగత ఏర్పాట్లు చేయాలని సందేశంలో పేర్కొన్నారు. ఇంకా సమయ పట్టిక అందలేదని అధికారులు అంటున్నారు. ఈ రైలు వల్ల ప్రధాన ఐటి హబ్‌లైన హైదరాబాద్- బెంగళూరు మధ్య ప్రయాణ సౌకర్యం మరింత పెరగనుంది.

న్యూస్‌రీల్

టెక్కీ అకృత్యం

- ఇద్దరు పిల్లలను చంపి, భార్యతో కలిసి ఆత్మహత్య



దంపతులు విజయ్, హేమావతి (ఫైల్)

కృష్ణరాజపురం: ఇద్దరు చిన్నారి కూతుళ్లను చంపేసి ఆ తర్వాత దంపతులు కూడా ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన బెంగళూరు వైట్‌ఫీల్డ్ సమీపంలోని కాడుగోడి పోలీసు స్టేషన్ పరిధిలోని ఒక అపార్టుమెంట్‌లో జరిగింది. వివరాలు.. అపార్టుమెంట్‌లో అద్దె ఫ్లాటులో వీరార్జున విజయ్ (31), ఆయన భార్య హేమావతి (29) ఉంటున్నారు. హైదరాబాద్‌కు చెందిన వీరికి 6 ఏళ్ల క్రితం పెళ్లయింది. విజయ్ ఒక ఐటీ కంపెనీలో ఉద్యోగి. వీరికి రెండున్నరేళ్ల మోక్ష, నాలుగేళ్ల సృష్టి అనే ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఆర్థిక సమస్యలు, కుటుంబ కారణాలతో జీవితం మీద విరక్తి చెందిన దంపతులు.. పిల్లలను గొంతు పిసికి చంపి.. ఆపై ఇద్దరూ ఉరేసుకున్నారు. గత నెల 31 నుంచి ఇంటి తలుపులు తెరవక పోవడంతో పాటు దుర్వాసన వస్తుండడంతో గురువారం ఇరుగు పొరుగు ఫ్లాట్లవారు కిటికీ నుంచి చూడగా ఘోరం బయటపడింది. కాడుగోడి పోలీసులు వచ్చి తలుపులు పగులగొట్టి లోపల పరిశీలించారు. నలుగురి మృతదేహాలను పోస్టుమార్టమ్ నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. హైదరాబాద్ నుంచి వారి బంధువులు వస్తే పూర్తి సమాచారం తెలుస్తుందని పోలీసులు చెప్పారు.

జ్ఞానేంద్రను అరెస్టు చేయాలి



శివమొగ్గ: కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పట్ల మాజీ హోం మంత్రి అరగ జ్ఞానేంద్ర అవహేళనగా మాట్లాడటాన్ని ఖండిస్తూ శివమొగ్గ నగర దక్షిణ బ్లాక్ కాంగ్రెస్ కమిటీ ఆందోళన చేపట్టింది. జ్ఞానేంద్రను వెంటనే అరెస్టు చేయాలని ఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ఖర్గే శరీర రంగు గురించి జ్ఞానేంద్ర అవహేళనగా మాట్లాడారని, ఇది వర్ణబేధం కిందకి వస్తుందని, ఒక ప్రజాప్రతినిధిగా బాధ్యతారహితంగా ఆయన చేసిన వ్యాఖ్యలపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది.

నటి మమత కన్నుమూత



మమత (ఫైల్)

యశవంతపుర: రంగస్థల కళాకారిణి, నటి మమత గోడూర (75) గురువారం బెంగళూరులో కన్నుమూశారు. మెదడులో రక్తస్రావం కారణంగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమె మృతికి కళాకారులు, బంధుమిత్రులు సంతాపం వ్యక్తం చేశారు. ఆమెకు గతంలో కర్ణాటక ప్రభుత్వం రాజోత్సవ ప్రశస్తి నిచ్చి సన్మానించింది. మెదడు సమస్య వల్ల ఇంటిలోనే చికిత్స పొందేవారని కుటుంబ సభ్యులు తెలిపారు. బాగలకోట జిల్లా ఇళకల్ తాలూకా గోడూర సొంతూరు కాగా, బెంగళూరులోనే నివాసం ఉంటున్నారు. ఆమె రెండు వేలు నాటకాలతో పాటు 20 సినిమాలలో నటించారు.

పోయేది కొండంత
స్వాధీనం గోరంత





ఆన్‌లైన్ మోసాలకు గురైనవారు తక్షణం 1930 కి ఫిర్యాదు చేయాలి

- ఆరునెలల్లో రూ.65 కోట్లు దోచేసిన సైబర్ నేరగాళ్లు
- రూ.17 కోట్లు రికవరీ
- 1930 సహాయవాణికి తక్షణం ఫిర్యాదు చేస్తే ఫలితం

బనశంకరి: ప్రజలు ఎంత జాగ్రత్తగా ఉన్నా సైబర్ కేటుగాళ్లు విభిన్న పంథాలో పెట్రేగిపోతున్నారు. 2023 మొదటి ఆరునెలల్లో బెంగళూరుతో పాటు రాష్ట్రంలో అమాయకులను మోసగించి సుమారు రూ.65 కోట్లు దోచేశారు. బాధితులు, పోలీసులు సమయస్ఫూర్తితో సుమారు రూ.17 కోట్లను సైబర్ వంచకుల నుంచి రికవరీ చేశారు. అదే 2022లో సైబర్ మోసగాళ్లు రూ.76.9 కోట్ల ప్రజాధనాన్ని దోచుకోగా, రూ.14.7 కోట్లు రికవరీ అయ్యింది. మిగతా సొమ్మును వంచకులు స్వాహా చేసినట్లే. స్వాధీనం చేసుకున్న సొమ్ముతో పోలిస్తే పోయిన డబ్బు చాలా మొత్తం ఉంటోంది. పోలీసులు, బ్యాంకుల వద్ద ఆధునిక సాంకేతికత, బలగం ఉన్నప్పటికీ నేరగాళ్లను కట్టడి చేయడం దుర్లభం అవుతోంది.

బాధితులు 112, లేదా 1930 కి కాల్ చేయాలి

సైబర్ నేరాల గురించి ఇటీవల శాసనసభలో ఎమ్మెల్యే సురేశ్ కుమార్ అడిగిన ప్రశ్నకు హోం మంత్రి పరమేశ్వర్ పూర్తి వివరాలు వెల్లడించారు. పోలీస్ కంట్రోల్ రూం 112 నంబరు, లేదా జాతీయ సహాయవాణి 1930 కి బాధితులు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి. ఇలా చేస్తే ఫిర్యాదు వెంటనే సైబర్ నేరం నమోదు పట్టిక (సీఐఆర్)లో నమోదవుతుంది. వెంటనే పోలీసులు బాధితుని ఖాతా నుంచి ఏ ఖాతాలకు నగదు వెళ్లిందో గుర్తించి ఆ ఖాతాలను ఫ్రీజ్ చేయించడానికి వీలుంటుంది.

సైబర్ వంచనకు గురైన రెండు గంటల్లోగా సీఐఆర్ ద్వారా ఫిర్యాదు చేయడం చాలా ముఖ్యం. సైబర్ వంచన బారినపడిన బాధితులు సాధ్యమైనంత త్వరగా 112 లేదా 1930 నంబర్లకు ఫోన్లు చేసి సమాచారం అందించాలి. దీనిని గోల్డెన్ అవర్ అంటారు. ఆలస్యమయ్యేకొద్దీ బ్యాంక్ అకౌంట్ల ఆచూకీ కనిపెట్టడం, నగదు ఫ్రీజ్ చేయడం కష్టమౌతుందని పోలీస్ అధికారులు తెలిపారు.

కేవలం 25 మందికి శిక్ష

ఈ నేరాల్లో శిక్షలు మాత్రం అతి స్వల్పంగా ఉన్నాయి. నేరగాళ్లు ఎక్కడో దూర రాష్ట్రాల్లో ఉండడం దీనికి కారణమంటున్నారు. 2017లో ఇద్దరు, 2019లో 7 మంది, 2021 లో ముగ్గురు, 2022లో 5 మంది సైబర్ నేరగాళ్లకు శిక్ష పడింది. వేలాది కేసులు నమోదైతే కేవలం 25 మంది ఆచూకీ కనిపెట్టి శిక్ష విధించారు.

ఏడాది	కేసులు	పరిష్కారం	నష్టం	ఫ్రీజ్ చేసింది
2023	4,090	3,270	రూ.65 కోట్లు	రూ.16.4 కోట్లు
2022	8449	6,740	రూ.76 కోట్లు	రూ.14.7 కోట్లు
2021	12,850	11,719	రూ.142కోట్లు	రూ.31 కోట్లు



తక్షణ ఫిర్యాదు వల్ల నేరగాళ్ల ఖాతాలను ఫ్రీజ్ చేస్తారు

సీఐఆర్ వచ్చాక ఉపయోగం

పోలీస్ శాఖ వివరాల ప్రకారం సీఐఆర్ వచ్చాక 12,850 సైబర్ నేరాల కేసులు నమోదయ్యాయని, వాటిలో 11,719 కేసులను ఛేదించామని సీనియర్ పోలీస్ అధికారులు తెలిపారు. నేరగాళ్లు దోచేసిన నగదును రికవరీ చేయడంపై ఎక్కువ దృష్టి పెట్టామని, ఈ ఏడాది జనవరి 1 నుంచి జూన్ 30 వరకు బాధితులకు సుమారు రూ.65 లక్షలు అప్పగించామని చెప్పారు. కోర్టు అనుమతితో విధి విధానాలు పూర్తిచేసి బాధితులను నగదు అందిస్తామని సైబర్ క్రైం పోలీసులు తెలిపారు.

గోడౌన్‌లో అగ్నిప్రమాదం



దొడ్డబళ్లాపురం: కాటన్ బాక్సు గోడౌన్‌లో అగ్నిప్రమాదం జరిగిన సంఘటన దొడ్డ తాలూకా ఆలహళ్లి గ్రామంలో చోటుచేసుకుంది. నాగరాజు అనే వ్యక్తికి చెందిన కాటన్ బాక్సు గోడౌన్‌లో గురువారం తెల్లవారుజామున మంటలు వ్యాపించి క్షణాల్లో గోడౌన్ మొత్తం మంటలు చెలరేగాయి. గోడౌన్‌లో ఉన్న సుమారు రూ.10 లక్షల విలువ చేసే కాటన్ బాక్సులు, వాటిల్లోని ముడిసరుకు కాలిపోయాయి.

సేద్యంలో మార్పులు తేవాలి

యశవంతపుర: వాతావరణంలోని మార్పులు కారణంగా తక్కువ వర్షపాతం నమోదైంది. కరవు ఏర్పడే అవకాశం ఉన్న కారణంగా రైతులు సుస్థిర వ్యవసాయ సాగు పద్ధతులను అనుసరించటం అనివార్యమని వ్యవసాయశాఖ మంత్రి ఎన్ చలువరాయస్వామి తెలిపారు. జీకేవీకేలో స్నాతకోత్సవంలో విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేసి ఆయన మాట్లాడారు. వర్సిటీ నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేసి రైతులకు అందించాలని మంత్రి సూచించారు.

సొరంగ మార్గం, పై వంతెనకు బిడ్లు: డీకేశి

శివాజీనగర: బెంగళూరులో ట్రాఫిక్ సమస్యను తగ్గించి ఒక ప్రత్యేక రూపం ఇవ్వటానికి సొరంగ మార్గం, ఫ్లైఓవర్ నిర్మాణానికి బిడ్‌లను ఆహ్వానించామని ఉప ముఖ్యమంత్రి డీ.కే శివకుమార్ తెలిపారు. గురువారం ఢిల్లీలో కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరిని భేటీ చేసి జల వివాదానికి సంబంధించి న్యాయ నిపుణులతో సమావేశమైన తరువాత విలేకరులతో మాట్లాడిన ఆయన, బెంగళూరులోని ట్రాఫిక్ ఒత్తిడి గురించి అన్నిచోట్ల వినిపిస్తోంది. డిల్లీ, ముంబయిలో బెంగళూరు కంటే అధిక ట్రాఫిక్ సమస్య ఉన్నా కూడా ఆ నగరాల విషయం మాట్లాడటం లేదు. బెంగళూరు అంతర్జాతీయ నగరంగా ప్రఖ్యాత పొందటంతో అందరి దృష్టి బెంగళూరుపై ఉంది. దీంతో ట్రాఫిక్ ఒత్తడి తగ్గించేందుకు ప్రపంచ స్థాయి బిడ్‌లను ఆహ్వానించామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సహకరించేందుకు ఆమోదించిందన్నారు. ఈ నెల 8 బిడ్‌లను సమర్పించేందుకు ఆఖరి రోజన్నారు. ఇప్పటికే సింగపూర్, ఇజ్రాయేల్‌తో పాటుగా చైనా సహా వివిధ దేశాల కంపెనీ ప్రతినిధులు తమతో సంప్రదించినట్లు చెప్పారు.

ఎయిర్‌పోర్టు సిబ్బంది దురాశ

దొడ్డబళ్లాపురం: బెంగళూరు కెంపేగౌడ విమానాశ్రయంలో ప్రయాణికుని పర్సు కొట్టేసిన సిబ్బంది ఉదంతం ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలు... జూలై 27న విమానంలో దుబాయ్‌కి వెళ్లడానికి కేపీ సోలి అనే ప్రయాణికుడు వచ్చాడు. అతన్ని చక్రాల కుర్చీలో తీసికెళ్లే సహాయక ఉద్యోగి వేణుగోపాల్.. సోలి పర్సును తస్కరించాడు. కొంతసేపటికి పర్సులేకపోవడంతో సోలి ఎయిర్‌పోర్టు అధికారులకు తెలపగా వారు సీసీ కెమెరాలను పరిశీలించి వేణుగోపాల్ కొట్టేసినట్లు గుర్తించారు. నిందితుని నుంచి పర్సును తిరిగి ఇప్పించారు. ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు.

పట్టుబడిన లేడీ చైన్‌స్నాచర్



నిందితురాలు

దొడ్డబళ్లాపురం: బస్సులో ప్రయాణికురాలి గొలుసు చోరీ చేసి పరారవడానికి యత్నించిన లేడీ స్నాచర్‌ను ప్రయాణికులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన చెన్నపట్టణ బస్టాండులో చోటుచేసుకుంది. చెన్నపట్టణ తాలూకా బ్రహ్మణీపుర గ్రామానికి చెందిన జయమ్మ బస్సులో ప్రయాణిస్తుండగా ఆమె మెడలోని 60 గ్రాముల బంగారు గొలుసు తెంపుకుని ఒక మహిళ పరారవడానికి ప్రయత్నించగా తోటి ప్రయాణికులు పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పగించారు. తమిళనాడుకు చెందిన మహిళగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బడుగుజీవులపై అశనిపాతం



భీతావహంగా సంఘటనాస్థలం

- నాలుగో అంతస్తు నుంచి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌పై కూలిన నీటి ట్యాంకు
- ముగ్గురు దుర్మరణం
- బెంగళూరు శివాజీనగరలో ఘోరం

శివాజీనగర: రాత్రి కాస్త కడుపు నింపుకుందామని కూలీలు, ఇతరులు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్ద ఆరగిస్తున్నారు. ఇంతలో పెద్దశబ్దంతో ట్యాంకుతో పాటు గోడలు విరిగి వారి మీద పడ్డాయి. విధి ఆడిన వింత నాటకంలో పేదలు సమిధలయ్యారు.

నాలుగు అంతస్తుల భవనంపై నీటి ట్యాంకును ఉంచిన గోడ కూలి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌పై పడింది, అక్కడ ఉన్న ముగ్గురు మృతిచెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటన బెంగళూరు నడిబొడ్డున శివాజీనగర బస్టాండ్ వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. భోజనానికి వచ్చిన అరుళ్ (40) కోటా నాగేశ్వరరావు (32) కరణ్ థాపా (32) అనేవారు మృతిచెందారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ యజమాని దాస్, కపిల్ అనే మరో వ్యక్తి తీవ్రంగా గాయపడి బౌరింగ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అరుళ్ తమిళనాడువాసి కాగా శివాజీనగరలో కూరగాయల వ్యాపారం చేస్తుండేవారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కోటా నాగేశ్వరరావు కూలి పని చేస్తుండేవాడు. మరొకరు కరణ్ థాపా నేపాల్ నుంచి వచ్చి ఉపాధి పొందుతున్నట్లు డీసీపీ భీమాశంకర్ గుళేద్ తెలిపారు.

నాసిరకం నిర్మాణమే కారణం

శివాజీనగర బస్టాండ్ వద్ద ఓక్ ఫర్నిచర్ షాపు భవనం నాలుగవ అంతస్తు పైన సింటెక్స్ వాటర్ ట్యాంక్ పెట్టారు. ఇటీవల కురిసిన వానలకు నాసిరకంగా ఉన్న ట్యాంకు కట్టడం చీలిపోయింది, రాత్రి 10:30 సమయంలో కుప్పకూలి కిందనే ఉన్న రోడ్డు పక్కనున్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌పై పడింది. ఇద్దరు అక్కడే మరణించగా, తీవ్రంగా గాయపడిన కరణ్ థాపా ఆస్పత్రిలో గురువారం ఉదయం చనిపోయాడు. డీసీపీ భీమాశంకర్ గుళేద్ ఘటనాస్థలిని పరిశీలించారు. భవనంపై ట్యాంక్ గోడలను అశాస్త్రీయంగా నిర్మించినట్లు తెలిసింది. కమర్షియల్ స్ట్రీట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

భర్త కోసం పోరాటం

- మెట్టినింటి ముందు చంటిబిడ్డతో ధర్నా

తుమకూరు: పెళ్లి తర్వాత ప్రసవం కోసం పుట్టింటికి భార్య వెళ్లింది.. ఆనాటి నుంచి భర్త ఆమె ముఖం చూడకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఆమె ఇంటికి వస్తే తాళం వేసుకుని పరారయ్యాడు. భర్తను చూడకుండా వెళ్లనని అత్తింటి ముందు భార్య భీష్మించుకుని కూర్చొంది. ఈ ఘటన తుమకూరు జిల్లా శిరా తాలూకా హోన్నగొండనహళ్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అప్పిహళ్లి గ్రామంలో జరిగింది. అలాగని ఇద్దరు నిరక్షరాస్యులు కాదు.. ఎంతో ఉన్నత విద్యావంతులే.

అమ్మాజమ్మ, నరసింహయ్య దంపతుల కుమారుడు చంద్రశేఖర్‌తో 2021లో మడకశిర పరిధిలోని చిక్క తీర్ప గ్రామానికి చెందిన శోభతో వివాహం జరిగింది. చంద్రశేఖర్ ఎంఏ, బీఎడ్ చదువుకోగా, శోభ ఇంజినీరింగ్‌లో ఎంటెక్ పూర్తి చేసింది. పెద్దలు సంబంధం కుదిర్చి పెళ్లి చేశారు. కొన్ని నెలల తర్వాత శోభ గర్భం దాల్చింది. భర్త చంద్రశేఖర్ భార్యకు సీమంతం జరిపించి పుట్టింట్లో దింపేసి వచ్చాడు. ఇక అంతే సుమారు ఏడాదిగా అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు.



భర్త ఇంటి వద్ద బిడ్డతో శోభ

ఎవరికి చెప్పుకోవాలి

ఆ తర్వాత శోభకు కొడుకు పుట్టినప్పటికీ చంద్రశేఖర్ రాలేదు. దీంతో తన అత్తింటి వెళ్లి చూడగా వారు ఇంట్లోకి తనను రానివ్వడం లేదని శోభ ఆరోపిస్తోంది. తాను వెళ్లిన ప్రతిసారి ఇంటికి తాళాలు వేసి వెళ్లిపోతున్నారని తెలిపింది. తాను భర్తతోనే ఉంటానని, ఎన్నిసార్లు శిర పోలీసు స్టేషన్‌తోపాటు మహిళా సాంత్వన కేంద్రంలో ఫిర్యాదు చేసిన ప్రయోజనం లేదని విలపించింది. భర్త కంటికే కనిపించడం లేదని, ఎవరిని అడగాలో తెలియడం లేదని వాపోయింది. ఇంటి ముందు తల్లిదండ్రులతో కలిసి దీక్ష చేపట్టింది.

హస్తినలో ప్రముఖులతో భేటీలు

- ప్రధాని మోదీని కలిసిన సీఎం

శివాజీనగర/బనశంకరి: ముఖ్యమంత్రి సిద్దరామయ్య గురువారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. కాంగ్రెస్ పార్టీ సమావేశాల కోసం ఢిల్లీకి వెళ్లిన ఆయన ఉదయం పార్లమెంట్ భవనంలో ప్రధానిని కలిసి పలు అంశాలపై చర్చలు జరిపారు. మోదీకి సంప్రదాయ పేటా, గంధపు హారం వేసి శాలువా కప్పి జ్ఞాపికను అందజేశారు. అంతకుముందు కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌లతోను సీఎం చర్చలు జరిపారు. మైసూరు దసరా వేడుకల్లో వైమానిక ప్రదర్శన నిర్వహించాలని రక్షణమంత్రిని కోరారు. రాష్ట్రానికి జీఎస్టీ నిధుల వాటాను విడుదల చేయాలని ఆర్థికమంత్రికి విన్నవించారు.



రహదారులకు నిధులివ్వండి

బెంగళూరు –మైసూరు ఎక్స్‌ప్రెస్ వే లో ప్రమాదాలు తప్పించాలని, ఆ మార్గంలో సౌకర్యాలు కల్పించాలని సీఎం కేంద్ర రవాణా మంత్రి నితిన్‌గడ్కరీ కి మనవి చేశారు. గడ్కరీతో సమావేశమైన ఆయన ఎక్స్‌ప్రెస్ వే లో సర్వీసు రోడ్లు, బైపాస్‌లు నిర్మించాలని కోరారు. అలాగే శిరాడిఘాట్ మారనహళ్లి నుంచి అడ్డహొళె మధ్య సొరంగమార్గం నిర్మించాలి, రహదారుల అభివృద్ధికి రూ.10 వేల కోట్ల నిధులను కేటాయించాలని విన్నవించారు.

రెవెన్యూ ఆఫీసుల్లో సోదాలు

బనశంకరి: రెవెన్యూ ఆఫీసుల్లో గురువారం లోకాయుక్త పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించడంతో ఉద్యోగులు బెంబేలెత్తిపోయారు. బెంగళూరులోని పద్మనాభనగర, విజయనగర, బసవనగుడి, మహదేవపుర, కృష్ణరాజపురం తో పాటు నగర పరిధిలోని 28 నియోజకవర్గాల్లోని రెవెన్యూ కార్యాలయాల్లో సోదాలు జరిపారు. రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ విభాగాల్లో రికార్డులను పరిశీలించారు. సోదాలు కొనసాగుతున్నాయి.



షో లో నటి శరణ్య శెట్టి



అందాల భామల వయ్యారి నడకలు

సొగసుల వైభవం

బనశంకరి: ప్యాలెస్ మైదానంలో నిర్వహించిన ఫ్యాషన్ షోలో కన్నడనటి శరణ్యశెట్టి, అందాల భామలు హంసనడకతో హొయలొలికించారు. గార్మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాగుతున్న ప్రదర్శనలో గురువారం ఫ్యాషన్ వేడుక జరిగింది. నటి శరణ్యశెట్టి , మోడల్స్ ఆకర్షణీయమైన దుస్తులు ధరించి మిరుమిట్లు గొలిపే లైటింగ్స్, సంగీతం మధ్య సొగసైన నడకతో ఆకట్టుకున్నారు.






వైవిధ్య వస్త్రధారణలో మోడల్స్

స్వరాజ్య పుష్ప జాతర

- సింగారించుకున్న లాల్‌బాగ్
- నేటి నుంచి ఫ్లవర్ షో



లాల్‌బాగ్‌లో ఓ ఫ్లవర్ టవర్



పూలను అమరుస్తున్న కార్మికులు



సౌధ వద్ద కెంగెల్ హనుమంతయ్య విగ్రహం

బనశంకరి: రాబోయే స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నగరంలోని లాల్‌బాగ్‌లో ఫల పుష్ప ప్రదర్శన శుక్రవారం ప్రారంభమవుతుంది. సాయంత్రం 4 గంటలకు సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ తదితరులు ప్రారంభిస్తారు. ఈసారి మాజీ సీఎం కెంగెల్ హనుమంతయ్య, విధానసౌధ థీమ్‌తో పుష్ప ప్రదర్శన జరుగుతోంది. గ్లాస్ హౌస్ మధ్యభాగంలో 18 అడుగుల వెడల్పు, 36 అడుగుల పొడవు 18 అడుగుల ఎత్తుతో లక్షలాది పుష్పాలతో విధానసౌధ రూపాన్ని తీర్చిదిద్దారు.

వాహనాల పార్కింగ్ ఇక్కడ

హాప్‌కామ్స్ ఆవరణ, జేసీ రోడ్డులోని బీబీఎంపీ బహుళ అంతస్తు పార్కింగ్, శాంతినగర బస్టాండు పైన గల పార్కింగ్ భవనం, అల్ అమీన్ కాలేజీ మైదానంలో సందర్శకులు వాహనాలను పార్కింగ్ చేయాలి. ఈసారి ఫ్లవర్ షోను 10 లక్షల మంది వీక్షించే అవకాశం ఉందని అంచనా. భద్రత కోసం 150 చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి భద్రతా సిబ్బందిని నియమించారు. ప్రజలు సొంత వాహనాలు కాకుండా సిటీ బస్‌లు, మెట్రో రైళ్లలో రావాలని అధికారులు కోరారు.

క్లుప్తంగా

విద్యతోనే బాలికల అభివృద్ధి సాధ్యం



ఎమ్మెల్యే భరత్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

సాక్షి,బళ్లారి: నేటి రోజుల్లో విద్యతోనే బాలికల అభివృద్ధి సాధ్యం అని ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి అన్నారు. ఆయన గురువారం ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. చదువుతో పాటు క్రీడలు, యోగా, ప్రాణాయామం అలవరుచుకోవాలన్నారు. తమ పిల్లల చదువుపై తల్లిదండ్రులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఎంతో కష్టపడి చదివించే తల్లిదండ్రులకు బాసటగా విద్యార్థినులు కూడా మంచి ఆలోచనలు, ఉన్నత ఆశయాలతో బాగా చదువుకోవాలన్నారు. ఇష్టపడి చదివితే మరింత సులువుగా లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. అనంతరం ఎమ్మెల్యే భరత్‌రెడ్డిని కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది ఘనంగా సన్మానించారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకుడు చానాళ్ శేఖర్ పాల్గొన్నారు.

మద్యం కోసం టవర్ పైకెక్కిన యువకుడు



టవర్ పైకెక్కిన మద్యం ప్రియుడు

రాయచూరు రూరల్: విజయపుర జిల్లాలో మద్యం కోసం ఓ యువకుడు రెండోసారి టవర్ పైకెక్కిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఆ జిల్లాలోని సింధగి తాలూకా చాందకవటేలో సతీష్ అనే యువకుడు మద్యం, గుట్కా కోసం మొబైల్ టవర్ పైకెక్కాడు. దీంతో రాయల్ విస్కీ, విమల్ గుట్కాను చూపించి అతనిని కిందికి దింపారు. కాగా సతీష్ 15 రోజుల క్రితం మద్యం మత్తులో టవర్ పైకెక్కి కలకలం రేపిన విషయం తెలిసిందే.

ఆశ్రయ ఇళ్ల నిర్మాణానికి మోక్షమెన్నడో.?



ఆశ్రయ ఇళ్లకు నోచుకోని ఖాళీ స్థలం

హొసపేటె: తాలూకాలోని నాగేనహళ్లి జీపీలోని గుడి ఓబళాపురం సర్వే నెంబర్–44లో 5.22 ఎకరాల్లో 92 మందికి ఆశ్రయ లబ్ధిదారులకు ఆశ్రయ ఇళ్లను కట్టుకునేందుకు హక్కు పత్రాలను అందించి 32 ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు ఆశ్రయ ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు జెడ్పీ యంత్రాంగం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇక్కడ పేదలు పూరిగుడిసెల్లో నివాసముంటున్నారు. విద్యుత్ దీపాలతో పాటు డ్రైనేజీలు, తాగునీరు తదితర వ్యవస్థలు లేకపోవడంతో వారు తీవ్ర కష్టాలను ఎదుర్కొంటున్నారు. ఇంతకు ముందు టీపీ అధ్యక్షురాలుగా ఉన్న నాగవేణి బసవరాజ్ తన స్వంత ఖర్చుతో ప్రజలకు నీటి ట్యాంక్‌ను కట్టించారు. అదే విధంగా రెండు బోరుబావులతో పాటు అక్కడక్కడ కాంక్రీట్ డ్రైనేజీలను నిర్మించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ఆశ్రయ ఇళ్లను నిర్మించాలని గుడి ఓబుళాపురం గ్రామస్తులు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు.

తల్లిపాలతో శిశువుకు ఆరోగ్యం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

బళ్లారి రూరల్: తల్లిపాలే శిశువుకు వ్యాధినిరోధక శక్తినిస్తాయని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ గంగాధరగౌడ తెలిపారు. గురువారం విమ్స్ వైద్యభవన్‌లో పీడియాట్రిక్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తల్లిపాల విశిష్టత జాగృతి వారోత్సవంలో ఆయన మాట్లాడారు. తల్లి పాలు సర్వరోగాల నుంచి శిశువును రక్షిస్తాయన్నారు. కనీసం 6 మాసాల పాటు తల్లిపాలను శిశువుకు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. పీడియాట్రిక్ హెచ్ఓడీ డాక్టర్ దుర్గప్ప మాట్లాడుతూ 2019–21 సర్వే ప్రకారం 41.8 శాతం తల్లులు శిశువు పుట్టిన గంటలోపు పాలిస్తున్నారన్నారు. 63.7 శాతం శిశువులు మాత్రమే 6 మాసాలు తల్లిపాలు తాగుతున్నారన్నారు. 45.9 శాతం మంది శిశువులు 6–8 మాసాల్లో అల్పాహారం, ద్రవాలు తీసుకొంటున్నారన్నారు. తల్లిపాల విశిష్టతను గుర్తించి శిశువులకు తప్పనిసరిగా తల్లిపాలను అందించాలన్నారు. జెడ్పీ సీఈఓ రాహుల్ శరణప్ప సంకనూరు తల్లిపాల విశిష్టతను వివరించారు. డీహెచ్ఓ డాక్టర్ జనార్దన్, డీఎస్ డాక్టర్ బసిరెడ్డి, డాక్టర్ సురేశ్, డాక్టర్ వీరశంకర్, డాక్టర్ బి.కె.శ్రీకాంత్, డాక్టర్ సుమ గడ్డి, డాక్టర్ శివకుమార్ పాల్గొన్నారు.

ఆయకట్టు రైతులకు తీపి కబురు

- టీబీ డ్యాం నుంచి 5,575 క్యూసెక్కుల నీటి విడుదలకు అనుమతి
- ఢిల్లీలో డీసీఎం, జలవనరుల శాఖ మంత్రి డీ.కే.శివకుమార్ వెల్లడి



వరద జలాలతో నిండుకుండలా తొణికిసలాడుతున్న తుంగభద్ర డ్యాం



ఉప కాలువలకు నీరు విడుదల చేస్తున్న దృశ్యం

శివాజీనగర: రైతుల డిమాండ్, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేల ఒత్తిడి నేపథ్యంలో తుంగభద్ర డ్యాం నుంచి వివిధ కాలువలకు 5,575 క్యూసెక్కుల నీటి విడుదలకు ఆమోదించినట్లు డీసీఎం, జలవనరుల శాఖ మంత్రి డీ.కే.శివకుమార్ తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన గురువారం కర్ణాటక భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. దక్షిణ కర్ణాటక కంటే ఉత్తర కర్ణాటకలోని జిల్లాల్లో మంచి వర్షాలు కురిశాయన్నారు. తుంగభద్ర డ్యాం నుంచి కాలువలకు నీరు వదలాలని ఇప్పటికే జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి చాలా ఒత్తిడి వచ్చిందన్నారు. డ్యాంలో 105 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉండగా, ఇప్పటికే 83 టీఎంసీల మేరకు నీరు నిల్వ చేరిందన్నారు. టీఎల్‌బీఎంసీకి సుమారు 1300 నుంచి 1500 క్యూసెక్కులు, ఆర్‌బీఎల్ఎల్‌సీకి 1200 క్యూసెక్కులు, ఆర్‌బీహెచ్ఎల్‌సీకి 1375 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తారన్నారు. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్ వాటా నీటిని విడుదల చేయాల్సి ఉందన్నారు. రైతుల నుంచి కూడా డిమాండ్ ఉన్నందున మొత్తం 5575 క్యూసెక్కుల నీటి విడుదలకు అనుమతించామన్నారు. తద్వారా రైతుల డిమాండ్‌పై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు.

మంత్రి తంగడగి అధ్యక్షతన సలహా సమితి:

తుంగభద్రా నీటిపారుదల సలహా సమితి(ఐసీసీ)కి మంత్రి శివరాజ్ తంగడగిని అధ్యక్షుడిగా నియమించామన్నారు. రాబోయే రోజుల్లో ఆయన అధ్యక్షతన ఐసీసీ సమావేశం జరిపి, రైతుల పంటలకు అనుకూలమయ్యే దిశలో ఏ సమయానికి ఎంత నీరు ఇవ్వాలో తీర్మానిస్తారని డీసీఎం తెలిపారు.

తుంగభద్ర కాలువలకు నీటి వాటాలివే

హొసపేటె: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కాలువల వారీగా నీటి విడుదలకు చర్యలు చేపట్టామని తుంగభద్ర ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్, విజయనగర కాలువల నీటిపారుదల సలహా కమిటీ సభ్యకార్యదర్శి ఎల్.బసవరాజ్ తెలిపారు. గురువారం మునిరాబాద్‌లో తుంగభద్ర జలాశయం కింద కాలువలకు కేటాయించిన నీటి వాటాల గురించి విలేకరులకు తెలిపారు. తుంగభద్ర డ్యాంలో ప్రస్తుతం 83.18 టీఎంసీల వరకు నీరు నిల్వ ఉండగా, 21,492 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని తెలిపారు. రిజర్వాయర్‌లో నీటి లభ్యత ఆధారంగా తుంగభద్ర డ్యాం కింద కాలువలకు నీటిని మళ్లిస్తామని తెలిపారు.

ఏయే కాలువకు ఎంత వాటా నీరు:

తుంగభద్ర ఎడమ గట్టు ప్రధాన కాలువకు ఆగస్టు 3 నుంచి గణేకల్ రిజర్వాయర్‌కు తాగునీటిని నింపే వరకు సగటున 3,000 క్యూసెక్కులు, కుడిగట్టు ఎగువ కాలువ(హెచ్ఎల్‌సీ)కు సగటున 1200 క్యూసెక్కులు, కుడిగట్టు దిగువ కాలువ(ఎల్లెల్సీ)కు సగటున 650 క్యూసెక్కులు, గత జూన్ 1 నుంచి రాయబసవన్న కాలువకు 250 క్యూసెక్కులు, తుంగభద్ర ఎడమ గట్టు అప్పర్ లెవల్ కెనాల్‌కు ఆగస్టు 3 నుంచి సగటున 25 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు తెలిపారు. కాలువల నుంచి పంప్‌సెట్లతో అక్రమంగా నీటిని మళ్లిస్తే కఠిన చర్యలు చేపడుతామని హెచ్చరించారు.

ఉప కాలువలకు నీరు విడుదల

సాక్షి,బళ్లారి: తుంగభద్ర డ్యాం నుంచి హెచ్ఎల్‌సీ, ఎల్ఎల్‌సీల కింద ఉప కాలువలకు కర్ణాటక కోటా కింద ఎట్టకేలకు నీరు విడుదల చేశారు. సాధారణంగా ఐసీసీ సమావేశం నిర్వహించిన తర్వాత ఆయా కాలువలకు నీటిని విడుదల చేసేవారు. అయితే డ్యాంలో గరిష్టస్థాయికి నీరు చేరుతున్నా ఇప్పటి వరకు కర్ణాటక కోటా కింద నీటి విడుదలకు ఇండెంట్ ఇవ్వక, ఉప కాలువలకు నీరు విడుదల చేయకపోవడంతో తుంగభద్ర రైతు సంఘం అధ్యక్షుడు దరూరు పురుషోత్తంగౌడ ఆధ్వర్యంలో జిల్లాధికారి, టీబీ డ్యాం చీఫ్ ఇంజనీర్ బసవరాజ్‌లను కలుసుకుని ఒత్తిడి తెచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర చొరవ తీసుకుని సంబంధిత మంత్రి, కార్యదర్శికి రైతుల సమస్యలు వివరించి ఎట్టకేలకు గురువారం నీటిపారుదల శాఖ కార్యదర్శి రాకేష్‌సింగ్ ద్వారా తుంగభద్ర డ్యాం నుంచి కర్ణాటక కోటా కింద హెచ్ఎల్‌సీకి 1300 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీకి 650 క్యూసెక్కుల నీరు విడుదల చేయాలని సూచించారు. దీంతో ఆ రెండు కాలువల ద్వారా ఉప కాలువలకు నీరు విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉప కాలువల వద్ద మంత్రి నాగేంద్ర సోదరుడు వెంకటేశ్, రైతు సంఘం నేతలు నీరు విడుదల చేయించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు.

పట్టు రైతుల అభివృద్ధికి సహకరిస్తాం

కోలారు: జిల్లాలో పట్టు రైతుల అభివృద్ధికి సహకరిస్తామని జిల్లా కలెక్టర్ అక్రం పాషా తెలిపారు. గురువారం తన కార్యాలయం భవనంలో నిర్వహించిన పట్టు రైతులు, రీలర్ల సహకార సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. నాణ్యత కలిగిన పట్టుకు డిమాండ్ అధికంగా ఉన్నందున రైతులు నాణ్యత కలిగిన పట్టును ఉత్పత్తి చేయాలన్నారు. తద్వారా తమ ఆదాయాన్ని రెండింతలు చేసుకోవాలన్నారు. పట్టు పరిశ్రమలో సిబ్బంది కొరత నివారిస్తామన్నారు. మల్బరీ ఆకులకు నుసి రోగం తగలకుండా తగిన చర్యలు తీసుకోవాలని పట్టు శాఖ అధికారులకు సూచించారు. ఇదే సమయంలో పట్టు శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, పట్టు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు, రీలర్ల సంఘం అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎముకల ఆరోగ్య పరీక్ష శిబిరం



మాట్లాడుతున్న హరీష్ మూర్తి

రాయచూరు రూరల్: నగరంలో శుక్రవారం ఎముకల ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రాయచూరు ఆర్థోపెడిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ హరీష్ మూర్తి తెలిపారు. గురువారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ ఆర్థోపెడిక్ దినోత్సవం సందర్భంగా ఎముకల వ్యాధిపై ప్రజలకు, 8, 9, 10వ తరగతి విద్యార్థులకు జాగృతి జాతాను ఏర్పాటు చేస్తామన్నారు. శిబిరంలో రాయచూరు వైద్య విజ్ఞాన సంస్థ(రిమ్స్)కళాశాల విద్యార్థులు పాల్గొంటారన్నారు.

ప్రజా సమస్యలపై స్పందనతోనే సార్థకత



అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి: గ్రామ పంచాయతీలకు నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులు తమ పదవులకు న్యాయం చేస్తూ ప్రజా సమస్యలపై స్పందించినప్పుడే వారి గెలుపునకు సార్థకత చేకూరుతుందని ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. ఆయన గురువారం తాలూకాలోని జీరిగనూరు, సిద్దమ్మనహళ్లిల్లో ఇటీవల రెండో విడత గ్రామ పంచాయతీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా గెలుపొందినవారు పదవీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



సాక్షి,బళ్లారి: ఆర్‌టీసీ బస్సు కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం నగరంలో చోటు చేసుకుంది. ఇన్‌ఫ్యాంట్రీ రోడ్డులో గదగ్ జిల్లాకు చెందిన రిటైర్డ్ ఆయుర్వేద డాక్టర్ శశిధర్(66) అనే వ్యక్తి స్కూటీలో వెళుతుండగా ప్రమాదవశాత్తు బస్సు చక్రాల కింద పడటంతో తీవ్ర రక్తస్రావమై ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందారు. నగరంలోని కుమార్తె ఇంటికి వచ్చిన ఆయన నగరంలో ఓ పని మీద స్కూటీపై వెళుతుండగా అదుపు తప్పి బస్సు కింద పడి ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహానికి విమ్స్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఘటనపై ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో విజ్ఞాన కేంద్రాల ఏర్పాటుకు వినతి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించిన మంత్రి బోసురాజు

రాయచూరు రూరల్: రాష్ట్రంలో మూడు చోట్ల విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర చిన్న నీటిపారుదల,సైన్సు అండ్ టెక్నాలజీ శాఖా మంత్రి బోసురాజు కేంద్ర పర్యాటక, సంస్కృతి శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని కలసి విన్నవించారు. గురువారం న్యూఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో రాయచూరు, యాదగిరి, చిక్కమగళూరు జిల్లాల్లో విజ్ఞాన కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. చిక్కమగళూరు జిల్లాలో డిజిటల్ డూమ్ ప్లానిటోరియం ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని మంత్రి తెలిపారు.

మణిపూర్ నిందితులను బంధించండి



ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

రాయచూరు రూరల్: మణిపూర్‌లో మహిళలపై అకృత్యాలకు పాల్పడిన నిందితులను బంధించి కఠినంగా శిక్షించాలని అఖిల భారత క్రైస్తవ మహాసభ, మెథడిస్ట్ కేంద్ర చర్చిలు డిమాండ్ చేశాయి. గురువారం జిల్లాధికారి కార్యాలయం వరకు చేపట్టిన ర్యాలీలో రాయచూరు అధ్యక్షుడు సిమోన్, ఫ్రాంక్లిన్‌లు మాట్లాడారు. ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసి అత్యాచారం చేసిన నిందితులపై మణిపూర్ ప్రభుత్వ నిర్లక్ష్యం చూపడాన్ని ఖండించారు. ఈ విషయంలో కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి మిగిలిన నిందితులను బంధించడంలో సర్కార్ మౌనం వహించిందన్నారు. నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలని, క్రైస్తవులపై ప్రభుత్వం అనుసరిస్తున్న వివక్షతను ఖండిస్తూ స్థానికాధికారి ద్వారా రాష్ట్రపతికి వినతిపత్రం సమర్పించారు. ర్యాలీలో జోసెఫ్, మోసెస్, అనిల్ కుమార్, విజయానంద్‌లున్నారు.

పుట్టింటికి వెళ్తుండగా ఘోరం

- మినీ వ్యాన్–కారు ఢీ, మహిళ మృతి
- భర్త, తమ్మునికి తీవ్ర గాయాలు



ఢీకొన్న కారు టాటా ఏసీఈ వాహనం దృశ్యం



గాయపడిన హనుమంతరాయప్ప

అగళి: మడకశిర పరిధిలోని అగళి వద్ద పి.బ్యాడిగెర, వడగుంటనహళ్లి సమీపంలో ప్రధాన జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం స్విఫ్ట్ కారు, మినీ వ్యాన్ ఢీకొన్నాయి. కారులో ప్రయాణిస్తున్న రాధమ్మ (38) అనే మహిళ మృతి చెందింది. వివరాలు.. అగళి మండల కేంద్రం వైపు నుంచి కారులో మంజునాథ్, హనుమంతరాయప్పతో పాటు రాధమ్మ శిర పట్టణం వైపు వెళుతున్నారు. శిర నుంచి ఎదురుగా వస్తున్న మినీ వ్యాన్ కారును బలంగా ఢీకొట్టింది. కారులో ఇరుక్కొని రాధమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మంజునాథ్, హనుమంతరాయప్పలకు తీవ్ర రక్త గాయాలు తగిలాయి. స్థానికులు చేరుకుని ఇరువురినీ శిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పావగడకు చెందిన హనుమంతరాయప్ప, రాధమ్మ భార్యాభర్తలు, మంజునాథ్ మృతురాలి తమ్ముడు. రాధమ్మ రొళ్ల మండలం రత్నగిరిలోని పుట్టినింటికి వెళ్లి తిరుగు ప్రయాణంలో ఉండగా ప్రమాదం జరిగింది. అగళి ఎస్ఐ లావణ్య సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

కోలారు వార్తలు...

స్కూళ్లు, అంగన్‌వాడీల్లో తనిఖీ



తనిఖీ నిర్వహిస్తున్న జెడ్పీ సీఈఓ పద్మ బసవంతప్ప

శ్రీనివాసపురం: ప్రభుత్వ ఆదేశాల మేరకు తాలూకాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలను పరిశీలిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ పద్మ బసవంతప్ప తెలిపారు. గురువారం తాలూకాలోని నంబిహళ్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యా ప్రగతి, మౌలిక సౌకర్యాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. పాఠశాలలకు అవసరమైన మౌలిక సౌకర్యాల కోసం సీఎస్ఆర్ నిధులను ఉపయోగించుకోవచ్చన్నారు. తాలూకాలో ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది కొరతపై ఉన్నతాధికారులపై చర్చించి కొరత లేకుండా చూస్తానన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయుల కొరతపై జాబితాను సిద్ధంచేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. ప్రస్తుతం ఇతర పాఠశాలల్లో అదనంగా ఉన్న ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తామన్నారు. వచ్చే శనివారం జిల్లాలోని అన్ని జీపీల ఆధ్వర్యంలో స్వచ్ఛత, నైర్మల్య అభియాన్ నిర్వహిస్తామన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమన్నారు. ఈసందర్భంగా టీపీ ఏడీ రామప్ప, నంబిహళ్లి జీపీ పీడీఓ మంజునాథ్‌రెడ్డి, కార్యదర్శి ఈశ్వర్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌పై కొరడా

- హోటళ్లు, దుకాణాల్లో కవర్లు సీజ్
- దుకాణ యజమానులకు జరిమానా



దుకాణాలపై దాడులు చేసిన కమిషనర్

కేజీఎఫ్: నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు చేస్తున్న హోటళ్లు, దుకాణాలపై గురువారం నగరసభ కమిషనర్ దాడులు నిర్వహించి ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు రూ.11 వేల జరిమానా విధించారు. కమిషనర్ పవన్‌కుమార్ అధికారుల బృందంతో కలిసి నగరసభ బస్టాండు, రోడ్డులో ఉన్న దుకాణాలు, హోటళ్లపై దాడులు చేశారు. నందిని హోటల్ వంట గదిలో స్వచ్ఛత లేకపోవడంపై రూ.5 వేల జరిమానా విధించారు. బస్టాండు వద్ద ఉన్న ఓ బేకరీలో స్వచ్ఛత లోపించడంతో బేకరీ యజమానికి జరిమానా వేశారు. మరోసారి ఇలా జరిగితే ట్రేడ్ లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. నగర ప్రజలు బజారుకు వచ్చిన సమయంలో తప్పనిసరిగా బట్ట బ్యాగులను వెంట తేవాలని సూచించారు. కళ్యాణ మంటపాల్లో కూడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ఉపయోగించరాదని అధికారులు ఈసందర్భంగా తెలిపారు.

టెంపో, కారు ఢీ.. డ్రైవర్‌కు గాయాలు



ఘటనాస్థలంలో ప్రమాద దృశ్యం

మాలూరు: టెంపో, కారు ఢీకొన్న ఘటనలో కారు డ్రైవర్ తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. మాలూరు– బెంగళూరు మెయిన్ రోడ్డులో చొక్కండహళ్లి గేట్ వద్ద హొసకోటె నుంచి వస్తున్న గూడ్స్ టెంపో వాహనం కారును ఢీకొనడంతో కారు ముందు భాగం దెబ్బతిని డ్రైవర్ గాయపడ్డాడు. అతనిని మాలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పట్టణ పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించారు.

గాలికి కూలిన వటవృక్షం



ఈదురు గాలికి వటవృక్షం నేలకూలిన దృశ్యం

కేజీఎఫ్: నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న 100 ఏళ్ల వటవృక్షం గాలికి నేలకొరిగింది. అదృష్టవశాత్తు చెట్టు కింద ఎవరూ లేకపోవడం వల్ల పెను ప్రమాదం తప్పింది. ఆస్పత్రి ఆవరణలో ఉండడం వల్ల సాధారణంగా రోగుల సంబంధీకులు తరచుగా చెట్టు కింద విశ్రాంతి తీసుకునేవారు. పలువురు ద్విచక్ర వాహనాలను చెట్టు కింద నిలిపేవారు. అయితే చెట్టు కూలిన సమయంలో ఎలాంటి వాహనం అక్కడ నిలపకపోవడం వల్ల నష్టం కలుగలేదు. చెట్టు కూలిన వెంటనే ఆస్పత్రి సర్జన్ డాక్టర్ సురేష్‌కుమార్ అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. చెట్టు కూలిన స్థలంలో మరికొన్ని మొక్కలను నాటుతామన్నారు.

6న తింథిణిలో మంత్రులకు సన్మానం



మాట్లాడుతున్న రాజశేఖర్

రాయచూరు రూరల్: రాయచూరు, యాదగిరి జిల్లాల్లోని నూతన మంత్రులు, ఎమ్మెల్యేలకు ఈనెల 6న సన్మానం ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ కురుబ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్ వెల్లడించారు. గురువారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లింగసూగూరు తాలూకా తింథిణిలోని కనక గురు పీఠం వద్ద మాజీ ఎంపీ విరుపాక్షప్ప, మఠాధిపతి సిద్దరామానంద స్వామీజీల ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మంత్రులు, ఎమ్మెల్యేలను ప్రత్యేకంగా సన్మానిస్తామన్నారు.

వర్షానికి కూలిన ఇళ్ల పరిశీలన



ఇళ్లను పరిశీలిస్తున్న జిల్లాధికారి దివాకర్

హొసపేటె: విజయనగర జిల్లా హరపనహళ్లి తాలూకా జిగటేరి గ్రామంలో ఇటీవల వర్షానికి దెబ్బ తిన్న ఇళ్లను గురువారం జిల్లాధికారి దివాకర్ పరిశీలించారు. పాక్షికంగా, పూర్తిగా దెబ్బతిన్న ఇళ్ల యజమానులతో చర్చించారు. ప్రభుత్వ నియమానుసారంగా దెబ్బ తిన్న ఇళ్లకు తగిన పరిహారం అందిస్తామన్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దుపై పుస్తకావిష్కరణ

సాక్షి బెంగళూరు: 'ప్రజాబంధు సిద్ధరామయ్య' పేరిట ఒక పుస్తకాన్ని బెంగళూరులో పిఎస్ఆర్ క్లబ్‌లో ఆవిష్కరించారు. సీఎం సిద్ధరామయ్య 76వ పుట్టినరోజు సందర్భంగా ఈ పుస్తకాన్ని ప్రచురించినట్లు పుస్తక రచయిత తిప్పినేని రామదాసప్ప నాయుడు తెలిపారు. సిద్ధరామయ్య జీవితానికి సంబంధించి సమగ్రంగా వివరించారని రచయితను వక్తలు అభినందించారు. సిద్ధరామయ్య పెద్ద కుమారుడు దివంగత రాకేశ్ పేరున రూపొందించిన అవార్డులను పలువురికి ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ బీసీ కమిషన్ సభ్యుడు ఎం.కృష్ణయ్య, ఏపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి, కర్ణాటక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆ నిధులను గ్యారంటీలకు వాడొద్దు

రాయచూరు రూరల్: బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన రూ.11 వేల కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం అమలు పరచిన గ్యారంటీ పథకాలకు వాడరాదని దళిత సంఘర్ష సమితి అధ్యక్షుడు శరణప్ప డిమాండ్ చేశారు. ఆయన గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి మాట్లాడారు. దీన, దళితుల, దేవదాసీల సంక్షేమం కోసం ప్రభుత్వం 2023–24 బడ్జెట్‌లో ఎస్సీలకు రూ.7,750, ఎస్టీలకు కేటాయించిన రూ.3,430 కోట్ల నిధులను గృహలక్ష్మి, జ్యోతి, శక్తి, అన్నభాగ్య పథకాలకు వాడుకోవడాన్ని తప్పుబట్టారు. ఎస్సీ, ఎస్టీ పథకాలకు కేటాయించిన నిధులను వారికే వినియోగించాలన్నారు.

రోటరీతో సమసమాజ నిర్మాణం



మాట్లాడుతున్న సతీష్ మాధవన్

కోలారు: సమ సమాజ నిర్మాణం కోసం రోటరీలో చేరాలని రోటేరియన్ సతీష్ మాధవన్ సూచించారు. గురువారం రోటరీ భవనంలో కోలారు రోటరీ నందిని సంస్థ పదవీ బాధ్యతల స్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మౌలిక సౌకర్యాలు ప్రతి ఒక్కరికీ అందాలన్నారు. ప్రతి ఒక్కరూ సమాజంలో ఉత్తమ జీవితం సాగించాలన్నారు. రోటరీ సభ్యులు మౌలిక సౌకర్యాల కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ సౌకర్యాలను అందించాలన్నారు. అక్కడి ప్రజలను సమాజ ప్రధాన స్రవంతిలోకి తేవాలన్నారు. రోటరీ సంస్థ పదాధికారులు సుధా రవీంద్ర, నటరాజ్, దేవదాసన్, స్కాట్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అవయవదానం చేయండి

కోలారు: ప్రతి ఒక్కరూ తమ జీవితానంతరం అవయవ దానం చేయడం ద్వారా ఇతరుల ప్రాణ రక్షణకు ముందుకు రావాలని డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ జగదీష్ తెలిపారు. గురువారం జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని జిల్లా ఆస్పత్రి సర్కిల్ వద్ద మానవహారాన్ని నిర్మించి మాట్లాడారు. మనిషి మరణం తరువాత సార్థకత చేకూరడానికి అవయవదానం ఎంతో ముఖ్యమన్నారు. తద్వారా మరణించినా తానింకా బతికి ఉండడానికి సాధ్యమన్నారు. ఇదే సమయంలో వ్యాసరచన పోటీల్లో విజేత విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను అందించారు. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు డాక్టర్ నారాయణస్వామి, జిల్లా ఆరోగ్య విద్యాధికారి ఎం.ప్రేమ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనధికార లాటరీ విక్రయాలు అడ్డుకోండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

మండ్య: అనధికార లాటరీ, మట్కా దందాపై ఉక్కుపాదం మోపాలని జిల్లాధికారి డాక్టర్ కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో లాటరీ విక్రయాలు, మట్కా దందా నియంత్రణపై ఫ్లయింగ్ స్క్వాడ్ త్రైమాసిక సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. లాటరీ విక్రయాలు చేసే వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. లాటరీ, మట్కా వంటి కార్యకలాపాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

బోనులో చిక్కిన చిరుత

మైసూరు: ఆహారం వెతుక్కుంటూ వచ్చిన చిరుత బోనులో చిక్కిన ఘటన హుణసూరు తాలూకా గొమ్మటగిరి బీట్ హాళేపుర గ్రామంలో జరిగింది. గ్రామ పరిసరాల్లో చిరుత సంచరిస్తుండటంతో అటవీ అధికారులు హాళేపురకు చెందిన ఓ రైతు పొలంలో బోను ఏర్పాటు చేశారు. ఆహారం కోసం వచ్చిన చిరుత బోనులో చిక్కింది. అటవీ అధికారులు చిరుతను మైసూరు కోర్గళ్లిలోని వన్యప్రాణి సంరక్షణ కేంద్రానికి తరలించారు.

చెరకు రవాణా అడ్డుకోవడం తగదు

మండ్య: తాలూకాలోని రాయసెట్టిపురలో రాజకీయ విద్వేషాల కారణంగా కొందరు దుండగులు రోడ్డును దిగ్బంధనం చేసి చెరకు రవాణాను అడ్డుకుంటున్నారని గ్రామస్తులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు తలపై చెరకు గడలు పెట్టుకుని మండ్య నగరంలోని ఎం. విశ్వేశ్వరయ్య విగ్రహం నుంచి జిల్లాధికారి కార్యాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు.

బాలికపై వీధికుక్క దాడి

మైసూరు: బాలికపై వీధికుక్క దాడి చేసిన ఘటన హుణసూరులో జరిగింది. హుణసూరు షబ్బీర్ నగరకు చెందిన ఇమ్రాన్ షేక్ కుమార్తె ఆలినా (3) ఇంటి వద్ద ఆడుకుంటుండగా కుక్కదాడి చేసింది. బాలిక కేకలు విన్న తల్లిదండ్రులు అక్కడికి చేరుకుని గాయపడిన పాపను ఆస్పత్రికి తరలించారు. తక్షణమే కుక్కను పట్టుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఎండిన టమాటా పంట పరిశీలన



పంటను పరిశీలిస్తున్న అధికారులు

దొడ్డబళ్లాపురం: పంట బాగా రావడానికని ఒక కంపెనీ ఉచితంగా ఇచ్చిన మందు వాడడంతో ఎండిన టమాటా తోటలను హార్టికల్చర్ విభాగం అధికారులు గురువారం పరిశీలించారు. దొడ్డ తాలూకా దొడ్డతుమకూరు గ్రామంలో గిడ్డేగౌడ అనే రైతు ఒక ప్రైవేటు కంపెనీ ప్రతినిధి మాయమాటలు చెప్పి మందులు ఇచ్చాడు. అవి కొట్టడంతో పంట మొత్తం ఎండిపోయిన సంఘటన తెలిసిందే. అధికారులు పంటను పరిశీలించి అధిక మోతాదు కారణంగా ఇలా జరిగిందని అన్నారు. మందు శాంపిల్స్‌ను పరీక్షలకు పంపిస్తామని చెప్పారు.

అవయవ దానం మహోన్నతం

శివాజీనగర: అవయవ దానం మహోన్నతమైదని, దాన్ని మించిన దానం ఏదీ లేదని మంత్రి దినేశ్ గుండూరావ్ అన్నారు. గురువారం అవయవాల దినాచరణ నేపథ్యంలో బెంగళూరులోని సెంట్రల్ కాలేజీ జ్ఞానజ్యోతి సభా మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ... కిడ్నీ, శ్వాసకోశ, లివర్, గుండెతో పాటు ప్రాణాలు కాపాడే అవయవాలకు డిమాండ్ పెరుగుతోంది. ఇటీవల రోజుల్లో అవయవాలు దానం చేసేవారు కూడా అధికంగా ఉన్నారు. ప్రజల్లో దీనిపై మరింత జాగృతి కల్పించాల్సిన అవసరముందన్నారు. ఈ సందర్భంగా అవయవదానం చేసిన 151 కుటుంబాలను దివంగత పునీత్ రాజ్‌కుమార్ భార్య అశ్విని సన్మానించారు. కార్యక్రమంలో జపానంద స్వామి, ఎమ్మెల్యే రిజ్వాన్ హర్షద్, ఆరోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, కమిషనర్ రణదీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై ఎమ్మెల్యే ఫిర్యాదు

బనశంకరి: ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేకు ఆహ్వానం ఇవ్వకుండా ప్రొటోకాల్ ఉల్లంఘనకు పాల్పడ్డారని గురువారం జయనగర ఎమ్మెల్యే సీకే.రామమూర్తి స్పీకర్ యుటీ.ఖాదర్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం విధానసౌధలో స్పీకర్ యుటీ.ఖాదర్‌కు ప్రొటోకాల్‌పై ఫిర్యాదు చేసిన అనంతరం రామమూర్తి మాట్లాడుతూ.. ఆగస్టు 5 తేదీ గృహజ్యోతి ప్రారంభ కార్యక్రమం ఉందని ముఖ్యమంత్రి కార్యక్రమంలో పాల్గొంటారని ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యేల పేర్లు ఆహ్వాన పత్రికలో ఉండాలి. కానీ తన పేరు ఆహ్వానపత్రికలో లేదని, ప్రొటోకాల్ ఉల్లంఘనకు పాల్పడ్డారని ఆరోపించారు.

స్వాతంత్య్ర సౌరభాల హిండలగా

- ఎందరో సమరయోధుల ఖైదు ఇక్కడే
- బెళగావి సెంట్రల్ జైలుకు వంద వసంతాలు

బనశంకరి: జైలు వెనుక గొప్పతనం ఏముంటుంది? అని అనుకుంటే పొరపాటే. దేశం కోసం త్యాగాలు చేసిన ఎందరో గొప్పవారు, అలాగే కరడుగట్టిన నేరగాళ్లు అందరూ అదే జైలు గాలి పీల్చారు. బ్రిటిషుల కాలంలో స్వాతంత్య్ర పోరాటదారులు జైలుజీవితం అనుభవించిన చారిత్రక నేపథ్యం కలిగిన హిండలగా సెంట్రల్‌జైలు వంద వసంతాలు పూర్తిచేసుకుంది. వందేళ్లలో వేలాది మంది ఖైదీలతో కూడి హిండలగా జైలు అనేక చారిత్రక విషయాలకు సాక్షిగా నిలిచింది.

1908లో నిర్మాణం మొదలై..

బెళగావి శివారులోని హిండలగా గ్రామంలో తెల్లదొరల ఆధ్వర్యంలో 1908లో జైలు నిర్మాణ పనులు ప్రారంభమై 1923 జూలైలో పూర్తయ్యాయి. హిండలగా సెంట్రల్‌జైలు పూణే యరవాడ, సొల్లాపుర, అండమాన్ జైళ్ల తరహాలో శత్రు దుర్భేద్యంగా ఉంటుంది.

సమరయోధుల కూడలి

1932 జూన్ నెలలో వరకవి ద.రా.బెంద్రే నరబలి కవిత రచించినందుకు ఆంగ్లేయులు కోపించి హిండలగా జైలులో ఖైదు చేశారు. 1942లో క్విట్ ఇండియా స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొన్న గుల్జారి లాల్ నందా, సర్దార్‌వల్లభాయ్ పటేల్ కుమార్తె మణిబెన్ పటేల్, మృదులాబెన్ సారాభాయి, రవసాహెబ్ పట్వర్ధన్‌లను ఇదే జైలులో ఆంగ్లేయులు నిర్బంధించారు. స్వాతంత్య్రం వచ్చాక వీరు గొప్ప గొప్ప పదవులను అధిష్టించారు. మహాత్మగాంధీ కార్యదర్శిగా ఉన్న మహదేవ దేశాయి, మైలార మహదేవప్పతో పాటు 300 కు పైగా సమరయోధులు హిండలగా జైలులోనే శిక్ష అనుభవించారు.

స్వరాజ్యం వచ్చాక వీర సావర్కర్

వీర సావర్కర్ సైతం హిండలగా జైలులో విచారణ ఖైదీగా 100 రోజులు పాటు నిర్బంధంలో ఉన్నారు. 1950లో అప్పటి పాకిస్తాన్ ప్రధానమంత్రి లియాకత్ అలీఖాన్ భారత పర్యటనను తీవ్రంగా వ్యతిరేకించిన నేపథ్యంలో సావర్కర్‌ను అరెస్ట్‌చేసి హిండలగా జైలు ఉంచారు.

సినిమా షూటింగులు

కన్నడ మించిన ఓట, వీరప్పనాయక, దొడ్డన హుడుగ, హిందినమోహరా, రోస్, ఖతర్నాక్ తదితర అనేక సినిమాలను హిండలగా జైలులో చిత్రీకరించారు.

చార్లెస్ శోభరాజ్ ఖైదు

ప్రపంచస్థాయిలో పేరుమోసిన క్రిమినల్ చార్లెస్ శోభరాజ్, నరహంతకుడు వీరప్పన్ నలుగురు అనుచరులు , దండుపాళ్య ముఠాలోని 12 మంది నేరగాళ్లు, ప్రముఖ నేరగాడు ఉమేశ్‌రెడ్డి, మాఫియా క్రిమినల్ బన్నంజె రాజా, అతని అనుచరులు హిండలగా జైలులో శిక్ష అనుభవించారు.



బెళగావిలోని హిండలగా కేంద్ర కారాగారం



జైలు లోపల కట్టడాలు



దుస్తులు కుడుతున్న ఖైదీలు

39 మందికి ఉరిశిక్ష

1947 నుంచి ఇప్పటి వరకు 39 మంది నేరస్తులకు హిండలగా జైలులో ఉరిశిక్ష విధించారు. 1983లో 5 హత్యకేసుల్లో దోషిగా తేలిన గోకాక్ హనుమప్ప మారిహాళను ఉరితీసిన తరువాత మరో ఉరి చోటుచేసుకోలేదు. 40 ఏళ్ల నుంచి ఉరికంబం ఖాళీగా ఉంది.

100 ఎకరాల విస్తీర్ణంలో

హిండలగా సెంట్రల్‌జైలు మొత్తం విస్తీర్ణం వంద ఎకరాల్లో ఉంది. జైలు కట్టడం 24 ఎకరాల్లో నిర్మించారు. మొత్తం 1,162 మంది ఖైదీలను ఉంచవచ్చు. ప్రస్తుతం 897 మంది పురుషులు 38 మంది మహిళా ఖైదీలతో మొత్తం 935 మంది ఖైదీలు ఉన్నారు. ఇక్కడ ఖైదీలను ఊరికే ఉంచకుండా పలురకాల చేతి వృత్తులను నేర్పిస్తారు. గార్మెంట్స్, వంటలు చేయడం వంటి వృత్తుల్లో శిక్షణనివ్వడం వల్ల వారు బయటకు వచ్చాక ఉపాధి పొందడానికి వీలుంటుంది.

క్రైం సమాచారం

వృద్ధురాలిపై దాడి చేసిన దొంగ అరెస్ట్

మైసూరు: వృద్ధురాలిపై దాడి చేసి ఆమె బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన దొంగను మైసూరు నరసింహరాజ పోలీసులు అరెస్టు చేశారు. మండ్యకు చెందిన దీపక్ అనే వ్యక్తి మైసూరులోని గంగానగరలో బేల్దారి పని చేస్తున్నాడు. అదే లేఔట్‌లో ఉన్న 68 ఏళ్ల వృద్ధురాలిని తాగునీరు అడగ్గా చెంబులో నీరిచ్చింది. దుండగులు నీటిని తాగి అదే చెంబుతో ఆమెను కొట్టి మెడలోని రూ.50 వేల విలువ చేసే 9 గ్రాముల బంగారు చెయిన్, 3.4 గ్రాముల చెవి మాటీలను లాక్కుని పారిపోయాడు. బాధితురాలు ఎన్‌ఆర్ పోలీసు స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేయగా గాలించి నిందితున్ని అరెస్టు చేశారు.

వాహనం పల్టీ.. ఒకరు మృతి



మైసూరు: సరుకు రవాణా వాహనం బోల్తా పడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా 8 మంది గాయపడ్డారు. ఈ ఘటన చామరాజనగర తాలూకా చిక్కకెంపిన హుండి సమీపంలో జరిగింది. మృతుడిని మూడల అగ్రహార గ్రామానికి చెందిన కెంపరాజుగా గుర్తించారు. క్షతగాత్రులు చామరాజనగర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఉగనేద హుండి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఒక ఇంటి పనులు చేసి తిరిగి వస్తుండగా చిక్కకెంపిన హుండి సమీపంలో రోడ్డు మలుపు వద్ద అదుపు తప్పి వాహనం బోల్తా పడింది.

పోలీసులపై దాడి, క్రిమినల్ అరెస్ట్

బనశంకరి: రాత్రి సమయంలో తనిఖీ చేయడానికి వచ్చిన పోలీసులపై కొడవలితో దాడి చేసిన వ్యక్తిని గురువారం చామరాజపేటే పోలీసులు అరెస్ట్ చేశారు. జేజే.నగర ఫారూకీ నగర అఫ్రిద్‌ఖాన్ పోలీసులకు పట్టుబడిన వ్యక్తి. చామరాజపేటే పోలీసులు విజయ్, శివప్రసాద్ బుధవారం రాత్రి గస్తీలో ఉండగా అనంతరామయ్య కంపౌండ్ రెండో క్రాస్‌లో అఫ్రిద్ అనుమానాస్పదంగా తిరుగుతుండగా గమనించి ఆగమని కోరారు. దీంతో కోపోద్రిక్తుడైన అఫ్రిద్‌ఖాన్ పోలీసులను అసభ్యపదజాలంతో దూషించాడు. అనంతరం తన వెంట తెచ్చుకున్న కొడవలితో దాడి చేశాడు. అప్రమత్తమైన కానిస్టేబుల్ విజయ్‌కుమార్ అఫ్రిద్‌ఖాన్‌ను పట్టుకుని హొయ్సళ పోలీసుల సాయంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శివప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మోసగాడు అరెస్ట్

యశవంతపుర: మెడికల్ సీటు ఇప్పిస్తానని నమ్మించి మహిళ నుంచి లక్షల డబ్బులు తీసుకుని మోసం చేసిన కేసులో బెంగళూరు విద్యారణ్యపుర పోలీసులు సయ్యద్ యూనస్ (32) అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. యలహంకలో యూనివర్సల్ ఎడ్యుకేషన్ సంస్థను నడుపుతున్న మారసంద్రకు చెందిన లోకనాయక్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అరెస్ట్ చేశారు. నిందితుడు తనకు కేంద్ర మంత్రులతో పాటు వైద్యవిద్యాశాఖ మంత్రి తెలుసునంటూ రూ. లక్షలు వసూలు చేశాడు. రాజస్థాన్‌లో ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానంటూ నమ్మించి మోసం చేశారు. దీంతో యూనస్‌ను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

ముగ్గురు పెడ్లర్ల పట్టివేత

మంగళూరు సమీపంలో ముగ్గురు పెడ్లర్లను అరెస్ట్ చేసి ఎండిఎంఎ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉళ్లాలకు చెందిన మహమ్మద్ హఫీజ్, సజిపద అమీర్ అలియాస్ అమ్మి, దాసరగుడ్డకు చెందిన జాకీర్ హుసేన్ అలియాస్ తాచీని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.10 లక్షల విలువగల రెండు వందల గ్రాముల ఎండిఎంఎని స్వాధీనం చేసుకున్నారు.

జీపీ సభ్యురాలి కిడ్నాప్‌నకు యత్నం



జీపీ సభ్యురాలు నాగమ్మ (ఫైల్)

యశవంతపుర: గ్రామ పంచాయతీ అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి సినీ ఫక్కీలో జీపీ సభ్యురాలిని కిడ్నాప్‌నకు యత్నించిన ఘటన కలబురిగి జిల్లా సిందగి బి గ్రామంలో జరిగింది. సావళగి గ్రామ పంచాయతీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక శుక్రవారం జరుగనున్నాయి. అధ్యక్ష స్థానానికి రమేశ పోటీ చేస్తున్నారు. రమేశ్‌కు 10 మంది సభ్యుల మద్దతు ఉంది. అయితే మరో ఇద్దరు సభ్యుల మద్దతుకావాలి. సభ్యురాలు నాగమ్మను మద్దతు కావాలని అడగటానికి వెళ్లారు. ఆమె నిరాకరించారు. దీంతో రమేశ్ వర్గం ఒక ప్లాన్ వేసి నాగమ్మను కిడ్నాప్ చేయాలని నిర్ణయించారు. గురువారం ఉదయం పొలం పనులకు వెళ్లగా పోలీసులమంటూ వచ్చారు. స్టేషన్‌కు రావాలని హుకుం జారీ చేశారు. రానని చెప్పడంతో కిడ్నాప్ చేయడానికి యత్నించగా అక్కడే ఉన్న ఆమె కొడుకు మల్లికార్జున అడ్డుకున్నారు. అతడిపై చాకుతో దాడి చేశారు. అనంతరం వారు పారిపోయారు. శివరాజ అనే వ్యక్తి కిడ్నాప్‌నకు యత్నించినట్లు మల్లికార్జున పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మాసిన మువ్వన్నెల జెండా.. స్థానికుల ఆగ్రహం

దొడ్డబళ్లాపురం: దేశంలో త్రివర్ణ పతాకానికి ఎంతో గౌరవం ఉంది. త్రివర్ణ పతాకాన్ని ఎగరవేయాలన్నా, దించాలన్నా కొన్ని నిబంధనలు ఉన్నాయి. అయితే రామనగర పట్టణంలోని నాడ (ప్రభుత్వ) కార్యాలయంపైన ధ్వజస్తంభానికి ఉన్న త్రివర్ణ పతాకం మాసిపోయి రంగులు కనబడకుండా ఉన్నా దాన్ని మార్చకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తాళగుప్ప-హుబ్లీ రైల్వే మార్గం ఆమోదించండి

శివమొగ్గ: శివమొగ్గ లోకసభ నియోజకవర్గానికి సంబంధించిన రైల్వే ప్రాజెక్టులు, బీఎస్ఎన్ఎల్ మొబైల్ టవర్ల ఏర్పాటుపై ఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను స్థానిక ఎంపీ బీవై రాఘవేంద్ర విజ్ఞప్తి చేశారు. తాళగుప్ప-సిద్దాపుర-శిరసి-ముంజగోడ-హుబ్లీ మధ్య 158 కి.మీ. పొడవైన రైల్వే మార్గం ప్రాజెక్టుకు ఇటీవలే సర్వే పూర్తి అయిందని, అయితే ఇప్పటివరకు ఆమోదం లభించలేదని కేంద్ర మంత్రికి ఎంపీ వివరించారు. ఈ ప్రాజెక్టుకు ఆమోదం ఇవ్వడంతో పాటు నిర్ణీత కాల గడువులో పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే శివమొగ్గ-శికారిపుర-రాణిబెన్నూరు రైల్వే మార్గం నిర్మాణం, శివమొగ్గ, భద్రావతి వంటి వివిధ ప్రాంతాల్లో నిర్మిస్తున్న నాలుగు రైల్వే ఫ్లైఓవర్లు, కొటేగంగోరిలో నిర్మాణం అవుతున్న కోచింగ్ డిపో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. మరోవైపు శివమొగ్గ జిల్లాలో మంజూరైన బీఎస్ఎన్ఎల్ మొబైల్ టవర్ల ఏర్పాటును కూడా పరిశీలించాలని కోరారు.

వైద్య కళాశాల ప్రారంభించకపోతే నిరాహార దీక్ష చేస్తా

చిక్కబళ్లాపురం: నగరంలో నిర్మాణంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలను త్వరగా పూర్తి చేసి ప్రారంభించకపోతే తాను కళాశాల ఎదుట నిరాహార దీక్ష చేస్తానని మాజీ మంత్రి, బీజేపీ నేత డాక్టర్ సుధాకర్ హెచ్చరించారు. గురువారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ...జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సుధాకర్, ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ పదవులు చేపట్టి రెండు నెలలు గడుస్తున్నా కళాశాల పురోగతి లేదని, తాను ఎంతో కష్టపడి మెడికల్ కళాశాలను తీసువచ్చానని అన్నారు. త్వరలో ప్రారంభించకపోతే నిరాహార దీక్ష చేస్తానని మాజీ మంత్రి సుధాకర్ అన్నారు.

వాణిజ్య దుకాణాలకు తాళాలు

విజయపుర: పట్టణంలో పురసభ ఆధ్వర్యంలో నడుస్తున్న వాణిజ్య దుకాణాలకు అధికారులు తాళాలు వేశారు. అద్దె చెల్లించని దుకాణాలకు అధికారులు తాళాలు వేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పురసభ పర్యవేక్షకుడు సి.త్యాగరాజ్ మాట్లాడుతూ... పురసభ బహిరంగ వేలంలో పాల్గొని దుకాణాలను సొంతం చేసుకున్న వారు ప్రతి నెల అద్దె చెల్లించాలని, అలాగే ఆ దుకాణాలను వేరే వారికి బదిలీ చేయకూడదని ఆయన తెలిపారు. రెండు నెలల్లో అద్దె బకాయిలు చెల్లించకుంటే సంబంధిత యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టమాటా పంట ధ్వంసం

మైసూరు: పొలంలో సాగు చేసిన రూ. 10 లక్షల విలువైన టామాటా పంటను దుండగులు నాశనం చేసిన ఘటన చామరాజనగర తాలూకా కెబ్బెపుర గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన మంజు అనే వ్యక్తి తన ఎకరన్నర పొలంలో టమాటా సాగు చేశాడు. బుధవారం రాత్రి కొందరు గుర్తు తెలియని దుండగులు టమాటా మొక్కలను పెరికివేశారు. పంట సాగుకు రూ. లక్ష ఖర్చు చేశానని బాధితుడు వాపోయాడు. బేగూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

సందడిగా జీపీ ఎన్నికలు



నగరకెరె జీపీకి ఎంపికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులు



మండిబెలె అధ్యక్ష, ఉపాధ్యక్షులకు సన్మానం

గౌరిబిదనూరు: నగరగెరె జీపీ పరిధిలో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి తన వంతు కృషి చేస్తానని రెండోదళ అధ్యక్షురాలిగా ఎన్నికైన సిద్ధమ్మ అన్నారు. గురువారం జరిగిన అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల్లో బీజేపీ మద్దదారు సిద్ధమ్మకు 9 మంది సభ్యులు మద్దతు తెలపగా ప్రత్యర్థి లక్ష్మమ్మకు 8 మంది మద్దతు ప్రకటించారు. ఇక ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్‌కు 9 మంది సభ్యులు మద్దతు తెలపగా, ప్రత్యర్థి రవీంద్రకు 8 మంది మద్దతు ప్రకటించారు. దీంతో అధ్యక్షురాలిగా సిద్దమ్మ, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి పాండురంగప్ప ప్రకటించారు. పదవీ బాధ్యతల స్వీకారోత్సవంలో పీడీఓ మల్లికార్జున, కార్యదర్శి శ్రీనివాస్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.



గూలూరు అధ్యక్ష, ఉపాధ్యక్షులకు సన్మానం

అధ్యక్షురాలిగా ఏకగ్రీవం

విజయపుర: పట్టణ సమీపంలోని మండిబెలె గ్రామ పంచాయతీ అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు జరిగిన ఎన్నికల్లో సుజాత, శ్రీనాథ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామంలో మౌలిక వసతులు కల్పించడమే ప్రాధాన్యత అని నూతన అధ్యక్షురాలు సుజాత తెలిపారు.

గూళూరు జీపీలో కాంగ్రెస్ మద్దతుదారులదే హవా

బాగేపల్లి: తాలూకాలోని గూళూరు గ్రా.పం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా కాంగ్రెస్ పార్టీ మద్దతుదారు అనురాధ రమేశ్ బాబు, ఎస్‌జీ శంకరనాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గూళూరు గ్రా.పం. కార్యాలయంలో ఎన్నికల అధికారి డాక్టర్ చిన్న కై వారమయ్య సమక్షంలో ఎన్నిక జరిగింది.

ఏకగ్రీవ ఎన్నిక

బాగేపల్లి: తాలూకాలోని కానగమాకలపల్లి గ్రామ పంచాయతీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు లక్ష్మీదేవమ్మ అశ్వత్థప్ప, లక్ష్మీదేవి నారాయణ స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొత్తం 19 మంది సభ్యులున్న గ్రామ పంచాయతీకి వీరిద్దరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

బాలుడి ఆచూకీ లభ్యం

బనశంకరి: నిమ్హాన్స్ ఆసుపత్రికి చికిత్స కోసం తండ్రితో వచ్చిన నెల్లూరు జిల్లా రామాయపట్నం సోలిపేట బీసీ.కాలనీకి చెందిన కవర్తపు వెంకటసాయి ఆచూకీ గురువారం చెన్నపట్టణ సమీపంలోని గ్రామంలో లభించింది. సమాచారం అందిన వెంటనే బెంగళూరు కేజీ.హళ్లికి చెందిన మాల్యాద్రిరెడ్డి, కిషోర్ చెన్నపట్టణ సమీపంలోని గ్రామానికి వెళ్లి బాలుడు వెంకటసాయిని బెంగళూరుకు తీసుకువచ్చి సిద్దాపుర సీఐ హనుమంత కే.భజంత్రికి అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ హనుమంత మాల్యాద్రిరెడ్డి, కిషోర్‌ను అభినందించారు. బాలుడి తండ్రి వెంకటనారాయణకు సమాచారం అందించడంతో గురువారం సాయంత్రం సీఐ హనుమంతను కలిసి కుమారుడి ఆచూకీ లభించడంపై ఆనందం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

హోసూరు వార్తలు..

వాహనం పైనుంచి పడి మృతి

క్రిష్ణగిరి: ద్విచక్ర వాహనంపై వెళ్తూ వ్యక్తి అదుపు తప్పి కిందపడి మృతి చెందిన ఘటన మత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... క్రిష్ణగిరి జిల్లా గొండనూరు ప్రాంతానికి చెందిన మాధు (33) గురువారం ఉదయం ద్విచక్ర వాహనంలో వెళ్తూ అకస్మాత్తుగా అదుపుతప్పి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన మాధును మత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

అధికారులకు కొత్త వాహనాలు



అదనపు కలెక్టర్‌కు కొత్త వాహనాన్ని అందజేస్తున్న కలెక్టర్

హోసూరు: గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా క్రిష్ణగిరి జిల్లా అధికారులకు కేటాయించిన కొత్త వాహనాలను గురువారం జిల్లా కేంద్రం క్రిష్ణగిరిలో కలెక్టర్ శరయు అధికారులకు అందజేశారు. బుధవారం చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా క్రిష్ణగిరి జిల్లాకు ఏడు వాహనాలను కేటాయించారు. గురువారం క్రిష్ణగిరి కలెక్టర్ కార్యాలయానికి చేరుకొన్న ఈ వాహనాలను అదనపు జిల్లా కలెక్టర్ వందన కార్గ్, బీడీవో అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వందనాకార్గ్, అధికారి రాజగోపాల్, బీడీవో అధికారులు పాల్గొన్నారు.

సిగరెట్ కొనివ్వలేదని కిరాతకం

- బాలుడిని ద్విచక్ర వాహనంతో ఢీకొట్టి హత్య

హోసూరు: అడిగిన వెంటనే సిగరెట్ కొనివ్వలేదని ఓ వ్యక్తి బాలుడి ప్రాణం తీసిన ఘటన క్రిష్ణగిరి తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు.. క్రిష్ణగిరి సమీపంలోని పాంచాలియూరు గ్రామానికి చెందిన ఇర్ఫాన్ (14) అదే ప్రాంతంలోని మద్యం షాపు వద్ద బుధవారం రాత్రి నడుచుకుంటూ వెళ్తుండగా అక్కడున్న ఓ మందుబాబు బాలున్ని పిలిచి దుకాణంలో సిగరెట్ కొనిపెట్టాలన్నాడు. అందుకు బాలుడు నిరాకరించాడు. ఆగ్రహంతో బాలుడిపై మందుబాబు తన ద్విచక్ర వాహనంతో ఢీకొట్టి హత్య చేశాడు. విషయం తెలుసుకొన్న బాలుడి బంధువులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన చేపట్టారు. క్రిష్ణగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో శాంతి చర్చలు జరిపారు. ఈ ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది.

అభివృద్ధి పనుల పరిశీలన

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను మేయర్ ఎస్.ఏ సత్య గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్పొరేషన్ పరిధిలోని 43, 44వ వార్డులలో రూ. 4.70 కోట్ల ఖర్చుతో జరుగుతున్న తారురోడ్డు, సిమెంట్ రోడ్డు పనులను కమిషనర్ స్నేహ, ఇంజినీర్ రాజేంద్రన్ నేతృత్వంలో పట్టణంలోని దీపంనగర్, దిన్నూరు, కావేరినగర్, వీఐపీ నగర్, కామరాజ్‌కాలనీ, అభిరామి గార్డెన్, కర్నూరు, పాతమత్తిగిరి తదితర ప్రాంతాల్లో పర్యటించి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించి, వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు, మురికి కాల్వల ఏర్పాటు తదితర మౌలిక వసతులపై ఆరా తీశారు. డెప్యూటీ మేయర్ ఆనందయ్య, కార్పొరేటర్ మంజుల మునిరాజ్, పుష్పాసర్వేష్, కే.జి ప్రకాష్, రవికుమార్, సుమన్, దినేష్, గుణ, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న మేయర్

విశేషంగా ఆడికృత్తిక పూజలు

హోసూరు: తమిళ ఆడిమాస 18వ తేదీ ఆడికృత్తికను రాష్ట్ర వ్యాప్తంగా తమిళులు విశేషంగా జరుపుకోవడం ఆనవాయితీ. అందులో భాగంగా గురువారం ఉదయం నుంచి క్రిష్ణగిరి జిల్లాలోని వివిధ ఆలయల్లో పెద్ద ఎత్తున భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ప్రధానంగా కావేరిపట్టణం వద్ద దక్షిణ పెన్నానదిలో స్నానాలు ఆచరించారు. క్రిష్ణగిరి జిల్లా సరిహద్దు బిలిగుండ్లు వద్ద ప్రవహిస్తున్న కావేరి నదీ తీరంలో, హొగేనకల్లో పెద్ద ఎత్తున భక్తులు స్నానాలు ఆచరించారు. డెంకణీకోట తాలూకా కెలమంగలం సమీపంలోని చిన్నట్టి వద్ద ప్రవహిస్తున్న శనత్‌కుమార్ నదీ తీరంలో వెలసిన బాలమురుగన్ ఆలయంలో ఉదయం నుంచి విశేష పూజలు జరిగాయి. కెలమంగలం చుట్టు పక్కల గ్రామాల నుంచి వందలాది భక్తులు ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



విశేష అలంకరణతో బాలమురుగన్ మూలవిరాట్

చెరువులో ఏనుగుల జలకాలు



దొడ్డబళ్లాపురం: చెన్నపట్టణ తాలూకా మొగేనహళ్లి గ్రామంలోని చెరువులో ఐదు అడవి ఏనుగుల గుంపు తిష్ఠాణా వేసి కదలకుండా ఉండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఏనుగులను పారద్రోలడానికి అటవీశాఖ అధికారులు తంటాలు పడుతున్నారు. సాతనూరు అటవీ ప్రదేశం నుంచి వచ్చిన ఏనుగులు మొగేనహళ్లి చెరువులో బుధవారం రాత్రి నుండి కదలకుండా ఉన్నా యి. అటవీ సిబ్బంది ఏనుగులను తరమడానికి యత్నిస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కిందపడి మృతి

హోసూరు: ట్రాన్స్‌ఫార్మర్‌లో మరమ్మతు పనులు చేస్తూ అకస్మాత్తుగా అదుపుతప్పి కిందపడి ఉద్యోగి మృతి చెందిన ఘటన పోచ్చంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... తిరుపత్తూరు జిల్లా వాణియంబాడి సమీపంలోని పళందూరు గ్రామానికి చెందిన మురుగేషన్. విద్యుత్ శాఖలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. బుధవారం సాయంత్రం పోచ్చంపల్లి సమీపంలోని సంతూర్ కూడలి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో మరమ్మతు పనులు చేస్తూ అదుపు తప్పి కిందపడ్డాడు. స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఫలితంలేక మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

గంజాయి విక్రేతలు అరెస్ట్

బనశంకరి: డ్రగ్స్ విక్రయాలకు పాల్పడుతున్న ఐదుగురు అంతరాష్ట్ర గంజాయి విక్రేతలను గురువారం సిద్దాపుర పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ.24 లక్షల విలువచేసే 59 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. జయనగర ఫస్ట్‌బ్లాక్ ఏబీసీడీ పార్కు వద్ద రోడ్డులో డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం ఆధారంగా గురువారం సిద్దాపుర పోలీసులు దాడిచేసి గంజాయి విక్రేతలను అరెస్ట్ చేశారు.

దసరాను సుత్తూరు స్వామీజీచే ప్రారంభించాలి

మైసూరు: ఈసారి మైసూరు దసరా మహోత్సవాలను సుత్తూరు మఠాధిపతి శ్రీ శివరాత్రి దేశీ కేంద్ర స్వామి చేతుల మీదుగా ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కేఆర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టీఎస్ శ్రీవత్స డిమాండ్ చేశారు. నగరంలో మీడియాతో మాట్లాడుతూ.. సుత్తూరు మహాసంస్థానానికి గొప్ప పేరు ఉందని, అంతర్జాతీయ స్థాయిలో ఈ పీఠం పేరు గడించిందని గుర్తు చేశారు. తమ జిల్లాకు చెందిన శ్రీ శివరాత్రిదేశీ కేంద్ర స్వామి చేతుల మీదుగా మైసూరు దసరా ప్రారంభించాలని ఆయన కోరారు.

క్లుప్తంగా...

చంద్రబాబుకు ప్రాజెక్టులపై మాట్లాడే హక్కు లేదు
మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తిరుమల: చంద్రబాబు నాయుడికి ప్రాజెక్టుల గురించి మాట్లాడే నైతికహక్కు లేదని రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆయన గురువారం ఉదయం తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పరిపాలనలో మరింత శక్తిని ప్రసాదించాలని స్వామిని కోరుకున్నానని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన అమోఘమని కొనియాడారు. విద్యలో ఆంధ్ర మూడో స్థానానికి చేరుకుందని, పేదరికంలో ఆరో స్థానానికి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. చంద్రబాబు ఏనాడు ప్రజలకు మంచి చేయలేదని విమర్శించారు.

ప్రజలకు మేలు చేసినా ఓర్వలేరా.?: మంత్రి సురేష్



యర్రగొండపాలెం: ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలను సైతం ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి ఆదిమూలపు సురేష్ విమర్శించారు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ప్రజల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలన్న ఉద్దేశంతో దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలుచేస్తుంటే దానిని కూడా రాజకీయం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఉన్న 15,004 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు, వలంటీర్లు దిగ్విజయంగా పూర్తి చేశారని, దీనివలన దాదాపు కోటి మందికి పైగా ప్రయోజనం చేకూరిందని తెలిపారు. జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించి ప్రజలకు ఎనలేని సేవలందించిన అన్ని శాఖల అధికారులు, వలంటీర్లు, గృహసారథులకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు.

పొంగూరు ప్రియ ఆరోపణలపై పవన్ స్పందించాలి: పుణ్యశీల



తాడేపల్లి రూరల్: టీడీపీ నేత, మాజీ మంత్రి నారాయణను ఉద్దేశించి ఆయన మరదలు పొంగూరు కృష్ణప్రియ చేసిన ఆరోపణలపై జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఎందుకు స్పందించడం లేదని ఏపీఐడీసీ చైర్‌పర్సన్ బండి పుణ్యశీల రాజ్‌కుమార్ ప్రశ్నించారు. గురువారం తాడేపల్లిలోని ఏపీఐడీసీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. కృష్ణప్రియ తాను పవన్‌కళ్యాణ్ అభిమానినని, తన పరిస్థితి ఇది అని చెబుతున్నా పవన్ ఎందుకు స్పందించడం లేదన్నారు. నారాయణ తన సోదరుడి భార్యకు మతిస్థిమితం లేదనడానికి మనసెలా వచ్చిందన్నారు.

బాబుకు పులివెందులలో పోటీ చేసే సత్తా ఉందా?
ఏపీ బీసీ సంఘం అధ్యక్షుడు మారేష్



సాక్షి, న్యూఢిల్లీ : 14 ఏళ్లపాటు సీఎంగా పనిచేసిన చంద్రబాబుకు పులివెందులలో పోటీ చేసే సత్తా ఉందా... అని ఏపీ బీసీ సంఘం అధ్యక్షుడు మారేష్ ప్రశ్నించారు. సీఎంగా అన్నేళ్లు పనిచేసినా ఏ వర్గానికి ఉపయోగపడని చంద్రబాబు మరోసారి అవకాశం ఇవ్వాలని అడగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గురువారం ఢిల్లీలో మారేష్ మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ వారి ఆర్థిక సుస్థిరతకు కృషిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను విమర్శించడం అర్థరహితమన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తాం
టీడీపీ నాయకుడు లోకేశ్



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన లోకేశ్

సాక్షి, నరసరావుపేట: టీడీపీ అధికారంలోకి రాగానే పెట్టుబడులు తగ్గించి వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తామని ఆ పార్టీ నాయకుడు నారా లోకేశ్ చెప్పారు. లోకేశ్ యువగళం పాదయాత్ర గురువారం ఉదయం వినుకొండ నియోజకవర్గంలోని నగరాయపాలెంలో ప్రారంభమై... మధ్యాహ్నం వనికుంట వద్ద ముగిసింది. వనికుంట గ్రామస్తులతో లోకేశ్ మాట్లాడుతూ వ్యవసాయంపై అవగాహన లేని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర రైతాంగాన్ని అప్పుల్లో ముందువరుసలో నిలిపారన్నారు. తన పాదయాత్ర కొండ్రముట్ల అనే గ్రామం వద్ద 2,300 కిలో మీటర్లకు చేరుకున్న సందర్భంగా వరికపూడిసెల ఎత్తిపోతల పథకం నిర్మిస్తామని హామీ ఇస్తూ లోకేశ్ శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ పథకం ద్వారా 1.30 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించి పల్నాడు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. కాగా, లోకేశ్ పాదయాత్రకు శుక్రవారం విరామం ప్రకటించారు.

ఆపద వేళ.. ఆపన్న హస్తం

ప్రభుత్వ సాయంపై వరద బాధితుల సంతోషం

- ఓడగుట్టపై రుద్రమకోట వాసులకు సకల సౌకర్యాలు
- టీడీపీ హయాంలో ఇక్కట్లను గుర్తు చేసుకున్న బాధితులు



బోటులో బాధితులను ఓడగుట్టకు తరలిస్తున్న ప్రభుత్వ సిబ్బంది



ఓడగుట్టపై రుద్రమకోట గ్రామస్తుల పునరావాస శిబిరం

వేలేరుపాడు: 'ఉన్నట్టుండి గోదావరికి వరద పోటు చేరింది. పెద్దవాగులోకి నీళ్లు ఎగదన్నాయి. దారులన్నీ మూసుకుపోయి రుద్రమకోట ఓ ద్వీపంలా మారిపోయింది. అటు కుక్కునూరు వెళ్లలేని పరిస్థితి. ఇటు వేలేరుపాడు రాలేని దుస్థితి. ఇలాంటి పరిస్థితి వస్తుందని ముందుగానే గుర్తించిన ప్రభుత్వం క్షణాల్లో అధికారులను పంపించింది. వారిచ్చిన సూచనల మేరకు మేమంతా సమీపంలోని ఓడగుట్టపైకి వెళ్లిపోయి తలదాచుకున్నాం. వరదలో మునిగిన పశువుల్ని ప్రభుత్వ అధికారులు, సిబ్బంది బోట్ల సాయంతో ఓడగుట్టపైకి చేర్చారు. తాత్కాలిక గుడారాలు ఏర్పాటు చేసి.. జనరేటర్ల సాయంతో వెలుగులు నింపారు. వరద తగ్గే వరకు ఇక్కడే ఆశ్రయం కల్పించారు. ఆహారం సమకూర్చా'రంటూ రుద్రమకోట గ్రామస్తులు ముక్తకంఠంతో చెబుతున్నారు. వరదల వేళ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ పట్ల ఎంతో ఔదార్యం చూపారని.. ఆపద వేళ ఆపన్న హస్తం అందించి ఆదుకున్నారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం రుద్రమకోట వరద బాధితుల కోసం ఓడగుట్టపై ఏర్పాటు చేసిన పునరావాస శిబిరంలో గ్రామానికి చెందిన 440 కుటుంబాల వారు ఆశ్రయం పొందుతున్నారు.

ఏ లోటూ లేకుండా చూస్తున్నారు

వరదల వల్ల తాము గ్రామం వదిలిపోవాల్సి వచ్చిందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాలతో అధికారులు తమకు అన్ని సౌకర్యాలు కల్పించారని నిర్వాసితులు చెప్పారు. తమ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో ఏ లోటూ లేకుండా చూసుకుంటున్నారని తెలిపారు. గోదావరి గట్టుపైనే తమ గ్రామం ఉన్నందున చిన్నపాటి వరదొచ్చినా వరద తాకిడికి గురవుతుంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో వరదలు వచ్చినప్పుడల్లా ఓడగుట్ట పైకి చేరి నానా అగచాట్లు పడేవారమని, తమను పట్టించుకునే నాథుడు ఉండేవారు కాదని చెప్పారు. ముఖ్యమంత్రి ముందస్తు ఆదేశాల మేరకు ఇక్కడ జనరేటర్లు ఏర్పాటు చేశారని, గ్రామానికి రెండు బోట్లు కేటాయించారని గ్రామస్తులు వివరించారు. గ్రామాన్ని వరద చుట్టుముట్టిన వెంటనే అధికారులు అప్రమత్తమై గ్రామస్తులందరినీ బోట్లలో ఓడగుట్టకు తరలించారని, పశువులను కూడా బోట్లలో ఓడగుట్టకే తరలించారు. అక్కడే తాత్కాలిక గుడారాలను ఏర్పాటు చేసి.. నిత్యావసర వస్తువులన్నీ సమకూర్చారని తెలిపారు.

అప్పట్లో రెండు కేజీల బియ్యం ముఖాన కొట్టేవారు

తెలుగుదేశం హయాంలో గోదావరి వరదలు వచ్చినప్పుడు తాము పడిన బాధలను గ్రామస్తులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. టీడీపీ హయాంలో వరదలు వచ్చినప్పుడు రెండు కిలోల బియ్యం, లీటర్ కిరోసిన్ చొప్పున తమ ముఖాన కొట్టి చేతులు దులుపుకునేవారని చెప్పారు. అవి అయిపోతే తమను పట్టించుకునే నాథుడే ఉండేవాడు కాదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయ వల్ల తాము అన్ని సౌకర్యాలు పొందగలిగామని, ఏ లోటూ లేకపోవడంతో ఓడగుట్టపై ధైర్యంగా గడపగలుగుతున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ తమ గ్రామానికి ఎంతో సాయపడిందన్నారు. సచివాలయంలో పనిచేసే వీఆర్వో, వలంటీర్, పోలీస్, ఏఎన్‌ఎం, పశు వైద్యశాఖ ఏహెచ్‌ఏ తమను కంటికి రెప్పలా చూసుకున్నారన్నారు. నిత్యావసర వస్తువులతోపాటు తాగునీరు, పాలు, ఐదు రోజులకు సరిపడా కూరగాయలు, బ్రెడ్, చిన్న పిల్లలకు బిస్కెట్ ప్యాకెట్లు కూడా ఇచ్చారని వివరించారు. పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సందర్శించి వరద బాధితులకు కల్పించిన సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారని పేర్కొన్నారు.

ఎప్పుడూ ఇంత సాయం అందలేదు



ఏ ప్రభుత్వ హయాంలోనూ ఇంత సాయం అందలేదు. మేం గుట్టకు వెళ్లిన వెంటనే మంచినీటి ప్యాకెట్లు అందించారు. కూరగాయలు ఇచ్చారు. ఏ లోటూ రాకుండా చూశారు.

– కణితిరెడ్డి లక్ష్మీనర్సయ్య, వరద బాధితుడు

పశువుల్ని కూడా కాపాడారు



గోదావరి నీటిలో మునిగిన పశువులను కూడా కాపాడారు. గ్రామంలో ఉన్న వందలాది పశువులను బోట్లలో ఓడగుట్టకు తరలించారు. పశు నష్టం జరగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. సీఎం జగన్‌కు ధన్యవాదాలు

– షేక్ షఫీ, వరద బాధితుడు

అప్పట్లో బియ్యంతో సరిపెట్టారు



టీడీపీ హయాంలో కేవలం రెండు కేజీల బియ్యం మాత్రమే ఇచ్చారు. ఇప్పుడు 25 కేజీల బియ్యంతోపాటు కిలో కందిపప్పు, లీటర్ పామాయిల్, తక్షణ సాయంగా 2వేల నగదు అందజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాకు అన్నీ సమకూర్చారు. విద్యుత్ సౌకర్యం లేక అంధకారంలో మగ్గుతున్న గ్రామస్తులకు జనరేటర్లు ఏర్పాటు చేశారు. ఇలా ఏ ప్రభుత్వంలోనూ జరగలేదు.

– జి.భాస్కర్, రుద్రమకోట గ్రామస్తుడు

ఎమ్మెల్యేలు చిల్లర మనుషులు, పందికొక్కులు

- లెక్కలు రాస్తున్నాం.. వడ్డీతో చెల్లిస్తాం
- అభివృద్ధి అంతా టీడీపీ ప్రభుత్వంలోనే జరిగింది
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు దోచుకోవడం తప్ప అభివృద్ధి చేయలేదు
- అనంతపురం పర్యటనలో చంద్రబాబు వ్యాఖ్యలు
- చంద్రబాబు ముందే కొట్టుకున్న తమ్ముళ్లు



అనంతపురం సభలో బాహాబాహీకి దిగిన ప్రభాకర్‌చౌదరి, కాలువ శ్రీనివాసులు వర్గీయులు

ఆత్మకూరు/పెనుకొండ/కదిరి: 'ఎవరు ఏం చేస్తున్నారో అన్నీ గమనిస్తున్నా. చిత్రగుప్తుడి లెక్కలు రాస్తున్నాం. పోలీసులు అక్రమంగా కేసులు పెడుతున్నారు. మేం అధికారంలోకి వస్తే ఎవ్వర్నీ వదిలిపెట్టం. వడ్డీతో సహా చెల్లిస్తాం' అని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అన్నారు. 'సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి' యాత్రలో భాగంగా గురువారం ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆయన పర్యటించారు. మాజీ మంత్రులు సునీత, పల్లె రఘునాథరెడ్డితో కలిసి ఆత్మకూరు వద్ద ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ పంప్ హౌస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అభివృద్ధి అంతా టీడీపీ ప్రభుత్వంలోనే జరిగిందన్నారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు దోచుకోవడం తప్ప అభివృద్ధి చేయలేదని విమర్శించారు. ఎమ్మెల్యేలను చిల్లర మనుషులు, పందికొక్కులు అంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అక్రమంగా సంపాదిస్తూ అభివృద్ధి విస్మరించారని అన్నారు. అక్కడి నుంచి అనంతపురం చేరుకుని పార్టీ నేతలతో జిల్లాలో పార్టీ పరిస్థితిపై సమీక్షించారు. అక్కడి నుంచి 'కియా' పరిశ్రమ వద్దకు వెళ్లి సెల్ఫీ దిగారు. కియా పరిశ్రమ వద్ద చంద్రబాబు మాట్లాడుతూ... గొల్లపల్లి రిజర్వాయర్ వద్దకు రాలేకపోతున్నానని, మళ్లీ ఒకసారి తప్పకుండా వస్తానన్నారు. అనంతరం సీఎం వైఎస్ జగన్, ఎంపీ గోరంట్ల మాధవ్, ఇతర నాయకులను విమర్శిస్తూ దాదాపు 18 నిమిషాలు ప్రసంగించారు. అమరావతి రాజధానిని ఏర్పాటు చేయడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. తాను గొల్లపల్లి రిజర్వాయర్ పూర్తి చేయడం వల్లే ఇక్కడ 'కియా' పరిశ్రమ ఏర్పాటైందన్నారు. అనంతరం కొడికొండ చెక్‌పోస్టు మీదుగా కదిరికి వెళ్లారు. ఎక్కడా జనం పెద్దగా కన్పించలేదు. వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే డా. పీవీ సిద్ధారెడ్డి జన్మదినం సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను టీడీపీ కార్యకర్తలు చింపేశారు. కదిరిలో చంద్రబాబు మాట్లాడుతూ.. అలసిపోయి సాయంత్రానికి క్వార్టర్ తాగే వారిపై కరుణ లేకుండా సీఎం వైఎస్ జగన్ మద్యం ధరలు పెంచేశారని అన్నారు. చెల్లెలు షర్మిలమ్మకు ఆస్తిలో సగం వాటా జగన్ ఇవ్వాలా? వద్దా... అని ప్రశ్నించారు.

కంగుతిన్న చాంద్‌బాషా

కదిరిలో వచ్చే ఎన్నికల్లో కందికుంట వెంకట ప్రసాద్‌ను గెలిపించాలని చంద్రబాబు చెప్పడంతో అక్కడే ఉన్న ముస్లిం మైనార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా అవాక్కయ్యారు. కందికుంట వర్గం ఈలలు, కేకలు వేస్తుంటే చాంద్ వర్గం చంద్రబాబుపై తిట్లతో ఆగ్రహం వ్యక్తంచేసింది.



బాబు యాత్ర అభాసుపాలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: 'తాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి' అంటూ చంద్రబాబు చేపట్టిన యాత్ర అభాసుపాలైంది. గురువారం అనంతపురం ఎంవైఆర్ ఫంక్షన్ హాలులో టీడీపీ ముఖ్యనేతలు, వైద్యులు, పాత్రికేయులు, న్యాయవాదులు, మేధావులతో నిర్వహించిన సమావేశం రసాభాసగా మారింది. చంద్రబాబు సమక్షంలోనే మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకరచౌదరి, మాజీ మంత్రి కాలువ శ్రీనివాసులు వర్గాలు ఒకరినొకరు తిట్టుకొంటూ తోసుకున్నారు. ఈ తోపులాటలో న్యాయవాది తిరుపతి నాయుడు కిందపడిపోగా, మిగతా వారు లేపబోయారు. కాలువ శ్రీనివాసులు వారిని అడ్డుకొని 'చస్తే చావనీ లే' అని అన్నారు. దీంతో న్యాయవాదులు మనస్తాపం చెందారు. సమావేశానికి పిలిచి అవమానిస్తారా అంటూ అక్కడి నుంచి పలువురు లాయర్లు వెళ్లిపోయారు. ఈ రాద్ధాంతం బయటకు రాకుండా టీడీపీ నేతలు మీడియా ప్రతినిధులను అక్కడి నుంచి పంపేశారు. మీ సేవలు అవసరం లేదని విలేకరులతో టీడీపీ నేత పార్థసారథి కరాఖండిగా చెప్పారు. ఓ సీనియర్ జర్నలిస్టును ఛంద్రదండు ప్రకాష్‌నాయుడు అడ్డుకున్నారు. అడ్డు చెప్పిన మరో విలేకరిని అంతుచూస్తానంటూ బెదిరించారు. సమావేశానికి బందోబస్తుగా వచ్చిన శింగనమల సీఐ అస్రార్‌బాషాపై ప్రకాష్‌నాయుడు చిందులు తొక్కారు. ఇదంతా చూసిన మేధావులు, వైద్యులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

బాబును మించిన నేరస్తుడు రాష్ట్రంలో లేడు

- పులివెందులలో ఇరుకు సందులో బయటి జనాలతో సభ పెట్టారు
- పులివెందులకు, వైఎస్సార్ జిల్లాకు బాబు చేసిన మేలేమిటి?
- రాయలసీమలో హైకోర్టు, ఈ ప్రాంతానికి మేలుపై ఒక్క మాటా చెప్పలేదు
- అమరావతి ఔట్‌డేటెడ్ రాజధాని
- బాబు సింహమే అయితే సింగిల్‌గా 175 స్థానాల్లో పోటీ చేసే దమ్ముందా?
- కుప్పంతో సహా 175 స్థానాలు వైఎస్సార్‌సీపీ గెలవబోతోంది
- ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా

కడప కార్పొరేషన్ : టీడీపీ అధినేత చంద్రబాబును మించిన నేరస్తుడు రాష్ట్రంలోనే లేరని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్‌బాషా చెప్పారు. ఆయన గురువారం కడప మేయర్ సురేష్ బాబుతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాకు వచ్చిన చంద్రబాబు సిగ్గూ ఎగ్గూ లేకుండా మాట్లాడారని చెప్పారు. తాము అడిగిన ప్రశ్నల్లో ఒక్కదానికి కూడా సమాధానం చెప్పలేదన్నారు. ఇరుకుగా ఉన్న పూల అంగళ్ల రోడ్డులో బయటి నుంచి జనాలను తెచ్చి వై నాట్ పులివెందుల అనడం సిగ్గుచేటన్నారు. 14 ఏళ్ల అధికారంలో ఉన్న చంద్రబాబు పులివెందులకు, వైఎస్సార్ జిల్లాకు ఏం మేలు చేశారో చెప్పాలని నిలదీశారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడే వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగిందని, కుటుంబ సభ్యులపైనే నెపం వేసేందుకు ఆయన వ్యవస్థలను మేనేజ్ చేసి, విచారణను పక్కదారి పట్టించారని చెప్పారు.



పిల్లనిచ్చిన మామ ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి ఆయన మరణానికి కారణమయ్యారన్నారు. పింగళి దశరథరామ్, వంగవీటి మోహన రంగా, నారాయణరెడ్డిలను ఆయనే హత్య చేయించారని ఆరోపించారు. అనంతపురంలో వందల మందిని పొట్టనబెట్టుకున్నారన్నారు. అమరావతి ఔట్‌డేటెట్ రాజధాని అని, ఇక్కడికి వచ్చి అమరావతికి జై కొట్టించుకోవడం సిగ్గుచేటని అన్నారు. రాయలసీమలో హైకోర్టు, ఈ ప్రాంతానికి మేలుపై బాబు ఒక్క మాటా చెప్పలేదని విమర్శించారు. చంద్రబాబు కొదమ సింహమే అయితే సింగిల్‌గా 175 స్థానాల్లో పోటీ చేసే దమ్ము, ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో కుప్పంతో సహా 175 స్థానాలూ వైఎస్సార్‌సీపీనే గెలవబోతోందని చెప్పారు.

బాబు శంకుస్థాపనలకే పరిమితం : మేయర్

చంద్రబాబు రాయలసీమ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశారే తప్ప, ఏ ప్రాజెక్టు పనులూ పూర్తి చేయలేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కడప మేయర్ కె.సురేష్ బాబు చెప్పారు. ఆయన వేసిన పునాది రాళ్లు సమాధి రాళ్లుగా మారాయని, ఆనాడు వైఎస్ రాజశేఖరరెడ్డి వీటిపై మొక్కలు నాటిన విషయాన్ని మరచిపోయారా అని అన్నారు. వెలిగల్లుకు బాబు మూడు సార్లు శంకుస్థాపన చేస్తే వైఎస్ ఒకటిన్నర సంవత్సరంలో పూర్తి చేశారన్నారు. జిల్లాలోని అన్ని ప్రాజెక్టుల్లో 67 టీఎంసీల నీరు నిల్వ ఉండటానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్తశుద్ధేనని తెలిపారు. దాని ఫలితంగానే నీటిపారుదల రంగంలో దేశంలోనే వైఎస్సార్ జిల్లా అగ్రస్థానంలో ఉందని చెప్పారు. చిత్రావతి, పైడిపాలెం వైఎస్ మదిలోంచి వచ్చిన ప్రాజెక్టులన్నారు.

ఎలాంటి సింహమో ప్రజలు తేలుస్తారు..

- ఏ ధైర్యంతో బాబు సీమ ప్రాజెక్టుల పర్యటన చేస్తున్నాడు?
- అబద్ధాలతో చంద్రబాబు ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టించుకున్నాడు
- కుప్పాన్ని గుండెల్లో పెట్టుకుని అభివృద్ధి చేస్తున్న సీఎం జగన్
- వివేకా కేసును రాజకీయ కోణంలోకి తీసుకెళ్లారు...
- వారి అంతిమ లక్ష్యం జగన్‌ను ఇబ్బంది పెట్టడమే
- మీడియాతో కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి



పులివెందుల : మనం కొదమ సింహాలమా, వృద్ధ సింహాలమా.. గ్రామ సింహాలమా అనేది ప్రజలు తేలుస్తారని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పులివెందుల పర్యటనలో బుధవారం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు భయస్తుడు కాబట్టే తాను ధైర్యవంతుడిని అని చెప్పుకునేందుకు మాటిమాటికి కొదమ సింహం అని అంటున్నాడని ఎద్దేవా చేశారు. సాగునీటి ప్రాజెక్టులను సందర్శించేందుకు ఆయన ఏ ధైర్యంతో వస్తున్నాడో అర్థంకావడంలేదన్నారు. ఒక అబద్ధాన్ని కళ్లు ఆర్పకుండా చెప్పగలిగే వ్యక్తి చంద్రబాబు అన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. 11వేల క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌వల్ల రాయలసీమతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు సాగునీరు అందించలేమని భావించి దాన్ని 44వేల క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచిన ఘనత మహానేత డాక్టర్ వైఎస్సార్‌దే. దీనిని అడ్డుకునేందుకు అప్పట్లో ధర్నాలు చేయించిన విషయం బాబు మరిచిపోయినా ప్రజలు మర్చిపోలేదు. అలాగే, గండికోట రిజర్వాయర్ సామర్థ్యాన్ని 3 టీఎంసీలకు కుదించిన ఘనుడు చంద్రబాబే. వైఎస్సార్ వచ్చాక 27టీఎంసీలుగా చేశారు. చంద్రబాబు హయాంలో ప్రాజెక్టుల్లో ఎన్నడూ పూర్తిస్థాయి సామర్థ్యంతో నీటిని నింపిన దాఖలాల్లేవు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయ్యాక 27టీఎంసీల పూర్తి సామర్థ్యాన్ని నింపి సీమకు నీళ్లిస్తున్నారు. నిర్వాసితులకు రూ.950కోట్ల పరిహారం ఇవ్వబట్టే ఇది సాధ్యమైంది. అలాగే, చిత్రావతి ప్రాజెక్టు కూడా. తన 14ఏళ్ల పాలనలో ఏనాడూ సీమ ప్రాజెక్టుల గురించి పట్టించుకోని పెద్ద మనిషి చంద్రబాబు.

డ్రిప్‌లో రూ.వెయ్యి కోట్ల బకాయి పెట్టి అబద్ధాలా..

డ్రిప్ ఇరిగేషన్‌కు సంబంధించి చంద్రబాబు హయాంలో ఆయా కంపెనీలకు రూ.1,000 కోట్ల బకాయిలు పెట్టడంతో స్కీం నిర్వీర్యమైపోయింది. జగనన్న సీఎం అయ్యాక వాటిని చెల్లించి గత ఏడాది పునఃప్రారంభించారు. పంటల బీమా విషయంలోనూ చంద్రబాబు ఇచ్చిన దానికంటే రెండు రెట్లకు పైగా జగన్ ప్రభుత్వం అందించింది. వైఎస్సార్ జిల్లాలో 2012కు సంబంధించిన శనగపంట బీమా 2014–19 వరకు పెండింగ్‌లో ఉండేది.. జగనన్న వచ్చాక తొలి ఏడాదిలోనే రూ.112కోట్లు రైతుల ఖాతాల్లో వేశారు.

పైడిపాలెం వైఎస్సార్ బ్రెయిన్ చైల్డ్..

పైడిపాలెం రిజర్వాయర్ వైఎస్సార్ బ్రెయిన్ చైల్డ్. ఆయన హయాంలో 90శాతం పనులు పూర్తయ్యాయి. దానిని కూడా బాబు తన ఖాతాలోనే వేసుకుంటున్నాడు. కడప ఎయిర్‌పోర్ట్ రన్‌వే కోసం రూ.75కోట్లు జగనన్న ప్రభుత్వం చెల్లించింది. ఈరోజు రన్‌వే విస్తరణ జరిగి పెద్ద ఫ్లైట్లు వస్తున్నాయంటే అది జగన్ చలవే. అలాగే, కుప్పాన్ని కూడా గుండెల్లో పెట్టుకున్న వ్యక్తి సీఎం జగన్. ఇక జిల్లాలో ఎన్నో పరిశ్రమలు వచ్చాయి. ఇవేవీ చంద్రబాబుకు కనిపించడంలేదు. మరోవైపు.. తన కుటుంబాన్ని సర్వనాశనం చేయాలని తన సోదరి, చంద్రబాబు, బీజేపీలోని టీడీపీ నేతలు, వ్యవస్థలోని ఒక పెద్ద మనిషి కలిసి రెండున్నరేళ్లుగా పన్నాగం పన్నారు. వారి అంతిమ లక్ష్యం వైఎస్సార్‌సీపీని, జగన్‌ను ఇబ్బంది పెట్టడమే. వివేకా కేసులో వాస్తవాలను పక్కన పడేసి రాజకీయ కోణంలో ముందుకు తీసుకువెళుతున్నారు.

క్షమాపణ చెప్పి మాట్లాడాలి

ఇక తెలుగుగంగ ప్రాజెక్టులో బ్రహ్మం సాగర్‌కు నీరు రావాలంటే కావాల్సిన కాలువ రిపేర్లు చేయాలని అనేకసార్లు విన్నవించినా చంద్రబాబు పట్టించుకోలేదు. జగన్ వచ్చిన తర్వాత ఆ కాలువలన్నీ ఆధునికీకరణ చేసి లైనింగ్ చేయించారు. ముందు ఈ ప్రాంత ప్రజలకు చంద్రబాబు క్షమాపణ చెప్పి మాట్లాడాలి.

రాయలసీమ గురించి మాట్లాడే అర్హత బాబుకు లేదు

- నువ్వు పూర్తిచేసిన ఒక్క ప్రాజెక్టు పేరు చెప్పగలవా?
- సీమ ప్రాంత నీటివాటా దక్కనీయని దుర్మార్గుడు బాబు
- సీమ అభివృద్ధికి పనిచేసింది వైఎస్సార్, జగనన్న
- ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఫైర్



రాయచోటి : రాజకీయాల్లో అనుభవం కన్నా క్రమశిక్షణ, హుందాతనం చాలా ముఖ్యం. చంద్రబాబులో అవి పూర్తిగా లోపించినట్లు స్పష్టంగా కనిపిస్తున్నాయని వైఎస్సార్ జిల్లా రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. తాను అధికారంలో లేననే ఫ్రస్టేషన్ ఆయన మాటల్లోనే స్పష్టమవుతోందని గురువారం సాయంత్రం రాయచోటిలో మీడియాకు చెప్పారు. రాయలసీమలో తిరుగుతూ ఆయన చేస్తున్న మాటలు చాలా విడ్డూరంగా ఉన్నాయన్నారు. శ్రీకాంత్‌రెడ్డి ఇంకా ఏమన్నారంటే.. రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులను నేనే తెచ్చానంటూ బాబు బిల్డప్‌లు ఇవ్వడంపై సమాధానం ఇవ్వాలి. ఇక్కడ ఎన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశావు, ఎన్నింటిని పూర్తిచేసి ప్రారంభోత్సవం చేశావు? ఒక్కదాని పేరైనా చెప్పగలవా? రాయలసీమ ప్రజలు గర్వంగా చెప్పుకునే పోతిరెడ్డిపాడు రిజర్వాయర్‌ను 44 వేల క్యూసెక్కులకు పెంచి ఒకటిన్నర సంవత్సర కాలంలో ఆ పనులు పూర్తిచేసిన మహానేత వైఎస్సార్ రికార్డు సృష్టించారు. కానీ, సీమ ప్రాంత నీటివాటా దక్కనీయకుండా అడ్డుపడుతున్న దుర్మార్గుడు బాబు.

అబద్ధాలాడటంలో బాబు నేర్పరి..

'కన్నార్పకుండా అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబును మించిన నాయకుడు లేడు. 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన విషయాన్ని, మూడుసార్లు అధికారం నుంచి దిగిపోయానన్న సంగతినీ మరచిపోయి మాట్లాడుతున్నారు. మహానేత వైఎస్సార్ రూపకల్పన చేసిన ప్రాజెక్టుల సామర్థ్యం పెంచేందుకు సీఎం జగన్ చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు. ఇక రాయలసీమ ప్రాంత అభివృద్ధి గురించి మాట్లాడే హక్కు చంద్రబాబుకు లేదు. నీచమైన స్వభావమున్న బాబు ఈ రోజు రాయలసీమ ప్రాజెక్టులపై మాట్లాడటం ఆయన సిగ్గుమాలినతనానికి నిదర్శనం. ఇక పోలవరం ప్రాజెక్టుకు అన్ని అనుమతులు తీసుకొస్తుంటే దానికి అడుగడుగునా ఆటంకాలు సృష్టించిన దుర్మార్గుడు ఈ చంద్రబాబు. నిజానికి.. ఆదినుంచి రౌడీయిజం ప్రోత్సహించిన చరిత్ర చంద్రబాబుది. రాయలసీమ ప్రజలంతా ఫ్యాక్షనిస్టులని దుష్ప్రచారం చేసిన నీచుడు. అన్ని విధాలుగా రాయలసీమను నాశనం చేసి ఈ రోజు తగుదునమ్మా అంటూ పులివెందులకొచ్చి మాట్లాడుతున్నావా బాబు? నీ హూంకరింపులు, బెదిరింపులకు ఇక్కడ భయపడేదెవరూ లేరు' అని శ్రీకాంత్‌రెడ్డి అన్నారు.

టీడీపీ హయాంలో ఎంత మంది బీసీలకు మంత్రి పదవులిచ్చారు?

- బీసీల గురించి లోకేశ్ మాట్లాడటం హాస్యాస్పదం
- సీఎం జగన్‌ను విమర్శించే అర్హత ఎమ్మెల్యేగా గెలవలేని లోకేశ్‌కు లేదు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎంత మంది బీసీలకు మంత్రి పదవులిచ్చారు? ఇప్పుడు ఎంత మంది బీసీలు మంత్రులుగా ఉన్నారో.. లోకేశ్ చెప్పాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని డిమాండ్ చేశారు. బీసీల బాగోగులు లోకేశ్‌కు ఇప్పుడే గుర్తుకొచ్చినట్టుందని, లోకేశ్‌కు దమ్ముంటే.. బీసీల కోసం సీఎం జగన్ ఏర్పాటు చేసిన కార్పొరేషన్లను ఎత్తేస్తా అని చెప్పగలడా అంటూ సవాల్ విసిరారు. జగనన్న నలుగురు బీసీలకు ఏకంగా రాజ్యసభ సీట్లు ఇచ్చారని, ఇలా చేయకూడదు అని లోకేశ్ అనగలడా.. అని ప్రశ్నించారు.



ఏకంగా 11 మంది బీసీలను సీఎం జగన్ మంత్రులను చేశారని, ఇది తప్పు.. ఇలా నేను చేయను.. అని లోకేశ్ చెప్పగలడా.. అని ప్రశ్నించారు. చిలకలూరిపేట ఏరియా ఆస్పత్రి ప్రారంభోత్సవం సందర్భంగా గురువారం ఆమె మాట్లాడుతూ లోకేశ్, చంద్రబాబులపై నిప్పులు చెరిగారు.

చంద్రబాబే పెద్ద కటింగ్, ఫిటింగ్ మాస్టర్

చంద్రబాబును మించిన కటింగ్, ఫిటింగ్ మాస్టర్ దేశంలోనే ఎక్కడా లేరని మంత్రి విమర్శించారు. పల్నాడు జిల్లా పాదయాత్రలో భాగంగా లోకేశ్ మాట్లాడిన మాటలు అతడి మానసిక దుస్థితికి అద్దం పడుతున్నాయని ఆమె ఎద్దేవా చేశారు. పదే పదే రెడ్‌బుక్‌లో పేరు నమోదు చేస్తా.. అంటూ అధికారులను, ప్రజలను లోకేశ్ బెదిరిస్తున్నాడని.. వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఓటమికి ఇది కూడా ఓ కారణమవుతుందన్నారు. 151 మంది ఎమ్మెల్యేలను ఒంటిచేత్తో గెలిపించుకుని సీఎం అయిన జగనన్నను కనీసం ఎమ్మెల్యేగా కూడా గెలవలేని లోకేశ్‌కు విమర్శించే అర్హత ఉందా అని ప్రశ్నించారు. లోకేశ్ కటింగ్.. ఫిటింగ్ అంటూ మాట్లాడుతున్నాడని, రైతులకు సంపూర్ణ రుణమాఫీ, డ్వాక్రా రుణమాఫీ అంటూ 2014 ఎన్నికల్లో హామీ ఇచ్చి, దానిని తుంగలో తొక్కిన చరిత్ర చంద్రబాబుదని, అసలైన కటింగ్, ఫిటింగ్ అంటే ఇదేనని మంత్రి ఎద్దేవా చేశారు. పల్నాడులో సున్నపురాయిని దోచుకుతిన్నది టీడీపీ నేతలేనని రజిని మండిపడ్డారు. సున్నపురాయి క్వారీల్లో టీడీపీ నేతలు చేసిన అక్రమ మైనింగ్ ప్రజలకు ఇంకా గుర్తుందన్నారు. వైనాట్ పులివెందుల అంటూ చంద్రబాబు పగటి కలలు కంటున్నారని మంత్రి ధ్వజమెత్తారు. ఆయనకు దమ్ముంటే ముందు తన సొంత నియోజకవర్గం కుప్పంలో ఏ పార్టీతో పొత్తు లేకుండా పోటీ చేయాలని సవాల్ విసిరారు. ఒంటరిగా పోటీ చేసే దమ్ములేని వారు వైనాట్ పులివెందుల అంటూ పెద్ద పెద్ద మాటలు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు.

ఫ్యాషన్









యునిక్ యూత్

డ్రెస్సింగ్‌లో ఎప్పుడూ యునిక్‌గా ఉండాలనే ఆలోచన నేటి యూత్‌ది. వారి అభిరుచికి తగినట్టుగా అందుబాటులోకి వచ్చింది వన్‌సైడ్ లాంగ్ స్టయిల్. టాప్ లేదా కుర్తీ ఒక వైపు పొడవుగా, మరోవైపు పొట్టిగా ఉండటం ఈ స్టయిల్ ప్రత్యేకత.

రెండు రంగులు భిన్నం కావచ్చు. రెండు ఫ్యాబ్రిక్స్ కూడా వేర్వేరువి అయి ఉండవచ్చు. కుర్తా లేదా టాప్ డిజైన్‌లో ప్రత్యేకత కనిపించాలంటే ఓ చిన్న మార్పు తీసుకురావాలి. డిజైనర్స్ చేసిన ఓ చిన్న ఆలోచన యూత్‌ని మరింతగా ఆకట్టుకుంటుంది. వెస్టన్ నుంచి ఇండియన్ వేర్‌లోకి ఈ డిజైన్ కొత్తగా ఆకట్టుకుంటోంది. వెస్టన్ పార్టీలో ప్రత్యేకతను చాటడమే కాదు, స్ట్రీట్ స్టయిల్‌గానూ మార్కులు కొట్టేస్తోంది ఈ డిజైన్.

టిప్స్



ఒక గుడ్డు తెల్ల సొనలో స్పూను తేనె వేసి చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముక్కుమీద, చుట్టూ పూతలా వేసి ఇరవై నిమిషాలు ఆరనివ్వాలి. పూర్తిగా ఆరాక గోరువెచ్చని నీటితో కడిగేయాలి. వారానికి రెండుసార్లు ఈ ప్యాక్ వేసుకోవడం వల్ల బ్లాక్ హెడ్స్ సమస్య తగ్గుముఖం పడుతుంది.



బ్రెడ్ ప్యాకెట్‌లో కొన్ని స్లైసులను మాత్రం వాడి మిగిలిన వాటిని ప్యాకెట్‌లో అలానే ఉంచేస్తుంటాం. అయితే అవి కొన్నిసార్లు రాయిలా గట్టిగా మారతాయి. ఇటువంటప్పుడు బ్రష్‌ను నీటిలో ముంచి స్లైసులపైన రాయాలి. తరువాత కొద్దిగా నీటిని చల్లి, స్లైసులను పదిహేను సెకన్ల పాటు అవెన్‌లో ఉంచితే మెత్తగా తాజాగా మారిపోతాయి.

వర్షంలోనూ క్లియర్ వ్యూ మిర్రర్



వర్షాకాలంలో కారు అద్దాలు తడిసి ఎదురుగా వస్తోన్న వాహనాలు సరిగా కనపడవు. వైప్స్, గుడ్డతో తుడిచినప్పటికీ ఇంకా మసకమసకగానే కనిపిస్తుంది. ఇలా కాకుండా అద్దం క్లియర్‌గా కనిపించాలంటే.. బంగాళ దుంపను రెండు చెక్కలు చేయాలి. ఒక చెక్కను తడిసిన అద్దంపై రుద్దాలి. అద్దం మీద ఉన్న తడి పోయి క్లియర్‌గా ఉంటుంది. మరోసారి వర్షం నీళ్లు పడినా సులభంగా జారిపోయి అద్దం స్పష్టంగా కనిపిస్తుంది.



డ్రైఫ్రూట్స్‌ని మార్కెట్ నుంచి తెచ్చిన తరువాత కొద్దిగా ఉప్పు వేసి దోరగా వేయించి, గాలిచొరబడని డబ్బాలో నిల్వ చేస్తే వర్షాకాలంలోనూ మెత్తబడకుండా, పాడవకుండా కరకరలాడతాయి.

ఒంటరి మహిళ

క్యాబ్‌లో ఏం మాట్లాడుతున్నారు?

క్యాబ్‌లో ఎక్కాక చేతులు ఊరికే ఉండవు. ఫోన్ తీసి కబుర్లు చెప్పమంటాయి. కాని కబుర్లు మరీ పర్సనల్ అయినప్పుడు, అవి విన్న డ్రైవర్‌కు దుర్బుద్ధి పుడితే నరకం అనుభవించాల్సి ఉంటుంది. బెంగళూరులో క్యాబ్ ఎక్కిన మహిళ ఫోన్‌లో చేసిన పర్సనల్ టాక్‌ను విన్న డ్రైవర్ ఆమెను ఏడు నెలలుగా బ్లాక్‌మెయిల్ చేసి 40 లక్షలు గుంజాడు. అనుకోకుండా దొరికాడు. ఇలాంటి ఘటనలు ఎన్ని జరుగుతున్నాయో! ఏం జాగ్రత్తలు తీసుకోవాలి?



స్త్రీలు విధులు, ఉపాధికి బయటకు వెళ్లక తప్పదు. ఇప్పుడున్న ప్రయివేటు రవాణా యాప్‌లను నమ్ముకోకా తప్పదు. ఇలాంటి యాప్‌లలో పని చేసే డ్రయివర్లు నూటికి తొంభై తొమ్మిది మంది తమ బతుకు తెరువు కోసం పని చేస్తున్నా ఒకరిద్దరు ప్రమాదకరంగా మారుతున్నారు. ఇటీవల బెంగళూరులో ఒక మహిళ టూ వీలర్ బుక్ చేసుకుంటే ఆమెను వెనుక కూచోబెట్టుకున్న డ్రైవర్ ఆమె చూసేలా తన శరీరాన్ని తాను తాకుతూ అసభ్యంగా ప్రవర్తిస్తుంటే ఆమె మధ్యలో బైక్ మీద నుంచి దూకేయాల్సి వచ్చింది. ఇప్పుడు వెలికి వచ్చిన మరో ఘటన ఒంటరి స్త్రీలు ఎంత జాగ్రత్తగా క్యాబ్ లేదా టూ వీలర్ వ్యవస్థను ఉపయోగించుకోవాలో తెలుపుతోంది.

అసలేం జరిగింది?

ఇది నవంబర్ 2022లో జరిగింది. బెంగుళూరులో ఒక వివాహిత క్యాబ్ మాట్లాడుకుని ఇంటి నుంచి బయలుదేరింది. క్యాబ్‌లో వెనుక సీట్‌లో కూచుని ఫోన్ తీసి మిత్రుడితో మాట్లాడసాగింది. అప్పటికే డిప్రెషన్‌లో ఉన్న ఆమె తన మిత్రుడితో ఇంటి సమస్యలు చెప్పుకుని, త్వరలో విడాకులు తీసుకుందామనుకుంటున్న ఆలోచన చెప్పి, మిత్రునితో సాన్నిహిత్యపు మాటలు మాట్లాడింది. తను క్యాబ్‌లో ఉన్నానని ఇంకో వ్యక్తి ఆ మాటలు వింటున్నాడని మర్చిపోవడం ఆమె తప్పు. ఈ మాటలన్నీ విన్న క్యాబ్ డ్రైవర్ ఆమెను గమ్యంలో దింపి సోషల్ మీడియా ద్వారా ఆమెనూ ఆమె భర్తనూ గుర్తించాడు. తర్వాత ఆమెకు కాల్ చేసి ఆ రోజు తాను విన్న సంగతంతా భర్తకు చెప్పేస్తానని, మరో పురుషుడితో సన్నిహితంగా వ్యవహరిస్తున్నావని చెప్పేస్తానని బెదిరించాడు. ఆ వివాహిత హడలిపోయింది. దీని పర్యవసానాలు ఎలా ఉంటాయో తెలియక భయపడిపోయింది. దాంతో క్యాబ్ డ్రైవర్ ఆమె నుంచి గత ఏడు నెలలుగా డబ్బు గుంజడం మొదలెట్టాడు. ఆమె తన దగ్గరున్న 20 లక్షల రూపాయలు అతనికి సమర్పించింది. అయినప్పటికీ ఆశ చావక వేధిస్తుండటంతో తల్లిగారి ఇంటికి వెళ్లి తల్లికి చెందిన 20 లక్షల విలువైన నగలు తెచ్చి ఇచ్చింది. పరువు మర్యాదలు ఎలా కాపాడుకోవాలో తెలియక, మరోవైపు ఈ క్యాబ్ డ్రైవర్ పెడుతున్న నరకం నుంచి ఎలా బయటకు రావాలో అర్థం కాక సతమతమైంది. ఇంత జరుగుతున్నా ఆమె ఈ విషయాన్ని భర్తకు కాని, పోలీసులకు కాని తెలిపే ధైర్యం చేయలేదు. అయినప్పటికీ దుర్మార్గుడు దొరికాడు.

ఎలా దొరికాడు?

జూలై 24న బెంగళూరులోని రామ్మూర్తి నగర్‌లో ఒక క్యాబ్ ఆగి అందులో కొందరు పార్టీ చేసుకుంటున్నారని పోలీసులు గమనించారు. రాత్రిపూట అలా క్యాబ్‌లో పార్టీ చేసుకోవడం సరికాదని హెచ్చరించి వెళ్లిపోయారు. అయితే వెళుతూ ఉండగా ఎస్.ఐకి అనుమానం వచ్చింది. క్యాబ్‌లో ఉన్నది డ్రైవర్ స్థాయి మనుషులు. వారు తాగుతున్నది గ్లెన్లివట్ విస్కీ. ఆ బాటిల్ ధర బెంగళూరులో 9,900. అంత ఖరీదైన బాటిల్ ఎక్కడిదని డ్రైవర్‌ని పేరడిగితే 'ప్రవీణ్' అని చెప్పాడు. ఐడి కార్డులో కిరణ్ అని ఉంది. దాంతో పోలీసులకు పూర్తిగా అనుమానం వచ్చింది. ఆ క్యాబ్‌కు డ్రైవర్ అతడే. మిగిలిన వారు స్నేహితులు. కిరణ్‌ను పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి తగు మర్యాదలు చేశాక మొత్తం కక్కాడు. పోలీసులు అవాక్కయ్యి ఆ వివాహితను, ఆమె భర్తను కలిసి విషయం చెప్పారు. అయినప్పటికీ వారు కేసు పెట్టడానికి సంశయిస్తే బాధితుల పేర్లు బయటకు రాకుండా చూస్తామని హామీ ఇచ్చి కేసు పెట్టించారు. వెంటనే కిరణ్‌ని అరెస్ట్ చేశారు. కుదువ పెట్టిన నగలన్నీ బయటకు తెచ్చారు. డబ్బు మాత్రం అతడు బెట్టింగ్‌లో ఖర్చు పెట్టేశాడు.



● పోలీసులకు పట్టుబడ్డ క్యాబ్ డ్రైవర్ కిరణ్

జాగ్రత్త... మాటలు వింటారు

మీ మాటలు, చాటింగ్ ప్రతిదీ అపరిచితుల కంట పడకుండా జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవసరం స్త్రీలకు ఉంది. అపరిచితుల ఎదుట ఫోన్లలో పర్సనల్ విషయాలు మాట్లాడకపోవడం, ఇంట్లో ఒంటరిగా ఉంటుంటే గనక అలాంటి వివరాలు చెప్పకపోవడం, ఏ సమయంలో ఎక్కడ ఉండేది చెప్పకపోవడం చాలా ముఖ్యం. అలాగే ఫోన్ క్యాబ్‌లో వదిలి ఏదైనా కొనడానికి కిందకు దిగకూడదు. పిల్లల స్కూల్ టైమింగ్స్, డ్రాపింగ్ పికప్ వంటి విషయాలు ఫోన్‌లో డ్రైవర్ వినేలా చెప్పకూడదు. డబ్బు విషయాలు కూడా. అలాగే డ్రైవర్‌తో కాలక్షేపం కబుర్లు కూడా మంచివి కావు. ఏ క్యాబ్ డ్రైవర్ అయినా ఏ కొంచెం ఇబ్బంది పెట్టినా వెంటనే పోలీసులకు ఫోన్ చేయాలి. ఎందుకంటే మన వ్యక్తిగత సమస్యలను కుటుంబం అర్థం చేసుకుంటుంది. వాటిని అడ్డు పెట్టి ఎవరూ బ్లాక్‌మెయిల్ చేయకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిదీ... ముఖ్యంగా స్త్రీలది. తస్మాత్ జాగ్రత్త!

వంటిల్లు

చిరుజల్లుల్లో... క్రిస్పీ సిప్స్

చల్లని సాయంకాలం ఓ మాదిరిగా పడుతోన్న వర్షం చినుకులు చూస్తు టీ తాగితే ఆ అనుభూతే వేరు. పొగలు గక్కే టీని సిప్ చేస్తూ క్రిస్పీగా, కారకారంగా ఉండే వేడివేడి స్నాక్స్ మరింత ఆనందాన్ని ఇస్తాయి. పకోడీ, బజ్జీ, సమోసాలు ఎప్పుడూ తినేవే కాబట్టి ఈసారి వంటిల్లు చెబుతోన్న స్నాక్స్‌తో టీని సిప్ చేసి చూడండి.



క్రిస్పీ మసాలా మత్రీ

కావలసినవి: గోధుమ పిండి – రెండు కప్పులు; వాము – అరటీస్పూను; కసూరీ మేథి – రెండు టేబుల్ స్పూన్లు; కారం – అరటేబుల్ స్పూను; గరం మసాలా – అరటేబుల్ స్పూను; కార్న్ స్టార్చ్ – టేబుల్ స్పూను ; నెయ్యి – రెండు టేబుల్ స్పూన్లు; ఉప్పు – రుచికి సరిపడా; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● గోధుమ పిండిలో వాము, కసూరీ మేథి, కారం, గరం మసాలా, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి ● దీనిలో టేబుల్ స్పూను నెయ్యివేసి మరోసారి కలపాలి ● ఇప్పుడు కొద్దికొద్దిగా నీళ్లు పోసుకుంటూ ముద్దలాగ కలపాలి ● మిగిలిన టేబుల్ స్పూను నెయ్యిని కార్న్‌స్టార్చ్‌లో వేసి పేస్టులా కలపాలి ● పిండి ముద్దను మందపాటి గుండ్రని చెక్కల్లా వత్తుకోవాలి. ఈ చెక్కలపైన కార్న్ పేస్టు రాయాలి ● చెక్కలను మీడియం మంటమీద క్రిస్పీగా మారేంత వరకు డీప్‌ఫ్రై చేసుకుంటే మసాలా మత్రీ రెడీ.



సూజీ టోస్ట్

కావలసినవి: బ్రెడ్ స్లైస్‌లు – ఆరు, సూజీ రవ్వ – అరకప్పు; పెరుగు – పావు కప్పు; క్యారట్ తురుము – టేబుల్ స్పూను; ఉల్లిపాయ ముక్కలు – రెండు టేబుల్ స్పూన్లు; టొమాటో తరుగు – టేబుల్ స్పూను; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూను; కారం – టీస్పూను; బటర్ – టోస్టు వేయించడానికి సరిపడా; ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ: ● బ్రెడ్ స్లైలు తప్పించి మిగతా పదార్థాలన్నింటిని గిన్నెలో వేసి కలపాలి ● రుచికి సరిపడా ఉప్పు, కొద్దికొద్దిగా నీళ్లుపోసుకుంటూ చిక్కగా కలపాలి ●కలిపిన మిశ్రమాన్ని బ్రెడ్ స్లైస్‌మీద మందంగా పరుచుకోవాలి ● ఇలా స్లైసులన్నింటికి రాశాక, నాన్‌స్టిక్ పాన్‌పై బటర్ వేసి రెండు వైపులా చక్కగా కాల్చాలి ● టోస్టు బంగారు వర్ణంలో, క్రిస్పీగా మారేంత వరకు కాల్చి తీసేయాలి.



స్టఫ్డ్ బ్రెడ్ పకోడి

కావలసినవి: వైట్ బ్రెడ్‌స్లైసులు – నాలుగు; పన్నీర్ – రెండు స్లైసులు; పుదీనా, కొత్తిమీర చట్నీ – నాలుగు టీస్పూన్లు; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా. **స్టఫింగ్ :** ఉడికించి చిదుముకున్న బంగాళ దుంప – కప్పు ; ఉల్లిపాయ – ఒకటి ; పచ్చిమిర్చి – రెండు; అల్లం వెల్లుల్లి పేస్టు – టీస్పూను; జీలకర్ర పొడి – టీస్పూను; ధనియాల పొడి – టీస్పూను; ఉప్పు – రుచికి సరిపడా; కారం – అరటీస్పూను ; ఆమ్‌చూర్ పొడి – టీస్పూను; చాట్ మసాలా – టీస్పూను; గరం మసాలా –అరటీస్పూను; కొత్తిమీర తరుగు – రెండు టీస్పూన్లు.

బ్యాటర్: శనగపిండి – ఒకటిన్నర కప్పులు; బియ్యప్పిండి – మూడు టేబుల్ స్పూన్లు; వాము – అరటీస్పూను ; ఉప్పు – రుచికి సరిపడా; కారం – అరటీస్పూను ; వంటసోడా – పావు టీస్పూను.

తయారీ: ● ఉల్లిపాయ, పచ్చిమిర్చిని సన్నగా తరిగి పక్కన పెట్టుకోవాలి ● పెద్ద గిన్నెతీసుకుని స్టఫింగ్ కోసం తీసుకున్న పదార్థాలన్నీ వేసి కలిపి పక్కన పెట్టుకోవాలి ● మరో గిన్నెలో బ్యాటర్ కోసం తీసుకున్న పదార్థాలు, తగినన్ని నీళ్లుపోసి పకోడి పిండిలా కలిపి పక్కన పెట్టుకోవాలి ● ఇప్పుడు బ్రెడ్ అంచులను తీసేసి పుదీనా కొత్తిమీర చట్నీని రాయాలి ● దీనిపైన బంగాళ దుంపల స్టఫింగ్ మిశ్రమాన్ని పెట్టాలి ● చివరిగా పన్నీర్ స్లైస్‌ను పెట్టి మరో బ్రెడ్‌స్లైస్‌తో కప్పేసి రెండు ముక్కలుగా కట్ చేయాలి ● ఇప్పుడు బ్యాటర్‌లో బేకింగ్ సోడా వేసి కలపాలి ● శాండ్‌విచ్‌లా స్టఫ్ చేసిన బ్రెడ్ స్లైసులను బ్యాటర్‌లో ముంచి... సలసల మరుగుతోన్న నూనెలో డీప్‌ఫ్రై చేయాలి ● గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారాక తీసేసి చాట్ మసాలా చల్లుకుని సర్వ్ చేసుకోవాలి.



చీజ్ కార్న్ రోల్స్

కావలసినవి: బంగాళ దుంపలు – మూడు; కార్న్ గింజలు – అరకప్పు; చీజ్ – అరకప్పు; వెల్లుల్లి తురుము – టీస్పూను; కార్న్ స్టార్చ్ – టేబుల్ స్పూను; బ్రెడ్ స్లైసులు – నాలుగు; కారం – అరటీస్పూను; గరం మసాలా – పావు టీస్పూను; ఛాట్ మసాలా – అరటీస్పూను; మిరియాల పొడి – అరటీస్పూను; ఉప్పు – రుచికి సరిపడా; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.


తయారీ: ● బంగాళ దుంపలు, కార్న్ గింజలను విడివిడిగా ఉడికించాలి ● బంగాళ దుంపల తొక్క తీసి చిదుముకోవాలి ● దీనిలో కార్న్ గింజలు, వెల్లుల్లి తురుము, కార్న్‌స్టార్చ్, కారం, గరం మసాలా, మిరియాల పొడి, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి ● ఈ మిశ్రమంలో సన్నగా తరిగిన బ్రెడ్‌స్లైసులను వేసి అన్నీ కలిసిపోయేలా కలిపి, చిన్నచిన్న ఉండలు చేసుకోవాలి ●ఈ ఉండలకు వేలితో రంధ్రం చేసి చీజ్‌ను సన్నగా తురిమి పెట్టాలి ●తరువాత రంధ్రాలని మూసేసి రోల్స్ ఆకారంలో వత్తుకోవాలి ● ఇలా అన్ని ఉండలను రోల్స్ చేసి గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు డీప్‌ఫ్రై చేసి, సాస్‌తో సర్వ్ చేసుకోవాలి.



జపనీస్ ఫ్లఫీ పాన్‌కేక్

కావలసినవి: గుడ్లు – రెండు; పాలు – రెండు టేబుల్ స్పూన్లు; వెనీలా ఎసెన్స్ – పావు టీస్పూను; గోధుమ పిండి – పావు కప్పు; వంటసోడా – టీస్పూను; చక్కెర – రెండు టేబుల్ స్పూన్లు; ఉప్పు – చిటికెడు.

తయారీ: ● గుడ్లలోని పచ్చసొనను ఒక గిన్నెలోకి తీసుకుని పాలు, వెనీలా ఎసెన్స్ వేసి ఐదు నిమిషాల పాటు నురగవచ్చేంత వరకు చక్కగా కలపాలి ● ఇప్పుడు దీనిలో గోధుమ పిండి వేసి పేస్టులా కలిపి పక్కన పెట్టాలి ● గుడ్ల తెల్ల సొనలో చిటికెడు ఉప్పు వేసి బాగా కలపాలి. ఒక్కో స్పూను చక్కెర వేస్తూ నురగ వచ్చేంత వరకు కలపాలి ● నురగ వచ్చిన మిశ్రమాన్ని గుడ్ల పచ్చసొన మిశ్రమంలో వేసి కలపాలి ● వేడెక్కిన నాన్‌స్టిక్ పాన్ పై కొద్దిగా నెయ్యిరాసి కేక్‌లా పోసుకోవాలి ● ఈ కేక్ చుట్టూ రెండు మూడు స్పూన్ల నీళ్లుపోసి మూత పెట్టి గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు రెండువైపులా చక్కగా ఉడికిస్తే జపనీస్ ఫ్లఫీ పాన్‌కేక్ రెడీ ● వేడిగా ఉన్నప్పుడే బటర్, మేపిల్ సిరప్‌తో సర్వ్‌చేసుకోవాలి.



● సక్సెస్ స్టోరీ

పరీక్షలు వస్తున్నాయంటే పట్టాలపై పరుగులు తీయాల్సిన రైళ్లు మన గుండెల్లో పరుగెత్తిన రోజులు ఇప్పటికీ గుర్తుంటాయి. తరాలు మారినా పరీక్షల సమయంలో ఒత్తిడి, భయం మారలేదు. పరీక్షల మాట ఎలా ఉన్నా పండగ అంటే బోలెడు సంతోషం వస్తుంది. అందుకే 'పరీక్షలను పండగ చేసుకోండి. సంతోషం మీ దగ్గర ఉంటే సక్సెస్ మీ దగ్గర ఉన్నట్లే' అంటున్నారు మధ్యప్రదేశ్‌కు చెందిన అధర్వ, ప్రణయ్ అనే ఇద్దరు మిత్రులు...

పరీక్షలను పండగ చేశారు

ఎంతోమంది విద్యార్థుల్లాగే అధర్వ, ప్రణయ్‌లకు పరీక్షలకు రెండు,మూడు రోజుల ముందు హడావిడిగా పుస్తకాలు పట్టుకోవడం అలవాటు. లాస్ట్-మినిట్ రివిజన్ వల్ల గందరగోళానికి గురైన రోజులు ఎన్నో ఉన్నాయి.

కట్ చేస్తే....

ఇంజనీరింగ్ చదవడం కోసం ప్రణయ్ ముంబై, అధర్వ చెన్నై వెళ్లారు. ఎవరి దారులు వారివి అయిపోయాయి. చాలారోజుల తరువాత కలుసుకున్నప్పుడు వారి మధ్య 'ఎగ్జామ్స్ సమయంలో స్టూడెంట్స్' అనే బరువైన ప్రస్తావన వచ్చింది.

పరీక్షల సమయంలో విద్యార్థులకు ధైర్యం ఇవ్వడానికి, ఉత్సాహం అందించడానికి తమ వంతుగా ఏదైనా చేయాలని ఆలోచించారు. ఆ ఆలోచనలో నుంచి పుట్టిందే 'పఢ్‌లే' (చదువు కో) అనే యూట్యూబ్ చానల్, వెబ్‌సైట్.

స్టూడెంట్స్‌కు ఉచితంగా అందుబాటులో ఉండే తమ చానల్, వెబ్‌సైట్‌లు ఎడ్యుకేషనల్ మెటీరియల్‌కు స్టోర్‌హౌజ్‌గా ఉండాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు.

పరీక్షల సమయంలో విద్యార్థులకు ఉపయోగపడే నోట్స్, లెక్చర్స్, స్టడీ టిప్స్...ఇలా ఎన్నో అంశాలకు ఈ 'పఢ్‌లే' వేదికగా మారింది. ప్రకటనలు, డొనేషన్‌లు తమకు ప్రధాన ఆదాయ వనరు.

'ఎన్నో రంగాలలో చెప్పుకోదగ్గ మార్పు వచ్చినా విద్యావ్యవస్థలో మాత్రం రావడం లేదు. బోధన అనేది యాంత్రికం అయితే విద్యార్థులకు అయోమయమే మిగులుతుంది. అది వారి భవిష్యత్‌పై ప్రభావం చూపుతుంది. పరీక్షలు అంటే స్టూడెంట్స్ భయపడే రోజులు కాదు, సంతోషంతో గంతులు వేసే రోజులు రావాలి' అంటాడు అధర్వ. ఎంత జటిలమైన విషయాన్ని అయినా పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా చెప్పడానికి ఎన్నో దారులు ఉన్నాయి. కొందరు ఆ దారుల గురించి కనీసం ఆలోచించరు. కొందరు ఆ దారుల గురించి వెదుకుతారు. ఈ కోవకు చెందిన వారే అధర్వ, ప్రణయ్‌లు.

'కాన్సెప్ట్‌లను అర్థం చేయించాలంటే విద్యార్థులకు కంఫర్ట్‌గా ఉన్న భాషలో చెప్పాలి. ఇంటర్నెట్‌లో ప్రతి సబ్జెక్ట్ మీద ఎంతో కంటెంట్ అందుబాటులో ఉంది. అయితే స్టూడెంట్స్ చేతితో రాసుకున్న నోట్స్‌కే ప్రాధాన్యత ఇస్తారు' అంటాడు ప్రణయ్.

8,9,10 తరగతి విద్యార్థులతో పాటు ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం ఇద్దరు మిత్రులు కాన్సెప్ట్‌లకు సంబంధించిన నోట్స్ రాసుకున్నారు. వాటిని స్కానింగ్ చేసి తమ యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారు. దీంతో పాటు ఫన్నీ వీడియోలతో, మీమ్స్‌తో జటిలమైన కాన్సెప్ట్‌లను అర్థం చేయించడం మొదలుపెట్టారు. ఈ ఫార్మట్ సూపర్ సక్సెస్ అయింది.

'పదవ తరగతి చదివే మా అబ్బాయి ఆదిత్య చదువులో వెనకబడ్డాడు. నేను అతడికి అర్థమయ్యేలా పాఠాలు చెప్పాలని నిర్ణయించుకున్నప్పటికీ ఆఫీస్ పనుల వల్ల అది ఎప్పుడూ సాధ్యం కాలేదు. ఆదిత్య తరచుగా పఢ్‌లే చానల్ చూసేవాడు. అక్కడ ఎన్నో నేర్చుకున్నాడు. ఇప్పుడు బాగా చదువుతున్నాడు' అంటున్నాడు ఇండోర్‌కు చెందిన కుమార్ అనే పేరెంట్.

'ఇక చదవడం నా వల్ల కాదు' అనుకున్న సమయంలో మీ యూట్యూబ్ చానల్ చూశాను. నేను జటిలం అనుకున్న ఎన్నో విషయాలు చాలా సులభంగా అర్థమయ్యాయి. ఇప్పుడు నాకు ఎంతో ధైర్యంగా ఉంది' అని ఈ ఇద్దరు మిత్రులను కలిసి చెప్పిన విద్యార్థులు ఎంతో మంది ఉన్నారు.

'పఢ్‌లే'గా మొదలైన తమ యూట్యూబ్ చానల్ ఇప్పుడు 'జస్ట్ పఢ్‌లే'గా మారింది. 1.5 మిలియన్‌ల సబ్‌స్క్రైబర్స్‌తో దూసుకువెళుతోంది.

● ప్రణయ్ ● అధర్వ

● ఇంగ్లిష్ ఇడియమ్స్



ఆన్ యువర్ లాస్ట్ లెగ్స్

ఒక వ్యక్తి జీవితం నుంచి వ్యాపారం, వస్తువుల వరకు చివరి దశలో ఉన్నప్పుడు వాడే మాట ఇది.

ఉదా: మై వోల్డ్ ప్రింటర్ ఈజ్ ఆన్ ఇట్స్ లాస్ట్ లెగ్స్. ఇట్స్ టైమ్ ఐ గాట్ ఏ న్యూ వన్

లేబర్ ఆఫ్ లవ్

కేవలం ఇష్టం వల్ల, ఆహ్లాదం, సంతోషం కోసం ప్రతిఫలాపేక్ష లేకుండా, లాభం ఆశించకుండా చేసే పని.

ఉదా: రన్నింగ్ ది మ్యాగజైన్ టుడే ఈజ్ సమ్‌థింగ్ ఆఫ్ ఏ లేబర్ ఆఫ్ లవ్.

● అవును...ఇది నిజమే!



అమెరికాలోని ఫ్లోరిడా కీస్ జలగర్భంలో జరిగే సంగీత కచేరిలో ప్రతి సంవత్సరం ఎంతోమంది డైవర్స్ పాల్గొంటారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకొని ముఖ్యంగా సముద్రంలోని పగడపు దిబ్బల సంరక్షణను దృష్టిలో పెట్టుకొని జరిగే మ్యూజిక్ ఫెస్టివల్ ఇది. ఈ వినూత్నమైన కచేరిలో పాల్గొనేవారు వాటర్-థీమ్డ్ సాంగ్స్‌ను వింటారు.

టెక్.. టాక్

నూబియ రెడ్ మ్యాజిక్ 8ఎస్ ప్రో



డిస్‌ప్లే: 6.80 అంగుళాలు
రిజల్యూషన్: 1116×2480 పిక్సెల్స్
బరువు: 228 గ్రా. వోఎస్: ఆండ్రాయిడ్ 13
ఫ్రంట్ కెమెరా: 16ఎంపీ
మెమొరీ: 128జీబి 8జీబి ర్యామ్/ 256జీబి 8జీబి ర్యామ్ / 256జీబి 12జీబి ర్యామ్/ 512జీబి 12జీబి ర్యామ్ / 512జీబి 16జీబి ర్యామ్
బ్యాటరీ: 6000 ఎంఏహెచ్
కనెక్టివిటీ: 5జీ

లింక్డ్ ఇన్ కోచ్



లింక్డ్ ఇన్ యూజర్ ప్రొఫైల్ ఇన్ఫర్‌మేషన్ ఆధారంగా రెజ్యూమ్ తయారుచేసే రెజ్యూమ్ బిల్డర్ టూల్‌ను గతంలో తీసుకువచ్చింది. ఈ క్రమంలోనే ఉద్యోగార్థుల కోసం సరికొత్త ఏఐ టూల్‌ను తీసుకురానుంది. 'లింక్డ్ ఇన్ కోచ్' అనే ఈ ఫీచర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేయడంలో, కొత్త స్కిల్స్, కెరీర్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి యూజర్‌లకు సహాయపడుతుంది. ఈ చాట్‌బాట్ ద్వారా ఒక కంపెనీకి సంబంధించిన వర్క్‌కల్చర్‌ని తెలుసుకోవచ్చు. ప్రస్తుతం ఈ ఫీచర్ పరీక్ష దశలో ఉంది.

హానర్ ప్యాడ్ ఎక్స్9




సైజ్: 11.5 అంగుళాలు వోఎస్: ఆండ్రాయిడ్ 13
రిజల్యూషన్: 1200×2000 పిక్సెల్స్
బరువు: 495 గ్రా. ఇంటర్నల్: 128జీబి 4జీబి ర్యామ్
కలర్: స్పేస్ గ్రే ● గ్లాస్ ఫ్రంట్, అల్యూమినియం ఫ్రేమ్, అల్యూమినియం బ్యాక్

ఎల్ఈడీ రింగ్ లైట్



బ్రాండ్: అమెజాన్ బేసిక్స్
కనెక్టివిటీ: యూఎస్‌బి
పర్‌ఫెక్ట్ ఫర్: వీడియో కాలింగ్, వ్లోగింగ్, యూట్యూబ్ వీడియోలు, ఫొటోగ్రఫీ
● మల్టీపుల్ అడ్జెస్ట్‌మెంట్ లెవెల్స్
బరువు: 2కేజీ 70గ్రా.

గూగుల్ అన్‌నోన్ ట్రాకర్ ఫీచర్



గూగుల్ 'అన్‌నోన్ ట్రాకర్ ఎలర్ట్' ఫీచర్‌ని తీసుకువచ్చింది. అన్‌వాంటెడ్ బ్లూటూత్ ట్రాకర్స్ గురించి యూజర్‌లకు తెలియజేసే 'అన్‌వాంటెడ్ బ్లూటూత్ ట్రాకర్స్' ఫీచర్‌పై యాపిల్‌తో కలిసి పని చేస్తున్నట్లు ఈ సంవత్సరం ప్రారంభంలో గూగుల్ ప్రకటించింది. ప్రస్తుతం ఇది యాపిల్ వారి ఎయిర్‌ట్యాగ్‌కు మాత్రమే సపోర్ట్ చేస్తుంది. భవిష్యత్తులో మరిన్ని బ్లూటూత్ ఆధారిత ట్రాకర్స్‌కు దీన్ని విస్తరించే అవకాశం ఉంది.

● మ్యూజిక్ వరల్డ్



తన్మయ గీతం

దిల్లీకి చెందిన తన్మయ భట్నాగర్ సెల్ఫ్-టాట్ సింగర్, సాంగ్ రైటర్, గ్రాఫిక్ డిజైనర్. తన హృదయంలో పుట్టిన సంగీతం ఎన్నో హృదయాలకు దగ్గరవుతుంది. స్వీయ అనుభవాలే ఆమె పాటలకు స్ఫూర్తి, శక్తి...

తన్మయ భట్నాగర్ తండ్రి ఆర్మీలో పనిచేసేవారు. తండ్రి ఉద్యోగరీత్యా తన్మయ రాజస్థాన్, గ్యాంగ్‌టక్, చెన్నై...ఇలా ఎన్నోచోట్ల చదువుకుంది. ఎక్కడికి వెళ్లినా తనతో పాటు పాట వచ్చేది. దీంతో పాటు ఇంటినిండా సంగీతమే. తల్లి గిటార్ వాయించేది. పాటలు రాసేది. మరి ఆ స్ఫూర్తి ఎక్కడికి పోతుంది!

'క్యా తుమ్ నారాజ్ హో!' డెబ్యూ సింగిల్‌తో మ్యూజిక్ వరల్డ్‌లోకి అడుగు పెట్టింది తన్మయ. అన్‌కంఫర్ట్ ఫీలింగ్‌ను పట్టించే పాట ఇది.

తనకు సంగీతంలో స్ఫూర్తి అయిన తల్లి కోసం 'రాత్ అధూరి' అనే పాట రాసింది తన్మయ.

గిటార్, ఉకులేలే ప్లే చేసే తన్మయ ఇంగ్లిష్, హిందీ భాషలలో పాటలు రాస్తుంది. ఆమె ట్యూన్స్ గ్రౌండ్-బ్రేకింగ్ ఫీలింగ్స్ నుంచి పుట్టినవి అంటారు విశ్లేషకులు.

తన్మయకు సంగీతం అంటేనే కాదు కొత్త భాష నేర్చుకోవడం అంటే కూడా ఇష్టం. అలా నేర్చుకున్నదే జర్మన్. జర్మనీ వెళ్లి మరీ నేర్చుకుంది. తన్మయ రిలీజ్ చేసిన తాజా పాట...ఇజ్‌హర్.

ఇంతకీ తన్మయకు సంగీతం ఏం ఇచ్చింది? ఆమె మాటల్లోనే చెప్పాలంటే...

'నేను తప్పనిసరిగా చెప్పాల్సిన విషయాన్ని భయం లేకుండా చెప్పడానికి సంగీతం అనేది ఒక వేదికలా ఉపయోగపడింది'

● గేమింగ్

ఆ చూపుల్లో క్షిపణులు ఉన్నాయి!

యాక్షన్ రోల్-ప్లేయింగ్ వీడియో గేమ్ 'అట్లాస్ ఫాలెన్' ఈ నెల 10న విడుదల కానుంది. గేమ్ ప్రారంభంలో ప్లేయర్స్ తమ సొంత ప్లేయర్ అవతార్‌ని సృష్టించవచ్చు. గంట్లెట్ అనే ప్రాచీన ఆయుధం ప్లేయర్‌కు రక్షణగా ఉపయోగపడుతుంది. ఈ ఆయుధంతో ఎయిర్ డ్యాషింగ్‌లాంటి ఫీట్స్ చేయవచ్చు. రహస్య ప్రదేశాలతో పాటు కొత్త దారులను కనిపెట్టవచ్చు. ఈ ట్రెడిషన్ యాక్షన్ గేమ్‌లో ప్లేయర్స్ మూడు రకాల ఆయుధాలను ఉపయోగించవచ్చు.ప్లేయర్స్ ఎక్స్‌ప్లోర్ చేయడానికి ఈ గేమ్‌లో ఎన్నో బహిరంగ ప్రదేశాలు ఉంటాయి.నాన్-ప్లేబుల్ క్యారెక్టర్స్‌ను కూడా కలవవచ్చు. ఈ గేమ్‌లో టు-ప్లేయర్ కోఆపరేటివ్ మోడ్ కూడా ఉంది.



జానర్స్: యాక్షన్ రోల్-ప్లేయింగ్
మోడ్స్: సింగిల్-ప్లేయర్, మల్టీప్లేయర్
ప్లాట్‌ఫామ్స్: మైక్రోసాఫ్ట్ విండోస్, ప్లేస్టేషన్ 5, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

సినిమా



● రామ్, శ్రీలీల

రామ్, శ్రీలీల జంటగా బోయపాటి శీను దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'స్కంద'. జీ స్టూడియోస్, పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబరు 15న రిలీజ్ కానుంది. గురువారం ఈ సినిమాలోని 'నీ చుట్టు..' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. తమన్ స్వరకల్పనలో రఘురామ్ సాహిత్యం అందించిన ఈ పాటను సిద్ శ్రీరామ్, కె. సంజన పాడారు.

భోళా..లో నా పాత్ర ఓ చిన్న బ్రీజ్

- సుశాంత్



''హీరో, అతిథి, సపోర్టింగ్ రోల్.. ఇలా నచ్చిన పాత్రలన్నీ చేస్తున్నాను. ఏదీ ప్లాన్ చేసింది కాదు. 'అల.. వైకుంఠపురములో' చిత్రంలో నన్ను కొత్తగా చూపించారు. 'రావణాసుర'లోనూ కొత్తగా కనిపించాను. ఇప్పుడు చిరంజీవిగారి 'భోళా శంకర్' సినిమా చేశాను. మెగాస్టార్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను. నేను సోలో హీరోగా చేసినా ఈ సినిమాకు వచ్చినంత హైప్ రాదేమో!'' అన్నారు సుశాంత్. చిరంజీవి హీరోగా మెహర్ రమేష్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'భోళా శంకర్'. ఈ చిత్రంలో చిరంజీవి సరసన తమన్నా నటించగా, ఆయన చెల్లెలి పాత్రలో కీర్తి సురేష్ నటించారు. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో సుశాంత్ మాట్లాడుతూ– ''చిన్నప్పట్నుంచి చిరంజీవిగారి సినిమాలు చూస్తూ, ఆయన అభిమానులుగా పెరిగాం. ఆయన పాటలకు నేను చిన్నతనంలో డ్యాన్స్‌లు కూడా వేశాను. అందుకే 'భోళా శంకర్' చిత్రం గురించి మెహర్ రమేష్‌గారు చెప్పగానే ఎగ్జైటింగ్‌గా అనిపించింది. అలాగే ఈ చిత్రంలో ఓ పాట కూడా ఉందని చెప్పారు. చిరంజీవిగారితో డ్యాన్స్ చేసే చాన్స్ ఎంతమందికి వస్తుంది. మెహర్ గారు ఈ సినిమా కథ చెప్పినప్పుడే చిరంజీవిగారితో డ్యాన్స్ స్టెప్పులు ఉండాలని ఆయన దగ్గర మాట తీసుకున్నాను. చిరంజీవిగారు, తమన్నా, కీర్తీ సురేష్, నేను.. ఇలా మా కాంబినేషన్‌లో ఓ పాట కోసం చాలా ప్రాక్టీస్ చేశాను. తమిళ 'వేదాలం'ని చూడలేదు. అయితే 'భోళా శంకర్' చిత్రంలో నా క్యారెక్టరైజేషన్, నిడివిలో చాలా మార్పులు చేశామని మెహర్‌గారు చెప్పారు. భోళా మానియాలో నా పాత్ర చిన్న బ్రీజ్‌లా వుంటుంది. చిరంజీవిగారు సెట్స్‌లో చాలా సరదాగా ఉంటారు. 'ఇది మీ తాతగారి స్టెప్' అంటూ సెట్స్‌లో ఓ స్టెప్ వేసి చూపించారు (నవ్వుతూ). ఇక నేను సోలో హీరోగా రెండు కథల వర్క్ జరుగుతోంది'' అన్నారు.

ఫీమేల్

క్యారెక్టర్ డిమాండ్‌ని బట్టి గెటప్ మారుతుంది. ఒక్కోసారి మేల్ 'ఫీమేల్'గా మారాల్సి వస్తుంది. ఫీమేల్ 'మేల్'గా మారాల్సి వస్తుంది. అలా క్యారెక్టర్ డిమాండ్ మేరకు ఇద్దరు హిందీ హీరోలు ఫీమేల్ గెటప్‌లోకి మారారు. ఇటు సౌత్‌లో ఇద్దరు హీరోలు లేడీ గెటప్స్‌లోకి మారనున్నారు. ఆ ఫీ'మేల్' విశేషాలు...



● ఆయుష్మాన్



● నవాజుద్దీన్



● కమల్‌హాసన్



● విశ్వక్ సేన్

ఆయుష్‌ఉమన్

''అయ్య బాబోయ్.. స్త్రీ పాత్ర చేయడం అంత ఈజీ కాదండోయ్'' అంటున్నారు ఆయుష్మాన్ ఖురానా. 'డ్రీమ్ గర్ల్ 2'లో తను చేసిన పూజ పాత్ర గురించే ఆయన అలా అన్నారు. 'అంధాధున్'లో అంధుడిగా, 'బాలా'లో బట్టతల ఉన్న యువకుడిగా.. ఇలా వైవిధ్యమైన పాత్రల్లో మెప్పించిన ఆయుష్మాన్ 'డ్రీమ్ గర్ల్ 2' చిత్రంలో కరణ్‌వీర్ అనే యువకుడిగా, పూజ అనే యువతిగా కనిపించనున్నారు. 2019లో ఆయుష్మాన్ హీరోగా నటించిన 'డ్రీమ్ గర్ల్'కి ఇది సీక్వెల్. తొలి భాగాన్ని తెరకెక్కించిన రాజ్ శాండిల్యానే మలి భాగానికి కూడా దర్శకత్వం వహించారు. ఫస్ట్ పార్ట్‌లోనూ పూజ పాత్రలో కనిపించిన ఆయుష్మాన్ సెకండ్ పార్ట్‌లోనూ ఆ పాత్ర చేశారు. ఓ చిన్న పట్టణానికి చెందిన కరణ్ తన తండ్రి చేసిన అప్పులు తీర్చడానికి కష్టాలు పడుతుంటాడు. అతని ప్రేయసి పరీ (అనన్యా పాండే). అయితే ఆమెను పెళ్లాడటానికి పరీ తండ్రి కరణ్‌కి కొన్ని నిబంధనలు పెడతాడు. తన ముందున్న సమస్యలను పరిష్కరించుకోవడానికి పూజాగా మారతాడు కరణ్. ఇలా కష్టాల కరణ్‌గా, నవ్వులు పూయించే పూజాగా ఆయుష్మాన్ నటించిన 'డ్రీమ్ గర్ల్ 2' ఈ నెల 25న విడుదల కానుంది. కాగా.. ''స్త్రీ వేషం చాలా సవాల్‌గా అనిపించింది. ముఖ్యంగా ఎండల్లో విగ్ పెట్టుకుని నటించడం కష్టంగా అనిపించింది. ఈ ఆయుష్'మాన్' చేసిన ఆయుష్'ఉమన్'ని ఇష్టపడతారని ఆశిస్తున్నాను'' అన్నారు ఆయుష్.

అమ్మాయిగా ఆలోచించాలి

''ఫీమేల్ ఆర్టిస్టులు వ్యానిటీ వేన్ నుంచి బయటకు రావడానికి అన్నేసి గంటలు ఎందుకు పడుతుందో నాకిప్పుడు అర్థమైంది. మేల్ ఆర్టిస్ట్‌ల మేకప్‌తో పోల్చితే ఫీమేల్‌కి చాలా ఎక్కువ టైమ్ పడుతుంది. నేను చేసిన స్త్రీ పాత్ర మేకప్‌కి మూడు గంటలు పట్టేది'' అని నవాజుద్దీన్ సిద్దిఖీ అంటున్నారు. 'హడ్డీ' చిత్రంలో తాను చేసిన లేడీ క్యారెక్టర్ గురించే నవాజుద్దీన్ ఈ విధంగా అన్నారు. అక్షయ్ అజయ్ శర్మ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. ఓ చిన్న పట్టణానికి చెందిన హరి అనే యువకుడికి అమ్మాయిగా మారాలనే ఆకాంక్ష ఉంటుంది. లింగ మార్పిడి గురించి ఈ చిత్రంలో చూపించారు. ''అమ్మాయి పాత్ర చేయడానికి అమ్మాయిలా మేకప్ వేసుకుంటే చాలదు.. అమ్మాయిలానే ఆలోచించాలి. నేను అలానే చేశాను'' అంటూ ఈ పాత్రలో తానెంతగా లీనమయ్యారో చెప్పారు నవాజుద్దీన్. ఇదిలా ఉంటే... వెంకటేశ్ నటిస్తున్న తాజా చిత్రం 'సైంధవ్'లో ఆయన విలన్‌గా నటిస్తున్నారు. తెలుగులో నవాజుద్దీన్‌కి ఇది తొలి చిత్రం.

పదిహేనేళ్ల తర్వాత...

వైవిధ్యమైన పాత్రలకు చిరునామా కమల్‌హాసన్. ఫిజికల్లీ చాలెంజ్డ్, చిన్న వయసులో వృద్ధుడిగా, ఎత్తు పళ్ల, వృద్ధురాలిగా.. ఇలా క్యారెక్టర్ డిమాండ్ మేరకు మౌల్డ్ అవుతారు కమల్‌హాసన్. ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో 'ఇండియన్ 2'లో నటిస్తున్నారు. గతంలో ఈ ఇద్దరి కాంబినేషన్‌లోనే వచ్చిన 'ఇండియన్' (1996) చిత్రానికి ఇది సీక్వెల్. ఇందులో కమల్ యువకుడిగా, వృద్ధుడిగా కనిపించనున్నారని తెలిసిందే. కొన్ని సన్నివేశాల్లో స్త్రీగానూ కనిపించనున్నారన్నది తాజా సమాచారం. ఇదే నిజమైతే పదిహేనేళ్ల తర్వాత కమల్ స్త్రీ వేషంలో కనిపించినట్లు అవుతుంది. గతంలో కమల్‌హాసన్ 'భామనే సత్యభామనే' (1996), 'దశావతారం' (2008)లో లేడీ గెటప్‌లో కనిపించిన విషయం గుర్తుండే ఉంటుంది. ఇక 'ఇండియన్ 2' విషయానికి వస్తే.. ఓ సమస్య పరిష్కారానికి కమల్ స్త్రీ వేషంలోకి మారతారని టాక్.

లేడీ గెటప్ పై ఫోకస్

విశ్వక్ సేన్‌లో మంచి నటుడు–దర్శకుడు ఉన్న విషయాన్ని నిరూపించిన చిత్రం 'ఫలక్‌నుమా దాస్'. ఆ తర్వాత 'హిట్', 'పాగల్'... ఇలా హీరోగా ఒకదానికి ఒకటి పోలిక లేని చిత్రాలు చేస్తున్న విశ్వక్ ఆ మధ్య ఓ సినిమా ప్రమోషన్ సమయంలో తాను ఒక సినిమాలో లేడీ గెటప్‌లో కనిపించనున్నట్లు పేర్కొన్నారు. అయితే జస్ట్ కొన్ని సన్నివేశాల్లో అలా కనిపించి మాయం కాకుండా సినిమా సెకండాఫ్ మొత్తం ఆ గెటప్‌లోనే కనిపించనున్నారని సమాచారం. అందుకే ఈ చిత్రానికి 'లీల' అనే టైటిల్ పెట్టాలనుకుంటున్నారని భోగట్టా. ఈ చిత్రం గురించి, ఈ పాత్ర గురించి అధికారిక ప్రకటన అయితే రాలేదు. ప్రస్తుతం విశ్వక్ 'గాంగ్స్ ఆఫ్ గోదావరి', 'గామి'తో పాటు మరికొన్ని చిత్రాలు చేస్తున్నారు. మరి.. వీటిలో ఏదైనా సినిమాలో లేడీ గెటప్ ఉంటుందా? లేక వార్తల్లో ఉన్న ప్రకారం 'లీల' అనే సినిమా ఉంటుందా? అనే క్లారిటీ రావాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.

సినిమాలో స్పార్క్ ఉందనిపిస్తోంది

- మంత్రి జగదీశ్వర్ రెడ్డి

విక్రాంత్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'స్పార్క్ లైఫ్'. మెహరీన్, రుక్సార్ థిల్లాన్ హీరోయిన్లు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ విడుదల కార్యక్రమంలో మంత్రి జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ– ''ఏ సినిమానైనా విమర్శనాత్మక కోణంలో చూసే వ్యక్తిని నేను. 'స్పార్క్' టీజర్ ప్రారంభం చూడగానే నాకు 'శివ' సినిమా గుర్తొచ్చింది. విక్రాంత్‌లో, ఈ సినిమాలో స్పార్క్ ఉందనిపిస్తోంది. ఈ సినిమా కొత్త ట్రెండ్‌ని క్రియేట్ చేయడంతో పాటు విజయం సాధించాలి'' అన్నారు. ''యూఎస్‌లో చదువుకుని, అక్కడే జాబ్ చేసినా సినిమాలపై ప్రేమ పెరిగిందే కానీ తగ్గలేదు. ఆ ప్రేమ తోనే 'స్పార్క్' కథ రెడీ చేసుకున్నాను. నేను ప్రేమతో చేసిన ఈ సినిమాను ప్రేక్షకులు ప్రేమతో హిట్ చేయాలని కోరుకుంటున్నాను'' అన్నారు విక్రాంత్. తుంగతుర్తి ఎమ్మెల్యే కిశోర్, రచయిత అనంత శ్రీరామ్, ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ హేషం అబ్దుల్ వహాబ్ మాట్లాడారు.



● జగదీశ్వర్ రెడ్డి, విక్రాంత్, మెహరీన్, లీలా రెడ్డి, రుక్సార్

విభిన్నం.. వినోదం



● అనన్య

రవితేజ మహదాస్య, అనన్యా నాగళ్ల జంటగా, 'వెన్నెల' కిశోర్ ఓ ప్రధాన పాత్రధారిగా రచయిత మోహన్ దర్శకుడిగా ఓ సినిమాను తెరకెక్కిస్తున్నారు. వెన్నెపూస రమణా రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ''ఓ డిఫరెంట్ స్టోరీతో మంచి ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా షూటింగ్ ఇటీవల ప్రారంభమైంది. ఈ సినిమా ప్రేక్షకులను తప్పక అలరిస్తుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్.

సరికొత్త వూల్ఫ్

ప్రభుదేవా, రాయ్ లక్ష్మీ, అనసూయ భరద్వాజ్ ప్రధాన పాత్రల్లో వినూ వెంకటేష్ దర్శకత్వంలో సందేశ్ నాగరాజు, ఎస్. సందేశ్ నిర్మిస్తున్న చిత్రం 'వూల్ఫ్'. ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''ఈ సినిమా ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. ప్రభుదేవా యాక్షన్ సీక్వెన్స్‌లు, అనసూయ గెటప్ కొత్తగా ఉంటాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.



● 'వూల్ఫ్'లో ఓ దృశ్యం

అందరొక్కటే..

'లోకం లోన ఏ చోటైనా అందరొక్కటే.. ఎవడుకాడూ ఎర్రి బాగులోడూ.. నిజమిదే..' అంటూ మొదలవుతుంది 'బెదురులంక 2012' చిత్రంలోని 'దొంగోడే దొరగాడు' పాట. కార్తికేయ గుమ్మకొండ, నేహా శెట్టి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం ఇది. క్లాక్స్ దర్శకత్వంలో ముప్పానేని రవీంద్ర బెనర్జీ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. ఈ చిత్రంలోని 'దొంగోడే దొరగాడు..' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. సంగీత దర్శకుడు మణిశర్మ స్వరకల్పనలో కిట్టూ విస్సాప్రగడ రాసిన ఈ పాటను సాహితి చాగంటి ఆలపించారు. ''ఓ ఊరి ప్రజలకు దేవుని మీద ఉన్న భక్తిని గమనించిన కొందరు మోసగాళ్లు ఎలా దోచుకుంటారనేది ఈ పాటలో చూపించాం'' అన్నారు క్లాక్స్.



● 'దొంగోడే..' పాటలో ఓ దృశ్యం

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	542	65,241
నిఫ్టీ ▽	145	19,382

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	14,004	▲	30
డోజోన్స్	35,301	▲	18
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,529	▽	32
డాక్స్	15,893	▽	127
షాంఘై	3,280	▲	19
నికాయ్	32,159	▽	548

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	59,310 ▽	306
బంగారం (99.5 స్వచ్ఛత)	59,073 ▽	304
వెండి (కేజీ)	72,197 ▽	2076

జూలైలో సేవలు సూపర్

పదమూడేళ్ల గరిష్ట స్థాయిలో 62.3కు పీఎంఐ సూచీ



న్యూఢిల్లీ: భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో మెజారిటీ వాటా కలిగిన సేవల రంగం జూలైలో అద్భుత పనితీరు కనబరిచింది. ఇందుకు సంబంధించి ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ పదమూడేళ్ల గరిష్ట స్థాయి 62.3కు ఎగసింది. జూన్‌లో సూచీ 58.5 వద్ద ఉంది. అయితే సూచీ 50పైన ఉంటే దానిని వృద్ధి ధోరణిగానే పరిగణిస్తారు. ఆ దిగువకు పడిపోతేనే క్షీణతగా భావిస్తారు. ఈ ప్రాతిపదికన సేవల పీఎంఐ గడచిన 24 నెలలుగా అప్‌ట్రెండ్‌లోనే కొనసాగుతోంది.

సేవలు–తయారీ కలిపినా స్పీడే...

కాగా, సేవలు, తయారీ రంగంతో కూడిన ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా కాంపోజిట్ పీఎంఐ అవుట్‌పుట్ ఇండెక్స్ జూలైలో 61.9కు ఎగసింది. జూన్‌లో ఇది 59.4 వద్ద ఉంది. కాగా, భారత్ మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో దాదాపు 70 శాతం వాటా కలిగిన తయారీ రంగాన్ని చూస్తే, జూలైలో వరుసగా 25వ నెల వృద్ధి బాటన నిలిచింది. జూలైలో సూచీ 57.7 వద్ద పటిష్టంగా ఉంది. అయితే జూన్‌కన్నా (57.8) స్వల్పంగా తగ్గింది.

కంప్యూటర్ల దిగుమతిపై నియంత్రణ

- భద్రతాపరమైన అంశాలే కారణం
- దేశీయంగా ఉత్పత్తిని ప్రోత్సహించే దిశగా కేంద్రం నిర్ణయం
- తక్షణమే అమల్లోకి

న్యూఢిల్లీ: దేశీయంగా తయారీని ప్రోత్సహించేందుకు, భద్రతాపరమైన కారణాల రీత్యా ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్లు అలాగే కొన్ని రకాల కంప్యూటర్ల దిగుమతులపై కేంద్రం గురువారం నియంత్రణలు విధించింది. చైనా, కొరియా వంటి దేశాల నుంచి దిగుమతులను కట్టడి చేసేందుకు ఇవి ఉపయోగపడనున్నాయి. నియంత్రణలు తక్షణమే అమల్లోకి వచ్చినట్లు సీనియర్ ప్రభుత్వాధికారి ఒకరు తెలిపారు. ఇకపై ఈ ఉత్పత్తులను దిగుమతి చేసుకునేందుకు దిగుమతిదారులు ప్రభుత్వం నుంచి అనుమతి, లైసెన్సులు తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నియంత్రణల విధింపునకు పలు కారణాలు ఉన్నప్పటికీ పౌరుల భద్రతను పరిరక్షించడం అన్నింటికన్నా ప్రధానమైనదని ఆయన వివరించారు. ఆంక్షలు విధించడమనేది దిగుమతులను పూర్తిగా నిషేధించే ఉద్దేశంతో తీసుకున్నది కాదని, వాటిని నియంత్రించడం మాత్రమే లక్ష్యమని చెప్పారు. దీనివల్ల దేశీయంగా ధరలేమీ పెరగబోవని తెలిపారు.



కొన్ని మినహాయింపులు ఉంటాయి..

'ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్లు, ఆల్–ఇన్–వన్ పర్సనల్ కంప్యూటర్లు, అల్ట్రా చిన్న స్థాయి కంప్యూటర్లు, సర్వర్ల దిగుమతులపై తక్షణమే నియంత్రణలు అమల్లోకి వస్తాయి' అని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) ఒక నోటిఫికేషన్‌లో తెలిపింది. అయితే, కొన్ని సందర్భాల్లో మినహాయింపులు ఉంటాయని పేర్కొంది. ఆగస్టు 3 కన్నా ముందుగానే లెటర్ ఆఫ్ క్రెడిట్ జారీ చేసిన కన్సైన్‌మెంట్లను దిగుమతి చేసుకోవచ్చని వివరించింది. ఆగస్టు 4 నుంచి దిగుమతిదారు లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. అలాగే ఆర్‌అండ్‌డీ, టెస్టింగ్, రిపేర్ అండ్ రిటర్న్ తదితర అవసరాల కోసం కన్సైన్‌మెంట్‌కు 20 ఐటమ్‌ల వరకు దిగుమతి చేసుకునేందుకు లైసెన్సు తీసుకోనక్కర్లేదని వివరించింది. ఈ–కామర్స్ పోర్టల్స్ ద్వారా కొనుగోలు చేసే ఒక ల్యాప్‌టాప్, ట్యాబ్లెట్, పీసీ, లేదా అల్ట్రా స్మాల్ ఫారం ఫ్యాక్టర్ కంప్యూటర్లకు కూడా మినహాయింపులు వర్తిస్తాయి. అయితే, వాటికి వర్తించే సుంకాలను చెల్లించాల్సి ఉంటుంది. దిగుమతులపై ఆంక్షల వల్ల దేశీయంగా ఆయా ఉత్పత్తుల రేట్లు పెరిగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడ్డాయి.

బిలియన్ డాలర్ల కొద్దీ దిగుమతులు..

2022–23లో భారత్ 5.33 బిలియన్ డాలర్ల విలువ చేసే పర్సనల్ కంప్యూటర్లు .. ల్యాప్‌టాప్‌లను, 553 మిలియన్ డాలర్ల విలువ చేసే ప్రత్యేక డేటా ప్రాసెసింగ్ మెషీన్లను దిగుమతి చేసుకుంది. భారత్‌లో ఎక్కువగా హెచ్‌సీఎల్, డెల్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్, లెనొవొ, యాపిల్, హెచ్‌పీ, శాంసంగ్ తదితర ఎలక్ట్రానిక్ దిగ్గజాల ఉత్పత్తులు అమ్ముడవుతున్నాయి. భారత్ ఈ తరహా ఉత్పత్తులను ఏటా 7–8 బిలియన్ డాలర్ల మేర దిగుమతి చేసుకుంటోంది. గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్‌ఐ) నివేదిక ప్రకారం భారత్ చైనా నుంచి దిగుమతి చేసుకునే వాటిల్లో 65 శాతం వాటా ఎలక్ట్రానిక్స్, యంత్రాలు, ఆర్గానిక్ రసాయనాలు ఉంటున్నాయి. రోజువారీ ఉపయోగించే మొబైల్ ఫోన్స్, ల్యాప్‌టాప్‌లు, సోలార్ సెల్ మాడ్యూల్స్ మొదలైన వాటి కోసం ఎక్కువగా చైనాపైనే ఆధారపడాల్సి ఉంటోంది. దీన్ని తగ్గించుకునే దిశగా దేశీయంగా ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు కేంద్రం పలు చర్యలు తీసుకుంటోంది.

అంబుజా చేతికి సంఘీ సిమెంట్స్

- 56.74 శాతం వాటా కొనుగోలు
- మరో 26% వాటాకు ఓపెన్ ఆఫర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గౌతమ్ అదానీ గ్రూప్ కంపెనీ అయిన అంబుజా సిమెంట్స్ తాజాగా హైదరాబాద్‌కు చెందిన సంఘీ ఇండస్ట్రీస్‌లో 56.74 శాతం వాటా కొనుగోలు చేసింది. సంఘీ ప్రమోటర్లు అయిన రవి సంఘీ, కుటుంబం నుంచి ఈ వాటా దక్కించుకుంది. ఇందుకోసం అంబుజా సిమెంట్స్ రూ.1,674 కోట్లు వెచ్చిస్తోంది. మరో 26 శాతం వాటా కోసం అంబుజా సిమెంట్ ఓపెన్ ఆఫర్ ప్రకటించనుంది. 6.71 కోట్ల ఈక్విటీ షేర్లకుగాను 13.8 శాతం ప్రీమియంతో ఒక్కొక్కటి రూ.114.22 చొప్పున రూ.767 కోట్లను ఖర్చు చేయనుంది. ఓపెన్ ఆఫర్ పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయితే సంఘీ ఇండస్ట్రీస్‌లో అంబుజా సిమెంట్స్‌కు 82.74 శాతం వాటా దక్కుతుంది. ఈ డీల్‌లో భాగంగా సంఘీ ఇండస్ట్రీస్‌ను రూ.5,000 కోట్లుగా విలువ కట్టారు. 3–4 నెలల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తి అయ్యే అవకాశం ఉంది. సంఘీ ఇండస్ట్రీస్ కొనుగోలుతో అంబుజా సిమెంట్స్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 7.36 కోట్ల టన్నులకు చేరనుంది.

ఉత్పత్తి సామర్థ్యం పెంపు..

సంఘీ సిమెంట్స్‌కు గుజరాత్‌లోని కచ్ వద్ద ఉన్న సంఘీపురంలో 61 లక్షల మెట్రిక్ టన్నుల వార్షిక తయారీ సామర్థ్యం గల సిమెంట్ ప్లాంటుతోపాటు 66 లక్షల మెట్రిక్ టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో క్లింకర్ ప్లాంట్ ఉంది. 'సంఘీ ఇండస్ట్రీస్‌తో చేతులు కలపడం ద్వారా అంబుజా తన మార్కెట్ ఉనికిని విస్తరించడానికి, ఉత్పత్తి పోర్ట్‌ఫోలియోను బలోపేతం చేయడానికి.. నిర్మాణ సామగ్రి రంగంలో అగ్రగామిగా తన స్థానాన్ని బలోపేతం చేయడానికి సిద్ధంగా ఉంది. సంఘీ ఇండస్ట్రీస్‌కు ఉన్న 100 కోట్ల టన్నుల సున్నపురాయి నిల్వలతో అంబుజా సిమెంట్స్ వచ్చే రెండేళ్లలో సంఘీపురంలో సిమెంట్ సామర్థ్యాన్ని 1.5 కోట్ల టన్నులకు చేర్చనుంది. అదానీ గ్రూప్ 2028 నాటికి 14 కోట్ల మెట్రిక్ టన్నుల సిమెంట్ తయారీ సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యంతో ఉంది' అని అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ ఈ సందర్భంగా తెలిపారు.



ఒప్పంద కార్యక్రమంలో రవి సంఘీ, గౌతమ్ అదానీ

పెద్ద నౌకలకు వీలుగా..

8,000 డెడ్ వెయిట్ టన్నేజ్ సామర్థ్యం గల పెద్ద నౌకలు వచ్చేందుకు వీలుగా అక్కడే ఉన్న పోర్టును విస్తరించడానికి పెట్టుబడి చేయనున్నట్టు అదానీ పోర్ట్స్, స్పెషల్ ఎకనమిక్ జోన్ సీఈవో కరణ్ అదానీ వెల్లడించారు. దేశంలో అతి తక్కువ ఖర్చుతో క్లింకర్‌ను ఉత్పత్తి చేసే ప్లాంటుగా సంఘీ ఇండస్ట్రీస్‌ను తీర్చిదిద్దాలన్నది లక్ష్యమని చెప్పారు.

గురువారం అంబుజా షేరు ధర 2.87% పెరిగి రూ.474.20 వద్ద, సంఘీ ఇండస్ట్రీస్ షేరు ధర 4.99% ఎగసి రూ.105.76 వద్ద స్థిరపడింది.

విస్తరణ బాటలో ఇరస్వ ఫైన్ జ్యువెలరీ



హైదరాబాద్: ఇరస్వ ఫైన్ జ్యువెలరీ హైదరాబాద్‌లో కొత్త స్టోర్ ప్రారంభం ద్వారా తన రిటైల్ వ్యాపార నెట్‌వర్క్‌ను మరింత విస్తరించుకుంది. ఎల్లే ఇండియా భాగస్వామ్యంతో ముంబై, అహ్మదాబాద్ తర్వాత తన మూడో స్టోర్‌ను బంజారా హిల్స్‌లో ఆవిష్కరించింది. ''ఇరస్వ బ్రాండ్ దినదినాభివృద్ధి చెందుతోంది. ఇక్కడ ఆభరణాల కొనుగోలుతో మీరు కూడా ఇరస్వ కుటుంబ సభ్యులు అవుతారు'' అని కంపెనీ సీఈవో కేతన్ పటేల్ తెలిపారు.

ఎయిర్‌టెల్ లాభం ఫ్లాట్

- క్యూ1లో రూ. 1,612 కోట్లు
- ఏఆర్‌పీయూ @ రూ. 200

న్యూఢిల్లీ: మొబైల్ టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం దాదాపు యథాతథంగా రూ. 1,612 కోట్లను తాకింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 1,607 కోట్లు ఆర్జించింది. అయితే సర్దుబాటుకు ముందు నికర లాభం 91 శాతం జంప్‌చేసి రూ. 2,902 కోట్లుగా నమోదైంది. ఇక మొత్తం ఆదాయం 14 శాతం ఎగసి రూ. 37,440 కోట్లకు చేరింది. దేశీ మొబైల్ సర్వీసుల ఆదాయం 13 శాతంపైగా పుంజుకుని రూ. 26,375 కోట్లను తాకినట్లు కంపెనీ పేర్కొంది. ఈ కాలంలో ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) రూ. 183 నుంచి రూ. 200కు బలపడింది. రూ. 19,746 కోట్ల నిర్వహణ లాభం(ఇబిటా) ఆర్జించగా.. 52.7 శాతం ఇబిటా మార్జిన్లను సాధించింది.



4జీ యూజర్లు అప్

తాజా సమీక్షా కాలంలో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా 56 లక్షల మంది 4జీ వినియోగదారులను జత చేసుకున్నట్లు భారతీ ఎయిర్‌టెల్ ఎండీ గోపాల్ విఠల్ పేర్కొన్నారు. నాణ్యమైన కస్టమర్లపై దృష్టి సారించడం ద్వారా 0.8 మిలియన్ పోస్ట్‌పెయిడ్ వినియోగదారులను జత కలుపుకున్నట్లు తెలియజేశారు. దీంతో వీరి సంఖ్య దాదాపు 2.05 కోట్లకు చేరినట్లు వెల్లడించారు. ఇక మొబైల్ డేటా వినియోగం 22 శాతం ఎగసి ఒక్కో కస్టమర్‌పై నెలకు 21.1 జీబీకి చేరినట్లు వివరించారు.

ఫలితాల నేపథ్యంలో ఎయిర్‌టెల్ షేరు బీఎస్‌ఈలో 0.7 శాతం క్షీణించి రూ. 872 వద్ద ముగిసింది.

అన్ని సర్కిళ్లకు జియో 5జీ విస్తరణ పూర్తి

న్యూఢిల్లీ: అన్ని సర్కిళ్లలోనూ 5జీ విస్తరణ ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేసినట్లు టెలికం సంస్థ రిలయన్స్ జియో వెల్లడించింది. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొంది. తదుపరి టెస్టింగ్ కోసం 10% సైట్లను టర్మ్ సెల్ ఎంపిక చేయనున్నట్లు టెలికం శాఖ (డాట్) వివరించాయి. వీటి ఫలితాలు వచ్చిన తర్వాత సేవల విస్తరణ నిబంధనలను పూర్తి చేసినట్లుగా సర్టిఫికెట్ జారీ అవుతుందని పేర్కొన్నాయి. దేశవ్యాప్తంగా జూలై 7 నాటికి టెల్కోలు 2.81 లక్షల పైచిలుకు 5జీ టవర్లను (బీటీఎస్) ఏర్పాటు చేసినట్లు కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి దేవుసిన్హ్ చౌహాన్ ఇటీవల తెలిపారు.



నెల కనిష్టానికి సూచీలు

- సెన్సెక్స్ 542 పాయింట్లు క్రాష్
- 19,400 దిగువకు నిఫ్టీ

ముంబై: ఫిచ్ రేటింగ్స్ ఏజెన్సీ అమెరికా రుణ రేటింగ్‌ను తగ్గించిన ప్రభావం ఈక్విటీ మార్కెట్లపై కొనసాగింది. బాండ్లపై రాబడులు పెరగడం, డాలర్ ఇండెక్స్ బలపడటం తదితర అంశాలూ ఇన్వెస్టర్లను కలవరపెట్టాయి. ఫలితంగా మూడో రోజూ అమ్మకాలు వెల్లువెత్తడంతో స్టాక్ సూచీలు నాలుగు వారాల కనిష్ట స్థాయి వద్ద ముగిశాయి. ఉదయం సెన్సెక్స్ 232 పాయింట్ల నష్టంతో 65,551 వద్ద, నిఫ్టీ 63 పాయింట్లు పతనమై 19,464 వద్ద మొదలయ్యాయి. ప్రపంచ ప్రతికూల పరిణామాల నేపథ్యంలో సూచీలు రోజంతా నష్టాల్లో ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 820 పాయింట్లు క్షీణించి 64,963 వద్ద, నిఫ్టీ 231 పాయింట్లు పతనమై 19,296 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి. అయితే వారాంతపు ఎఫ్‌అండ్‌ఓ ముగింపు సందర్భంగా ట్రేడర్లు షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు చేపట్టడంతో సూచీలు స్వల్పంగా నష్టాలను భర్తీ చేసుకోగలిగాయి. చివరికి సెన్సెక్స్ చివరికి 542 పాయింట్ల నష్టంతో 65,241 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 145 పాయింట్లు దిగివచ్చి 19,382 వద్ద ముగిసింది. బ్యాంకులు, ఫైనాన్స్, మెటల్, ఇంధన, రియల్టీ షేర్లలో భారీ అమ్మకాలు నెలకొన్నాయి. జూన్ క్వార్టర్ మెరుగైన ఫలితాల దన్నుతో ఫార్మా షేర్లు నష్టాల మార్కెట్లోనూ ఎదురీదాయి.





దేవధర్ ట్రోఫీ విజేత సౌత్‌జోన్

దేశవాళీ జోనల్ వన్డే క్రికెట్ టోర్నీ దేవధర్ ట్రోఫీలో మయాంక్ అగర్వాల్ సారథ్యంలోని సౌత్‌జోన్ జట్టు అజేయ విజేతగా నిలిచింది. పుదుచ్చేరిలో గురువారం జరిగిన ఫైనల్లో సౌత్‌జోన్ 45 పరుగుల తేడాతో ఈస్ట్‌జోన్ జట్టును ఓడించి తొమ్మిదోసారి దేవధర్ ట్రోఫీని సొంతం చేసుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సౌత్‌జోన్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 328 పరుగులు చేసింది. రోహన్ (75 బంతుల్లో 107 : 11 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీ సాధించాడు. మయాంక్ (63 : 4 ఫోర్లు), జగదీశన్ (54 : 2 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు చేశారు. అనంతరం 329 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఈస్ట్‌జోన్ 46.1 ఓవర్లలో 283 పరుగులకు ఆలౌటైంది. రియాన్ పరాగ్ (95 : 8 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరిపించాడు. సౌత్‌జోన్ బౌలర్లలో వాషింగ్టన్ సుందర్ మూడు వికెట్లు తీయగా... వైశాఖ్, కౌశిక్, విద్వత్ రెండు వికెట్ల చొప్పున పడగొట్టారు.

భారత్ శుభారంభం



చెన్నై: ఆసియా చాంపియన్స్ ట్రోఫీ పురుషుల హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు శుభారంభం చేసింది. గురువారం ఇక్కడి మేయర్ రాధాకృష్ణన్ హాకీ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో భారత్ 7–2 గోల్స్‌తో చైనాపై గెలిచింది. ఆట ఆరంభమైనప్పటి నుంచే భారత్ ఆధిపత్యం కూడా మొదలైంది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (5వ, 8వ ని.లో), వరుణ్ కుమార్ (19వ, 30వ ని.లో) రెండు గోల్స్ చొప్పున సాధించగా... సుఖ్‌జీత్ సింగ్ (15వ ని.లో), ఆకాశ్‌దీప్ సింగ్ (16వ ని.లో), మన్‌దీప్ సింగ్ (40వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. చైనా తరఫున వెన్ హుయ్ (18వ ని.), జిషెంగ్ గావ్ (25వ ని.) చెరో గోల్ సాధించారు. ఇతర మ్యాచ్‌ల్లో డిఫెండింగ్ చాంపియన్ దక్షిణ కొరియా 2–1తో జపాన్‌పై, మలేసియా 3–1తో పాకిస్తాన్‌పై గెలిచారు. నేడు జరిగే పోటీలో జపాన్‌తో భారత్ ఆడుతుంది.

మూడో రౌండ్‌లో హంపి, హారిక




బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్ మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారికలతోపాటు మహిళా గ్రాండ్‌మాస్టర్ (డబ్ల్యూజీఎం) దివ్య దేశ్‌ముఖ్, అంతర్జాతీయ మాస్టర్ (ఐఎం) వైశాలి మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు. రెండో రౌండ్‌లో హంపి 1.5–0.5తో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి నూతక్కి ప్రియాంకపై నెగ్గగా... హారిక 2–0తో మిచలినా (పోలాండ్)ను ఓడించింది. ఓపెన్ విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్లు ఎస్ఎల్ నారాయణన్, దొమ్మరాజు గుకేశ్, నిహాల్ సరీన్, ప్రజ్ఞానంద మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టగా... ఇరిగేశి అర్జున్, కార్తీక్ వెంకటరామన్, విదిత్ మూడో రౌండ్‌లో బెర్త్ కోసం టైబ్రేక్ గేమ్‌లు ఆడతారు.

తొలి టి20 చేజారె...

4 పరుగులతో ఓడిన భారత్ • విండీస్ సమష్టి విజయం • రాణించిన తిలక్ వర్మ

తరూబా (ట్రినిడాడ్): వెస్టిండీస్‌తో టి20 సిరీస్‌ను భారత్ తడబడుతూ ఆరంభించింది. సులువైన లక్ష్యాన్ని కూడా ఛేదించలేక జట్టు ఓటమిని ఆహ్వానించింది. గురువారం జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో భారత్ 4 పరుగుల తేడాతో విండీస్ చేతిలో ఓటమి పాలైంది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. కెప్టెన్ రావ్‌మన్ పావెల్ (32 బంతుల్లో 48; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), నికోలస్ పూరన్ (34 బంతుల్లో 41; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లతో రాణించగా, బ్రెండన్ కింగ్ (19 బంతుల్లో 28; 4 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడాడు. భారత బౌలర్లలో చహల్, అర్ష్‌దీప్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం భారత్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 145 పరుగులు చేసింది. తిలక్ వర్మ (22 బంతుల్లో 39; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇరు జట్ల మధ్య రెండో మ్యాచ్ ఆదివారం ప్రావిడెన్స్‌లో జరుగుతుంది.

రాణించిన పూరన్...

విండీస్ ఇన్నింగ్స్‌ను కింగ్ దూకుడుగా మొదలు పెట్టాడు. మేయర్స్ (1)తో తొలి వికెట్ భాగస్వామ్యంలో 4 ఓవర్లలో 29 పరుగులు రాగా, ఇందులో కింగ్ ఒక్కడే 28 పరుగులు సాధించాడు. అయితే తర్వాతి ఓవర్ వేసిన చహల్ తొలి మూడు బంతుల్లోనే ఓపెనర్లు ఇద్దరినీ ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపించాడు. పూరన్ తాను ఆడిన తొలి 6 బంతుల్లోనే 2 ఫోర్లు, 2 సిక్స్‌లు బాదడంతో పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 54 పరుగులకు చేరింది. కొత్త ఆటగాడు తిలక్ వర్మ వరుసగా రెండు క్యాచ్‌లు పట్టడంతో చార్లెస్ (3), పూరన్ వెనుదిరిగారు. మరో ఎండ్‌లో పావెల్ ధాటిగా ఆడిన కొన్ని షాట్లు విండీస్‌కు కాస్త మెరుగైన స్కోరు అందించాయి.

తిలక్ వర్మ మినహా...

ఓపెనర్లిద్దరూ విఫలం కావడంతో ఛేదనలో భారత్‌కు శుభారంభం లభించకపోగా... సూర్యకుమార్ యాదవ్ (21 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్), తిలక్ కలిసి స్కోరును పెంచారు. తాను ఎదుర్కొన్న రెండో బంతిని సిక్సర్‌గా మలచి ఖాతా తెరచిన తిలక్, తర్వాతి బంతిని కూడా సిక్సర్ బాదాడు. పవర్‌ప్లేలో భారత్ 45 పరుగులు చేసింది. ఆ తర్వాత షెఫర్డ్ ఓవర్లోనూ అతను వరుసగా 6, 4 కొట్టాడు. అయితే తక్కువ వ్యవధిలో సూర్య, తిలక్ వెనుదిరిగారు. హార్దిక్ పాండ్యా (19), సంజు సామ్సన్ (12) క్రీజ్‌లో ఉన్నంతసేపు భారత్ గెలుపుపై ధీమా ఉన్నా...'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హోల్డర్ ఒకే ఓవర్లో వీరిద్దరిని అవుట్ చేయడంతో ఆశలు సన్నగిల్లాయి. చివర్లో అర్ష్‌దీప్ (12) కొంత ప్రయత్నించినా లాభం లేకపోయింది.



హోల్డర్



తిలక్ వర్మ

తిలక్ వర్మ అరంగేట్రం

హైదరాబాద్ క్రికెటర్ తిలక్ వర్మ అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టాడు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరఫున రెండు సీజన్లలో ఆకట్టుకున్న ఈ ఎడంచేతి వాటం బ్యాటర్ గురువారం తన తొలి మ్యాచ్ ఆడాడు. ఈ పర్యటనలో ఇప్పటికే టెస్టులు, వన్డేల్లో అరంగేట్రం చేసిన పేసర్ ముకేశ్ కుమార్‌కు కూడా ఇది తొలి టి20 మ్యాచ్. భారత్ తరఫున టి20లు ఆడిన 103, 104వ ఆటగాళ్లుగా వీరిద్దరు నిలిచారు.

స్కోరు వివరాలు

వెస్టిండీస్ ఇన్నింగ్స్: కింగ్ (ఎల్బీ) (బి) చహల్ 28; మేయర్స్ (ఎల్బీ) (బి) చహల్ 1; చార్లెస్ (సి) తిలక్ (బి) కుల్దీప్ 3; పూరన్ (సి) తిలక్ (బి) పాండ్యా 41; పావెల్ (సి) కుల్దీప్ (బి) అర్ష్‌దీప్ 48; హెట్‌మైర్ (సి) అక్షర్ (బి) అర్ష్‌దీప్ 10; షెఫర్డ్ (నాటౌట్) 4; హోల్డర్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు)** 149. **వికెట్ల పతనం:** 1–29, 2–30, 3–58, 4–96, 5–134, 6–138. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4–0–31–2, ముకేశ్ 3–0–24–0, అక్షర్ 2–0–22–0, చహల్ 3–0–24–2, పాండ్యా 4–0–27–1, కుల్దీప్ 4–0–20–1.

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (సి) పావెల్ (బి) మెకాయ్ 6; గిల్ (స్టంప్డ్) చార్లెస్ (బి) హొసీన్ 3; సూర్యకుమార్ (సి) హెట్‌మైర్ (బి) హోల్డర్ 21; తిలక్ (సి) హెట్‌మైర్ (బి) షెఫర్డ్ 39; పాండ్యా (బి) హోల్డర్ 19; సామ్సన్ (రనౌట్) 12; అక్షర్ (సి) హెట్‌మైర్ (బి) మెకాయ్ 13; కుల్దీప్ (బి) షెఫర్డ్ 3; అర్ష్‌దీప్ (రనౌట్) 12; చహల్ (నాటౌట్) 1; ముకేశ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు)** 145. **వికెట్ల పతనం:** 1–5, 2–28, 3–67, 4–77, 5–113, 6–113, 7–129, 8–140, 9–144. **బౌలింగ్:** హొసీన్ 4–0–17–1, మెకాయ్ 4–0–28–2, జోసెఫ్ 4–0–39–0, హోల్డర్ 4–1–19–2, షెఫర్డ్ 4–0–33–2.

200 అంతర్జాతీయ టి20 క్రికెట్‌లో 200 మ్యాచ్‌లు ఆడిన రెండో జట్టుగా భారత్ గుర్తింపు పొందింది. ఈ జాబితాలో పాకిస్తాన్ (223 మ్యాచ్‌లు) అగ్రస్థానంలో ఉంది. న్యూజిలాండ్ (193), శ్రీలంక (179), ఆస్ట్రేలియా (174) వరుసగా మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో ఉన్నాయి.

జ్యోతి సురేఖ ముందంజ

ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్ క్వార్టర్ ఫైనల్లోకి భారత స్టార్

బెర్లిన్ (జర్మనీ): గురి తప్పని ప్రదర్శనతో భారత స్టార్ ఆర్చర్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం జరిగిన మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో విజయవాడకు చెందిన 27 ఏళ్ల జ్యోతి సురేఖ ఆడిన రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. క్వాలిఫయింగ్‌లో రెండో ర్యాంక్‌లో నిలిచిన జ్యోతి సురేఖకు నేరుగా మూడో రౌండ్‌కు 'బై' కేటాయించారు. మూడో రౌండ్ మ్యాచ్‌లో జ్యోతి సురేఖ 139–136తో లికోఅరెలో (అమెరికా)పై, నాలుగో రౌండ్‌లో 148–145తో ఓ యూహున్ (దక్షిణ కొరియా)పై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది.



ధీరజ్ పరాజయం

పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్ ప్రిక్వార్టర్ ఫైనల్లో 4–6తో రికార్డో సాటో (చిలీ) చేతిలో పరాజయం చవిచూశాడు.

క్వార్టర్ ఫైనల్లో సింధు, శ్రీకాంత్

ప్రణయ్, ప్రియాన్షు కూడా • మిథున్, కిరణ్ పరాజయం

సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ పీవీ సింధు... పురుషుల సింగిల్స్ విభాగంలో కిడాంబి శ్రీకాంత్, ప్రణయ్, ప్రియాన్షు రజావత్ క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో సింధు 21–14, 21–10తో భారత్‌కే చెందిన ఆకర్షి కశ్యప్‌ను ఓడించింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో ప్రపంచ మాజీ నంబర్‌వన్ శ్రీకాంత్ 21–10, 21–17తో సు లి యాంగ్ (చైనీస్ తైపీ)పై, ప్రణయ్ 19–21, 21–19, 21–13తో చి యు జెన్ (చైనీస్ తైపీ)పై, ప్రియాన్షు 21–8, 13–21, 21–19తో వాంగ్ జు వె (చైనీస్ తైపీ)పై గెలుపొందారు. భారత్‌కే చెందిన మిథున్ మంజునాథ్, కిరణ్ జార్జి పోరాటం ముగిసింది. మిథున్ 13–21, 21–12, 19–21తో లీ జి జియా (మలేసియా) చేతిలో, కిరణ్ 15–21, 18–21తో ఆంథోనీ సినిసుక జిన్‌టింగ్ (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయారు. మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో పుల్లెల గాయత్రి–ట్రీసా జాలీ (భారత్) 10–21, 20–22తో వకానా నాగహార–మాయు మత్సుమోతో (జపాన్) చేతిలో ఓటమి పాలయ్యారు.



క్రికెట్‌కు మనోజ్ తివారీ వీడ్కోలు

కోల్‌కతా: భారత మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ అన్ని ఫార్మాట్లకు గుడ్‌బై చెప్పాడు. ఈ బెంగాలీ క్రికెటర్ 2008 నుంచి 2015 వరకు అంతర్జాతీయ కెరీర్‌లో 12 వన్డేలు, మూడు టి20లు ఆడాడు. వన్డేల్లో ఒక సెంచరీ, అర్ధసెంచరీ ఉన్నాయి. కానీ మూడు టి20ల్లో ఒకసారి మాత్రమే బ్యాటింగ్ అవకాశం దక్కగా 15 పరుగులే చేశాడు. దేశవాళీ క్రికెట్‌లో 141 మ్యాచ్‌ల్లో 48.56 సగటుతో 9908 పరుగులు చేశాడు. ఐపీఎల్‌లో కోల్‌కతా, పంజాబ్, రైజింగ్ పుణేలకు ఆడాడు. 2012లో మనోజ్ తివారీ విన్నింగ్ షాట్‌తో కోల్‌కతా నైట్‌రైడర్స్ విజేతగా నిలిచింది. 37 ఏళ్ల తివారీ ప్రస్తుతం పశ్చిమ బెంగాల్ సీఎం మమత బెనర్జీ కేబినెట్‌లో రాష్ట్ర యువజన, క్రీడా శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నాడు.




క్లుప్తంగా...

12న గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఎన్నికలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఎన్నికలను ఆగస్టు 12న గుంటూరు ఆర్‌డీవో కార్యాలయం ఆవరణలో ఉన్న రెవెన్యూ అసోసియేషన్ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల అధికారిగా ప్రకాశం జిల్లా డీపీవో జీవీ నారాయణ రెడ్డి, ఉప ఎన్నికల అధికారిగా ఆయుర్వేద కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ బుల్లయ్యను నియమించినట్లుగా తెలిపారు.

'పల్సస్' ఆధ్వర్యంలో హెల్త్‌కేర్ సమ్మిట్ సిరీస్



మాండవీయాను కలిసిన శ్రీనుబాబు, లక్ష్మణ్

సాక్షి, అమరావతి: అందరికీ ఆరోగ్యం–అందుబాటులో వైద్యం ఇదే జీ–20 దేశాల లక్ష్యమని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయా అన్నారు. జీ20 దేశాల్లోని ప్రధాన నగరాల్లో హెల్త్‌కేర్ సమ్మిట్ సిరీస్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి చెందిన పల్సస్ గ్రూపు నిర్వహిస్తోన్న ఈ హెల్త్‌కేర్ సమ్మిట్ సిరీస్‌ను మంత్రి ఢిల్లీలో గురువారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. అందరికీ అందుబాటులో ఆరోగ్యం అనే లక్ష్యంతో పల్సస్ గ్రూప్ చేస్తోన్న కృషిని అభినందించారు. పల్సస్ గ్రూపు సీఈవో డాక్టర్ శ్రీనుబాబు గేదెల మాట్లాడుతూ.. రానున్న కాలంలో హెల్త్‌కేర్ సమ్మిట్ సిరీస్‌లను ప్రఖ్యాత నగరాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

భార్య చేతివేళ్లు కొరికి తినేసిన భర్త

బనశంకరి: భార్యతో గొడవపడిన భర్త కోపావేశంలో ఆమె చేతివేళ్లు కొరికి తినేశాడు. ఈ ఘటన బెంగళూరు కోణకుంటే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బాధిత మహిళ పుష్ప (40)కు 23 ఏళ్ల క్రితం విజయ్‌కుమార్ అనే వ్యక్తితో వివాహమైంది. కొన్నేళ్ల నుంచి విజయ్‌కుమార్ భార్యను వేధిస్తుండటంతో ఆమె వేరుగా ఉంటోంది. గత నెల 28న విజయ్‌కుమార్ ఆమె వద్దకు వెళ్లి ఘర్షణకు దిగాడు. కోపం పట్టలేక ఆమెపై దాడి చేసి ఎడమ చేతి వేళ్లు కొరికి తినేశాడు. తన వద్దకు రాకపోతే నిన్ను కూడా చంపి ఇదే విధంగా తినేస్తానని బెదిరించడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సంపద పెరిగింది.. అప్పులు తగ్గాయి

ఏపీ గురించి ఆర్బీఐ, కేంద్ర ఆర్థిక మంత్రి వెల్లడించిన వాస్తవం ఇదీ: మంత్రి బుగ్గన

- కోవిడ్ ఇబ్బందులున్నా చంద్రబాబు హయాం కన్నా ఇప్పుడే అప్పులు తక్కువ
- బడ్జెట్ బయట చూసినా.. లోపల చూసినా ఇదే విషయం తెలుస్తుంది
- టీడీపీ హయాంలో పరిమితికి మించి రూ.16,418 కోట్లు అప్పు చేయడంతో ఇప్పుడు కోత పడింది
- వైఎస్సార్‌సీపీ వచ్చాక అనుమతి ఉన్నా సరే రూ.28,466 కోట్లు తక్కువ అప్పులు చేసింది
- నాడు అప్పులు వార్షిక వృద్ధి రేటు 14.7 శాతం.. నేడు 12.4 శాతం మాత్రమే
- ఈ ప్రభుత్వం చేసిన అప్పులు డీబీటీతో ప్రజలకు వెళ్లినట్లు స్పష్టంగా కనిపిస్తోంది
- మరి చంద్రబాబు హయాంలో చేసిన అప్పులు ఎక్కడకు వెళ్లినట్లు?
- ఈ వయసులో కొదమ సింహం అంటూ జంతువులతో పోల్చుకోవడం ఎందుకు?
- స్వయం ప్రకటిత ఆర్థిక నిపుణులు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారు
- కేంద్ర ఆర్థిక మంత్రి ఇంత తక్కువ ఎలా చెబుతారంటూ బాధపడిపోతున్నారు
- కొత్తగా వచ్చిన వారు ద్రవ్యలోటు, రెవెన్యూ లోటు గురించి తెలుసుకున్నాక మాట్లాడాలి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు, వైఎస్సార్ హయాంతోపాటు విభజన అనంతరం మరోసారి టీడీపీ పాలనలో, వైఎస్సార్‌సీపీ వచ్చాక బడ్జెట్ బయట, లోపల చేసిన అప్పులు, రెవెన్యూ రాబడులు, వడ్డీల శాతం గణాంకాలను బుగ్గన వెల్లడించారు. ఆ వివరాలివీ...

- 2014–15 నాటికి రాష్ట్ర అప్పులు రూ.1,22,605 కోట్లు (రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 23.35 శాతం)
- 2018–19 నాటికి రాష్ట్ర అప్పులు రూ.2,64,451 కోట్లు (రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 30.27 శాతం)
- 2023 నాటికి రాష్ట్ర అప్పులు రూ.4,42,442 కోట్లు (రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 33.5 శాతం)
- చంద్రబాబు పాలనలో అప్పులు ఏడు శాతానికిపైగా పెరగగా ఇప్పుడు నాలుగేళ్లలో మూడు శాతం మాత్రమే పెరిగాయి.

- 2014 – 2019 అప్పుల వార్షిక వృద్ధి రేటు 14.7 శాతం
- 2019 నుంచి 2022–23 వరకు అప్పుల వార్షిక వృద్ధి రేటు 12.4 శాతం
- చంద్రబాబు హయాం కంటే ఇప్పుడు అప్పుల వృద్ధి రెండు శాతం తక్కువగానే ఉంది

- 1999 – 2004 రెవెన్యూ రాబడులు వృద్ధి 12.4 శాతం (ఉమ్మడి ఏపీలో చంద్రబాబు హయాం)
- 2004 – 2009 రెవెన్యూ రాబడులు వృద్ధి 21.6 శాతం (వైఎస్సార్ హయాం)
- 2014 – 2019 రెవెన్యూ రాబడులు వృద్ధి 6 శాతం
- 2019 – 2023 రెవెన్యూ రాబడులు వృద్ధి 16.7 శాతం
- వైఎస్సార్ హయాంతో పోలిస్తే చంద్రబాబు జమానాలో రెవెన్యూ రాబడులు 15.6 శాతం క్షీణించగా ఇప్పుడు 10.7 శాతం పెరిగాయి

- 2014 – 2019 రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.6,95,000 కోట్లు
- 2019 – 2023 రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.11,00,000 కోట్లు
- రాష్ట్ర విభజన నాటికి గ్యారెంటీలు, గ్యారెంటీలు ఇవ్వని అప్పులు రూ.35,000 కోట్లు
- 2019 మే నాటికి ఆ అప్పులను చంద్రబాబు రూ.1,40,500 కోట్లకు పెంచారు. అంటే 21.8 శాతం పెంచారు.
- వైఎస్సార్‌సీపీ వచ్చాక రూ.2,09,000 కోట్లకు పెరిగాయి. అంటే 12.6 శాతమే పెరిగాయి.



సాక్షి, అమరావతి: కోవిడ్ లాంటి సంక్షోభాన్ని ఎదుర్కొన్నప్పటికీ గత ప్రభుత్వ హయాంలో కంటే వైఎస్సార్ సీపీ పాలనలో సంపద పెరగడంతోపాటు అప్పులు తగ్గాయని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ గణాంకాలతో సహా మీడియాకు గురువారం వెల్లడించారు. రాష్ట్ర అప్పులపై ఆర్బీఐ, కేంద్ర ఆర్థిక మంత్రి, కాగ్ చెప్పినవి వాస్తవాలని తెలిపారు. కొందరు స్వయం ప్రకటిత ఆర్థిక నిపుణులు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర అప్పులు రూ.పది లక్షల కోట్లు అంటూ చేస్తున్న దుష్ప్రచారంలో నిజం లేదన్నారు. ఎల్లో మీడియా, విపక్షాల మాటలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అప్పులపై పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి చెప్పిన లెక్కలు, అసెంబ్లీలో సీఎం వెల్లడించిన గణాంకాలు మాత్రమే వాస్తవాలన్నారు. రాష్ట్ర అప్పులు రూ.4,42,442 కోట్లేనని కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించడంతో ఇంత తక్కువ ఎలా చెబుతారంటూ ఎల్లో మీడియాతో పాటు విపక్ష నేతలు బాధపడుతున్నారని ధ్వజమెత్తారు. కేరళను అప్పులకు అనుమతించకుండా ఏపీకి మాత్రం ఎందుకు వెసులుబాటు కల్పిస్తున్నారంటూ ఎల్లో మీడియా కథనాలు ప్రచురించడం విచిత్రంగా ఉందన్నారు.

- గత ప్రభుత్వం చేసిన అప్పుల గురించి ఎల్లో మీడియా ఏనాడైనా కథనాలు ప్రచురించిందా? ఇప్పుడు రూ.వెయ్యి కోట్ల అప్పులపై ఐదుసార్లు వార్తలు రాసి రూ.ఐదు వేల కోట్ల అప్పుల తరహాలో చిత్రీకరిస్తోంది. బడ్జెట్ బయట చూసినా లోపల చూసినా అప్పులు చంద్రబాబు హయాంలోనే ఎక్కువగా ఉన్నాయి. ఆయన హయాంలో పరిమితికి మించి రూ.16,418 కోట్లు అప్పులు చేయడంతో ఇప్పుడు ఆ మేరకు కోత పడింది. అనుమతి ఉన్నా సరే మేం రూ.28,466 కోట్లు తక్కువ అప్పులు చేశాం.
- చంద్రబాబు హయాంలో అప్పుల వార్షిక వృద్ధి రేటు 14.7 శాతం కాగా ఇప్పుడు 12.4 శాతం మాత్రమే ఉంది. మేం అప్పులు చేసినా డీబీటీ రూపంలో ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా చేరవేసినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. మరి చంద్రబాబు హయాంలో చేసిన అప్పులు ఎటు వెళ్లినట్లు? టీడీపీ అధికారంలో ఉండగా సంపద పెరగలేదు కానీ అప్పులు మాత్రం పెరిగాయి. తాను సంపద పెంచే నిపుణుడినంటూ చంద్రబాబు చెప్పుకోవడం హాస్యాస్పదం. కర్ణాటక, తమిళనాడుతో పాటు వైఎస్సార్‌సీపీ పథకాలను కాపీ కొట్టి మేనిఫెస్టోలను ప్రకటించుకున్నారు.
- గత ఎన్నికల ముందు ఏప్రిల్‌లో పసుపు కుంకుమ పేరుతో చంద్రబాబు రూ.5,500 కోట్లు అప్పు చేయలేదా? వచ్చే ప్రభుత్వం పాలన చేయలేదు. సంక్షేమ పథకాలు అమలు చేయలేరు. ఇక అప్పులు పుట్టకుండా చేశామంటూ టీడీపీ నేతలు బహిరంగంగానే వ్యాఖ్యానించలేదా? అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్లుగా ఏ సంక్షేమ పథకాన్నీ ఆపకుండా నిర్విఘ్నంగా అమలు చేస్తోంది. పరిమితికి లోబడే అప్పులు చేస్తోంది. దీనిపై కేంద్రానికి ఫిర్యాదు చేయడంతోపాటు పార్లమెంట్‌లోనూ ప్రశ్నించారు. కేంద్రం వాస్తవాలను వెల్లడించడంతో ఎల్లో మీడియా, టీడీపీ నేతలకు దిక్కు తోచట్లేదు.
- దేశంలో రాష్ట్రానికో నిబంధన ఉండదు. పరిమితికి లోబడి కేంద్రం అప్పులను అనుమతిస్తోంది.
- రాష్ట్ర అప్పులపై మాట్లాడుతున్న వారు, కథనాలను ప్రచురిస్తున్న వారు అసలు మన రాష్ట్రంలోనే ఉండరు. హైదరాబాద్‌లో ఉంటూ ఏపీ అప్పుల గురించి దుష్ప్రచారం చేస్తున్నారు. పౌరసరఫరాల సంస్థ ద్వారా చంద్రబాబు హయాంలో రూ.20 వేల కోట్లు అప్పులు చేస్తే ఇప్పుడు రూ.10 వేల కోట్లు మాత్రమే అప్పు చేశాం. విద్యుత్ సంస్థలకు భారీగా పెట్టిన బకాయిలను సైతం తీరుస్తున్నాం. రెవెన్యూ రాబడులు, వృద్ధి, రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో వృద్ధిని గమనిస్తే సంపద ఎవరి హయాంలో ఎంత పెరిగిందో స్పష్టమవుతుంది.
- టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఈ వయసులో తాను కొదమ సింహం అంటూ జంతువులతో పోల్చుకోవడం ఎందుకు? సింహం అంటే సింగిల్‌గా వస్తుంది. మరి ఆయన ఎప్పుడైనా సింగిల్‌గా పోటీ చేశారా? చంద్రబాబు పొత్తులు పెట్టుకోని పార్టీ లేదు. ఒకే పార్టీతో రెండేసి సార్లు పొత్తులు పెట్టుకున్న ఘనత ఆయనదే.
- కొత్తగా క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించినవారు ద్రవ్య లోటు, రెవెన్యూ లోటు అంటే ఏమిటో అధ్యయనం చేశాక మాట్లాడాలి. నాబార్డు నుంచి రూ.7,992 కోట్లు అప్పులు చేయలేదు. తీసుకున్నది రూ.3,281 కోట్లు మాత్రమే. కంటిన్జెన్సీ ఫండ్ గవర్నర్ వద్ద అత్యవసరాల కోసం ఉంటుంది. కొత్తగా వచ్చిన వారు దాన్ని కూడా అప్పు కింద లెక్కించారు. పబ్లిక్ అకౌంట్ పద్దు నుంచి గత ప్రభుత్వం రూ.36,241 కోట్లు వాడుకోగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.3,475 కోట్లు మాత్రమే వినియోగించుకుంది.

అరెస్టు చేసేందుకు వెళ్లి అరెస్టయ్యారు

- కేరళలో నిందితుడిని లంచం అడిగి పట్టుబడిన బెంగళూరు పోలీసులు



ఎస్‌ఐ శివప్రకాశ్

కృష్ణరాజపురం: లంచం డిమాండ్ చేశారనే ఆరోపణలపై బెంగళూరు పోలీసులను కేరళ పోలీసులు అరెస్ట్ చేశారు. ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ చందక్ శ్రీకాంత్‌ను కొందరు నిందితులు మోసం చేశారు. ఆన్‌లైన్‌లో రూ.25 లక్షల డబ్బులను నిందితులు శ్రీకాంత్ నుంచి దండుకున్నారు. ఆ తర్వాత మోసపోయానని గ్రహించిన శ్రీకాంత్ వైట్‌ఫీల్డ్ సెన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన వైట్‌ఫీల్డ్ సెన్ పోలీసు స్టేషన్ ఎస్సై శివప్రకాశ్ అతని సిబ్బంది దర్యాప్తు ప్రారంభించారు. తొలుత దర్యాప్తులో మడికేరిలో ఉంటున్న ఇసాక్ అనే నిందితుడి ఆచూకీ లభించింది. దీంతో అక్కడికి వెళ్లి పరిశీలించగా ఇసాక్ బ్యాంకు ఖాతాలో రూ. 2 కోట్లు లావాదేవీ జరిగినట్లు గుర్తించారు. ఈ లింక్‌ను ఆధారంగా చేసుకుని శివప్రకాశ్ అతని సిబ్బంది కేరళకు వెళ్లింది. పోలీసులకు దొరికిన లీడ్ ఆధారంగా నౌషాద్ అనే వ్యక్తి ఈ ఆన్‌లైన్ ఫ్రాడ్‌కు పాల్పడినట్లు సాక్ష్యాలు లభించాయి. దీంతో అరెస్ట్ చేయకుండా ఉండాలంటే రూ.3 లక్షలు ఇవ్వాలని నౌషాద్ వద్ద వైట్‌ఫీల్డ్ సైబర్ క్రైమ్ పోలీసులు డిమాండ్ చేశారు. ఈ లంచం విషయమై కల్లంచేరి పోలీసు స్టేషన్‌లో నౌషాద్ ఫిర్యాదు చేశాడు. వెంటనే ఎస్‌ఐ శివప్రకాశ్‌తో పాటు అతని సిబ్బంది శివాని, విజయ్ కుమార్, సందేశ్‌ను కల్లంచేరి పోలీసులు అరెస్ట్ చేశారు. తాము ఒక కేసు విషయమై దర్యాప్తు నిమిత్తం వచ్చామని బెంగళూరు పోలీసులు చెప్పినా వినకుండా తమకు అందిన ఫిర్యాదు మేరకు కల్లంచేరి పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు.

పబ్లిక్ నోటీసుపై హైకోర్టుకెక్కిన మార్గదర్శి

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ పలు చట్ట ఉల్లంఘనలకు పాల్పడుతూ చందాదారులను మోసం చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఉంచిన చిట్‌గ్రూపుల విషయంలో అభ్యంతరాలు తెలపాలని చందాదారులను కోరుతూ చిట్స్ రిజిస్ట్రార్ జారీ చేసిన పబ్లిక్ నోటీసుపై మార్గదర్శి యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య గురువారం విచారించారు. మార్గదర్శి తరఫున వాదనలు వినిపించేందుకు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వీ, నాగముత్తులతోపాటు హైకోర్టు సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాసులు వచ్చారు. మొదట అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. 60 ఏళ్లుగా చిట్ వ్యాపారం చేస్తున్నామని, ఏ రోజూ ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు. ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే తమ వెంట పడిందన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

విద్యతోనే బాలికల అభివృద్ధి సాధ్యం


ఎమ్మెల్యే భరత్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

సాక్షి,బళ్లారి: నేటి రోజుల్లో విద్యతోనే బాలికల అభివృద్ధి సాధ్యం అని ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి అన్నారు. ఆయన గురువారం ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. చదువుతో పాటు క్రీడలు, యోగా, ప్రాణాయామం అలవరచుకోవాలన్నారు. తమ పిల్లల చదువుపై తల్లిదండ్రులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఎంతో కష్టపడి చదివించే తల్లిదండ్రులకు బాసటగా విద్యార్థినులు కూడా మంచి ఆలోచనలు, ఉన్నత ఆశయాలతో బాగా చదువుకోవాలన్నారు. కష్టపడి చదివితే మరింత సులువుగా లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. అనంతరం ఎమ్మెల్యే భరత్‌రెడ్డిని కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది ఘనంగా సన్మానించారు. విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకుడు చానాళ్ శేఖర్ పాల్గొన్నారు.

మద్యం కోసం టవర్ పైకెక్కిన యువకుడు


టవర్ పైకెక్కిన మద్యం ప్రియుడు

రాయచూరు రూరల్: విజయపుర జిల్లాలో మద్యం కోసం ఓ యువకుడు రెండోసారి టవర్ పైకెక్కిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఆ జిల్లాలోని సింధగి తాలూకా చాంద కవటేలో సతీష్ అనే యువకుడు మద్యం, గుట్కా కోసం మొబైల్ టవర్ పైకెక్కాడు. దీంతో రాయల్ ఎస్పీన్, విమల్ గుట్కాను చూపించి అతనిని కిందికి దింపారు. కాగా సతీష్ 15 రోజుల క్రితం మద్యం మత్తులో టవర్ పైకెక్కి కలకలం రేపిన విషయం తెలిసిందే.

ఆశ్రయ ఇళ్ల నిర్మాణానికి మోక్షమెన్నడో.?


ఆశ్రయ ఇళ్లకు నోచుకోని ఖాళీ స్థలం

హొసపేటె: తాలూకాలోని నాగేనహళ్లి జీపీలోని గుడి ఓబుళాపుర సర్వే నెంబర్–44లో 5.22 ఎకరాల్లో 92 మందికి ఆశ్రయ లబ్ధిదారులకు ఆశ్రయ ఇళ్లను కట్టుకునేందుకు హక్కు పత్రాలను అందించి 32 ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు ఆశ్రయ ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు జెడ్పీ యంత్రాంగం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇక్కడ పేదలు పూరిగుడిసెల్లో నివాసముంటున్నారు. విద్యుత్ దీపాలతో పాటు డ్రైనేజీలు, తాగునీరు తదితర వ్యవస్థలు లేకపోవడంతో వారు తీవ్ర కష్టాలను ఎదుర్కొంటున్నారు. ఇంతకు ముందు టీపీ అధ్యక్షురాలుగా ఉన్న నాగవేణి బసవరాజ్ తన స్వంత ఖర్చుతో ప్రజలకు నీటి ట్యాంక్‌ను కట్టించారు. అదే విధంగా రెండు బోరుబావులతో పాటు అక్కడక్కడ కాంక్రీట్ డ్రైనేజీలను నిర్మించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ఆశ్రయ ఇళ్లను నిర్మించాలని గుడి ఓబుళాపురం గ్రామస్థులు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు.

తల్లిపాలతో శిశువుకు ఆరోగ్యం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

బళ్లారి రూరల్: తల్లిపాలే శిశువుకు వ్యాధినిరోధక శక్తినిస్తాయని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ గంగాధరగౌడ తెలిపారు. గురువారం విమ్స్ వైద్యభవనంలో పీడియాట్రిక్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తల్లిపాల వినియోగ జాగృతి వారోత్సవంలో ఆయన మాట్లాడారు. తల్లి పాలు సర్వరోగాల నుంచి శిశువును రక్షిస్తాయన్నారు. శిశువు 6 మాసాల పాటు తల్లిపాలను శిశువుకు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. పీడియాట్రిక్ హెచ్ఓడీ డాక్టర్ దుర్గప్ప మాట్లాడుతూ 2019–21 సర్వే ప్రకారం 41.8 శాతం తల్లులు శిశువు పుట్టిన గంటలోపు పాలిస్తున్నారన్నారు. 63.7 శాతం శిశువులు మాత్రమే 6 మాసాలు తల్లిపాలు తాగుతున్నారన్నారు. 45.9 శాతం మంది శిశువులు 6–8 మాసాల్లో అల్పాహారం, ద్రవాలు తీసుకొంటున్నారన్నారు. తల్లిపాల విశిష్టతను గుర్తించి శిశువుకు తప్పనిసరిగా తల్లిపాలను అందించాలన్నారు. జెడ్పీ సీఈఓ రాహుల్ శరణప్ప సంకనూరు తల్లిపాల విశిష్టతను వివరించారు. డీహెచ్ఓ డాక్టర్ జనార్దన్, డీఎస్ డాక్టర్ బసిరెడ్డి, డాక్టర్ సురేశ్, డాక్టర్ వీరేశ్‌గౌడ్, డాక్టర్ బి.కె.శ్రీకాంత్, డాక్టర్ సుమ గడ్డి, డాక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టు రైతులకు తీపి కబురు

- టీబీ డ్యాం నుంచి 5,575 క్యూసెక్కుల నీటి విడుదలకు అనుమతి
- ఢిల్లీలో డీసీఎం, జలవనరుల శాఖ మంత్రి డీ.కే.శివకుమార్ వెల్లడి


వరద జలాలతో నిండుకుండలా తొణికిసలాడుతున్న తుంగభద్ర డ్యాం


ఉప కాలువలకు నీరు విడుదల చేస్తున్న దృశ్యం

శివాజీనగర: రైతుల డిమాండ్, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేల ఒత్తిడి నేపథ్యంలో తుంగభద్ర డ్యాం నుంచి వివిధ కాలువలకు 5,575 క్యూసెక్కుల నీటి విడుదలకు ఆమోదించినట్లు డీసీఎం, జలవనరుల శాఖ మంత్రి డీ.కే.శివకుమార్ తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన గురువారం కర్ణాటక భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. దక్షిణ కర్ణాటక కంటే ఉత్తర కర్ణాటకలోని జిల్లాల్లో మంచి వర్షాలు కురిశాయన్నారు. తుంగభద్ర డ్యాం నుంచి కాలువలకు నీరు వదలాలని ఇప్పటికే జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి చాలా ఒత్తిడి వచ్చిందన్నారు. డ్యాంలో 105 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉండగా, ఇప్పటికే 83 టీఎంసీల మేరకు నీరు నిల్వ చేరిందన్నారు. టీఎల్‌బీఎంసీకి సుమారు 1300 నుంచి 1500 క్యూసెక్కులు, ఆర్‌బీఎల్‌ఎల్‌సీకి 1200 క్యూసెక్కులు, ఆర్‌బీహెచ్ఎల్‌సీకి 1375 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తాం. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్ వాటా నీటిని విడుదల చేయాల్సి ఉందన్నారు. రైతుల నుంచి కూడా డిమాండ్ ఉన్నందున మొత్తం 5575 క్యూసెక్కుల నీటి విడుదలకు అనుమతించామన్నారు. తద్వారా రైతుల డిమాండ్‌పై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు.

మంత్రి తంగడగి అధ్యక్షతన సలహా సమితి: తుంగభద్రా నీటిపారుదల సలహా సమితి(ఐసీసీ)కి మంత్రి శివరాజ్ తంగడగిని అధ్యక్షుడిగా నియమించామన్నారు. రాబోయే రోజుల్లో ఆయన అధ్యక్షతన ఐసీసీ సమావేశం జరిపి, రైతుల పంటలకు అనుకూలమయ్యే దిశలో ఏ సమయానికి ఎంత నీరు ఇవ్వాలో తీర్మానిస్తారని డీసీఎం తెలిపారు.

తుంగభద్ర కాలువలకు నీటి వాటాలివే

హొసపేటె: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కాలువల వారీగా నీటి విడుదలకు చర్యలు చేపట్టామని తుంగభద్ర ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్, విజయనగర కాలువల నీటిపారుదల సలహా కమిటీ సభ్యకార్యదర్శి ఎల్.బసవరాజ్ తెలిపారు. గురువారం మునిరాబాద్‌లో తుంగభద్ర జలాశయం కింద కాలువలకు కేటాయించిన నీటి వాటాల గురించి విలేకరులకు తెలిపారు. తుంగభద్ర డ్యాంలో ప్రస్తుతం 83.18 టీఎంసీల వరకు నీరు నిల్వ ఉందని, 21,492 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని తెలిపారు. రిజర్వాయర్‌లో నీటి లభ్యత ఆధారంగా తుంగభద్ర డ్యాం కింద కాలువలకు నీటిని మళ్లిస్తామని తెలిపారు.

ఏయే కాలువకు ఎంత వాటా నీరు: తుంగభద్ర ఎడమ గట్టు ప్రధాన కాలువకు ఆగస్టు 3 నుంచి గణేకల్ రిజర్వాయర్‌కు తాగునీటిని నింపే వరకు సగటున 3,000 క్యూసెక్కులు, కుడిగట్టు ఎగువ కాలువ(హెచ్ఎల్‌సీ)కు సగటున 1200 క్యూసెక్కులు, కుడిగట్టు దిగువ కాలువ(ఎల్లెల్సీ)కు సగటున 650 క్యూసెక్కులు, గత జూన్ 1 నుంచి రాయబసవన్న కాలువకు 250 క్యూసెక్కులు, తుంగభద్ర ఎడమ గట్టు అప్పర్ లెవల్ కెనాల్‌కు ఆగస్టు 3 నుంచి సగటున 25 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు తెలిపారు. కాలువల నుంచి పంప్‌సెట్లతో అక్రమంగా నీటిని మళ్లిస్తే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

ఉప కాలువలకు నీరు విడుదల

సాక్షి,బళ్లారి: తుంగభద్ర డ్యాం నుంచి హెచ్ఎల్‌సీ, ఎల్ఎల్‌సీకి కింద ఉప కాలువలకు కర్ణాటక కోటా కింద ఎట్టకేలకు నీరు విడుదల చేశారు. సాధారణంగా ఐసీసీ సమావేశం నిర్వహించిన తర్వాత ఆయా కాలువలకు నీటిని విడుదల చేసేవారు. అయితే డ్యాంలో గరిష్టస్థాయికి నీరు చేరుతున్నా ఇప్పటి వరకు కర్ణాటక కోటా కింద నీటి విడుదలకు ఇండెంట్ ఇవ్వక, ఉప కాలువలకు నీరు విడుదల చేయకపోవడంతో తుంగభద్ర రైతు సంఘం అధ్యక్షుడు దరూరు పురుషోత్తంగౌడ ఆధ్వర్యంలో జిల్లాధికారి, టీబీ డ్యాం చీఫ్ ఇంజినీర్ బసవరాజ్‌లను కలుసుకుని ఒత్తిడి తెచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర చొరవ తీసుకుని సంబంధిత మంత్రి, కార్యదర్శికి రైతుల సమస్యలు వివరించి ఎట్టకేలకు గురువారం నీటిపారుదల శాఖ కార్యదర్శి రాకేష్‌సింగ్ ద్వారా తుంగభద్ర డ్యాం నుంచి కర్ణాటక కోటా కింద హెచ్ఎల్‌సీకి 1300 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీకి 650 క్యూసెక్కుల నీరు విడుదల చేయాలని సూచించారు. దీంతో ఆ రెండు కాలువల ద్వారా ఉప కాలువలకు నీరు విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉప కాలువల వద్ద మంత్రి నాగేంద్ర నీటికి పూజలు చేశారు. టీబీ, రైతు సంఘం నేతలు నీరు విడుదల చేయించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు.

6న తింథిణిలో మంత్రులు, ఎమ్మెల్యేలకు సన్మానం


మాట్లాడుతున్న రాజశేఖర్

రాయచూరు రూరల్: రాయచూరు, యాదగిరి జిల్లాల్లోని నూతన మంత్రులు, ఎమ్మెల్యేలకు ఈనెల 6న సన్మానం ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ కురుబ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్ వెల్లడించారు. గురువారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లింగసూగూరు తాలూకా తింథిణిలోని కనక గురు పీఠం వద్ద మాజీ ఎంపీ విరుపాక్షప్ప, మఠాధిపతి సిద్ధరామానంద స్వామీజీల ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మంత్రులు, ఎమ్మెల్యేలను ప్రత్యేకంగా సన్మానిస్తామన్నారు.

ఆ నిధులను గ్యారంటీ పథకాలకు వాడొద్దు


వినతిపత్రం సమర్పిస్తున్న శరణప్ప

రాయచూరు రూరల్: బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన రూ.11 వేల కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం అమలు పరచిన గ్యారంటీ పథకాలకు వాడరాదని దళిత సంఘర్ష సమితి అధ్యక్షుడు శరణప్ప డిమాండ్ చేశారు. ఆయన గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి మాట్లాడారు. దీన, దళితులు, దేవదాసీల సంక్షేమం కోసం ప్రభుత్వం 2023–24 బడ్జెట్‌లో ఎస్సీలకు రూ.7,750, ఎస్టీలకు ఇచ్చిన రూ.3,430 కోట్ల నిధులను గృహలక్ష్మి, జ్యోతి, శక్తి, అన్నభాగ్య పథకాలకు వాడుకోవడాన్ని తప్పుబట్టారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కేటాయించిన నిధులను వారికే వినియోగించాలన్నారు.

వర్షానికి కూలిన ఇళ్ల పరిశీలన


ఇళ్లను పరిశీలిస్తున్న జిల్లాధికారి దివాకర్

హొసపేటె: విజయనగర జిల్లా హరపనహళ్లి తాలూకా జిగళి గ్రామంలో ఇటీవల వర్షానికి దెబ్బతిన్న ఇళ్లను గురువారం జిల్లాధికారి దివాకర్ పరిశీలించారు. పాక్షికంగా, పూర్తిగా దెబ్బతిన్న ఇళ్ల యజమానులతో మాట్లాడారు. ప్రభుత్వ నియమానుసారంగా దెబ్బతిన్న ఇళ్లకు తగిన పరిహారం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మిరప పంట నష్టం పరిశీలన

కంప్లి: తాలూకాలోని మెట్రి సమీపంలోని ప్రైవేట్ నర్సరీలో పండించిన 5581 సింజెంటా రకం మిరప నారు నాటి నష్టపోయిన రైతుల పంటలను మునిరాబాద్ ఉద్యానవన కళాశాల నిపుణుల బృందం పరిశీలించారు. అధికారిక విత్తనం నుంచి ఖరీదు చేసిన విత్తనం నర్సరీకి అందించి వారు పెంచిన నారును పొంది నాట్లు వేసిన కొద్ది రోజులకే నారు ఎండిపోయింది. నర్సరీలో నారు నిర్వహణ లోపం వల్ల ఇలా అయిందని, చాలా నష్టం కల్గిందని రైతులు తిమ్మావర వీరేష్, నాయకర అంజినప్ప, యోగప్ప మేగళమనె, యంకప్ప, ఈశ్వరప్ప ఉప్పలకుంట, ఈరప్ప, కన్ని సోమప్ప ఆరోపించారు. నాటిన సమయంలో వర్షాలు, వాతావరణంపై నివేదిక సిద్ధం చేసి వివరాలు సేకరించారు. నారు రోగ శాస్త్ర సహ ప్రాధ్యాపకుడు డాక్టర్ రాఘవేంద్రాచారి, కూరగాయల విజ్ఞాన సహాయకుడు డాక్టర్ లింగమూర్తి, మట్టి విజ్ఞాన సహాయకుడు డాక్టర్ యోగీశప్ప తెలిపారు. అనంతరం ప్రైవేట్ నర్సరీని పరిశీలించి నారు పెంచేందుకు ఉపయోగించిన కోకో పీట్, ఎరువు నిర్వహణ క్రమం, రైతులు నర్సరీకి విత్తనం ఇచ్చిన, నారు పొందిన తేదీలపై సమాచారం సేకరించారు. నర్సరీ యజమాని భాస్కర్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన నారు అందించామని, నారు ఎండిపోవడానికి, పెరగకపోవడానికి కొంత మంది రైతులు గడువు మీరిన తర్వాత నర్సరీ నుంచి నారు పొందారని నిపుణుల ఎదుట వెల్లడించారు. ఉద్యానవన శాఖ ఉపనిర్దేశకులు సంతోష్, సహాయక నిర్దేశకులు విజయ్, తాలూకా ఉద్యానవన అధికారి కరిగౌడర్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



సాక్షి,బళ్లారి: ఆర్టీసీ బస్సు కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం నగరంలో చోటు చేసుకుంది. ఇన్‌ఫ్యాంట్రీ రోడ్డులో గదగ్ జిల్లాకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి బసవరాజ్ బోవిడి(66) అనే వ్యక్తి స్కూటీలో వెళుతుండగా ప్రమాదవశాత్తు బస్సు చక్రాల కింద పడటంతో తీవ్ర రక్తస్రావమై ఆస్పత్రికి తరలించలోగా మృతి చెందారు. నగరంలోని కుమార్తె ఇంటికి వచ్చిన ఆయన నగరంలో ఓ పని మీద స్కూటీపై వెళుతుండగా అదుపు తప్పి బస్సు కింద పడి ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహానికి విమ్స్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఘటనపై ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో విజ్ఞాన కేంద్రాల ఏర్పాటుకు వినతి


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించిన మంత్రి బోసురాజు

రాయచూరు రూరల్: రాష్ట్రంలో మూడు చోట్ల విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర చిన్న నీటిపారుదల, సైన్సు అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి బోసురాజు కేంద్ర పర్యాటక, సంస్కృతి శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి విన్నవించారు. గురువారం న్యూఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో రాయచూరు, యాదగిరి, చిక్కమగళూరు జిల్లాల్లో విజ్ఞాన కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. చిక్కమగళూరు జిల్లాలో డిజిటల్ డూమ్ ప్లానిటోరియం ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని మంత్రి తెలిపారు.

నేడు ఎముకల ఆరోగ్య పరీక్ష శిబిరం


మాట్లాడుతున్న హరీష్ మూర్తి

రాయచూరు రూరల్: నగరంలో శుక్రవారం ఎముకల ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రాయచూరు ఆర్థోపెడిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ హరీష్ మూర్తి తెలిపారు. గురువారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ ఆర్థోపెడిక్ దినోత్సవం సందర్భంగా ఎముకల వ్యాధిపై ప్రజలకు, 8, 9, 10వ తరగతి విద్యార్థులకు జాగృతి జాతాను ఏర్పాటు చేస్తామన్నారు. శిబిరంలో రాయచూరు వైద్య విజ్ఞాన సంస్థ(రిమ్స్)కళాశాల విద్యార్థులు పాల్గొంటారన్నారు.

ప్రజా సమస్యలపై స్పందనతోనే సార్థకత


అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి: గ్రామ పంచాయతీలకు నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులు తమ పదవులకు న్యాయం చేస్తూ ప్రజా సమస్యలపై స్పందించిన ప్పుడే వారి గెలుపునకు సార్థకత చేకూరుతుందని ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. ఆయన గురువారం తాలూకాలోని జీరిగనూరు, సిద్ధమ్మనహళ్లిలో ఇటీవల రెండో విడత గ్రామ పంచాయతీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా గెలుపొందినవారు పదవీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు.

కోలారు వార్తలు...

స్కూళ్లు, అంగన్‌వాడీల్లో తనిఖీ


తనిఖీ నిర్వహిస్తున్న జెడ్పీ సీఈఓ పద్మ బసవంతప్ప

శ్రీనివాసపురం: ప్రభుత్వ ఆదేశాల మేరకు తాలూకాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలను పరిశీలిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ పద్మ బసవంతప్ప తెలిపారు. గురువారం తాలూకాలోని సంబేళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యా ప్రగతి, మౌలిక సౌకర్యాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. పాఠశాలలకు అవసరమైన మౌలిక సౌకర్యాల కోసం సీఎస్ఆర్ నిధులను ఉపయోగించుకోవాలన్నారు. తాలూకాలో ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది కొరతపై ఉన్న తాత్కాలికంగా ఉపాధ్యాయులను నియమించుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయుల కొరతపై జాబితాను సిద్ధం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. ప్రస్తుతం ఇతర పాఠశాలల్లో అదనంగా ఉన్న ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తామన్నారు. వచ్చే శనివారం జిల్లాలోని అన్ని జెడ్పీల ఆధ్వర్యంలో స్వచ్ఛత, నైర్మల్య అభియాన్ నిర్వహిస్తామన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమన్నారు. ఈసందర్భంగా టీపీ ఈడీ రామప్ప, నంబిహళ్లి జీపీ పీడీఓ మంజునాథ్‌రెడ్డి, కార్యదర్శి ఈశ్వర్ పాల్గొన్నారు.

నిందితులను బంధించండి


ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

రాయచూరు రూరల్: మణిపూర్‌లో మహిళలపై అత్యాచారం పాల్పడిన నిందితులను బంధించి కఠినంగా శిక్షించాలని అఖిల భారత క్రైస్తవ మహాసభ, మెథడిస్ట్ కేంద్ర చర్చిలు డిమాండ్ చేశాయి. గురువారం జిల్లాధికారి కార్యాలయం వరకు చేపట్టిన ర్యాలీలో రాయచూరు అధ్యక్షుడు సిమోన్, ఫ్రాంక్లిన్‌లు మాట్లాడారు. నిందితులపై మణిపూర్ ప్రభుత్వ నిర్లక్ష్యం చూపడాన్ని ఖండించారు. కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి మిగిలిన నిందితులను బంధించడంలో సర్కార్ మౌనం వహించిందన్నారు. నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలని, క్రైస్తవులపై ప్రభుత్వం అనుసరిస్తున్న విధ్వంసకర ఐండ్సి స్వాంతనాధికార ద్వారా రాష్ట్రపతికి వినతిపత్రం సమర్పించారు. ర్యాలీలో జోసెఫ్, మోసెస్, అనిల్ కుమార్, విజయానందులున్నారు.

రంగస్థల నటప్రపూర్ణ బళ్లారి రాఘవ

- తెలుగు కళాకారులకు రాఘవ అవార్డుల ప్రదానం
- ఆకట్టుకున్న శ్రీకృష్ణదేవరాయ పౌరాణిక పద్య నాటకం


తెలుగు రంగస్థల కళాకారులను రాఘవ అవార్డులతో సత్కరించిన దృశ్యం

బళ్లారిఅర్బన్: ప్రపంచ భాషల్లో తనదైన శైలిలో రంగస్థల నటనా నైపుణ్యాన్ని చాటిన ఘనత బళ్లారి రాఘవకే దక్కిందని సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం సాయంత్రం స్థానిక రాఘవ కళామందిరంలో బళ్లారి రాఘవ జయంతి సందర్భంగా తెలుగు రంగస్థల కళాకారులకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో అవార్డుల ప్రదానం, శ్రీకృష్ణదేవరాయ పౌరాణిక తెలుగు పద్య నాటక ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడారు. తెలుగు విభాగం, ప్రముఖ న్యాయవాదిగా ముఖ్యంగా రంగస్థల కళాకారుడుగా బళ్లారి రాఘవ దేశ విదేశాల్లో తెలుగు, కన్నడ, హిందీ, మరాఠి, ఇంగ్లిష్ తదితర భాషల్లో అద్భుతమైన నటనను ప్రదర్శించి కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు చెందిన పీవీఎస్.కృష్ణకు రాష్ట్ర స్థాయి రాఘవ అవార్డు దక్కింది. గుంతకల్లుకు చెందిన దక్షిణ మధ్య రైల్వే అధికారి, బళ్లారికి చెందిన లాలోరిడ్డికి జిల్లా స్థాయి అవార్డులు దక్కాయి. అనంతరం తిరుపతికి చెందిన కోనేటి సుబ్బారావు రచించిన శ్రీకృష్ణదేవరాయ పౌరాణిక తెలుగు పద్య నాటకాన్ని సుబ్బారావు నాట్య కళా పరిషత్ తిరుపతి బృందం ప్రదర్శించారు. నగర మేయర్ త్రివేణి, రాఘవ మెమోరియల్ అధ్యక్షులు కే.కోటేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు చెన్నప్ప, ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, రమేష్‌గౌడ పాటిల్, కార్యదర్శి ఎస్.ప్రకాష్, కోశాధికారి దినుంజయ, సహ కార్యదర్శి ఎస్.రామాంజినేయులు, ఏపీఎంసీ వీ.రామచంద్ర, రంగస్థల కళాకారులు, అభిమానులు పాల్గొన్నారు.

మరో ముగ్గురు గంజాయి చాక్లెట్ల విక్రేతల అరెస్ట్

రాయచూరు రూరల్: నగరంలో చాక్లెట్ల రూపంలో గంజాయిని విక్రయిస్తున్న దుకాణాలపై ఎక్సైజ్ శాఖాధికారిణి లక్ష్మి, డీఎస్పీ సత్యనారాయణ, పోలీసులు దాడి చేసి మరో ముగ్గురిని అరెస్ట్ చేశారు. గురువారం యరమరస్, చిక్కసుగూరు, యరగేరల్లో దుకాణాలను సోదా చేసి సందీప్, రామకృష్ణ, అబ్బుల్ మజీద్‌లను అరెస్ట్ చేసి వారి నుంచి 6.8 కేజీల గంజాయి చాక్లెట్లను స్వాధీనపరుచుకున్నట్లు అధికారులు తెలిపారు. బుధవారం ఇద్దరిని అరెస్ట్ చేయగా, వీరితో కలిపి మొత్తం ఐదుగురిని అరెస్ట్ చేసినట్లయింది.

ప్లాస్టిక్‌పై కొరడా

- హోటళ్లు, దుకాణాల్లో కవర్లు సీజ్
- దుకాణ యజమానులకు జరిమానా


దుకాణాలపై దాడులు చేసిన కమిషనర్

కేజీఎఫ్: నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు చేస్తున్న హోటళ్లు, దుకాణాలపై గురువారం నగరసభ కమిషనర్ దాడులు నిర్వహించి ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు రూ.11 వేల జరిమానా విధించారు. కమిషనర్ పవన్‌కుమార్ అధికారుల బృందంతో కలిసి నగరసభ బస్టాండు, రోడ్లలో ఉన్న దుకాణాలు, హోటళ్లపై దాడులు చేశారు. నందిని హోటల్ వంట గదిలో స్వచ్ఛత లేకపోవడంపై రూ.5 వేల జరిమానా విధించారు. బస్టాండు వద్ద ఉన్న ఓ బేకరీలో స్వచ్ఛత లోపించడంతో బేకరీ యజమానికి జరిమానా వేశారు. మరోసారి ఇలా జరిగితే ట్రేడ్ లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. నగర ప్రజలు బజారుకు వచ్చిన సమయంలో తప్పనిసరిగా బట్ట బ్యాగులను వెంట తేవాలని సూచించారు. కళ్యాణ మంటపాల్లో కూడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ఉపయోగించరాదని అధికారులు ఈసందర్భంగా తెలిపారు.

టెంపో, కారు ఢీ.. డ్రైవర్‌కు గాయాలు


ఘటనాస్థలంలో ప్రమాద దృశ్యం

మాలూరు: టెంపో, కారు ఢీకొన్న ఘటనలో కారు డ్రైవర్ తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. బెంగళూరు మెయిన్ రోడ్డులో బొమ్మండహళ్లి గేట్ వద్ద హొసకోటె నుంచి వస్తున్న గూడ్స్ టెంపో వాహనం కారును ఢీకొనడంతో కారు ముందు భాగం దెబ్బతిని డ్రైవర్ గాయపడ్డాడు. అతనిని మాలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పట్టణ పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించారు.

గాలికి కూలిన వటవృక్షం

కేజీఎఫ్: నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న 100 ఏళ్ల వటవృక్షం గాలికి నేలకొరిగింది. అదృష్టవశాత్తు చెట్టు కింద ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఆస్పత్రి ఆవరణలో ఉండడం వల్ల సాధారణంగా రోగుల సంబంధీకులు రోజూ చెట్టు కింద విశ్రాంతి తీసుకునేవారు. పలువురు ద్విచక్ర వాహనాలను చెట్టు కింద నిలిపేవారు. అయితే చెట్టు కూలిన సమయంలో ఎలాంటి వాహనం అక్కడ నిలిపి లేకపోవడం వల్ల ఎలాంటి నష్టం కలుగలేదు. చెట్టు కూలిన వెంటనే ఆస్పత్రి సర్జన్ డాక్టర్ సురేష్‌కుమార్ అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.

చేపల దుకాణాల తొలగింపు


రోడ్డు పక్కన చేపల అంగళ్లను తొలగిస్తున్న దృశ్యం

కంప్లి: కంప్లి కోట ప్రాంతాన తుంగభద్ర నది వద్ద మెయిన్ రోడ్డు పక్కన అక్రమంగా చేపల విక్రయాలు సాగిస్తున్న దుకాణాలను మున్సిపల్ సిబ్బంది గురువారం తొలగించారు. పట్టణంలోని మటన్ మార్కెట్‌లో చేపలు అమ్ముకునేందుకు వ్యాపారులకు అవసరమైన సౌకర్యాలు లేవని, ప్రత్యేకంగా చేపల మార్కెట్ ఏర్పాటు చేయాలని, అంతవరకు మొదట ఉన్న స్థలంలోనే తాత్కాలికంగా వ్యాపారాలు చేసుకునే అవకాశం కల్పించాలని మత్స్యకారులు షబ్బీర్, ఆశోక్, నటరాజ్, రాజశేఖర్, ఎం.లోకేష్, కిరణ్, పూజారి, చిన్నరాజేలు విజ్ఞప్తి చేశారు. వారి సమస్యపై స్పందించిన ముఖ్యాధికారి దురుగప్ప రోడ్డు పక్కన చేపల వ్యాపారాలు చేయడం వల్ల వాహన రాకపోకలకు అంతరాయం కలుగుతుందని ప్రజల ఫిర్యాదు మేరకు మటన్ మార్కెట్ వద్ద చేపల అమ్మకాలకు ప్రత్యేక సౌకర్యం కల్పిస్తామన్నారు.